ఆత్రేయ నాటక సాహిత్యం - సంభాషణలు

డా॥ తలతోటి పృథ్వీరాజ్ M.A., (Ph.D).,

సీనియర్ రిసెర్స్ ఫెలో (U.G.C.)

ఒకటవ అధ్యాయం
ఆత్రేయ ' నాటక ' జీవితం

" పూర్వ నాటక రంగం నుండి ఆధునిక నాటక రంగంలోకి ప్రభావితమవుతున్న నాటక కళాజ్యోతికి ప్రభాతగీతం పలికిన ఉదయతార ఆచార్య ఆత్రేయ". అని చెప్పిన వడ్లమూడి సీతారామారావుగారి మాటలు అక్షరసత్యం! ఆత్రేయ తన 15వ యేటనే చందోబద్ధమైన పద్యరచనతో వారి సాహిత్య రచనా సృష్టి ప్రారంభించి తెలుగు నాటక రంగంలో నటుడిగా, దర్శకునిగా, రచయితగా ఎవ్వరూ చేయని నూతన ప్రయోగాలను, సాహసాలను అనేక నాటకాలలో చేసి చక్కగా ప్రదర్శించి ప్రేక్షకుల చేత, సాహిత్యాభిమానుల చేత " భేష్! " ఏర్పరచుకొని తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ప్రవేశించి దాదాపు నాలుగు దశాబ్దాలు పాటు తన పాటలతో – మాటలతో మురిపించి మైమరపించి మన మనసుల్లో శాశ్వత స్థానాన్ని ఏర్పరచుకున్న మన'సు' కవి – మనసుకవి – మహాకవి ఆచార్య ఆత్రేయ.

1.1. ఎవరీ ఆత్రేయ

ఆచార్య ఆత్రేయ. ఈ పేరు వినగానే.. " ముద్దబంది పువ్వులో – మూగకళ్ళ వూసులో.. ఎవరికోసం.. ఎవరికోసం – ఈప్రేమ మందిరం– ఇలాంటి అద్భుతమైన గీతాలెన్నింటినో రాసిన పాటల రచయితగానో, " పిచ్చిదాన. కన్నీళ్లు మనిషిని బ్రతికించగలిగితే అదీ అమృతంలాగా కరువైపోయేది!. ఇలాంటి మహాద్భుతమైన మాటలనెన్నింటినో రాసిన మాటల రచయితగానో వెంటనే మనందరికి గుర్తుకు వచ్చే సాహితీ బ్రహ్మ ఆచార్య ఆత్రేయ. రేడియో ఆన్‌చేసినా, తెలుగు టి.వి.ఛానల్స్ పెట్టుకున్న ఆత్రేయ గారి పాట, మాట వినబడని రోజుంటూ ఉండదంటే ఆశ్చర్యం కలుగక మానదు. చాలా మందికి వీరు ఒక సినిమా రచయితగానే తెలుసు. కాని ఇంతకంటే ముందే నాటకరచయితగా తన రచనా జీవితాన్ని ఆరంభించి అత్యద్భుతమైనటువంటి నాటికలను, నాటకాలను రాసిన గొప్ప ఆధునిక నాటక రచయితని చాలామందికి తెలియదు. వీరి నాటకాలు ప్రజలకు వినోదాన్ని కలిగించడం కోసమే వారి సంతృప్తి కోసమో రాసినవి కాదు. గొప్ప ప్రయోజనాన్ని ఆశించి రాసినవి. ఏమిటా ప్రయోజనమంటే.. మధ్య తరగతి మానవున్ని నిత్యం పట్టిపీడించే ఆశలు – ఆవేదనలు–నిట్టూర్పులు– జీవిత సమస్యల నుంచి వారిని తప్పించాలని– అందుకు వారు చేసే తప్పొప్పులను కొన్ని పాత్రలద్వారా ఆత్రేయ తన నాటకాలలో ప్రతిబింబింపచేసి వారిని ఆలోచింపజేయడమే కాక, సమాజంలో జరిగే దోపిడీ విధానం – బ్లాక్ మార్కెట్ – లంచగొండితనం – ఆకలి చావులు– స్వార్థపూరితమైన రాజకీయాలు మొదలగు అంశాలను వారి నాటక సాహిత్యంలో ఎత్తిచూపుతూ వీటిని ప్రతిఘటించేందుకు ప్రజలలో చైతన్యాన్ని తీసుకొని వచ్చి సమసమాజాన్ని స్థాపించాలనే ఆశ – ఆకాంక్ష ఆత్రేయగారి నాటకాలలో స్పష్టంగా కనిపిస్తుంది. తాననుకున్నది సాధించేందుకు సరియైన మాధ్యమంగా నాటక రంగాన్ని ఎన్నుకొన్నారు ఆత్రేయ. అందుచేతనే శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి ఆత్రేయ గూర్చి – " పీడిత ప్రజల ఆక్రందనల్ని గొంతెత్తి చాటిన రచయిత ఆత్రేయ. ప్రజా సమస్యల్ని చర్చిస్తూ వాటిని సూటిగా గుండెల్లో హత్తుకునేలా చెబుతూ ప్రజలను చైతన్యవంతుల్ని చేసిన రచయిత ఆత్రేయ" అని చెప్పారు.

1.2. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది

" నిండు చీకటి నిసి రెండవ రెక్కలో విల్లులగనమునకునిల్లు గాక తొర్తినెలను అమ్మ తొలిచూలు బిడ్డగా అవతరించినను అవని మీద అని ప్రాచీన పద్ధతిలో పద్యరూపంలో అచ్చతెలుగులోని గ్రహాల పేర్లతో తన పుట్టుకను చెప్పుకున్న ఆత్రేయ 1921 మే 7వ తేదీన నెల్లూరు జిల్లా, సూళ్లూరుపేట తాలూకా మంగళంపాడు గ్రామంలో పుట్టారు. తన 15వ యేటనే చందోబద్ధమైన పద్య రచనతో సాహిత్య రచనకు శ్రీకారం చుట్టారు. ఇంటర్మీడియట్

విద్యార్థిగా రాయనెల్లూరిలోని ఊరీస్ కళాశాలలో చేరినప్పటి నుంచి ఆత్రేయ కవిత్వం – నాటకాల పిచ్చితో చదువును అలక్ష్యం చేయడం మొదలుపెట్టారు. అందుకే ఇలా అంటారు.

"కవితపై పిచ్చితో నాటకాల పిచ్చి
కలిసి చదువుపై నక్కర తొలగిపోయె
లోన నేదియొ యస్పష్టమైన కోర్కె
వేదనగ నన్ను ముపొద్దు వెంట నంటె "

ఆ విధముగా నాటక రంగముపై, కవిత్వ రచనపై మక్కువేర్పరచుకున్న ఆత్రేయ చదువు సంగతే వదిలివేసి–

" అల్లిబిల్లిగ పద్యాల నల్లుకొనుచు,
నాటకాల వల్లించుచు, నటుడనగుట
కద్దమెదుట సాధనసేతు నభినయమ్ము,
ఒంటరిగ రోజు రోజెల్ల నుందు గదిని " అని చెప్పుకున్నారు.

" ఆత్రేయ నాటకాలు–పూర్వాపరాలు" అనే అంశంపై పరిశోధన చేసిన పైడిపాల గారు – ఆత్రేయ కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే మొట్టమొదటిసారిగా 'విశ్వామిత్ర' నాటికలోని త్రిశంకుని పాత్రను ధరించి ప్రదర్శించడానికి మోహానికి రంగు పూసుకున్నట్లు రాశారు. ఊరీస్ కళాశాల విద్యార్థిగా ఆత్రేయ చదువుకుంటున్నప్పుడు షేక్స్పియర్ రచన అయిన 'ఒథెలో' అనే నాటకంలోని ఒక దృశ్యాన్ని తీసుకొని ద్విపాత్రాభినయము చేయగా, మహానటుడు బళ్ళారి రాఘవగారికి ఆప్తులు మరియు ఆత్రేయగారికి ఆంగ్ల నాటిక అధ్యాపకులుగా వచ్చే వెంకోజిరావు గారు ఆత్రేయ నటనను చూసి మెచ్చుకొని, ఆశీర్వదించిన విషయాన్ని బళ్లారి రాఘవగారు చూసి అభినందించినట్లు పొరపాటున రాశారు".

ఆత్రేయ తల్లిదండ్రులయిన శ్రీమతి సీతమ్మ, శ్రీకృష్ణమాచార్యులు ఆత్రేయగారికి పెట్టిన అసలు పేరు కిళాంబి వేంకట నరసింహాచార్యులు. 'ఆచార్య ఆత్రేయ' అనే పేరులో 'ఆచార్య' అనేది బిరుదును కాని, విద్యార్హతను కాని సూచించే పదం కానేకాదు. 'నరసింహాచార్యుల'నే పేరులోని ఉత్తరభాగం 'ఆచార్య', ఇక ఆత్రేయ అనేది వారి గోత్రనామం. ఇలా ఆచార్య పదానికి గోత్రనామాన్ని కలిపి 'ఆచార్య ఆత్రేయ' అనే కలం పేరును రూపొందించుకున్న శ్రీ కిళాంబి వేంకట నరసింహాచార్యులు 'ఆచార్య ఆత్రేయ' పేరుతోనే చలామణి అయ్యారు.

సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఆత్రేయ ఎస్.ఎస్.ఎల్.సి.ముందు వరకు జట్టు ముడి వుండేది. వైష్ణవకుల సాంప్రదాయానికి వ్యతిరేకంగా ఆత్రేయ ధైర్యం చేసి క్రాపు చేయించారు.

1.3. మాసిపోని గాయం :

తల్లిని ఎంతగానో ప్రేమించే ఆత్రేయ తన పసితనంలోనే (మూడవ ఫారం చదువుకు ముందే) అయినవారి విషప్రయోగానికి తల్లిలేని బిడ్డ అయినాడు. ఆ పసి మనసులో తుఫాను చెలరేగింది. అమ్మ ప్రేమలోని ఆప్యాయతను చవిచూడకుండానే తల్లిని కోల్పోయిన ఆత్రేయ సినిమా రచయిత అయిన తరువాత ఆ అనుభూతులతోనే "అమ్మ" అనే అంశంపై ఎన్నో గొప్ప పాటలు, మాటలు రాశారు. చనిపోయిన తన తల్లి ఊళ్లో అనేక మందికి కనిపించిందని చెప్పగా మొదట విశ్వసించని ఆత్రేయ తన తల్లిని ఆ రూపానన్నా చూడాలనే ఆశతో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. విషయాన్ని వారి ఆత్మకథలో ఇలా రాసుకున్నారు.

" చిటుకుమని యెట్టి యలికిడి చెవిని బడిన
యులికి పడుదును చాటుగా నొదిగి చూతు
రేయి యైనంత గుండెయ రాయి చేసి
వేచి యుందును తల్లిని చూచుకొర్కె ".

1.4. చదువు సంధ్యలు :

చదువుకునే రోజుల్లో కవిత్వ రచన, నాటకాల పట్ల ఆసక్తి పెరిగి టీచర్ ట్రైనింగ్‌తో చదువుకు స్వస్తి చెప్పారు. ఎస్.ఎస్.ఎల్.సి.వరకు చిత్తూరులోనూ, ఇంటర్మీడియట్ రాయవెల్లూరిలోని ఊరిస్ కళాశాలలో చదివారు.

1.5. ప్రేమ పిపాసి :

ఆత్రేయ వేసవి సెలవులకు వరుసగా తన చిన్నాన్న అయిన రఘువాచార్య ఇంటికి వెళ్ళగా 'బాణమ'నే అమ్మాయి కనిపిస్తుంది. తొలిచూపులోనే తన మనసును ఆమెకు అంకితమిచ్చిన ఆత్రేయ ఆమె చూపులు గూర్చి తన ఆత్మకథలో ఇలా రాసుకున్నారు.

" ఇది యేమి పేరు ? పుట్టిన
పదిరోజులకెవ్వరెట్లు పసిగట్టిరొ, ఈ
యెద చీల్చు వాలు చూపులు
వదలిన వృధ పోని మరుని బాణములనుచున్"

అనేక కారణాల వల్ల వారి ప్రణయం పరిణయానికి దారి తీయలేదు.

1.6. వివాహం :

పెద్దలు కుదిర్చిన వివాహం ఆమె చేసుకోవడంతో ఆత్రేయ నిర్మించుకున్న 'ప్రేమనగర్' కుప్పకూలిపోయింది. ఈ అనుభవాలు అనుభూతులతోనే ఎన్నో ప్రేమగీతాలు, కరుణ రసాత్మక ప్రేమగీతాలను రాశారు. అంతేకాదు. వీణమీటే తన ప్రేయసిని తలచుకొని ఎన్నో వీణ పాటలను కూడా రచించారు. తన ప్రేయసి మరొకరిని వివాహమాడిన పరిస్థితుల్లో ఆత్రేయ కూడా పెద్దల మాటను కాదనలేక వారి సంతోషం కొరకు 1940, ఫిబ్రవరి 10వ తారీఖున పద్మావతిని వివాహమాడారు.

1.7. దేశభక్తి – నిజాయితీ :

చిత్తూరులో ఉంటుండగా తన 20-22 ఏళ్ల ప్రాయంలో అప్పటి రిజర్వ్ బ్యాంకు గవర్నర్ అనంతశయనం అయ్యంగారు మరి కొందరితో క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొనగా పోలీసులు అరెస్టుచేయడం చూసి అండర్‌గ్రౌండ్‌కు వెళ్ళడం జరిగింది. ఎవరో ఇచ్చిన సమాచారంతో అండర్‌గ్రౌండ్‌లో ఉండే ఆత్రేయ గారిని పోలీసులు ఆరెస్టు చేశారు. జైలుకెళ్ళడమే త్యాగంగా భావించారంటే ఆత్రేయ గారికి అసహ్యం. అండర్‌గ్రౌండ్‌లో ఉండి ఉద్యమంలో ఇంకా పాల్గొనవచ్చుననే తలంపుతోనే అలా చేశారు కాని బ్రిటిష్ వారికి భయపడి మాత్రం కాదు. మెజిస్ట్రేట్‌గా పనిచేసే తన మామ బ్రిటిష్ గవర్నమెంట్‌లో ఉద్యోగం చేస్తూ మేనల్లుడు జైల్లో ఉండటం తన ఉద్యోగానికే ముప్పని భావించి జైలులో వున్న ఆత్రేయను వెంటనే బయటకి విడిపించారు. స్వాతంత్ర్యానంతరం స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు భూములు ఇస్తామని మన గవర్నమెంటు ఆత్రేయగారి వద్దకు వెళ్ళడం జరిగింది. తన మనసుకు స్వతంత్ర్యం కావాలనిపించి చిత్తశుద్ధితో ఉద్యమంలో పాల్గొన్నాను తప్పించి నేనుచేసిన మహత్తరమైన ఆ పనికి కూలీలాగా మీరిచ్చే ఇలాంటి వాటిని నేను అంగీకరించనని వారిని తిప్పి పంపించారు. ఈ సంఘటన వారి నిజాయితీకి, వ్యక్తిత్వానికి నిదర్శనం." ఈనాడు ఎంతమంది బోగస్ స్వాతంత్ర్య సమరయోధులని మనం చూడటం లేదు. దేశంకోసం వారు ఏ

ఉద్యమాలలో పాల్గొనకపోయినా ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలను దర్జాగా అనుభవించే వారెందరూ లేరు! అప్పటికే ఆర్థిక బాధలతో సతమతమయ్యే ఆత్రేయ తనని వెదుక్కుంటూ వచ్చిన ఆ అవకాశాన్ని వినియోగించుకొనక " ఎన్ని కష్టాలైన సరే – భిక్షమైన ఎత్తుకుంటాను గాని నాకా భూములేమివద్ద " నిన దేశభక్తుడు ఆచార్య ఆత్రేయ.

1.8. నాటక సమాజాలు :

ఆత్రేయ గారికి నాటకాల పట్ల అమితమైన ఆసక్తి వుంది. ఆత్రేయని నాటకాల పట్ల బాగా ప్రభావితం చేసిన అంశాలు రెండే వేరు. బళ్ళారి రాఘవగారు ప్రదర్శించిన 'భక్త రామదాసు' నాటకం మొదటిది కాగా కర్ణాటక నుండి వచ్చి అనేక నాటకాలను ప్రదర్శించిన 'కన్నయ్య అండ్ కంపెనీ' రెండవది. వీరివల్ల నాటకాలపట్ల అభిరుచి పెరిగి తాను నాటకాలు రాసి ప్రదర్శించాలనే ఆశతో సరైన నాటక సమాజాల కోసం అన్వేషిస్తున్న సమయంలో చిత్తూరులో ఆర్యవైశ్య యువజన సంఘం కన్పించింది.

1.8.1. ఆర్యవైశ్య యువజన సంఘం (చిత్తూరు) :

మంచి నాటకాలు రాసి ప్రదర్శించడానికి సరి అయిన నాటక సమాజం కోసం చూసే ఆత్రేయ చిత్తూరులోని ఆర్యవైశ్య యువజన సంఘం కనిపించేసరికి అందులో చేరి అందులో వున్న యువకులను ప్రోత్సహిస్తూ అనేక నాటకాలను ప్రదర్శించడం మొదలుపెట్టారు. నాటక ప్రదర్శనను కూడా దృష్టిలో పెట్టుకొని ఖర్చులు ఎక్కువ లేకుండా ప్రదర్శించేందుకు అద్దెలు చెల్లించాల్సిన అవసరం లేని సత్రాలను వేదికగా చేసుకునేవారు. అలాగే నాటక ప్రదర్శనను రక్తి కట్టించడానికి శబ్ద ప్రయోగాలు కూడా చేశారు ఆత్రేయ. ఇలాంటి వాటినెన్నింటినో నాటకాలలో ప్రయోగించారు.

1940లో ఆంధ్రానాటక కళాపరిషత్‌వారు నిర్వహించిన నాటకాల పోటీకి ఆత్రేయ తాను రాసిన "శాంతి" నాటకంను ఈ సమాజం తరపునే వెళ్ళి ప్రదర్శింపగా ఏ బహుమతిని పొందకపోయేసరికి నిరాశతో అంతవరకు రాసిన నాటకాలన్నింటిని చింపివేశారు.

1.8.2 : వెంకటగిరి అమెచ్యూర్స్ (మద్రాసు) :

'శాంతి' నాటకానికి ఏ బహుమతి రాకపోయినప్పటికీ, ఆ నాటిక రచనలో ప్రదర్శనలో ఆత్రేయ కనబరచిన ప్రతిభను గుర్తించి తమ సంస్థలో నాటకాలను ప్రదర్శింపమని వెంకటగిరి అమెచ్యూర్స్ వారు కోరగా ఆత్రేయ ఆ సమాజంలోకి వెళ్ళడం జరిగింది. అందులో చేరిన తర్వాత 'రషీదా' నాటకాన్ని కొద్ది మార్పులతో సవరించి ఆ నాటకానికి దర్శకత్వం వహించడం జరిగింది. ఆ తర్వాత ఆ సంస్థ అసోసియేషన్‌కి ఆత్రేయగారే దర్శకులుగా పనిచేసారు.

1.8.3 : 'రినైజాన్స్' ఆర్టిస్ట్స్ సంస్థ (నెల్లూరు) :

రషీదా నాటక ప్రదర్శనాంతరం ఆత్రేయ గారికి ఒక నిర్దిష్టమైన చూపులేకపోయేసరికి తన సొంత జిల్లా నెల్లూరు చేరుకొని, తూములూరి ఆదినారాయణ గారు స్థాపించిన 'రినైజాన్స్ ఆర్టిస్ట్స్' అనే ఒక సంస్థలో సభ్యునిగా చేరారు.

1.8.3 : లలిత కళానిలయం (నెల్లూరు) :

'రినైజాన్స్ ఆర్టిస్ట్స్' సంస్థతో పరిచయం ఏర్పడినప్పుడే మజ్జిగ విశ్వనాధరెడ్డి గారు స్థాపించిన " లలిత కళానిలయం"తో పరిచయం ఏర్పడింది. వీరు ప్రదర్శించిన 'అనార్కలి నాటకంలో' 'అబుల్ ఫజల్' పాత్రను ధరించారు ఆత్రేయగారు. ఆ తర్వాత జాషువా గారు రచించిన 'దేశముక్తి' అనే నాటకంలోని 'టోజో' పాత్రను కూడా ప్రదర్శించారు. అలాగే నెల్లూరులో దువ్వూరి రామిరెడ్డిగారి వర్ధంతిని పురస్కరించుకొని గుర్రం జాషువా గారి పద్యాలను ఆధారం చేసుకొని 'పిరదౌసి' అనే ఏకపాత్రాభినయం చేశారు. అలాగే ఆకలి, రిక్షావాలా మొదలగు రామకృష్ణయ్య గారు రాసిన 'తలపని తలంపు' నాటకంలో అప్పయ్య పంతులు పాత్రను ఆత్రేయగారు ధరించారు.

1.8.5. ఆంధ్ర నాటక కళాపరిషత్ (గుడివాడ) :

1944లో ఎమ్.ఆర్.అప్పారావు గారు అధ్యక్షులుగా ఉంటున్న ఆంధ్ర నాటకకళాపరిషత్ తమ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఔత్సాహిక నాటక సమాజాల వారిని ప్రోత్సహించి తలపెట్టిన నాటికా నాటకపోటీలలో పాల్గొనటానికి వెంకటగిరి అమెచ్యూర్స్ సంస్థ వారు తాము ప్రదర్శించాలనుకునే 'ఎదురీత' నాటకానికి దర్శకత్వం వహించమని ఆత్రేయకు బాధ్యతలు అప్పజెప్పగా – ఉత్తమ ప్రదర్శనగా ఆ నాటకానికి బహుమతి రావడమేకాక, ఆత్రేయకు ఉత్తమ ప్రయోక్తగాను, సహాయపాత్రను ధరించి నటించినందుకు ఉత్తమ నటునిగా బహుమతులు లభించాయి. ఆనాటి ప్రదర్శన ద్వారా ఆత్రేయ ప్రతిభను గుర్తించిన ఆంధ్రనాటక కళాపరిషత్ 50 రూపాయల నెలసరి వేతనంతో ఆత్రేయను కార్యదర్శిగా నియమించుకుంది.

ఈవిధంగా వివిధ నాటక సమాజాలలో రచయితగా, నటుడిగా, దర్శకునిగా, కార్యదర్శిగా వివిధ బాధ్యతలను నిర్వహించిన ఆల్‌రౌండర్ ఆచార్య ఆత్రేయ!

1.9. ఉద్యోగాలు – అవస్థలు :

ఆత్రేయ ఏ ఉద్యోగం నిలకడగా చేయలేకపోయారు. మొదట నెల్లూరు జిల్లా కోర్టులో నఖలు లేఖకుడు (కాపీరైట్)గా, ఆ తర్వాత తిరుత్తనిలోని సెటిల్‌మెంటు ఆఫీసులో గుమాస్తాగా ఇంకొంతకాలం 'జమీన్‌రైతు' పత్రికలో సహాయ సంపాదకునిగా, మరికొంత కాలం ఆంధ్ర నాటక కళాపరిషత్‌లో వేతన కార్యదర్శిగా పనిచేశారే గాని ఏ ఉద్యోగంలో స్థిరంగా ఉండలేకపోయారు.

ఆత్రేయగారితో కడవరకు చెలిమి చేసినవి కష్టాలే! నాటకాల పిచ్చితో ఏ ఉద్యోగంలో నిలబడకపోగా అనేక ఊళ్ళు తిరగవలసి వచ్చింది. పైగా అప్పటికే పెళ్ళిచేసుకొని ఉన్న సంసారి. కుటుంబాన్ని పోషించుకునేందుకు ఏదో ఒక ఆధారం ఉండాలి కదా! ఆత్రేయ పంపు నీళ్ళతో కడుపునింపుకొని పస్తులున్న రోజులు ఎన్నో! ఒకే జత వస్త్రాలతో కాలం గడుపుతూ అవి మాసిన వెంటనే నాటకాలకు ఉపయోగించే తెరగుడ్డలను చుట్టుకొని మానిన బట్టలను ఉతికి ఆరవేసుకునే దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవించిన రచయిత ఆత్రేయ. వీధి దీపం క్రింద 'గౌతమ బుద్ధ' నాటకాన్ని పెన్సిల్‌తో రాసి 50రూపాయిలు పారితోషికంకి అదీ వాయిదా పద్ధతిపై పావలా, అర్ధ చొప్పున తీసుకుంటూ అచ్చు వేసుకోవడానికి అంగీకరించినవారు, కష్టాల చెలికాడు ఆత్రేయ. నాటకాలు రాసి దర్శకత్వం వహించినందుకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన పాణకా కనకమ్మ ద్వారా అప్పుడప్పుడు ఆర్థిక సహాయాన్ని పొందినవారు ఆత్రేయ. అదేవిధంగా అప్పుడప్పుడు పావలా, బేడా టిఫినుకు ఇచ్చేవాడు రమణారెడ్డి" అని ఆత్రేయ గారే చెప్పుకున్నారు. ఇంకా చెప్పాలంటే ఆత్రేయగారు ఇంటింటా తిరిగి మద్రాసులో సబ్బులు కూడా అమ్మినారట! అందుకే ఆత్రేయ తన ఆటవిడుపు అనే కవితలో

'ఘోర దారిద్ర్య గాఢాంధకారమందు
నిన్ను విడిపోవు కడకు నీ నీడకూడ
అనెడి సత్యము పలుమారులనుభవించి
అలసిపోతివి – కావలె నాటవిడుపు "

అని తన దారిద్ర్య దుస్థితిని గూర్చి చెప్పుకున్నారు.

1.10. సినిమా రంగప్రవేశం :

ఆత్రేయను నాటకరంగం మంచి సినిమా రంగంవైపునకు మళ్ళించింది ఈనాడు, ఎన్.జి.ఓ.నాటకాలే ! ఈనాడు నాటకం విజయవంతంగా ప్రదర్శింపబడిన తరువాత 'సంసారం' చిత్రానికి రచయితగా ఆత్రేయను మద్రాసు ఆహ్వానించారు. కొన్ని కారణాల వల్ల ఆ చిత్రదర్శకుడు కూడా మారి మరో రచయితను నిర్మాతలు ఎన్నుకున్నారు. అప్పటికే ఆత్రేయ గారి నాటక సంభాషణల పట్ల మంచి అభిరుచిని పెంచుకున్న కె.యస్.ప్రభాకరరావు గారు తాను దర్శకత్వం వహించే దీక్ష చిత్రం ద్వారా ఆత్రేయను తెలుగు చలనచిత్ర పరిశ్రమకి పాటలు, మాటలు రచయితగా పరిచయం చేశారు.

1.11. వ్యక్తిత్వం :

ఆత్రేయగారి వ్యక్తిత్వం పసిపిల్ల నవ్వులాంటిది. అంటే అంత స్వచ్ఛమైనది, నిష్కలమైనది. 'ఇదినాది' అని ఆత్రేయ ఎప్పుడూ దేనికి అతుక్కుపోలేదు. డబ్బులేకపడిన బాధలు తెలుసు. డబ్బున్నప్పుడు పొందిన సుఖాలు తెలుసు. కాని ఎప్పుడు డబ్బుకు విలువివ్వలేదు. డబ్బు లేకపోయినా నిద్రపట్టదు – డబ్బున్నా నిద్రపట్టదు. ఎందుకంటే ఏదైనా కొనాలనుకున్నప్పుడు డబ్బు లేకపోవడం మొదటి కారణం అయితే, చేతిలోని డబ్బు ఖర్చయ్యే వరకు ఏదో ఒకటి కొనే వరకు ఉండలేకపోవడం ఆత్రేయ నిద్రలేకపోవడానికి రెండవ కారణం. పసిపిల్లవాని మనసు చాలా సున్నితమైనది. ఎదుటివారిని అనవసరంగా ఏమి అనరు. అనవసరంగా ఎదుటివారు తనను ఏమైనా అంటే పడరు. ఎదుటివాడి జేబులో ఎంతుంటే అంత ఖర్చు పెట్టిస్తారు. తన దగ్గరున్నప్పుడు అంతకు రెండింతలు ఖర్చు చేసే స్వభావం కలవారు ఆత్రేయ.

ముక్కు మోహం తనకు తెలియకపోయినా ఎందరికో అడిగిందే తడవుగా డబ్బులిచ్చి సహాయపడిన దానశీలి ఆచార్య ఆత్రేయ. పొగడ్తలంటే ఆత్రేయకు ఎలర్జీ. ఇక్కడ ఒక విషయం ప్రస్తావిస్తే వారి వ్యక్తిత్వం ఏమిటో ఇంకా స్పష్టంగా తెలుస్తుంది.

" ఆత్రేయగారు నలభై ఏళ్ళ క్రితం వ్రాసిన నాటకాలకు ఇప్పటికీ ఇంత అప్లాస్ వస్తోందంటే, ఆయన గొప్పతనం ఇంతా అంతా కాదు." అంటూ అంబేద్కర్ ఒపెన్ యూనివర్శిటీలో అతని జరిగే సన్మానసభలో కొందరు పొగడడం విని ఆత్రేయ జరిగే సన్మానసభలో కొందరు పొగడడం విని ఆత్రేయ అందరిలా ఉప్పొంగిపోలేదు. ఎగిరి గంతెయ్యలేదు. చివరన ఏమన్నారో తెలుసా " నలభై ఏళ్ళ క్రితం నేను రాసిన నాటకాలు – ఇప్పటికీ చప్పట్లు కొడుతున్నారంటే.. నాకు సంతోషంగా లేదు. అంటే నేను రాసిన సమస్య ఇంకా సమసిపోలేదన్నమాట. ఇది నేను సిగ్గుపడుతున్నాను" అని ఆవేదనతో అన్నారు. భారతదేశంలోనే కాదు ప్రపంచంలోనే ఏ రచయిత అనని మాట అన్నారు ఆత్రేయ. తనను తాను ఎంతగా ఆత్మావలోకనం చేసుకుంటారో వారు పలికిన ఆ మాటలను బట్టి మనకు స్పష్టంగా తెలుస్తుంది. దటీజ్ ఆత్రేయ! ఆత్రేయగారి ప్రియశిష్యుడు జె.కె.భారవి గారు అన్నట్లు " ఆత్రేయ మహా రచయిత. ఆయనను అంచనా వేయడానికి కొలబద్ద లేదు. ఆయన పాండిత్యానికి హద్దులు లేవు. ఈ మాటలు విన్న తర్వాత ఆత్రేయగారి గూర్చి ఎన్ని చెప్పుకున్నా తక్కువే అనిపిస్తుంది.

ఆత్రయ నాటక – సినిమా రంగాలలో ప్రవేశించింది మొదలు పదిహేను నాటికలు, పది నాటకాలు రచించిన నాటక రచయితగా – సుమారు వివిధ చిత్రాలకు 2000 పాటలు రాసిన పాటల రచయితగా – 180 చిత్రాలకు పైగా సంభాషణలు సమకూర్చిన మాటల రచయితగా – వాగ్దానం చిత్రానికి దర్శకునిగా, నిర్మాతగా, రుణానుబంధం, మూగమనుషులు, డా॥ ఆనంద్ లాంటి చిత్రాలకెన్నింటికో కథలను సమకూర్చిన కథా రచయితగా – ఆదర్శ కుటుంబం

మంచి మనసులు, కన్నతల్లి, సతీసావిత్రి (రామారావు, వాణిశ్రీ) చిత్రాలకు స్క్రీన్‌ప్లే రచయితగా ఆదర్శం, కోడెనాగు, భామాకలాపం చిత్రాలలో నటుడిగా ఎన్నో వ్యాసాలను రాసిన వ్యాసకర్త – ఇలా వివిధ ప్రక్రియలలో పనిచేసిన ఆత్రేయ నాటక, చలనచిత్ర రంగాల నుంచే కాదు భూమి అనే రంగస్థలంపై జీవితమనే నాటకంలోని ఒక పాత్రలా 1989 సెప్టెంబరు 13 రాత్రి 10 గంటలకు

" వెళ్ళిపోయాను

నా ఈ కళేబరం కన్నా

మీ కన్నీటికే విలువు మిన్న

వాటిని వృధా చేయకండి

నాలో చూచిన చెడునంతా మన్నించండి

ఏ కాస్త మంచి కనిపించి వున్నా

మరచిపోండి

ఇన్నేళ్ళు నన్ను పోషించి, ఆధరించి

ఇంతవాణ్ణి చేసిన ప్రజలకు

నేను ఎంతో రుణపడి వున్నాను

పునర్జన్మ మీద నమ్మకంలేని వాణ్ణి గనుక

మళ్ళీ పుట్టి మీ రుణం తీర్చుకుంటానని

మాట ఇవ్వలేను

అలాంటి అవకాశమే వుంటే

అట్టడుగున వున్న బడుగు వాని

కన్నీరు తుడవడానికి

ఒక చిరుగు పాతగానైనా పుడతాను" అంటూ నిష్క్రమించారు.

రెండవ అధ్యాయం
ఆత్రేయ ' నాటక ' సాహిత్యం

సమకాలీన సాంఘిక సమస్యల్నీ, ఆర్థిక రుగ్మతల్ని, రాజకీయ అవినీతిని, యుద్ధ భీభత్సాన్నీ, శాంతి కాముకత్వాన్ని చాటుతూ, సామాజిక స్పృహను కలిగిస్తూ, సృజనాత్మక శక్తితో, అభ్యుదయ భావాలతో, ప్రజలతో విప్లవాత్మక చైతన్యాన్ని కలిగించే విధముగా, రచనల్ని సాగించాడు." అని ఆచార్య ఆత్రేయగారి నాటకాల గూర్చి శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు అన్నారు.

నిజమే..ఆత్రేయ నాటకాలను వినోదం కోసం, కాలక్షేపం కోసం రాసినవి కాదు. ప్రజలలో విప్లవాత్మకమైన చైతన్యాన్ని తీసుకొని రావడానికి – రచయిత తన నాటకంలో చూయించిన సన్నివేశాలను గూర్చి ప్రజలు ఒక్కసారైనా ఆలోచించేందుకు ఆ కాలంలో ఉండే ప్రధానమైన సాంఘిక సామాజిక సమస్యలను – యూనివర్శల్ ప్రోబ్లమ్స్‌ను తీసుకొని, ఇటువంటి సమస్యలను ఎదుర్కునో మధ్య తరగతి వారి జీవితాలను వాస్తవిక దృష్టితో పరిశీలించి వారినే ప్రధాన పాత్రలుగా చేసుకొని నాటకాలను రాశారు. ఇలా ఎన్నో నాటికలు, నాటకాలను రచించి తెలుగు నాటకరంగానికే వన్నె తెచ్చి ఆధునిక నాటక యుగకర్త అయ్యారు ఆచార్య ఆత్రేయ. మన దురదృష్టం కొద్ది వారు రాసిన కొన్ని నాటికలు నాటకాలు మనకు ఈరోజు లభించడం లేదు.

ఉత్త అనుమానం, తహతహై, బెంగాలు కరువు, పిచ్చాసుపత్రి, నిజం ఎవరికెరుక, బలిదానం, అమరత్వానికి ఆహ్వానం మొదలగు నాటికలు, శాంతి, సాధన, డా॥ కోట్నిస్ మొదలగు నాటకాలు లభ్యం కాకపోవడం వల్ల తెలుగు నాటక రంగ ప్రేక్షకులు ఎంతో ఆశానిపాతానికి గురయ్యారు.

2.1 నాటికలు :

ప్రస్తుతం లభించే –

1) అశ్వఘోషుడు	2) ఆత్మార్పణ	3) ఎవరు దొంగ	4) ఒక్క రూపాయి
5) ఓటు నీకే	6) అంతర్యుద్ధవ	7) అంత్యార్పణ	8) కళ కోసం
9) కాపలావాని దీపం	10) చస్తే ఏం?	11) చావకూడదు	12) తెరచిన కళ్ళు
13) ప్రగతి	14) మాయ	15) వరప్రసాదం	

మొదలైన నాటికలలోని వస్తు స్వభావాన్ని బట్టి ఆత్రేయ గారి నాటికలను

1) ప్రాచ్యానుసరణలు	2) పాశ్చాత్యానుసరణలు	3) సమస్యాత్మక నాటికలు
4) రాజకీయ నాటికలు	5) కౌటుంబిక నాటికలు	6) ప్రతీకాత్మక నాటికలు

7) ప్రబోధాత్మక నాటికలని ఏడు రకాలు విభజించవచ్చు.

2.1.1. ప్రాచ్యానుసరణలు :

భారతీయ పౌరాణిక చారిత్రక గాధలను ఆధారం చేసుకొని అందులోని కొన్ని పాత్రలు తీసుకొని రాసిన నాటికలను ప్రాచ్యానుసరణలుగా పేర్కొనవచ్చు. ఈ కోవకు చెందిన నాటికలు 1) అశ్వఘోషుడు, 2) మాయ నాటికలను పేర్కొనవచ్చు.

1) అశ్వఘోషుడు :

ఆత్రేయగారి అపూర్వ ప్రయోగం ఈ నాటిక. క్రీ.పూ. ఒకటవ శతాబ్దానికి చెందిన అశ్వఘోషుడుని ఇందులో కథానాయకునిగా చేసి ఈ పాత్ర చుట్టూ కొన్ని కల్పితపాత్రలను సృష్టించి ఇప్పటికీ ఈ నవనాగరిక సమాజంలో సమసిపోని కులమతభేధాలను ఎత్తి చూపుతూ వీటికి బలి అయిన ప్రేమికుల గూర్చి విషాధ ప్రేమ కథా కావ్యంగా ఈ నాటికను రాశారు ఆత్రేయగారు.

ఈ నాటికలోని కథానాయకుడు అశ్వఘోషుడు. అను మహాకవి, గాయకుడు, సకల కళాకోవిదుడు. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినవాడు. కథానాయిక ప్రభ గ్రీకు వర్తకుని కుమార్తె. వసంతోత్సవం నాడు వారిరువురి 'కన్నులు కలుసుకున్నవి. చిరునవ్వుల్లో చిత్తాలు చేరువౌతది... చూపులతో బాటు మనుసులూ అల్లిబిల్లిగా అల్లుకొని ఆ ప్రణయం వారి పరిణయానికి దారి తీయగా ఈ విషయం తెలిసిన అశ్వఘోషుని తండ్రి సుదర్శన పండితుడు ప్రళయాన్ని సృష్టిస్తాడు. వారిరువురిని వేరు చేయాలని అతని పన్నాగంలో భాగంగా వేరే మతంనకు చెందిన అమ్మాయిని వివాహమాడితే తన కొడుకు కుల బహిష్కృతుడై శ్రాద్ధకర్మకి అయోగ్యుడవుతాడనే దిగులుతో కనీసం పిండం వేయడానికి పనికి రాకపోతాడేమోననే దిగులుతో అశ్వఘోషుని తల్లి సువర్ణాక్షి మంచంపట్టి చనిపోయే స్థితిలో ఉన్నట్టు – అలాంటి స్థితిలో ఉన్న ఆమెను బతికించుకోవడానికి తన కొడుకును మరచిపోయినట్లు మాట ఇవ్వమని ప్రభతో అశ్వఘోషుని తండ్రి అబద్దం ఆడగా.. " చెప్పండి, ఈ కథ ముగిసిందని చెప్పండి. ఇక ప్రభ ఎవరికీ కనిపించదు" అని ప్రమాణం చేస్తుంది. ప్రియుడు లేని జీవితం వ్యర్థమని ప్రభ సరయూ నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ తర్వాత అశ్వఘోషుడు బౌద్ధమతంను స్వీకరించి బుద్ధ చరిత్ర, సౌందరనందం అనే బౌద్ధ గ్రంథాలను రాస్తాడు.

ఆత్రేయగారు కథను నడిపించే తీరు పాఠకులను, ప్రేక్షకులను గొప్పగా ఆకట్టుకుంటుంది. ఏ పాత్ర ఏమాట మాట్లాడాలి, ఎంత వరకు మాట్లాడాలి, ఏ అంశం గూర్చి మాట్లాడాలి, ఆ మాటలు ఎంత సరళంగా ఉండాలి ఇలా అన్నీ విషయాలను తూకం తూచుకొని రచనను సాగిస్తారు ఆత్రేయగారు. అశ్వఘోషుడు తన ప్రియురాలు ప్రభతో బౌద్ధారామం పోయినప్పుడు అశ్వఘోషునికి ఆ రామంలోని గురుదేవునికి మధ్య జరిగిన సంభాషణను పరిశీలిస్తే ఆత్రేయగారు సంభాషణలను చిన్నచిన్న వాక్యాలలో క్లుప్తంగా సరళంగా ఎలా రాస్తారో అర్థమౌతుంది.

అశ్వ : గురుదేవా, మీతో వేదాంత చర్చకోసం వచ్చాను

గురు : వేదాంతమా – బౌద్ధమతంలో వేదాంతాన్ని ఒక బరువైన బంధనంగా భావిస్తారు.

అశ్వ : లేకేం. దాని స్థానం దానికున్నది. చూడండి.. నదిని దాటవలసి వచ్చింది. పడవలు లేవు. ఏవో కర్రలు చేర్చి ఒక తరణిని చేరుకుంటాము. నదిని దాటేస్తాము. ఆపైన ఆ కర్ర ముక్కలను నెత్తిన మోసుకుపోవాల్సిన అవసరం, బాధ్యత లేదు.. అంతే. జీవితంలో వేదాంతానికి కూడా అదే స్థానం అని సెలవిచ్చారు బుద్ధ భగవానులు" అని ప్రబోధిస్తాడు గురుదేవుడు. ఈవిధంగా మనిషి తన జీవితంలో వేదాంతానికి ఎంత వరకు ప్రాముఖ్యతనివ్వాలో అంత వరకే ఇవ్వాలని ఉపమాన పూర్వకంగా నాటికలోని ఈ సన్నివేశం ద్వారా తెలిపారు. ఆత్రేయ ఒక విషయాన్ని చెప్పే ముందు సంభాషణ రచనలో ఏవిధంగా ఒక ప్రణాళికను రూపొందించుకుంటారో ఉదాహరణ ఆరంభం నుంచి పరిశీలిస్తే అర్థమవుతుంది.

2. మాయ :

రామాయణంలోని ఋష్యశృంగుడి కథను అనుసరించి రాసినప్పటికీ ఈ నాటికలో విషయాన్ని బట్టి ఇది ప్రబోధాత్మక నాటికగా కూడా భావించవచ్చు. ప్రతిభ ఉన్నవారు ఆ ప్రతిభను పదిమందికి ఉపయోగపడే విధముగా వినియోగించాలి. అప్పుడే వారు ప్రజలచేత కీర్తింపబడతారు, నీరాజనాలందుకుంటారు. అంతేగాని.. కనిపించని దేవునికోసం కనిపించే మానవుడ్ని నిర్లక్ష్యం చేసి ఎక్కడో స్వర్గం ఉందని – శాశ్వత స్థానాన్ని అందులో సంపాదించాలని మానవధర్మాన్ని మరచి జీవించే సనాతనవాదులకు ఈ నాటిక ఒక సందేశం.

ఋష్యశృంగుడు విభాండకుడి కుమారుడు. తండ్రి ఆజ్ఞ ప్రకారం మోక్ష సామ్రాజ్యానికి, శాశ్వత ఆనంద సామ్రాజ్యాన్ని సాధించడానికి – అందుకు ప్రతి బంధకమనుకునే ఈ ప్రపంచాన్ని విస్మరించి తపస్సులో నిమగ్నమై ఉంటాడు ఋష్య శృంగుడు. దశరథుడి రాజ్యంలో అనావృష్టి – కరవు నాటకాలతో ప్రజలు అల్లాడిపోవడం చూసి ధరిత్రి వారి ప్రాణాలను కాపాడాలని ఆతృతతో వర్షాన్ని కురిపించగల శక్తి కలిగిన ఋష్యశృంగుని తండ్రి వద్దకు పోయి " ఋష్యశృంగునికి వర్షం కురిపించే శక్తి వుంది. ఈ నశిస్తున్న కోటానుకోట్ల నరలోకాన్ని ఉద్ధరించే మహత్తు వుంది. అతనడుగు పెడితే ధరిత్రి పచ్చగా నవ్వుతుంది తెలుసా!" అని ప్రాధేయపడి అడగ్గా.. " తెలుసు, కానీ ఋష్యశృంగుని మాత్రం ప్రపంచపు కళ్ళకు అప్పగించలేను" అని మానవులకు అతని శక్తి సామర్థ్యాలు ఉపయోగించడానికి నిరాకరిస్తాడు.

దశరథుడు కూడా ఇదే విషయమై విభాంగుడిని అభ్యర్థించడానికి వచ్చి అతన్ని ఒప్పించడంలో విఫలుడౌతాడు. ఋష్యశృంగుని ఆకర్షించి లోకంలో ప్రబలుతున్న క్షామాన్ని తొలగించమని సత్సంకల్పంతో తన అరవై నాలుగు కళలతో ఋష్యశృంగుని కదిలించమని ధరిత్రి కళని కోరుతుంది. రాచనగర్లు తన శక్తిని కోల్పోయేలా చేశారని కళ వాపోగా – మాయను అభ్యర్థించగా మాయ తన సౌందర్యంతో ఋష్యశృంగుని ఆకట్టుకుంటుంది. " తండ్రిగారు – నన్ను పిలుస్తున్నారు" అనే ఋష్యశృంగునితో...

మాయ : తండ్రిగారి పిలుపుకాదు, శరవేగంతో సాగిపోతున్న నవ్య ప్రపంచ రథ చక్రాల క్రింద నలిగిపోతున్న అసత్యాల అరుపు – అంతే..

ఋష్య : అవును, అసత్యాలు, అంతరించాల్సిందే..

నిభా : కుమారా ! కుమారా !

మాయ : ఈ పానీయం తీసుకో.

ఋష్య : అమృతం ! ఇదీ మానవ సృష్టేనా ?

మాయ : అవును.

ఋష్య : తండ్రిగారి వేదాంతమంతా అసత్యం. దేవతలను నేనొక్కరోజూ చూడలేదు. శివతాండవం కలలో కూడా కన్పించలేదు. సరస్వతీ వీణానాదం ఎక్కడో ! నేను నిన్ను, మానవులను, మానవసృష్టిని – చూస్తున్నా – చూస్తున్నదే సత్యం. తండ్రి గారు చెప్పిందంతా అసత్యం " అంటూ వీళ్లు నాకానందం యిస్తున్నారు. నాతో మాట్లాడుతున్నారు. కళ్ళకు కనబడని దేవతల కోసం ఎంతకాలం ఆ కుటీరంలో కళ్ళు మూసుకొని కూర్చోమంటారు. నావల్ల కాదు" అని మాయతో వెళ్ళి తోటి మానవ క్షేమం కోసం తన శక్తిని, ప్రతిభను ఉపయోగించి వర్షాన్ని కురిపించి దేశాన్ని పచ్చదనంతో కళకళలాడేలా చేస్తాడు ఋష్యశృంగుడు.

ఆత్రేయగారి సంభాషణలో జీవిత సత్యాలుంటాయి. నిత్యం మనం చూసే దృశ్యాన్ని మాటల్లో మూగగా రోదిస్తుంటాయి. ఒక విధంగా ఇలాంటి దృశ్యాలే మనిషిగా కవి అయిన ఆత్రేయను కదిలించి అనేకానేక రచనలకు ప్రేరణలుగా నిలిపాయని చెప్పవచ్చు. మానవకళ్యాణం కోసం తన కొడుకును తీసుకొని వెళ్ళబోయే మాయను విభాండకుడు అడ్డుకొనగా..

" అలా చూడు ! దాహం, దాహం – ఆకలి, ఆకలి – పశువులు, నీరు లేక అరుస్తున్న పక్షులు గిలగిల తన్నుకు చస్తున్నవి – వేడికి, కొంపలు తగులబడిపోతున్నాయి. అదిగో చూడు మూల ఆహారం కోసం, కుక్కతో పోట్లాడుతున్న మానవుడు – అదుగో, శీలాన్నమ్ముకొంటున్న స్త్రీ – అదిగో ఎండిపోయిన ఎదపై ఏడుస్తున్న పాపాయి – అదుగో వెన్నుకంటిన డొక్కలు – అదిగో కన్నకొడుకు చేతిలోంచి వున్న ఒక్క కబళాన్ని లాక్కొంటున్న కన్నతండ్రి – అదిగో కాకి ముక్కు నుంచి జారిన ఎముక కోసం ప్రాణాలను బిగపట్టుకొని పోరాడే జీవచ్ఛవాలు – ఆకలి కాగలేక కన్నపిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుంటున్న తల్లి – యిదంతా నీవు పూజించే దైవసృష్టేనా? అని విభాంకుడిని నిలదీసి ప్రశ్నిస్తుంది. అలాంటి దృశ్యాలెన్నో ఆత్రేయగారి మనసును కలచివేసినాయి. లోకంలో ఇలాంటి వాటిని రూపుమాపాలనే ఆశను హృదయం నిండా నింపుకొని వారికి చేతనైన సహాయాన్ని నిజ జీవితంలో చేయడమే కాదు, అనేక నాటకాలలో ఇలాంటి సంఘర్షణలనే ప్రదర్శిస్తూ రచనను కొనసాగించారు ఆచార్య ఆత్రేయ.

2.1.2. పాశ్చాత్యానుసరణలు :

పాశ్చాత్య దేశాల నాటికలను ఆధారం చేసుకొని రచన చేసిన వాటి పాశ్చాత్యానుసరణలు అనవచ్చు. ఈ కోవకి చెందిన నాటికలు (1) ప్రగతి (2) వర ప్రసాదం (3) చావకూడదు.

1. ప్రగతి :

జాన్.జి.ఇర్విన్ 'ప్రొగ్రెస్' ఆధారంగా ఆత్రేయ ఈ 'ప్రగతి' నాటికను రాశారు. మద్రాసులోని గిండీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల కోసం 1948లో రాసిన నాటిక ఇది శాస్త్ర విజ్ఞానం అనేది మానవ జీవితానికి ప్రయోజనకరంగా ఉండాలి, ఉంచాలే గాని – శాస్త్రవేత్త తమ స్వార్థ ప్రయోజనాల కోసం శాస్త్ర విజ్ఞానాన్ని ప్రమాదకరమైన, భయంకరమైన దానిలా మార్చకూడదని ప్రభోదించే నాటిక ఇది. ఇందులో ప్రధానమైన పాత్రగా 'శాంతి' పాత్రను తీర్చిదిద్దారు ఆత్రేయ. 'శాంతి' యుద్ధంలో తన కొడుకును కోల్పోయిన స్త్రీ. యుద్ధమనేది ప్రతి మనిషి జీవితంలో ఎంత భయాన్ని సృష్టిస్తుందో – మరువలేని విషాదాన్ని జీవితంలో ఎలా మిగుల్చుతుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్న స్త్రీ! యుద్ధం అనే పదమే ఈ సృష్టికి – మనిషి మనుగడకి వినాశనాస్త్రంగా గుర్తించిన స్త్రీ. యుద్ధంలో చనిపోయిన తన కొడుకును శ్రద్ధాంజలి నటించడానికే ఆ సంస్మరణ దినాన తన తమ్ముడు ఇంటికి వెళ్తుంది శాంతి. శక్తివంతమైన ఒకే ఒక బాంబుతో లక్షలాది మందిని మట్టిలో కలిపే భయంకరమైన ఒక బాంబుని తయారుచేసిన ఆనందంలో ఉంటాడు శాంతి తమ్ముడు. మానవజాతి మనుగడకే ప్రమాదకరమైన ఆ బాంబు ఫార్ములాను పెట్టుబడిదారునికి ఆమె తమ్ముడు (సైంటిస్ట్) అమ్మబోగా అడ్డుకొని ఆ ఫార్ములాని నాశనం చేయమని ప్రాధేయపడుతుంది. ఎంత చెప్పినా మాట వినక ఫార్ములాని అమ్మటానికే మొగ్గు చూపే తమ్ముడ్ని చూసి ఒక్కడి కోసం కోట్లాదిమందిని చంపేకన్నా కోట్లాది మంది ప్రాణాలతో ఉండడానికి ఒక్కడి ప్రాణం తీసినా పాపం లేదని పొడిచి చంపేస్తుంది.

పిచ్చివాడి పాత్ర ద్వారా పచ్చి నిజాలు పలికించడానికే ఈ నాటికలో ఈ పాత్రను సృష్టించారనిపిస్తుంది. అంతేగాక తన మనసులోని మాటలను ఆ పాత్ర ద్వారా పలికించడానికి కూడా ప్రవేశపెట్టినట్లుంది. " మానవుని జీవితాన్ని సుఖప్రదం చేసేదే విజ్ఞానం. మానవుని ఆయుర్దాయాన్ని పెంచేదే విజ్ఞానం." అని శాంతి తన తమ్ముడికి శాంతిని ఉపదేశిస్తున్నట్లు రాస్తూ పిచ్చివాడి పాత్ర కూడా కలుగజేసుకొని 'ఆకలి, శోకం లేకుండా చేసేదే విజ్ఞానం" అని సైన్స్

పరిశోధనల ద్వారా ప్రమాదకరమైన బాంబును కనిపెట్టి అజ్ఞానంతో అదే విజ్ఞానమని భావించే సైంటిస్ట్‌కి అసలు సిసలైన విజ్ఞానమంటే ఏమిటో పలికిస్తారు ఆత్రేయ. సాంఘిక పరిస్థితులను బట్టి కూడా పాత్రకే సంభాషణలు రాయడమంటే ఇదే! పిచ్చివాడు సామాన్య మానవుడు కనుక అతనికి ప్రధాన సమస్యగా ముందుండేది పీడించేది ఆకలి. అది తీరకపోతే ఆ మనిషిలో కలిగేది మనసులో చెలరేగేది శోకమేగా! అందుకే ఆకలి లేకుండా చేసేదే అసలైన విజ్ఞానం అని ఆ పాత్రనోట పలికిస్తారు ఆత్రేయ.

2. వర ప్రసాదం :

డబ్ల్యు.డబ్ల్యు.జేకబ్స్ నాటిక 'ది మంకీస్ పా' కి అనుసరణగా ఆత్రేయ ఈ ' వరప్రసాదం' నాటికను రాశారు. ఈ నాటిక రాఘవ కళాసమితి 'కాకినాడ వారిచే ఆంధ్ర నాటక కళాపరిషత్ వారు 9-5-54 బందరులో నిర్వహించిన పోటీలలో ప్రదర్శింపబడి ఉత్తమ ద్వితీయ ప్రదర్శనలో బహుమతి పొందింది.

తోటివారి బలహీనతను గుర్తించి సొమ్ము చేసుకునే స్వాములు ఈ లోకంలో ఎందరు ఉన్నారు. ఇందులోని సార్జెంట్ పాత్ర ఈ కోవకి చెందినదే ! కాకి ముక్కు కోరిన వరాలు తీరుస్తుంది. ఆశతో వున్న ముసలి దంపతులను మభ్యపెట్టి వారి వద్ద ఉన్న వంద రూపాయలకు కాకి ముక్కును అమ్మివెళ్తాడు సార్జెంట్. వారు కోరిన వరాలు నెరవేరకపోగా వున్న వందరూపాయలు పోగొట్టుకుంటాడు. అంతేకాదు - ఈ సంఘన గూర్చి, ఫ్యాక్టరీలోని తన తోటి వారితో మాట్లాడుతూ మిషను దగ్గర పనిచేస్తుండే ఆ ముసలి దంపతుల కొడుకు ప్రమాదంలో చిక్కుకొని మరణిస్తాడు. వారు కోరిన 500/-లు వరం కొడుకు మరణంతో కంపెనీవారు నష్టపరిహారంగా లాయరు ద్వారా 500/- రూపాయల చెక్కును అందిచడం - విషయం తెలుసుకొని వృద్ధ దంపతులు విలపించడంతో కథను ముగిస్తారు ఆత్రేయ.

3. చావకూడదు :

జె.బి.ప్రిస్ట్లీ నాటకం 'యాన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్' ఆధారంగా ఈ నాటికను రాశారు ఆత్రేయ. రజనీ మహిళా సంఘం అధ్యక్షురాలు. అనేక మందిచే వంచింపబడిన ఒక స్త్రీ (కమల) తనకు పుట్టిన బిడ్డను మహిళా సంఘం ప్రహారీ గోడ లోపల పడవేసి ఆత్మహత్యకు పాల్పడగా ఆ నెత్తిన ఆ గొడవెక్కడ చుట్టుకుంటుందోనని రజని ఆ యువతిని హాస్పటల్‌లో చేర్పిస్తుందేగాని సాటి స్త్రీగా జాలిపడి మాత్రం కమల గుడ్డల మూటలో దొరికిన ఫొటోను నర్స్ డాక్టర్‌కి చూపించగా నిశ్చేష్టురాలై పోతుంది. కారణమేమిటంటే ఆ ఫొటో డాక్టర్ భర్తది. కమలను ప్రేమిస్తున్నట్లు చెప్పి పెళ్ళి చేసుకుంటానని ఆమె నెల తప్పగానే విడిచిపెట్టి వెళ్తాడు. డాక్టర్ భర్త మొదటిలో. ఆ తర్వాత డాక్టర్‌ని వివాహమాడతాడు. జయపేరుతో పద్మా జోసెఫ్ ఇంట్లో పనికి కుదురుతుంది. అరవైయేళ్ల వయసు గల జోసెఫ్ తండ్రి కమలపై అఘాయిత్యం చేయబోగా ఆమె మీద సానుభూతి చూపించే భర్తపై అనుమానపడి ఆమె తన మామగారితో అలసి జయను ఇంట్లో నుంచి తరుముంది. ఆ తర్వాత కమల 'ఇందిర'గా పేరు మార్చుకొని నర్స్ భర్త నిర్వహించే ఫ్యాన్సీ షాప్‌లో సేల్స్ గర్ల్‌గా చేరుతుంది. ఆమె కూడా అపార్థంతో పనినుంచి తీసేయించగా సర్వం కోల్పోయిన కమల మహిళా సంఘం ఆశ్రయంను కోరగా రజని తిరస్కరిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో కమల ఆత్మహత్యకు పాల్పడింది. ఇలా ఆ హాస్పటల్ సన్నివేశంలో కమల చుట్టూ ఉన్న డాక్టర్, నర్స్, రజని మొదలైన వారందరూ తన పరిస్థితికి కారకులుగా చెపుతుంది.

ఆడదానికి ఆడదే శత్రువు. వంచింపబడిన స్త్రీని వేశ్య అంటూ, "వీళ్లు సంఘానికి చీడపురుగులు, దేశానికి తీరని మచ్చలు" అని కాకుల్లా హేళనతో కూడిన ప్రశ్నలతో పీక్కు తింటారు. బూటకపు మహిళా సంఘాలు పేరుతో అధ్యక్ష పదవులు, మీటింగులు, పూలమాలలు, పత్రికల్లో ఫొటోలు. వీటిని మెట్లుగా ఉపయోగించుకొని అసెంబ్లీ టిక్కెట్లకు ప్రయత్నించి రాజకీయంగా ఎదుగుతారే గాని అన్యాయం జరిగిన స్త్రీకి ఈ స్త్రీ సంఘాలు ఎంతమేరకు న్యాయం చేస్తున్నవి అని బాధ్యతలను విస్మరించి విమర్శననే ధ్యేయంగా పెట్టుకున్నవారిని ఈనాటిక ద్వారా విమర్శిస్తారు ఆత్రేయ.

2.1.3 సమస్యాత్మక నాటికలు :

సమాజంలోని వివిధ సమస్యలను చిత్రీకరిస్తూ రాసిన నాటికలనే సమస్యాత్మక నాటికలంటారు. (1) ఎవరు దొంగ? (2) ఒక్క రూపాయి నాటికలు ఈ కోవకి చెందినవిగా పేర్కొనవచ్చు.

1. ఎవరు దొంగ ?

ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 'ఎవరు దొంగ' అనే ఒక నాటికను ప్రదర్శింపబోతుండగా ఒకటే గొడవ. హాస్టల్‌లో దొంగలు పడి ఏవో పట్టుకెళ్ళడంతో సబ్‌ఇన్‌స్పెక్టర్ మరి కొందరు పోలీసులు వచ్చి ఆ కాలేజి హాస్టల్ వార్డెన్‌ని అరెస్టు చేసి తీసికెళ్తారు. విద్యార్థుల కోసం హాస్టల్ వార్డెన్ బాపూజీ రైస్ మిల్లు నుంచి బియ్యం కొనుగోలు చేసేటప్పుడల్లా కమీషన్ పొందుతుంటాడు. ఆ బియ్యంలో రాళ్ళు కలిపి ఉంటాయి. ఇలాంటి అక్రమ సంపాదనికి అలవాటు పడిన మిల్లు యజమాని చౌదరి, డి.ఎస్.ఓ.కూడా తనకు అందాల్సింది రాబట్టుకుంటూ ఉంటాడు.

నాటకం ప్రదర్శింపబడుతున్న సమయంలోనే ఒక స్త్రీ తన ముగ్గురు బిడ్డలతో పోలీస్ స్టేషన్ బావిలో దూకి ఆత్మహత్య చేసుకోబోగా పోలీస్ ఆమెను బయటకు తీసి వైద్యం చేసే బ్రతికించ ప్రయత్నం చేస్తాడు. కాని వారి ప్రయత్నం విఫలమవుతుంది. ఆ స్త్రీ ఆమె ముగ్గురు పిల్లలు చనిపోతారు. ఆ స్త్రీ ఎవరో కాదు. ఆకలి బాధకు తాళలేక తాను తినకపోయినా తన వారికి నాలుగు మెతుకులు తినిపించి బ్రతికించుకోవాలని తాపత్రయపడి విధిలేని పరిస్థితుల్లో హాస్టల్‌లో పడి కొంచెం అన్నంను దొంగలించి మూటకట్టుకొనిన వ్యక్తి భార్య ఆ స్త్రీ.. తన వారి ఆకలిచావుకి– తనపై అన్నంను దొంగలించి మూటకట్టుగొనిన వ్యక్తి భార్య ఆ స్త్రీ.. తన వారి ఆకలిచావుకి – తనపై దొంగ అని ముద్రపడడానికి పెద్ద మనుషుల్లా కనిపించే అసలైన దొంగలు చౌదరి, వార్డెన్ డి.యస్.ఓ.నిరసిస్తూ ఎస్.ఐ.చేతిలోని పిస్టల్‌ను లాక్కొని కాల్చుకొని మరణిస్తాడు ఆవ్యక్తి. నిజాయితీపరుడైన ఎస్.ఐ. ఆ ముగ్గురికి తగిన శిక్ష వేయించడానికి అరెస్టు చేయగా రాజకీయ పలుకుబడితో క్షణాల మీదవారు విడుదలవడమే గాక ఈ ఎస్.ఐ.ను మరో ఊరుకి బదిలీ చేయిస్తారు.

2. ఒక్క రూపాయి :

భారతదేశంలో ఉన్నత విద్యావిధానం నిరుద్యోగులను తయారుచేయడానికి పనికి వస్తుందే కాని ఏదో ఒకవృత్తిలో వారి కాళ్లమీద వారు నిలబడేలా చేసేది కాదు. పెద్ద చదువులు చదివినా నిరుద్యోగ రాక్షసి కోరలకు బలికాక తప్పట్లేదు. ఉద్యోగం కోసం ఏళ్లు తరబడి ఏళ్లుపైబడుతున్నా ఎదురుచూడక ఏదో ఒక చేతివృత్తితో బ్రతుకుబాటను తీర్చిదిద్దుకోమని అంతర్లీనంగా ఉపదేశించే నాటిక మాత్రమేకాక ఈ భారతదేశ ఆర్థిక విధానంలో ఒక్క రూపాయి కూడా సంపాదించడం కూడా నిరుద్యోగులైన వారికి ఎంత కష్టమో కళ్ళకు కట్టినట్లు చూపించారు ఆత్రేయ.

వేణు, జగ్గు, శివ, రాం, గోపాల్ అనే ఐదురుగు నిరుద్యోగ యువకులు ధర్మయ్య ఇంటిలో అద్దెకుంటుంటారు. వాళ్ళెలా ఉన్నారంటే.. "అందరి ముఖాలు ముడతలు పడి, కొందరు తలలో తెల్ల వెంట్రుకలు స్ఫుటంగా కనబడుతూ ఒక్కరి ముఖంలోనైనా ఆ వయసులో వుండాల్సిన హుషారు, ఉత్సాహం కనబడక ఎల్లకాలం ఏదో సమస్య పీక్కుతింటూ, ఏడుస్తూ, కళ్లు దవడలు పడి తలలూ, గడ్డాలూ సంస్కారం లేక మురికి వల్ల అసలు రంగు మూసుకుపోయిన బట్టలత వుండే వాళ్ళను కుర్రాళ్ళనడం కుర్రాళ్ళతనానికే సిగ్గుచేటు " ఇదీ వాళ్ళ స్థితి.

ఆరు రోజుల క్రితం అన్నం తిన్నారు వాళ్ళు. నీళ్ళతోనే కడుపు నింపుకొని ప్రాణం నింపుకుంటున్న వారు వాళు ్లు. ఎన్నాళ్లు ఇలా! ఒక్కరూపాయి ఉంటే వాళ్ళ సమస్య తీరుతుంది ప్రస్తుతానికి. ఆ రూపాయిని పెట్టుబడిగా పెట్టి వారికి చేతనైన చేతి వృత్తితో కొన్ని వస్తువులను తయారుచేసి ఆ డబ్బును ఐదింతలు చేయగలమనే నమ్మకంతో వున్నారు. కాని వారి దగ్గర ఆ ఒక్క రూపాయే లేదు! ఎలాగైతేనేం మూటలు మోయగా ఒక్క రూపాయి సంపాదిస్తారు. తనకు

ఉద్యోగం లేదనే బాధతో మంచం పట్టిన తండ్రికి ఉద్యోగం వచ్చినట్లు టెలిగ్రాం ఇచ్చి శివ, రాం తండ్రిని బ్రతికించుకోవడానికి ఈ రూపాయను వెచ్చించాలా లేదా మూటలు మోస్తూ నరం పట్టిన గోపాల్‌కి మందులు తేవాలో లేదో చర్చించుకుంటుండగా లేదా మూటలు మోస్తూ నరంపట్టిన గోపాల్‌కి మందులు తేవాలో లేదో చర్చించు కుంటుండగా శోష వచ్చి పడిన రాంను చూసి పావలాతో ఇడ్లీ కొని అందరూ కొద్దికొద్దిగా తింటారు. మిగిలిన ముప్పావలాతో రంగులు, రంగు కాగితాలు మార్కెట్‌లో కొనుక్కొని వచ్చి 'రాం' రెండు డజన్లు కాగితం పూలను, శివరాం చిత్రాలను, జగ్గు ఒక కథను తయారుచేసి అమ్మి డబ్బు సంపాదించాలనుకుంటుండగా ఇంటి యజమాని వచ్చి వాటిని పట్టుకెళ్ళి అద్దె కింద చెల్లబెట్టుకోమంటాడు. ఇంతలో శివం తండ్రి చనిపోయినట్లు టెలిగ్రామ్.

2.1.4. రాజకీయ నాటికలు :

రాజకీయం ఇతివృత్తిగల నాటికలను ఈ విభాగం కింద చర్చించవచ్చు. ఈ కోవకి చెందిన నాటికలు (1) అంత్యార్పణం (2) ఓటు నీకే.

1. అంత్యార్పణ :

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ నాయకులలో కొందరు గాంధేయ వాదాన్ని అడ్డుపెట్టుకొని అన్యాయాలు, అక్రమాలు చేసే వాళ్ళను విమర్శిస్తూ రాసిన నాటిక.

భారతమ్మ స్వచ్ఛమైన గాంధేయవాది. కాంగ్రెస్ పార్టీలో ఉండే ఆమె చిన్నకొడుకు స్వాతంత్ర్యానంతరం మంత్రి అవుతాడు. శేషయ్య అనే నక్కజిత్తుల నాయకుడు భారతమ్మ వంచన చేరి చెరువు తట్టు నుండే ముప్పై ఎకరాల భూమి కోసం భారతమ్మకు నానా మాటలు చెప్పి తనకు అడ్డుపడే దళితులకు ఆ భూమి దక్కకుండా తనకు వచ్చేలా కొడుకుతో ఒక మాట చెప్పమని అడగగా.. అతనికి బాగా చివాట్లు పెట్టి పంపతుంది. దళితులకు చెందాల్సిన ఆ భూమిని వారికి దక్కేలా చేయమని వారి పక్షాన తన కొడుక్కి చెప్పాలనుకుంటుంది. తన బిడ్డ బ్లాక్ మార్కెట్ వ్యాపారం చేసే జోగయ్య ఇంట్లో అడుగుపెట్టినట్టు తెలుసుకొని ఆగ్రహిస్తుంది. శ్రీశ్రీ రాజమహేంద్ర వీరవెంకట భూపాలరావు బహుద్దూరుని కాంగ్రెస్ తరపున నిలబెట్టి వ్యక్తులను చూడకండి. కాంగ్రెస్ మహాసంస్థను చూడండి ' అని ప్రచారం చేస్తాడు. తనతోపాటు ఢిల్లీకి రమ్మని తల్లిని అడిగితే భారతమ్మ నిరాకరిస్తుంది. మంత్రిగా ఉండి ప్రజలను మోసపుచ్చినందుకు ప్రజల దగ్గరకెళ్ళి తాను చేసిన పాపాల్ని ఒప్పుకొని లెంపలేసుకోమనగా అందుకు నిరాకరిస్తాడు ఆమె కొడుకు. ఇంతలో కొందరు స్త్రీలు తమ పిల్లల్ని చంకన వేసుకొని రక్తసిక్త వస్త్రాలతో వచ్చి వారి గూడెంలోని గుడిసెల్లో దూరి పార్టీ నాయకురాలు ఓట్ల కోసం అందర్ని హింసలు పెట్టడం గూర్చి చెప్పగా వారి తరపున పోరాడడానికి వెళ్ళబోయే తల్లిని ఆమె కొడుకు మంత్రి అయిన తల్లిని తల్లని కూడా చూడక " అమ్మా! నోరు మూసుకొని పడివుండు" అని చెప్పినా అడ్డుకునే కొడుకును కర్రతో కొట్టగా భారతమ్మను అరెస్టు చేయమని పోలీసులకు చెప్తాడు. " కన్నతల్లిగా నా ప్రయత్నం నేను చేశాను. ఇక వీణ్ణి ప్రజలకప్పచెప్పి వెళ్తున్నాను. మళ్ళామళ్ళా మోసపోకండి, దేశాన్ని కాపాడుకోండి" అని అతని తల్లి అరెస్టు అయి వెళ్ళిపోగా ప్రజా ప్రవాహం ఉప్పెనలా మంత్రి పైకి రాగా జగన్నాధం కాలికి బుద్ధిచెప్పడంతో నాటిక ముగుస్తుంది.

2. ఓటు నీకే ! :

ఎలక్షన్ల పట్ల ఓటర్లని విద్యావంతులను చేయడమే ఈ నాటికలోని ప్రధానాంశం. ఎలక్షన్ల సమయంలో నాయకుడిగా నిలబడినవాడు ఒకో పల్లెలో, ప్రాంతంలో వారికి అనుకూలమైన వారిని ఎన్నుకొని తన ఏజెంట్లుగా ఉపయోగించుకొని ఏ విధంగా ఓటర్లకు మాయమాటలు చెప్పి ఓట్లు తమకు పడేలా చేసుకునేందుకు ప్రయత్నిస్తారో స్పష్టంగా చూపిన నాటిక ఇది. అంతేకాక అసలు ఓటు అంటే ఏమిటి? ఓటుకున్న శక్తి, ఓటరుకున్న హక్కు, అధికారం ఏమిటి ఇలాంటి విషయాలన్నింటిని కొడుకు పాత్ర ద్వారా ఆత్రేయగారు తెలియజేసిన నాటిక.

కొడుకు అనారోగ్యంతో మంచానపడితే పిల్లగాడికి మందులకోసం ధర్మాసుపత్రికి వెళ్ళిన ముసలాయన కోసం అతని భార్య కాచుకొని చూస్తుండగా ఓ చిన్న సీసాలో పిల్లవాడికి మందు తీసుకొని వస్తాడు. అంతలో సుబ్బన్నరావడం చూసి " ఏంటీ కబుర్లూ, ఈయాళ నాలుగు సార్లొచ్చి పోయావం?" అని వెంకన్న అడిగిన దానికి " అయ్యగారికి కాస్త మనందరితో పని పడిందిలేవయ్యా" అని తాను ఓట్ల విషయం అడగడానికి వచ్చినట్లు చెప్పకుండా అయ్యగారి దగ్గరకు రమ్మని చెప్పి వెళ్తాడు. సుబ్బన్న వెళ్ళిన వెంటనే రామయ్య అదేవిషయమై వచ్చి మాయమాటలు చెప్పి వెళ్ళబోతుండగా రంగనాయకులు వచ్చి, ఎలక్షన్ల గూర్చి మాయమాటలు చెప్పి కాగితం ఇచ్చి కొడుకును చదవమని చెప్పి వెళ్ళబోతుండగా శంకరం ఎదురౌతాడు అతను అవే విషయాలు చెప్పి వెళ్ళగా కానిస్టేబుల్‌గా పనిచేసే పెద్ద కొడుకు వారిచ్చిన కాగితాలను చదివి సుబ్బన్న రామయ్య రంగనాయకులు, శంకరం ఎందుకొచ్చారో తన తల్లిదండ్రులకు చెప్తాడు. అనారోగ్యంతో ఉన్న వారి కొడుకుకు సరైన సమయంలో వైద్యం చేయించి ఆదుకున్న అజ్ఞాత వ్యక్తికే తమ ఓటని ఆ ముసలి దంపతులు అంటారు.

2.1.5. కౌటుంబిక నాటికలు :

కుటుంబంలోని సమస్యలను చిత్రీకరిస్తూ రాసిన నాటికలను కౌటుంబిక నాటికలు అంటారు. ఈ కోవకి చెందినవి (1) కళకోసం (2) చస్తే ఏం (3) ఆత్మార్పణ.

1. కళకోసం :

నాటకరంగం ఆరంభదశలో స్త్రీ పాత్రలను ధరించడానికి స్త్రీలు ముందుకు వచ్చేవాళ్లు కాదు. ఎందుకంటే నటులలో సత్ప్రవర్తన, ప్రేక్షకులలో గౌరవభావం లోపించడం వల్ల కుల స్త్రీలు ముందుకు రావడానికి జంకేవారు. ఇలాంటి సమస్యలను తీసుకొని రాసిన నాటికే ఇది. 'మను' ఔత్సాహిక నాటక సమాజ దర్శకుడు, నటుడు, తాను ప్రదర్శించబోయే నాటికలో తారగా రాధను పోషించమనగా "నమస్తే! నన్ను మాత్రం నడివీధి కెక్కించండి. మీరెక్కింది చాలు" అని నిరాకరించగా, ఆమెను ఏ విధంగానైన ఆ నాటకంలో నటించేలా చేయడానికి తద్వారా నాటకాల పట్ల ఆమెకు గల దురభిప్రాయాన్ని తొలగించి నటించేందుకు వత్తిడి తీసుకువచ్చినా ఒప్పుకోదు. తన నాటకంలో వేషం వేయననే భార్యతో నాటకాల్లో వేషం వేయడానికి సమ్మతించే స్త్రీని పెళ్ళిచేసుకుంటానని బెదిరిస్తాడు.

మను అన్నట్టే మరొకరిని వివాహమాడినట్లు మను మిత్రుడు పాంచజన్యం రాధకు చెప్పగా తన జీవితం నాశనమయినట్లు బాధపడుతూ పుట్టింటికి బయలుదేరగా, మను అడ్డుకోవడం చూసి..

"రాధ : నన్ను వెళ్ళనీండి నన్ను చావనీండి. నన్ను ఏ నుయ్యే గొయ్యో చూసుకోనిండి (కదుల్తుంది)

మను : కళకోసం ఆ త్యాగం – ఆ దు:ఖం కూడా సహించాల్సి వస్తే తప్పదు. సహిస్తా! అంతే !

రాధ : (తిరిగి వచ్చి) నన్ను వదిలేస్తారా ? (కాళ్ళమీద వాలి) ఇంత ప్రేమించిన నన్నే మానుకుంటారా ? నా కన్న మీకు కళే అధికమా ?

మను : కళే నేను – నా ప్రాణం, రాధా !

రాధ : ఆ.. అయితే, అయితే – నేను మీరు చెప్పిందానికి ఒప్పుకుంటా ! నాటకాల్లో సహకరిస్తా." అని నటించడానికి ఒప్పుకుంటుంది. ఇంకా ఆమెను ఏడ్పించే మనును చూసి మను మామ గారిగా నటించే రంగయ్య అసలు విషయం బయటపెట్టగా " అబ్బ ! అసాధ్యులండీ మీరు నాటకాల కోసం నాటకమాడారు" అంటుంది.

2. చస్తే ఏం ? :

ఒక రచయిత, కళాకారుని రచన అభినయమో నచ్చి పొగడ్తలతోనో, బిరుదుతోనో సన్మానాలతోనూ, శాలువాలతో కప్పి అతని దారిద్ర్యాన్ని ఆర్ధిక దుస్థితిని కప్పిపుచ్చడానికే ప్రయత్నిస్తుంటారు కాని వేరే ఆలోచించం. కీర్తి ప్రతిష్టలు కళాకారులను బ్రతికించలేవనే నగ్నసత్యాన్ని తెలిపే నాటిక.

రజని పేరు ప్రఖ్యాతులు అర్జించిన గొప్ప పేదకవి, నటుడు. అతని భార్య సరస్వతి జబ్బు మనిషి. వారికి విప్లవ్, చిట్టి అనే కొడుకూ కూతుర్లు ఉంటారు. రజని నాటక రంగంపై ఉన్న అభిమానంతో కాంట్రాక్ట్ నాటకాలు ఆడడానికి ఇష్టపడడు. మరి ఆ కాలంలో విరివిగా ఆడబడేవన్ని అలాంటి నాటకాలే. అందుకే చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా పిల్లలకు తిండి పెట్టలేని స్థితిలో, భార్యకు వైద్య పరీక్షలు చేసి బాగు చేయించలేని స్థితిలో తన నిస్సహాయ స్థితిలో తన తన నిస్సహాయ స్థితికి తనకు తానే అసహ్యించుకుంటాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి యజమాని నాయుడు వచ్చి, " అద్దె యివ్వకపోతే పోయింది. యిల్లు ఖాళీ చేయకూడదూ ?" అని హెచ్చరించి వెళ్తాడు. సుఖంగా చూసుకోవాల్సిన భార్యను జబ్బుతో కుక్కి మంచంపై పండుకొనబెట్టినందుకు ఏమి చేయలేని అతని అసమర్ధతకు ' నీ అబ్బ తప్పు నిన్ను నాకు ముడిపెట్టడం " ఈ దౌర్భాగ్యుడికి భార్యగా చేయడం ఆయన తెలివితక్కువ" అని అతని మామగారిని తిడతాడు. కఠిన పరిస్థితుల్లో అమెచ్యూర్ సమాజం నడిపే పెద్దమనిషైన కరుణ 20/- ముష్టి ఇచ్చినట్లు ఇవ్వగా అతని మోహన విసిరి ఆదర్శాలు అన్నంపెట్టవని తెలుసుకొని నాటకాల కాంట్రాక్టర్ చిన వెంకటసుబ్బయ్యను పిలిపించి తాను కాంట్రాక్ట్ నాటకం ఆడడానికి ఒప్పుకుంటున్నట్లు చెప్పి అడ్వాన్సుగా 20/- పుచ్చుకుంటాడు. వెంటనే డాక్టర్‌ని ఇంటికి తీసుకురమ్మని కొడుకును పంపుతాడు. " అవమానింపబడే అమెచ్యూర్ కన్నా అసహ్యించుకోబడే ప్రొఫెషనల్ కావచ్చు. అదే నయం! చినవెంకట సుబ్బయ్యలో ఎంతో మానవత్వం వుంది. " అని మనసులో అనుకుంటాడు. డాక్టర్ వచ్చే లోపే అతని భార్య చనిపోతుంది. " అమ్మనన్యాయంఆ చంపేశావు?" అని రోదిస్తూ కొడుకు అనే మాటలకు " చస్తే ఏం? సరస్వతి ఏనాడో మనల్ని విడిచిపోయింది. చస్తే ఏం? చస్తే ఏం?" అనే మాటలతో నాటిక ముగుస్తుంది.

3. ఆత్మార్పణ :

భర్త కవితా ప్రేరణకు కారభూతమైన రాధకోసం తన జీవితాన్నే త్యాగం చేసిన ఇల్లాలు శ్యామ. మూడు ముళ్ళ బంధం కంటే మానసిక సంబంధమే గొప్ప అని నిరూపించిన నాటిక.

మూర్తి కవి. అతని భార్య శ్యామ. క్షయవ్యాధిగ్రస్తురాలు. శ్యామ తన భర్త కవిత్వానికి ప్రేరణ రాధ అని తెలుసుకొని వారు ఎంత చనువుగా తన కళ్ళ ముందు ఉన్నా ఏమనకుండా ఉండడమే కాక వారిరువురిని ఒకరిగా చేసి కళ్ళు మూయాలనే ఉద్దేశ్యంతో వైద్యం చేయించుకోవాలని బెంగుళూరుకి ప్రయాణం అవుతూ తోడుగా తన భర్తతో పాటు రాధను కూడా వెంట బెట్టుకెళ్తుంది. కవికి భార్యగా తాను కాగలిగానే కాని ఆ కవిని కదలించే మహత్తర శక్తి తనకు లేదని రాధకు అభ్యంతరం చెప్పదు. " ప్రపంచమంతా జోహార్లర్పించే కావ్యం రాయాలి. మూర్తి విశ్వకవీంద్రుడు అనిపించుకోవాలి. ఏం వెళ్ళండి – రాధా– వెళ్ళు" అని పంపగా కొన్ని రోజులు మానవుడనే మహాకావ్యాన్ని పూర్తిచేసి ప్రపంచ బహుమానానికి పంపంగా నోబెల్ బహుమతి పొందుతాడు. ఆ తర్వాత మూర్తికి భార్యగా తనస్థానాన్ని విడుచుకోవడానికి ఇష్టపడలేకపోతుంది శ్యామ. ఇంతలో రాధ నెల తప్పినట్టు డాక్టర్ ద్వారా తెలుస్తుంది. రాధ తండ్రి పతంజలికి ఈ విషయం తెలిసి బెంగుళూరు వచ్చి అతని భార్యను నిలదీసి అడుగగా ఈ సమస్యకు పరిష్కారంగా తన భర్త మూర్తిని రాధకిచ్చి పెళ్ళి చేయబోతున్నట్టు శ్యామ చెప్పడంతో నిశ్చేష్టుడైపోతాడు. తాను బ్రతికుంటే రాధ పెళ్ళాడడం కష్టమని, లోకం నానా మాటలంటుందని శ్యామ చనిపోతుంది. ఈ సంఘటనతో రాధకూడా మూర్తికి దూరంగా వెళ్తుంది.

2.1.9. ప్రబోధాత్మక నాటికలు :

ఏదో ఒక సందేశాన్ని, నీతిని ప్రభోదిస్తూ రాసిన నాటికలను ప్రబోధాత్మక నాటకాలనవచ్చును. ఈ కోవకి చెందినదే 'తెరచిన కళ్ళు' నాటిక, ఈ నాటికను పైడిపాల గారు వారి సిద్ధాంత గ్రంథంలో స్పృశించలేదు. అన్ని దానాలలో కెల్లా విద్యాదానం గొప్పది. అలాంటి దానిని దాచడం మంచిదికాదని నీతిని ప్రబోధించే నాటిక.

డా॥ సుదర్శన్ పేరు మోసిన కళ్ళ డాక్టర్. తన శస్త్ర చికిత్సతో పుట్టు గుడ్డి వాళ్ళకు కూడా ఈ రంగుల ప్రపంచాన్ని చూపించి ఎందరికో ఇలవేల్పయ్యాడు. ప్రమాదవశాత్తు పెళ్ళిపీటల మీదనే కళ్ళు పోగొట్టుకునే వానికి చూపును తెప్పించాడు. పిల్లా జెల్లలు లేని వాడు డాక్టర్. అతని దగ్గర కాంపౌండర్‌గా పనిచేసే సత్యం డాక్టర్‌ని వైద్యం నేర్పమని బ్రతిమలాడతాడు. ఎందుకంటే అతని తదనంతరం ఆ గొప్ప వైద్య విధానం మరుగున పడకూడదని ఎంత బ్రతిమాలాడినా ఆవిద్యను నేర్పడానికి డాక్టర్ నిరాకరిస్తాడు.

ఒకరోజు డాక్టర్ గారి కంటిలో ఏదో పడిచూపు కోల్పోతాడు. " భగవంతుడు బాగా శిక్షించాడోయ్ నన్ను – నా అహుభావానికి, అహంకారానికి సరైన శిక్ష విధించాడు. నన్ను గుడ్డి వాణ్ణి చేశాడు... విద్యంతా నా సొత్తని విర్రవీగాను. కళ్ళుండీ గుడ్డివాడిగా ప్రవర్తించాను" అని బాధపడే డాక్టర్‌కి తాను వైద్యం చేస్తానని సత్యం డాక్టర్‌ని ఒప్పించి ఆఫరేషన్ చేయగా కళ్ళు వస్తాయి. తాను చెప్పకపోయినా ఆ విద్యను డాక్టర్ వ్రాసుకున్న నోట్లంతా దొంగతనంగా చదివి, ఆపరేషన్ ధియేటర్‌లోకి రావద్దన్నా కంత చేసుకొని చూసి ఒకోసారి నర్స్ వేషంలో డాక్టర్ ప్రక్కనే చేరి చూసి నేర్చుకున్నట్లు చెప్పగా నాయనా సత్యం.. నువ్వు ధన్యుడివి. నీబోటి ప్రజాసేవకుల వద్ద విద్య సార్ధకమవుతుంది. నీవు నాకు ఈ కళ్ళే కాదు నాయనా, మనోనేత్రాన్ని కూడా తెరిచావు" అని పశ్చాత్తాపపడి, సత్యంను హత్తుకుంటాడు.

2.1.7. ప్రతీకాత్మక నాటికలు :

పాత్రలను ప్రతీకాత్మంగా చూపిస్తూ రచన చేసిన నాటికలను ప్రతీకాత్మక నాటికలు అంటారు. ఈ కోవకి చెందినది 'అంతర్యుద్ధం ' నాటిక.

ఈ నాటికను పైడిపాల తన సిద్ధాంత గ్రంథంలో సమస్యాత్మక నాటికల్లో సూచించారు. కాని ఈ నాటికలోని సమస్య కన్నా అంతర్గతంగా మానవునిలో నిత్యం మంచీ చెడుల మధ్య జరిగే సంఘర్షనే వుంది. దీనిలో అవివేకం, వివేకం, అంతరాత్మ అనే పాత్రలను ప్రతీకలుగా ఆత్రేయ తీసుకున్నారు.మానవునిలో ఆవేశానికి, వివేకానికి మధ్య నిత్యం జరిగే సంఘర్షణే ఈ అంతర్యుద్ధం.

మనిషిలోని వివేకంను ఆవేశం ప్రతిఘటించి తప్పుదోవ పట్టిస్తుంది. ఆవేశం, నిరాశ, దోపిడి, దొంగతనం, హత్యలు, ఆత్మహత్యల్లాంటి పనులే కాదు ఈ ఆవేశం నుంచి కవిత్వం, సంగీతం, కళ, ప్రేమ అన్నీ పుట్టుకొస్తాయని చెప్పుకుంటుంది. సామాన్యమైన వాడిని ఒక నాయకునిగా తీర్చిదిద్దింది తానేనని ఆవేశం వివేకంతో చెప్తుంది. ప్రజలతో ఎన్నుకోబడి వారినే కన్నూ మిన్నూ కానక చూసేలా ప్రవర్తించే రాజకీయ నాయకుణ్ణి ప్రతీకగా ఆవేశం పాత్రద్వారా చూపారు ఆత్రేయ. ఇలాంటి రాజకీయ నాయకుడికి ఆవేశానికి కార్మికులు, కర్షకులు స్త్రీ మొదలగు వారు చరమగీతం పాడతారు.

కాపలావాని దీపం :

పైడిపాల గారు కాపలావాని దీపంను ప్రాచ్యానుసరణలుగా పేర్కొన్నారు. ఈ నాటిక హరేంద్రనాథ్ చటోపాధ్యాయ నాటికకు అనుసరణ కనుక పైడిపాల గారు ఈ నాటికను ప్రాచ్యానుసరణకు చెందినదిగా గుర్తించారు. ఇలా పేర్కొనడాన్ని కె.బి.శ్రీలక్ష్మి విమర్శిస్తూ ఈ నాటికలోని పాత్రలను బట్టి ఇది ప్రతీకాత్మక నాటికగా వారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

వారు పేర్కొన్నట్లు ఇది ప్రతీకాత్మక నాటిక కాదు. ఇందులోని కార్మికులు, కవి, పెట్టుబడిదారుడు ఈ పాత్రలు పాత్రలే కాని ప్రతీకలు కావు. వారి వృత్తులకు సంబంధించి వారి మనస్తత్వాలను చిత్రీకరిస్తూ రాసిన నాటికగా చెప్పవచ్చు.

ఖైదు గదిలో ఉన్న వర్తకుడు, బూర్జువా కవి, కార్మికులను మరుసటి రోజు ఉదయం ఉరి తీయాల్సి వుంది. ఉరిశిక్షతో చనిపోబోయే కవి ఆ రాత్రిని కవిగా – " ఈ రాత్రి ఎంత అందంగా వుంది! ఆకాశమంతా చుక్కలు–స్వచ్ఛమైన చుక్కలు – ప్రేయసీ కన్నీటి చుక్కలు" అని వర్ణిస్తే కార్మికునిగా ఆకాశంలోని ఆ చుక్కలు శ్రామికుల చెమట చుక్కలులాగా కన్పిస్తాయి ఆ జీవితం కంటే " అని వర్తకుడు తన మనస్తత్వాన్ని ప్రదర్శిస్తాడు.

కవిత్వం ద్వారా జీవించాలనుకునే వాడు ఆ కవి – దేవుడ్ని నమ్మే వాడు ఆ కవి. పునర్జన్మ మీద నమ్మకం లేని కార్మికుడు " కవి !" నువ్వు తిరిగి జన్మించాల్సి వస్తే, బూర్జువా కవికంటే ఆత్మశుద్ధి గల ఇంకెవరివానైనా జన్మిస్తావని ఆశిస్తున్నాను.. సామ్రాజ్యాన్ని గడగడలాడిస్తున్న అరుణ పతాక క్రింద – సోదర ప్రజల్ని సమీకరించే కార్మికుడిగా జన్మించు" అని కోరతాడు.

2.2. నాటకాలు :

ప్రస్తుతం లభించే (1) గౌతమబుద్ధ (2) అశోకసామ్రాట్, 3) పరివర్తన, 4) వాస్తవం, 5) ఈనాడు, 6) ఎన్.జి.వో. 7) విశ్వశాంతి, 8) కప్పలు 9) భయం, 10) మనసూ – వయసూ (తిరుపతి) మొదలగు నాటకాలలోని వస్తువును బట్ట ఆత్రేయగారి నాటకాలను స్థూలంగా (అ) చారిత్రక నాటకాలు (ఆ) సాంఘిక నాటకాలుగా విభజించవచ్చు.

2.2.1. చారిత్రక నాటకాలు :

చారిత్రక అంశంలోని కథనో పాత్రలనో తీసుకొని రాయబడిన నాటకాలను చారిత్రక నాటకాలు అనవచ్చు. ఈ కోవకి చెందినవిగా (1) గౌతమబుద్ధ (2) అశోకసామ్రాట్‌ను చెప్పుకోవచ్చు.

1. గౌతమబుద్ధ :

ఈ నాటక రచనకు 'బెర్నార్డ్ షా' రాసిన 'ది బ్లాక్ గర్ల్ ఇన్‌సెర్చ్ ఆఫ్ గాడ్ " కథ ప్రేరణ. ఇది పది దృశ్యాలతో సాగిన నాటకం. వారి నాటకాలలో ప్రదర్శనకి నోచుకోని ఏకైక నాటకం కూడా ఇదే..! ఈ నాటక రచనలో ఆత్రేయగారు చేసిన వినూత్న ప్రయోగం ఏమిటంటే సంభాషణలకు ముందు పాత్రల పేర్లను సూచించక ఆయా రంగాల ముందు ఆ రంగంలోని పాత్రల పేర్లను సూచించడం. దీని ద్వారా ఈ నాటకంను చదివే పాఠకుడు ఏ సంభాషణ ఏ పాత్రకు చెందినదో జాగ్రత్తగా అన్వయించుకొని చదవవలసి వుంటుంది. పాఠకుల పఠనాశక్తికి ఇది ఒక పరీక్ష వంటింది. ఇందులోని మరో ప్రయోగం నృత్య గీతాలను ప్రవేశపెట్టడం.

మొదటి దృశ్యంలో రెండు సంఘటనలుంటాయి. అవి ఏమిటంటే–ఇహపరమైన ఆశలు మనిషిలో పెరిగే స్వార్థమనే అంధకారంలో ఉన్నవారికి – వెలుగును ప్రసాదించి సంతోషకరంగా బ్రతికేలా చేసే ఒక దివ్య పురుషుని కోసం ఎదురుచూస్తుండే కొందరికి రాచనగరులో ఒక తార దిగినట్లు చూసి అక్కడికి పోయి చూడడానికి బయలుదేరడం మొదటి సంఘటన.

రెండవ సంఘటనలో ప్రజలను ఆశలు బంధాలు ఇహలోక సుఖాలనే అనేకానేక మార్గాల ద్వారా ప్రశాంతంగా బ్రతకనివ్వక పట్టిపీడించే మృత్యువు, హింస, అసత్యం, స్వార్థం, దారిద్ర్యమనే భయంకర స్వరూపాలు ఒకరి గొప్పతనం ఒకరు చెప్పుకొనుచుండగా రాచనగరులో ప్రవేశించిన తార కళ్ళల్లో శాంతం, దయ – ముప్పై రెండు శుభలక్షణాలతో శిశువుగా ప్రజలలో శాంతి సమాధానాలను కలిగించడానికి జన్మించినట్లు తెలుసుకొని 'మన ఆటలు ఇక సాగవట' అని నిష్క్రమిస్తాయి.

రెండవ రంగంలో మాయనుండి వెలువడ్డ బిడ్డ అయిన సిద్ధార్థుడు వింత ప్రవర్తన గురించి అతని భవిష్యత్తు గురించి జ్యోతిష్కులు చెప్పిన దాన్ని చర్చించి విషాద దృశ్యాలే సిద్ధార్థుని కంటపడకుండా ఉండేందుకు అతని తండ్రి ఈ లోక సుఖాలతో అతని ఆలోచనలను మార్చడానికి విరికన్నె పాటను, తేటి పాటను, సెలపాటను, రాధ నృత్యంను మొదలగు శృంగారాత్మక నృత్య గీతాలను ఏర్పాటుచేయించడమే కాక "ఎట్టి వైరాగ్యభావమేనా మానినీ మందహాస శృంఖలాలకు కట్టుబడిపోతుంది. పరిత్యాగ సాగరమంతా వనితా వీక్షణాలకు యింకిపోతుంది. ప్రపంచాన్ని చేతనంగా నడిపించే మహాశక్తి స్త్రీ। అని గ్రహించి సిద్ధార్థుని వివాహం చేయాలని మంత్రి రాజుగారికి సూచిస్తాడు.

మూడవరంగంలో తోటమాలి మరణం, బిచ్చగాడిని, కుష్ఠురోగిని చూసిన సిద్ధార్థునికి మనసు చలిస్తుంది.

నాలుగవ రంగంలో విషాద దృశ్యాలను చూసి మనసు చలించిన సిద్ధార్థుడు ప్రపంచ జీవిత రహస్యాలను తెలుసుకొని దేశయాటన చేస్తాడనే తలంపుతో భయంతో తన కొడుకు ఇహలోక భోగాలకు ఆకర్షితుడై వెళ్లక తనకళ్ళ ఎదుటే ఉండేందుకు సమర్పించడానికి సిద్ధపడతాడు. " మంత్రీ ! నా సిద్ధార్థునికి ప్రత్యేక ప్రపంచం సృష్టించు" అని ఆదేశిస్తాడు.

అయిదవ రంగంలో యశోధర తన శృంగారాత్మక నృత్యంతో సిద్ధార్థునినిన అక్కున చేర్చుకుంటుంది.

ఆరవరంగంలో శుద్ధోదనుడు కనిన ఆ ఏడు కలలకు అర్థం తెలుసుకోవాలని పండితులను పిలిపిస్తాడు. తన పుత్రుడు విరాగి కావడం ఖాయమని ఆ పండితుల ద్వారా తెలుసుకొని ఎలాగైనా ఆ విపత్తును తప్పించాలని రాజు పరితపిస్తాడు.

ఏడవరంగంలో సిద్ధార్థునిలో మానసిక సంఘర్షణ మానవకళ్యాణం కోసం సాంసారికి జీవితాన్ని విడనాడడమా లేదా తననే నమ్ముకొని ఉన్న భార్యను సంతోషపెట్టడమా అనే ఆలోచనతో సతమతమై చివరకు సంసారిక జీవితాన్ని వదులుకోవాలని నిశ్చయించుకుంటాడు.

ఎనిమిదవ రంగంలో సన్యసించిన సిద్ధార్థునిని అంత:పురానికి తీసుకువచ్చే ప్రయత్నంలో చెన్నుడు విఫలుడై వెనదిరిగి రావడం చిత్రించబడింది.

తొమ్మిదవ రంగంలో యశోధర ఆవేదన చిత్రీకరించబడింది. పదవరంగంలో నిరాశా, నిట్టూర్పుతో ఉన్న ప్రజలకు బుద్ధుడు ఆశాజ్యోతిగా ఉండడం – ఇన్నాళ్ళుగా మానవ జీవితాలను పట్టి పీడించే మృత్యువు, హింస, అసత్యం మొదలైనవి ఓడిపోవటం చిత్రీకరించబడ్డాయి.

2. అశోక్ సామ్రాట్ :

నెల్లూరు గ్రంథాలయంలో ఆత్రేయ చదివిన ఒక చారిత్రక గ్రంథం ఆధారంగా అశోకుడు మొదట దుష్ట అశోకుడని తెలుసుకొని రాయబడిన నాటకం. దీనిని 1944లో రాశారు. అంటే రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో రాయబడింది. అశోకునిలా సామ్రాజ్యవాద దాహంతో రెండవ ప్రపంచయుద్ధంలో పాలుపంచుకున్న దేశాలకు – అశోకుడు గ్రహించిన సత్యాన్ని గ్రహించి యుద్ధాన్ని విడనాడమనే సందేశంతో, ఈ నాటికను రాసినట్లు కనిపిస్తుంది. తొమ్మిది రంగాలుగా సాగిన నాటకం ఇది.

మొదటి రంగంలో సామ్రాజ్య విస్తరణలో భాగంగా కళింగదేశ దండయాత్రకి సన్నాహాలు చేస్తుండగా 'దేశభక్తి' అనే మత్తు మందుకి లొంగి ప్రజలు సైనికులుగా చేరడం చేసి అహింసను శాంతిని ప్రబోధించే బౌద్ధమతం పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారని తెలుసుకున్న అశోకునికి ఈ విషయం మింగుడుపడనదిగా మారింది. బౌద్ధ బిక్షువులను దేశద్రోహులుగా పరిగణించి 'నరకమ'నే కారాగారంలో బంధించమని చండగిరుకుడుకి అజ్ఞాపిస్తాడు అశోకుడు.

రెండవ రంగంలో రెండు రకాల మనస్తత్వాలను చూపిస్తాడు. యుద్ధం చేయడం వీరత్వంగా, యుద్దాన్ని పవిత్రధర్మంగా భావించే మహావీరుడు, అతని తల్లి నిరూపల మనస్తత్వం ఒక రకమైనదైతే, మహావీరుని భార్య శాంతి ఎరుపు రంగును చూడడమంటేనే భయం. ఎర్రమందారాన్ని, ఎర్రకలువలన్నా శాంతికి అయిష్టం. తెల్లటి మల్లెలన్నా, ఆమెకు అతి ప్రియం, యుద్ధ రంగానికి సిద్ధమైపోయే తన భర్తకి తిలకం దిద్ది పంపలేకపోతుంది. మూడవరంగంలో అశోకుని పాలనపై తీవ్ర అసంతృప్తితో కొందరు ప్రజలు మాట్లాడుకుంటూ ఉంటారు. బౌద్ధ సన్యాసిని చండగిరికుడు అశోకుని వద్దకు నిర్భంధించి తీసుకువెళ్తాడు.

నాల్గవ రంగంలో యుద్దంలో గాయపడిన మహావీరుడు తన భార్య శాంతి పేరు ఉచ్చరించుకుంటుంటే 'శాంతి' శబ్దం సమరరంగంలో ఎవరి నోట రారాదని అశోకుడు ఆజ్ఞాపించగా.. " ప్రేమకు దయకు జాలికి స్థానం లేని ఈ కొలువుతో నాకు పనిలేదు" అని మానసిక స్వేచ్ఛను అరికట్టే ప్రభుత్వమని అశోకునికే ఎదురుతిరిగి మాట్లాడగా మహావీరుడు బంధించబడతాడు. చండగిరికుడు బౌద్ధ సన్యాసినిని అశోకుని ముందు ప్రవేశపెట్టగా అశోకుడి చేసే తప్పిదాలను ఎత్తిచూపుతూ శాంతిని బోధిస్తుండగా యుద్ధంలో భర్తను కోల్పోయిన కాంత అనే సామాన్య స్త్రీ శీలాన్ని అమ్ముకుని జీవిస్తుండగా అశోకుని ఎదుట ఆమెను కూడా ప్రవేశపెట్టగా ఇరువురిని నరకంలో తోసెయ్యమని అజ్ఞాపిస్తాడు.

అయిదవ రంగంలో ప్రేమానందుడు భటుడుతో ప్రవేశించి మహావీరుడు ఇచ్చిన లేఖను అతని భార్య శాంతికి అందజేయగా తన భర్త చనిపోయినట్లు తెలుసుకుంటుంది. 'అన్యాయాన్ని అరికట్టి, అహింసను స్థాపించి, నీ సామ్రాజ్యాన్ని నెలకొల్పు, కంకణం పూను. ఆనాడే నా ఆత్మశాంతి" అని చనిపోతూ మహావీరుడు భార్య నుండి ఆశించిన ఆ కోరికను నెరవేర్చడానికి ప్రేమానందుడు 'శాంతి'ని అశోకుని పాలనకు నిరసనగా ప్రజలతో విప్లవాన్ని తీసుకొచ్చేలా తయారు చేస్తాడు.

ఆరవరంగంలో మహావీరుని భార్య శాంతి అశోకసామ్రాట్ భార్య అయిన రాణి తిష్యను కలిసి రాణిగా కాకపోయిన ప్రజలకు తల్లిగా సామాన్య స్త్రీగానైనా రాజ్యంలో విలయతాండవం చేసే కరువు, కాటకం, యుద్ధజ్వాలలు వీటిని చూసి ప్రజలను ఆదుకోమంటుంది. " అహింసా సూత్రం మీద నిర్మింపబడి, ప్రేమతో ఏకమై బాధ, భేదం ఎరుగని రాజ్యం, సత్యం స్వేచ్ఛగా తలెత్తుకుని తిరగగల సామ్రాజ్యం, మానవులు దేవతలు కాగల సామ్రాజ్యం " కావాలని విన్నవించుకొని వెళ్ళిపోగా అశోకుడు కళింగయుద్ధంలో విజయం సాధించిన ఆనందంతో రాజ్యానికి రాగా సుస్థిర శాంతి కోసం ప్రజలు ఏవిధంగా తపిస్తున్నారో తమ నిరంకుశత్వ పరిపాలన ప్రజా హృదయంలో విప్లవాన్ని ఎలా రేపిందో చెప్పగా ఆ మాటలను లెక్కచేయడు అశోకుడు.

ఏడవ రంగంలో వృద్ధురాలు అశోకునికి ఎదురవుతుంది. అశోకుడు తాను చేసే పనులు తప్పా ఒప్పా అని ఆలోచించేలా మాట్లాడుతుంది. ఆమెతో మాట్లాడినప్పటి నుంచి అశోకుడు ఆలోచనలో పడతాడు.

ఎనిమిదవ రంగంలో శాంతి మహారుద్రునిలా, చండికలా, కాళీమాతలా కోలకళ్లలోంచి నిప్పులు కురిపిస్తూ ప్రేమానందునని బంధించిన నరకంవైపు వెళ్తుండగా ఆమెను అసంఖ్యాక ప్రజలు అనుసరించి చండగిరికుడికి మంచిని బోధించి బౌద్ధ సన్యాసి ప్రేమానందుని నరకం నుండి విడిపించి తీసుకొని వెళ్తారు.

తొమ్మిదవం రంగంలో ఊరంతా పొంగే ఏరులా తన దగ్గరికి ప్రజలు వస్తున్నట్లు తెలుసుకున్న అశోకుడు తనపై తిరగబడే వారినందరిని మట్టుపెట్టమని రథ, గజ, తురగదళాల నాయకులైన విజయుడు, రణవీరుడు, జయానందునికి ఆజ్ఞాపించగా, "బానిసలం. ఆత్మవంచకులం కాము" అని రాజాజ్ఞను నిరాకరిస్తారు. ప్రేమానందుడు, అశోకుని భార్య తిష్య, శాంతి ప్రజలు పట్ల అశోకునికి గల దురభిప్రాయంలో మార్పును తీసుకువస్తారు. " రాజ్యం మీది, ప్రజాశక్తి ప్రతిభ ఈనాడు తెలుసుకున్నాను" అని పశ్చాత్తాపపడి అహింసతో రాజ్యంలో శాంతిని నెలకొల్పడానికి పూనుకుంటాడు.

2.2.2. సాంఘిక నాటకాలు :

ఈ సాంఘిక నాటకాలను కూడా వస్తు స్వభావాన్ని బట్టి (1) కౌటుంబిక నాటకాలు, 2) ప్రబోధాత్మక నాటకాలు, 3) రాజకీయ నాటకాలుగా విభజించుకొనవచ్చును.

2.2.2.1 కౌటుంబిక నాటకాలు :

ఈ కోవకి చెందినవిగా (1) ఎన్.జి.వో. (2) కప్పులు అనే నాటకాలను పేర్కొనవచ్చు.

1. ఎన్.జి.ఓ :

" 1940-50 సంవత్సరాల మధ్య వచ్చిన నాటకాలలో 'మా భూమి' తరువాత అంతస్థాయిలోనూ అశేష ప్రజానీకాన్ని కదిలించిన నాటకం ఆత్రేయ ఎన్.జి.ఓ." అని పలికిన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారి మాటలతో మనం తప్పక ఏకీభవించాల్సి ఉంది. అప్పుడే కాదు ఇప్పటికి సమసిపోని సమస్యగా సమాజంలో వటవృక్షంలా పాతుకుపోయి విస్తరించుకుంటున్న అందరిసమస్య ఈ 'అద్దె కొంపల' సమస్య. రెండు రంగాలలో మధ్య తరగతి ఉద్యోగస్తుని సంసారిక జీవితం ఎలా వుంటుందో వివరించబడిన నాటకం. ఆత్రేయను 'ట్రెండ్‌సెట్టర్'గా నిలిపినటువంటి నాటకం ఈ ఎన్.జి.ఓ. హిందీ, కన్నడ భాషలలో అనువదింపబడటమే కాక ఆత్రేయను సినిమా పరిశ్రమ వైపు దృష్టిని మళ్ళింపజేసేందుకు కారణభూతమైనది మరియు 'గుమస్తా' పేరుతో 1953లో సినిమాగా రూపొందించబడిన నాటకం ఈ ఎన్.జి.ఓ. పట్టణాలలో చాలీచాలని జీతంతో గుమస్తాగా పనిచేస్తూ కుటుంబ బాధ్యతలు నెత్తిన వేసుకొని సంసారాన్ని నడపడమంటే ఈ భారతదేశంలో ఎంతకష్టమో తెలిపే నాటకం. ఈ నాటకాన్ని మొదట 'అద్దెకొంప' అని పేరు పెట్టారు ఆత్రేయ. ఈ నాటకంలోని ప్రధానాంశం ఈ సమాజంలో సంసారం పెట్టిన, పెట్టబోయే ప్రతి సంసారికి సంబంధించి అద్దె యింటి పాట్లు ఎలా ఉంటాయో స్పష్టంగా చూపేది. కాని అంతర్లీనంగా సగటు ఉద్యోగిగా, గుమస్తా ఉద్యోగిగా చాలీచాలని జీతంతో గంపెడు కుటుంబాన్ని నెట్టుకొచ్చే భారతీయ కుటుంబ వ్యవస్థను చిత్రించడమే కాదు, అద్దెయిళ్ళ సమస్యలు ఎలాంటివో అందరికీ తెలిసికూడా వారు ఇల్లు కట్టుకున్నాక అదే సమస్యను సృష్టించే 'గుప్త' లాంటి మనుషులు - అలాంటి మనుషులు ప్రభుత్వ నియమనిబంధనలను అనుసరించి అన్ని వసతులు కల్పించక, వారి యిష్టానుసారం అద్దెను వసూలు చేయడమే కాక దొంగ బిల్లులతో ప్రభుత్వానికి తప్పుడు లెక్కలతో పన్నును చెల్లించడం - ఇంటి యజమానులు అద్దెకు ఉండే వారిని జలగల్లా పట్టిపీడుస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటుందని చూపించడమే కాక ఆత్రేయగారు చెప్పినట్లు మధ్య తరగతి కుటుంబాలు పట్టణాలలో ఉండడానికి ఎన్ని బాధలు పడుతుంటారో - ప్రెస్టేజ్ పేరిట వారు పడే ఆర్థిక సాంఘిక బాధలను ఎన్నింటినో ఈ నాటకంలో చిత్రీకరించబడ్డాయి.

మొదటిరంగం అద్దె యింటి వ్యవహారంతోనే మొదలవుతుంది. మోటార్‌షెడ్‌నే ఒక ఇల్లుగా మార్చబడిన ఇంటిలో అద్దెకు ఉండే కుటుంబం రంగనాధంది. అందులో అతని భార్య సీత, పిల్లలు, అతని తమ్ముడు గోపి మరియు తండ్రి ఉంటారు.మనుషులనబడేవాళ్ళు నివసించలేని ఆ ఇంటిలో నుండి మనుషులు నివసించదగిన ఇంటికి మారడానికి అద్దె ఇంటికోసం ఊరంతా గాలించి వచ్చిన గోపి, తన వదినతో తాను చూసి వచ్చిన అద్దె యింటి గూర్చి చెప్పి వాళ్లు విధించిన షరతులను చెప్పగా అవి విన్న అతని వదిన " బాగున్నాయి ! యీ షరతులకు మనుష్యులెవ్వరూ వుండలేరు. దయ్యాలేమన్నా వుంటాయేమో!" అనగా "నిజం గ్రహించావు వదినా! ఆ యింట్లో దయ్యం వుంది" అని ఒక పోర్షన్లో ఉండే ఇంటి యజమానిని దయ్యంతో పోలుస్తూ చెప్పగా నిజమేననుకని తాను చూసి వచ్చిన ఆ యింట్లో దయ్యం వుందని పోవడానికి సంకోచించే వదిననుద్దేశించి " అది కాదు వదినా ! అసలీ యింట్లో దయ్యం లేదనా నీ అభిప్రాయం?" అని చెప్తూ " అన్నయ్యకు నెలకొకసారి కనిపిస్తుందట ఆ దయ్యం. ఆఫీసు నుంచి జీతం

పట్టుకురాగానే వాకిట్లో హాజరు. దాంతో అన్నయ్యకు గుండెలు జారిపోతాయి. పాపం, నాతో ఎన్నోసార్లు చెప్పాడు. నేను చూచాను కూడా ?అని వ్యంగ్యంగా అంటాడు. ఇంతలో డాక్టర్ వచ్చి పక్షవాతంతో మంచానపడి వున్న గోపి తండ్రికి వైద్యం చేసి ఇల్లుమారమని సలహా ఇస్తాడు. మారలేని స్థితిలో వాళ్ళుంటారు. పెళ్ళికి ఎదిగిన మనువరాలికి శాస్త్రిగారు సంబంధం తెస్తాడు. ఏ ఈవిధంగానైనా పెళ్ళి చేయాలనే తలంపుతో ఉంటారు పెద్దవాళ్ళు. చాలీచాలని జీతంతో పెద్ద కుటుంబానిన్న పోషించడమే కాక తన తమ్ముడు కాలేజి ఫీజులకి, తండ్రి పక్షవాతాన్ని తగ్గించడానికి వైద్య సహాయ నిమిత్తం డబ్బుకి, కూతురు పెళ్ళికి అవసరమైన కట్నం డబ్బు కోసం అన్నింటిని మించి దారిద్ర్యం నుంచి తప్పించుకోవడానికి దయాళ్‌సేఠ్ చూయించిన లంచానికి రంగనాధం తలవంచుతాడు.

అక్రమ సంపాదనకు ఇష్టపడక – ఎంత చదివినా ఉద్యోగాల కోసం నిరుద్యోగి అయి అడ్డమైనవాడి కాళ్ళు పట్టుకునే కన్నా తన కాళ్ళమీద తానే నిలబడే ప్రయత్నంలో భాగంగా తన అన్న పరిక్ష ఫీజుకు, ఇంటి అద్దెను కట్టమన్న డబ్బుతో పళ్ళపొడి పొట్లాల వ్యాపారం ప్రారంభిస్తాడు. డాక్టర్ ద్వారా ఈవిషయాన్ని తెలుసుకున్న గోపి అన్న రంగనాధం తమ్ముడుపై మండిపడతాడు. ప్రతీనెలా అద్దె తీసుకుంటూ బాగుచేయిస్తామన్న ఎలక్ట్రిక్ లైట్లూ, కుళాయి, మూయిస్తామన్న మురుగునీటి కాలువా.. ఇలా వీటిలో ఏదీ చేయక తిరిగి అద్దె డబ్బుకోసం వచ్చిన ఇంటి యజమానిని గోపి నిలదీసి అడగగా వారికి మాటామాటా పెరిగి ఇంటి యజమాని గోపిని కర్రతో గాయపరచి గోపియే తమని గాయపరచినట్లు కేసు పెడతారు. బాపూజీ పార్కు దగ్గర జరిగే మీటింగులో ఎం.ఎల్.ఎ.ఉపన్యసిస్తుంటే గోపి అడ్డుకొని ప్రభుత్వ విధానాల గూర్చి స్టేజిమీదనే బహిరంగంగా విమర్శిస్తాడు. ఆ సంఘటని అడ్డం పెట్టుకొని గోపిని విప్లవకారునిగా చిత్రీకరిస్తూ అరెస్టు చేయడమే కాక రంగనాధం కోటులని నోట్లను పరిశీలించి లంచానికి పాల్పడినందుకు అతన్ని కూడా తీసుకెళ్లారు పోలీసులు. ఈ దృశ్యాన్ని చూసి ముసలాయన చనిపోవడంతో నాటకం ముగుస్తుంది.

రెండు రంగాల నాటకంలోనే రచయత ఎన్నో సమస్యలను ఎత్తి చూపుతూ నాటకాన్ని నడిపించారంటే అది ఆత్రేయ గారికే సాధ్యం అనిపించక మానదు. ఇందులో ప్రధాన పాత్రలుగా గోపి, రంగనాధంలను తీర్చిదిద్దడంలో రచయితను అభినందించాలి. వేడివేడి సన్నివేశాలకు పదునైన సంభాషణలను సమకూర్చి పాత్రల ద్వారా పలికించారు ఆత్రేయ. గోపి మాట్లాడే ప్రతి మాటలో పదునైన సంభాషణలను సమకూర్చి పాత్రల ద్వారా పలికించారు ఆత్రేయ. గోపి మాట్లాడే ప్రతి మాటలో సత్యం వ్యంగ్య రూపంలో అభ్యుదయ భావంతో వుంటుంది. మధ్యతరగతి వారి నిస్సహాయత, నిట్టూర్పులూ వుంటాయి. ఇళ్లు మారలేని పరిస్థితుల్లో మురికి కాలువలా మధ్య ఉన్న ఇంటిలోనే అద్దెకు ఉండే గోపితో “యింటి ముందు మురుగుకాలువ మూయించమని ఎన్నిసార్లు చెప్పాను? మరీ ముక్కులు పగిలిపోతున్నాయి. నో.నో. ఏం లాభం లేదు” అని మాట్లాడిన డాక్టర్ మాటలకు” ఎందుకు లేదండీ డాక్టర్ గారూ ? మురుగు కాలువ మూయిస్తే మాకు రోగాలెట్లా వస్తాయి ? రోగాలు రాకుంటే డాక్టర్లేం కావాలి? ” అని గోపి పాత్రద్వారా వ్యంగ్యంగా పలికించడమే కాదు” చదివి విజ్ఞానం గడించడం మానవుడైన వాడికి అవసరమే. కాని, అంతకన్నా బ్రతకడం ముఖ్యం. సంసారం నానాటికీ నరకమై పోతుంది. ఏ వ్యాపారమన్నా చేసి నాలుక్కాసులు తెచ్చి వేస్తే యీ సంసారాన్ని కాస్త సుఖంగా లాగ్గలమేమోననే నా ఆశ.” (పళ్ళపొడి పొట్టాలు అమ్మి డబ్బు సంపాదించడంతో నామోషీగా ఫీలవ్వాల్సిన పనిలేదంటూ) “ మనం పస్తులున్నా పడి వుండాలి గాని యిలాంటి పనులు మాత్రం చేయకూడదు. అంతేనా అన్నయ్య! ఇదే నా మన ప్రెస్టేజీ పిల్లల రోగాలతో కుళ్ళిపోతుండొచ్చు. వాళ్ళకు రెండు చొక్కాలన్నా లేకపోవచ్చు. అప్పులవాళ్లు నానా బూతులు తిట్టొచ్చు. ఈ మురుక్కాలువ కంపులో – ఈ కారు షెడ్‌లో బతకొచ్చు...” ఇలాంటి ఈటెలలాంటి మాటలనెన్నింటినో గోపి పాత్ర ద్వారా పలికించారు ఆత్రేయ.

2. కప్పలు :

ఇది రెండు రంగాల నాటకం. గౌతమబుద్ధ, అశోకసామ్రాట్, పరివర్తన, వాస్తవం, ఈనాడు, ఎన్.జి.ఓ., విశ్వశాంతి వంటి శాంతి ప్రబోధాత్మకం – సామాజిక సమస్యలు – రాజకీయ నినాదాలతో కూడిన నాటకాలను రాసిన ఆత్రేయ గారు " రాజకీయ నినాదాలతో నాటకాన్ని రక్తి కట్టించుకుంటాడన్న వాదనను కాదనిపించుకోవాలని యీ నాటకం వ్రాశాను" అని ముందుమాటలో చెప్పుకుంటారు. 'సుమతీశతకం' లోని..

" ఎప్పుడు సంపద కలిగిన
అప్పుడు బందుగులువత్తెరది యెట్లన్నన్
దెప్పలుగా చెరువు నిండిన
కప్పలు పదివేలు జేరు గదరా సుమతీ" అనే పద్యం ఈ నాటకానికి ఇతివృత్తం.

" కాస్త చెమ్మ వుంటే చాలమ్మా కప్పలు చేరతాయి, నేల ఎండిందంటే పత్తా లేకుండా పోతాయి" అనే నౌకరు నారయ్య మాటలకు " మన నేల ఎండనూ ఎండదు, ఆవి పారిపోనూ పోవు. మనం యిలా చావాల్సిందే" అని కమల పలికే మాటలలో.. చెరువులో నీళ్ళులా పుష్కలంగా సిరిసంపదలతో ఉన్న శ్రీపతి ఇంటికి బంధుత్వం పేగుతో చెరువులోకి కప్పల్లా వారి ఇంటికి చేరి బ్రతికేసే శ్రీపతి బంధువుల గూర్చె ఆత్రేయ ఆ మాటలు రాశారు అనేది స్పష్టమవుతుంది.

తోటలు, కొండలు, పొలాలు మధ్య తన తండ్రి ఇల్లు కట్టినందుకు తండ్రిని కమల తిట్టుకుంటుంది. సినిమాకెళ్లిన బంధువుల కోసం భోంచేయకుండా ఎదురుచూస్తారు. శ్రీపతి తన కూతురు చేత సుమతీ శతకంలోని "ఎప్పుడు సంపద కలిగిన.." అనే పద్యం చదివించుకొని "మన ఆస్తి, ఐశ్వర్యాలను చూసి కప్పల్లా చేరిన మన బంధువుల్లాంటి వాడే నిన్ను ప్రేమించే చలపతి కూడా" అని మనసులోని మాట బయటపెడతాడు. సినిమా చూసి వచ్చిన బంధువులు శ్రీపతిని ఒకర్ని మించి ఒకరు పొగుడుతూ ఆకాశానికి ఎత్తేస్తారు. కమల తను ప్రేమించే చలపతి గూర్చి నారయ్య అభిప్రాయం తెలుసుకొని వారి పెళ్ళికి తన తండ్రి అభ్యంతరాన్ని కూడా తెలిపి తన పెళ్ళి విషయంలో కూడా తనకు స్వతంత్ర్యం లేకుండా తన తండ్రి చేస్తున్నట్లు చెప్తూ పెద్దల మాట వినకుండా అతన్ని పెళ్ళాడితే నా జీవితమే కదా పాడయేది? " నా పళ్ళు నేనూడగొట్టుకుంటే ఫరవాలేదు నారయ్యా! ఎదుటివాళ్లు ఊడగొడితేనే బాధ!" అని అనగా "పిచ్చితల్లి, ఎవరైనా బాధ ఒకటేనమ్మా నిజం ఆలోచిస్తే పనికిరాని పళ్ళు డాక్టర్ తీసేయడమే మంచిది. మనం రాయిపెట్టి కొట్టుకుంటే రభసవుతుంది కదూ? " అని నారయ్య సముదాయిసూత చెప్పాడు. కమల కోసం చలపతి వస్తాడు. కమల వెనుక వున్న ఆస్తినికాక వ్యక్తిగా కమలను ప్రేమిస్తావా? అనే శ్రీపతి ప్రశ్నకు సమాధానం చెప్పక మౌనంగా ఉండే చలపతిని కమల అపార్థం చేసుకొని పంపిస్తుంది. కమలని తన కోడలుగా చేసుకొని ఆస్తిని కొట్టేయ్యాలనే ఆలోచనతో పంకజమ్మ ఉంటే – భద్రయ్య తన కూతురును భార్యలేని శ్రీపతికి ఇచ్చి పెళ్ళిచేయదల్చుకున్నాడని భావించి కమల అర్ధరాత్రి ఇల్లు వదలి పారిపోబోగా తండ్రి చూస్తాడు. ఎప్పుడూ పుట్టిన రోజు జరుపుకోని శ్రీపతి ఆ సంవత్సరం జరుపుకోవాలని నిశ్చయించి ఎవరికి నచ్చింది వాళ్ళని చేసుకొనిమ్మని నారయ్యకు చెప్పడంతో మొదటిరంగం ముగుస్తుంది.

శ్రీపతి పుట్టినరోజు హడావిడి అతని బంధువులంతా ఉంటారు. దొరికిందే సందుగా శ్రీపతి పుట్టిన రోజును అడ్డం పెట్టుకొని కొత్త బట్టలు కొనడానికి బయలుదేరతారు. శ్రీపతికి పుట్టినరోజు కానుకలను అయినవాళ్ళు సమర్పించుకొని అతని పుట్టుపూర్వోత్తరాలు చెప్తూ పొగడటం ప్రారంభిస్తారు. తన దగ్గర ఉన్న డబ్బును బంధువులకు పంచుతాడు. ఒక అపరిచిత వ్యక్తి శ్రీపతిని ఆర్థిక సహాయాన్ని కోరగా సమయానికి తన వద్ద లేదని, ఉన్నదంతా పంచానని చెప్పి అందరి వద్ద నుంచి కొంత డబ్బును పోగుచేసి ఇప్పిస్తాడు. కొంతసేపటి తర్వాత తాను దొంగనోట్లను

ప్రింట్‌చేసి చలామణిచేసి ధనవంతుడైనట్టు, పోలీసుల దృష్టిలో తాను పడినట్లు చెప్తాడు. ఎస్.ఐ.శ్రీపతిని అరెస్ట్ చేయడానికి రాగా పొగిడిన జనమే దూషించడం మొదలుపెట్టి ఆపదలో వున్న శ్రీపతిని ఆదుకోవడానికి బంధువులనే వారెవ్వరూ ముందుకు రారు. శ్రీపతి నేరం తమపై వేసుకోవడానికి బంధువులు ముందుకు రారు. వారి నిజస్వరూపం బయటపడడంతో వీరి నాటకాన్ని కూడా బయటపెడతారు శ్రీపతి మరియు ఎస్.ఐ.గా నటించిన అతని మిత్రుడు గోపాలం.

2.2.2.2. ప్రబోధాత్మక నాటకాలు :

ఈ ప్రబోధాత్మక నాటిలకను రెండు రకాలుగా విభజించవచ్చు. అవి (1) విశ్వశాంతి ప్రబోధాత్మక నాటకాలు 2) మతసామరస్య ప్రబోధాత్మక నాటకాలు.

2.2.2.2.1. విశ్వశాంతి ప్రబోధాత్మక నాటకం :

ఈ విభాగం కింద చెప్పుకోదగిన నాటకం 'విశ్వశాంతి'

విశ్వశాంతి :

ప్రపంచశాంతి సాధించడమనేది యుద్ధాలపై నిరసనగా శాంతిసభలను నిర్వహించడం. ఉపన్యాసాలొలకటం వల్ల సాధ్యపడదు. యుద్ధంపట్ల అందరిలో వ్యతిరేక భావం కలిగి దాన్ని రూపుమాపాలనే ప్రయత్నం చేసినప్పుడే ప్రపంచంలో యుద్ధం అనే పదానికి తావు లేకుండా చేయవచ్చని ప్రబోధించే నాటకం. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి పేర్కొన్నట్లు " జపాన్‌లో హిరోషిమా, నాగసాకీల మీద అమెరికా అటంబాంబును ప్రయోగించి లక్షలాది మంది ప్రాణాలను తీసిన తరువాత, రెండవ ప్రపంచయుద్ధం ముగిసింది. కాని అగ్రరాజ్యాలు ఒకరిని మించి మరొకరు భయపడిపోయి పోటీలుగా మారణాయుధాలు తయారు చేయసాగారు. ఈ దారుణ కాండను అరికట్టడానికి ప్రపంచశాంతి కాముకలు 'యుద్ధం వద్ద శాంతి కావాల'నే ఉద్యమాన్ని లేవదీశారు. ఈ ఉద్యమాన్ని బలపరచేదే ఆత్రేయ రచన 'విశ్వశాంతి'..

'విశ్వశాంతి' ఐదు రంగాల నాటకం. సంకేతాన్ని పాత్రలుగా తీసుకొని రాయబడిన ప్రయోగాత్మక నాటకం ఈ 'విశ్వశాంతి'. ఈ నాటకం గూర్చి శ్రీశ్రీగారు " నాటక రంగమనే వైద్యశాలలో జరుగుతున్న ఒక చికిత్సా విధానమే ఈ 'విశ్వశాంతి' అని తన ముందుమాటలో రాశారు.

శ్రీశ్రీగా ' ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం ...?" అనే గేయంతో ఈ నాటకం ప్రారంభించబడుతుంది. సమత అనే పన్నేండేళ్ళ భూదేవి కూతురు క్లాసులో వారి మాష్టారు యుద్ధంపై కాంపోజిషన్ రాసుకొనిరమ్మనగా శాంతి గూర్చి తెలిసిన సమత యుద్ధమంటే ఏమిటో తన తల్లిని అడుగుతుంది. ఎంతో విపులంగా యుద్ధంపట్ల తనకు గల జుగుప్సాభావంతో ఆవేశంగా చెప్తుంది తల్లి తన కూతురికి. యుద్ధంలోనే కన్ను, కాలు, చేయి పోగొట్టుకున్న చిపాయి తాత అనబడే అమరయ్య ఏదో పనిమీద రాగా యుద్ధం గూర్చి తనను కూడా అడిగి తెలుసుకుంటుంది సమత. స్వానుభవంతో యుద్ధం గురించి కళ్ళకు కట్టినట్లు చెప్తారు అమరయ్య. ఇంతలో చిన్నోడు, పెద్దోడనే భూదేవి కొడుకులు ఇద్దరు వారి ఇద్దరి సిద్ధాంతాల విభేదంతో పోట్లాడుకుంటారు. విజ్ఞానం పేరుతో యుద్ధ సామగ్రిని చేసే ఫ్యాక్టరీ విషయం మాట్లాడడానికి 'శాస్త్రి' అనే సైంటిస్టు పెద్దాడు కోసం భూదేవి ఇంటికి రాగా యుద్ధం గూర్చి, వారు పెట్టబోయే ఫ్యాక్టరీ గూర్చి చిన్నాడు అడిగిన ప్రశ్నలకు సమాధానం దాటేసి వెళ్తాడు. కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్లాన్‌గీచి పెద్దాడుకి ఇద్దామని వచ్చిన మాస్టారు ద్వారా ప్లాన్ వివరాలు తెలుసుకుంటారు చిన్నోడు, అమరయ్యలు. పంటభూముల్లో నిర్మింపతలపెట్టిన ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కొందరు ఊరిజనం అడ్డుకోగా అందుకు పెద్దాడు ఒప్పుకోడు. ఫ్యాక్టరీ నిర్మాణానికి

వ్యతిరేకించే వారిని లొంగదీసుకోవడానికి ధాన్యం ధర పెంచటం వల్ల రైతులందరూ ఆశగా వారి పంటను అమ్ముతారని ఎత్తు వేసి ఆ ధాన్యాన్ని కొని స్టాక్ చేసి కరువు కాటకాలు సృష్టించవచ్చుననే శాస్త్రి మాటలను ఆచరణలో పెడ్తాడు పెద్దాడు.

రెండవ రంగంలో పెద్దాడు సృష్టించిన కరవు వల్ల ఊళ్లో జనమంతా అల్లాడిపోవలసి వుంటుంది. మూడవ రంగంలో కరువు కాటకాలను తాళలేని రైతులు తమ భూములను ఫ్యాక్టరీ నిర్మాణానికి ఇవ్వడానికి ఒప్పుకుంటారు. ధాన్యాన్ని కొద్దికొద్దిగా విడుదల చేస్తూ చౌకగా కార్మికుల చేత కూలీ పని చేయించుకుంటాడు పెద్దాడు. భూదేవి, అమరయ్య, చిన్నోడు, విశ్వం, శాంతి ఏవిధంగానైనా ఫ్యాక్టరీని మూయించాలని ప్రయత్నాలు చేస్తారు.

నాలుగవ రంగంలో యుద్ధ వివరణా – దాని వల్ల ప్రజలకు కలిగే నష్టాలు ఏమిటో ప్రజలకు తెలిపి వారిలో చైతన్యం తీసుకొని రావాలని 'యుద్దం' అనే చిన్న నాటికను ప్రదర్శింపచేస్తాడో. అందులో బేజి, జాన్‌ల ప్రేమకథను చూపిస్తారు. యుద్ధం వల్ల ఆకలిదప్పులకు నా అనే వాళ్లను పోగొట్టుకున్న బేబీ తన ప్రాణాలు నిలుపుకునేందుకు పడుపకత్తెగా మారిన విధానంనే కాక ఆమెను చూసిన జాన్ పిచ్చివాడిలా మారడాన్ని.. ఇలా హృదయవిదారకమైన సన్నివేశాలత నాటకం ప్రదర్శింపబడుతుంది.

ఐదవ రంగంలో బాంబులను తయారుచేసే ఫ్యాక్టరీ వల్ల వాళ్లకు వచ్చే లాభాలలో వారిద్దరికి భాగాలు పంచుకునే దగ్గర మనస్పర్ధలొస్తాయి. ఇంతలో ఊళ్లో జనమంతా 'యుద్ద ఫ్యాక్టరీ పడగొట్టండి! శాంతిని స్థాపించండి' అనే నినాదాలతో ఫ్యాక్టరీని చుట్టుముట్టడంతో పోలీసుల చేత కాల్పులు జరిపిస్తూ పెద్దాడు వెళ్తుంటాడు. ఇంత అనర్థానికి కారకుడై పారిపోయే కొడుకును అతని తల్లి భూదేవి తుపాకీతో కాల్చి చంపుతుంది. కాల్పులలో కారకుడై పారిపోయే కొడుకును అతని తల్లి భూదేవి తుపాకీతో కాల్చి చంపుతుంది. కాల్పులలో అక్కడున్న మందుగుండు సామాగ్రికి నిప్పంటుకోగా జనమంతా బయటకు వెళ్ళగా ఫ్యాక్టరీ దగ్ధమై కుప్పకూలిపోతుంది. 'రిజర్వాయరు కడదాం! బంగారు పంటలు పండిద్దాం! పాడుతూ ఆడుతూ హాయిగా అందరం బతుకుదాం!" అనే ఐక్యనినాదంతో నాటకం ముగుస్తుంది.

2.2.2.2.2. మతసామరస్య ప్రబోధాత్మక నాటకం :

మతసామరస్యంనే ప్రధాన అంశంగా పెట్టుకొని రాసిన నాటకంగా 'ఈనాడు' నాటకంను చెప్పుకోవచ్చు,

ఈనాడు :

హిందూ ముస్లింల సమైక్యతను ప్రబోధిస్తూ రాసిన నాటకం 'ఈనాడు' స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో చెలరేగిన మతదురహంకార విశ్వరూపమే ఈ నాటిక.. హజ్రాబేగం రచించిన 'దిబాన్ ఫయిర్ " అనే చిన్న కథ ఈ నాటకానికి ప్రేరణగా తెలిపారు ఆత్రేయ.

మొదటిరంగం ఆగష్టు 14 అర్ధరాత్రి స్వాతంత్ర్య వేడుకలతో నాటకం ప్రారంభమవుతుంది. "మనం అదృష్టవంతులం నసీం నిజంగా! మన భారతమాత, మనదేశమాత దాస్యశృంఖలాల నుండి విడివడే శుభముహూర్తం, అమృతక్షణం మనం చూడగలిగాం" అని రహీం, నసీం ఆనందించడమే కాదు. ఆరోజు అందరూ కొత్త గుడ్డలు తొడుక్కొని వీధిలో ఇంటిలో విద్యుత్ దీపాల వెలుగులో స్వాతంత్ర్య వేడుకలు జరుపుకున్నారు.

ఆగష్టు 18. అంటే స్వాతంత్ర్యం వచ్చిన మూడు రోజుల తర్వాత మనం ఛాందస బీజం మొలకెత్తిన రోజు, కుల మతాలకు అతీతంగా ప్రేమానురాగాలతో పెనవేసుకున్న అక్బర్ పురుషోత్తం కుటుంబ సభ్యుల హృదయాలలో ఆంగ్లేయ డాక్టర్ రెండు మతాల మధ్య నిప్పు రగల్చడం ఆరంభించిన రోజు. హిందూ ముస్లింలు ఒకరినొకరు పొడుచుకోవడం ప్రారంభించినా వారి తల్లిదండ్రులు ఇంకా కలిసి అన్యోన్యంగా ఉండడం ఏ ఆపదను కొని తెచ్చిపెడుతుందోనని వారిరువురిని వేరు చేసి వెళ్ళిపోతారు.

రెండవ రంగంలో మతఘర్షణల నుంచి తప్పించుకొని అక్బర్ ఇంటికి వత్సలా అనే హిందూ స్త్రీ తలదాచుకోవడానికి వస్తుది. తీరా అది ముస్లిం ఇల్లు అని తెలుసుకొని భయపడుతుంది. అక్బర్ ఆమె చెంతకు ఏప్రమాదం రానివ్వనని హామీ ఇస్తాడు. హిందూ స్త్రీ వత్సలకి ఆశ్రయం కల్పించారని ముస్లీంలు ఆమెను పంపివేయమని అక్బర్‌పై వత్తిడి తీసుకురాగా, ఈ గొడవకు కారణం వత్సలని రహీం చంపబోగా, నసీం అడ్డుకొని కనువిప్పు కలిగిస్తుంది.

మూడవరంగంలో 'గుండా' అనే ముస్లిం మతస్థుడైన కూలీకి మంచినీళ్లు ఇచ్చినందుకుగాను పురుషోత్తంను వారి మతస్థులైన హిందువులు హింసించి వెళ్ళడం విన్న అక్బర్ వారిద్దరి ఇళ్ల మధ్యనున్న తలుపు తాళం పగులగొట్టి గాయాలతో ఉన్న పురుషోత్తంకు కట్లు కడతారు.వత్సల శీలాన్ని పాడుచేయడానికే అక్బర్ ఆమెను తన ఇంటిలో పెట్టుకున్నాడని రాం అపార్థం చేసుకొని చంప ప్రయత్నిస్తాడు.

రక్షణ శిబిరంలో వత్సలను చేర్పిస్తే తన కుటుంబానికి ఎలాంటి ప్రమాదం వాటిల్లదని రహీం వత్సలను వెంటబెట్టుకెళ్తాడు. ఈలోపు కొందరు హిందూగుండాలు అక్బర్ ఇంటి మీద దాడి చేయగా, రాం అడ్డుకున్న అతన్ని ప్రక్కకు ఈడ్చి లాగి నసీంను కత్తితో పొడిచి "హిందూస్తాన్ జిందాబాద్" అనుకుంటూ వెళ్తారు. అక్బర్ వత్సలను కూడా ఊళ్లో హత్య చేశారనే వార్త తెలియగా " నీ ఆటలు సాగవు. మేము ఒకటిగా నిలుస్తాం" అనే (పురుషోత్తం అక్బర్) హిందు ముస్లింల ఐక్యత కంఠపలికిన మాటలకు ఆంగ్లేయుడైన డాక్టర్ పారిపోవడంతో నాటకం ముగుస్తుంది.

2.2.2.2.3. కనువిప్పు కలిగించే ప్రబోధాత్మక నాటకం :

ఈ విభాగం క్రింద 'పరివర్తన' అనే నాటకంను చర్చించుకోవచ్చు.

పరివర్తన :

సమాజం తనకేమి చేయలేదని పెట్టుబడిదారునికి తన మేధాసంపత్తిని బాబూరావులాంటి పెట్టుబడిదారులకు ధారబోస్తూ పరోక్షంగా పీడిత జనానికి అన్యాయం చేసే రఘులాంటి కవులకు కనువిప్పు కలిగించే ప్రబోధాత్మక నాటకం. డాక్టర్ పి.వి.రమణగారి మాట్లల్లో చెప్పాలంటే.. "శ్రమజీవుల కాలంబనగా కవులు కవితా పోరాటం చేయాలన్న సత్యాన్ని వెల్లడిస్తుందీ నాటకం" ఏడు రోజుల్లో రాయబడిన నాటకం ఇది!" నాలుగు రంగాల నాటకం ఇది.

మొదటి రంగం రంగడు పాటతో మొదలవుతుంది. " తననుద్దేశించే ఆ పాట" అని భ్రమించిన రంగడ్ని పాడటం ఆపమంటాడు కవి రఘు. పేద కుటుంబంలో పుట్టి బి.ఏ.చదివి గుమస్తా ఉద్యోగం చేయ ఇష్టపడక అజ్ఞాత కవిగగా గోస్టు రైటర్‌గా బాబూరావు అనే వర్ధమాన రాజకీయ నాయకుడు, మిల్లు యజమానికి అవసరమైన ప్రసంగాలు, స్టేట్‌మెంట్లు రాస్తూ ఉండే కవి రఘు. ఎన్నో పుస్తకాలను రాసిన తన పేరును ముద్రించడానికి ఇష్టపడడు. రఘు రాసిన సాహిత్యాన్నంతటిని ఆ కవికి తెలియకుండానే బాబూరావు తన పేరుతో ముద్రించుకుంటాడు. ఒక రోజు మిషన్లోని లోపం కారణంగా బాబూరావు ఫ్యాక్టరీలో ప్రమాదం జరుగుతుంది. ఆ ప్రమాదంలో బాబూరావు ఇంటిలో పనిచేసే రంగయ్య తండ్రి ఈరయ్య చెయ్యి విరిగిపోతుంది.

రెండవరంగంలో వీరయ్యకు చెయ్యి విరిగినందుకు ఫ్యాక్టరీ రూల్స్ ప్రకారం నష్టపరిహారం కట్టమంటారు కార్మికులు. అలా అడిగిన వారికి లంచం ఇచ్చి సంఘాన్ని విచ్చిన్నం చేయాలని బాబూరావు ప్రయత్నిస్తాడు. వాళ్ళందరూ ఒకేమాట మీద ఉండి కార్మిక నాయకుడైన చౌదరిని మధ్యవర్తిగా నష్టపరిహార విషయం మాట్లాడడానికి బాబూరావు దగ్గరకు పంపుతారు. చౌదరి మాటను నిరాకరిస్తూ 'గెట్ అవుట్' అని పంపిస్తాడు. కార్మికులు ఎంతకైనా తెగిస్తారని గ్రహించిన బాబూరావు తన దొంగ తెలివిని ఉపయోగిస్తూ " ఈ వెధవలు ఏం చేస్తారో చూస్తా. ఫ్యాక్టరీ మిషన్లో లోపం ఏమీ లేదు. తనిఖీ చేయించాం. వాడు త్రాగి వచ్చి ఒళ్లు తెలీకుండా ప్రమాదం తెచ్చుకున్నాడు. నష్టపరిహారం కట్టివ్వాల్సిన

బాధ్యత యజమానికే మాత్రం లేదు. చౌదరి పార్టీ బలం చేకూర్చుకునేందుకు యీ అవకాశాన్ని బాగా ఉపయోగించుకుంటున్నాడు. మనకు – వాళ్ళకు జరిగిన రాయబార విషయం కూడా వ్రాయి" అని కవిని ఆదేశిస్తాడు.

మూడవ రంగంలో – శోభ ఔదార్యంతో ఇచ్చిన పది రూపాయిలు తమ నోళ్లు మూయించడానికి శోభను అపార్థం చేసుకున్న కొండయ్య శోభ మంచితనాన్ని గ్రహిస్తాడు. బాబూరావు పంపిన రౌడీలు కొండయ్యను గాయపరచి పోతారు. చౌదరి, కొండయ్యలు అజ్ఞానాంధకారంలో ఇన్నాళ్లు మగ్గిపోయే కవికి వాస్తవాలను చెప్పి జ్ఞానోదయం కలిగిస్తారు.

నాలుగవ రంగంలో – బాబూరావు తన చెల్లెలు శోభ, కవి రఘు, దాసు, చౌదరి ఫ్యాక్టరీ ప్రమాదంలో చెయ్యి పోగొట్టుకున్న వీరయ్యను చూడడానికి వెళ్ళి తనపైనే ఎదురుతిరిగే సంఘంతో చేతులు కలిపినట్లు రంగడు ద్వారా తెలుసుకుంటాడు. అలా వెళ్ళినందుకు వారి మీద కోపపడడమే కాక, తన తప్పును గ్రహించి ప్రజాసేవలో బ్రతకటానికి వెళ్లబోయే కవిని వెయ్యి రూపాయిలు చెల్లించి గాని కదలమని ఆంక్ష విధిస్తాడు. లేదంటే ఇన్నాళ్లు తన యింటిలో తిండి తిన్న ఖర్చుకి డబ్బులు కట్టకపోతే పోలీసులకు అప్పజెప్తానని బెదిరించగా కవి రాసిన ఉపన్యాసాలు వ్యాసాలను ఉపయోగించుకోవడమే కాక, అతను రాసిన ఎన్నో పుస్తకాలను తన పేర అచ్చు వేయించుకున్నందుకు పోలీసులకు రిపోర్టు చేసి ప్రాసిక్యూట్ చేయిస్తానని శోభ తన అన్న బాబూరావును నిలదీసి చెప్పడంతో మోహం చెల్లని బాబూరావు వాళ్ళను వదలివెళ్ళిపోతాడు. నిజం తెలుసుకున్న కవి పేద ప్రజల ఉన్నతికై తాను సాహిత్యాన్ని రాయడానికి నిశ్చయించుకొని కొండయ్యతో వెళ్ళిపోతాడు.

2.2.2.3. రాజకీయ నాటకం :

రాజకీయ అంశాలతో రాయబడిన నాటికగా 'వాస్తవం' నాటకాన్ని పేర్కొనవచ్చు. నాలుగు రంగాలలో రాయబడిన నాటకం ఇది.

వాస్తవం :

మొదలి నాగభూషణశర్మగారి మాటల్లో చెప్పాలంటే " విదేశీ పాలన అంతమై, దేశీయుల పాలన ప్రారంభం అయిన వెంటనే స్వార్థపరులైన రాజకీయ నాయకులు, తమ అధికారం కోసం నిజంగా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న త్యాగధనులను సైతం ఎలా కించపరుస్తారో చూపే వ్యంగ్య నాటకం "వాస్తవం". కాంగ్రెస్ సంస్థతో ఆత్రేయకు గల పరిచయం ఈ నాటక రచనకు స్ఫూర్తి.

మొదటి రంగంలో – పరివర్తన నాటకంలో మాదిరే చెమిటివాడు పాడే పాటతో నాటకం ప్రారంభించబడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందులోకి అడుగుపెట్టిన అవకాశవాది రామయ్య. ఇతనికి సుబ్బయ్య కుడి భుజంగా, కోటిగాడు అంగరక్షకుడిగా ఉంటారు. మంత్ర అయిన ఆనందయ్య చేత మాట్లాడించడానికి రామయ్య తన ఇంటి దగ్గర సభను ఏర్పాటుచేస్తాడు. కాంగ్రెస్ పార్టీ మీద ఉన్న అభిమానంతో ఆ పార్టీనే నమ్ముకుని ఎన్నో సేవలను చేసిన వెంకటాద్రి వ్యక్తి. అక్షర జ్ఞానం లేక బ్రతికే బడుగు ప్రజల పక్షాన ఉంటూ వాడు సత్యం. అలగా జనాలనబడే వారిని తన వద్దకు ఎగదోసుకొని తెచ్చింది సత్యమేనని ఆనందయ్య మండిపడతాడు.

రెండవ రంగంలో – సత్యం ఉండే గూడానికి పోయి రామయ్య ద్వారా అతనికి జరుగబోయే ప్రమాదం గూర్చి చెప్పడానికి వెంకటాద్రి వెళ్తాడు. అంతలోపే రామయ్య మనిషి అయిన కోటిగాడి ద్వారా గాయపడిన సత్యంను చూసి బాధపడతాడు. ప్రజాశాంతికి భంగం కల్పించాడంటూ ఏ పాపమెరుగని సత్యంపై పోలీసులు నేరం మోపి అరెస్టు చేసి తీసుకువెళ్తారు. సత్యం వెళ్తూ వెంకటాద్రి అభిమానించే కాంగ్రెస్ పార్టీ తరపునే ఉండి ఆ గూడెం ప్రజల తరపున నాయకుడిగా ఉండి పోరాడమని చెప్పి జైలుకు వెళ్తాడు.

మూడవ రంగంలో – సత్యంను అన్యాయంగా అరెస్టు చేసినందుకు వేలాది మంది సమ్మె చేస్తారు. సత్యంను అన్యాయంగా అరెస్టు చేయించిన ఆనందయ్య దగ్గరకు వెంకటాద్రి నేరుగా వెళ్ళి సత్యంను విడిచిపెట్టమని – అలా విడిచిపెట్టని పక్షంలో విపరీత పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆనందయ్యను, రామయ్యలను హెచ్చరించి వెళ్తాడు. సత్యం పక్షాన పోరాడే గూడెం ప్రజలను జైల్లో పెట్టించడానికి ప్రొహిభిషన్ సమయంలో వారు దొంగసారా కాస్తున్నట్లు నిరూపించడానికి వారు నివసించే గూడెంలోని నేలలో ఎక్కడైన కల్లును పూడ్చి పెట్టడానికి ప్రణాళిక వేసుకుంటారు. తన వారికి ఉద్యోగమిప్పిస్తానని సుబ్బయ్య నుంచి వెయ్యి రూపాయిలు లంచంగా తీసుకున్న రామయ్య ఉద్యోగమివ్వపోయేసరికి వారిరువురి మధ్య మనస్పర్ధలు వస్తాయి.

నాల్గవ రంగంలో – రామయ్య చేతిలో మోసపోయిన సుబ్బయ్య స్వార్ధ ప్రయోజనంతో వెంకటాద్రి దగ్గరకు రాగా " జాగ్రత్త! మూతులు నాకే కుక్కా! నా దగ్గరకు పరుగెత్తావో ఇప్పుడు? అక్కడ పాకం చెడేటప్పటికి ఆ వెయ్యి రూపాయలు రాబట్టుకోవడానికి యీ ఎత్తు వేశావు ? పో–వెళ్ళు– యీ పొలిమేరల్లోకి రాకు. ఎముకలు విరగబొడుస్తాను పో!" అని కరత్రో బాదబోగా సుబ్బయ్య పారిపోతాడు. గూడెంలో కల్లుందని రాముడును పోలీసులు అరెస్టు చేస్తారు. పోలీసులు ఏదో ఒక వంకతో కాల్పులు జరుపుతారు. ఆ కాల్పులలో వెంకటాద్రి మరణిస్తాడు. నిజానిజాలు తెలుసుకున్న మంత్రి ఆనందయ్య సత్యంకు క్షమాపణ లేఖను రాసి విడిపించి వెళ్తాడు. పదవులు, పార్టీలు ఎరగని నిర్మల ప్రజాసేవకుడైన వెంకటాద్రికి అందరితోపాటు సత్యం కూడా నివాళులు అర్పించడంతో నాటకం ముగుస్తుంది.

2.2.2.4. మనస్తత్వ చిత్రణ నాటకాలు :

వివిధ వ్యక్తుల మనస్తత్వాలను చిత్రీకరిస్తూ రాసే నాటిక మనస్తత్వ చిత్రణ నాటకాలుగా పేర్కొనవచ్చు. దీనికి ఉదాహరణగా 'భయం' నాటకంను చెప్పుకోవచ్చు. ఒకే ఒక రంగంలో సాగిపోయే నాటకం.

1. భయం :

జీవితంలో ఏది ఎదుర్కోవాలన్నా భయంతో భయానికి లొంగిపోయి జీవితంలో రాజీపడి అణగదొక్కబడుతున్న వారుగానే ఉంటూ బ్రతుకు బండిన సాగించే కొంతమంది మనస్తత్వాల చిత్రణ ఈ నాటకం. ఈ నాటకాన్ని మద్రాసులోని ఉడ్‌లాండ్స్ హోటల్‌లో ఆత్రేయ చెబుతుంటే రక్తకన్నీరు నాగభూషణం రాశారు. కేవలం 48 గంటల్లో ఆత్రేయ ఈ నాటకాన్ని రాశారు"

తెర ఎత్తగానే రాత్రంతా పనిచేసినా బారెడు పొద్దెక్కినా ఎడదెగని పనిని వగదెంచడానికి పనిచేసుకునే అకౌంటెంట్‌ను ఇంటికి వెళ్ళి స్నానం చేసి విశ్రాంతి తీసుకువస్తే, విసుగులేకుండా మిగిలిన పని చకచకా చేసుకోవచ్చని ముసలయ్య సలహా ఇస్తాడు. అరవై రూపాయలకు అరవచాకిరి చేసే వాళ్ళకు పెళ్ళాం బిడ్డలెందుకని నిస్పృహతో అంటూ లోకంలో అందరూ సుఖపడుతుంటే తానే కష్టపడుతున్నట్లు భావిస్తాడు. అంతలో ప్రొప్రయిటర్, అతని పర్సనల్ సెక్రెటరీ ఆఫీసుకు వస్తారు. మేనేజర్‌కి అప్పజెప్పిన స్టేట్‌మెంట్‌ను పూర్తి చేయనందుకు ప్రొప్రయిటర్ మేనేజర్‌ని తిట్టి గంటలోపు రడీ చేయమని వెళ్తాడు.ఒకరి మూలాన మరొకరి మాట పడిందని పర్సనల్ సెక్రెటరీ మేనేజర్‌పై, మేనేజర్ ఎకౌంటెంట్‌పై కోప్పడతారు. స్టేట్‌మెంట్ తయారు చేయడమే గాక తన పని కాని టైపింగ్ వర్క్‌ను కూడా తానే చేయాలా? అని ప్రశ్నించినందుకు, సంసారాన్ని పోషించేందుకు ఏం చెయ్యమన్నా చెయ్యాలి అని మేనేజరు అంటాడు.

మేనేజరు ఉద్యోగంతో అతను సుఖపడుతున్నాడు. అనుకునే అకౌంటెంట్‌కి మేనేజరు ఆ స్థాయికి చేరుకోవడం వెనుక తాను పడిన బాధలు కూడా చెప్పటమే గాక అతని కుటుంబ పరిస్థితిని చెప్పి ఎవరన్నా చూస్తే నవ్వుతారనే భయం ఉన్నప్పటికి కట్టలు తెంచుకు వచ్చిన దు:ఖంతో కన్నీరు పెట్టుకుంటాడు. మేనేజరు గాథ విన్న అకౌంటెంట్ "అందరూ ఏడుస్తున్నారు. అందరూ బాధపడుతున్నారు.. అందరి బతుకులూ యింతే! ఈ ప్రపంచమంతా యింతే.

నేనొక్కణ్ణే కాదు. నాలా లక్షలూ కోట్లు వున్నారు. నా కన్నా హీనంగా వుండే వాళ్ళూ వున్నారు." అంటూనే వాళ్ళ గూర్చి నేనెందుకు ఆలోచించాలంటూ " ఎవరు బతుకు వాళ్ళది" అనే అభిప్రాయానికి వస్తాడు. చాలీచాలని జీతాన్నిచ్చే ఎకౌంటెంట్ ఉద్యోగం వల్ల సంసారం నాశనమైపోయినట్లు పీడకలలు కంటాడు. అప్పుడే డ్యూటీకి వచ్చిన టైపిస్టు ఎకౌంట్‌ని ఇంటికి పంపి తన పనిని తానే చేస్తుంది. తాను ప్రేమించిన వాడు ఉగ్యోగస్థుడయితే తన తల్లిదండ్రులు ఒప్పుకుంటారని ఆమె తన ప్రియుడికి ఆమె పని చేసే ఆఫీసులోనే ఉద్యోగమిప్పిస్తుంది టైపిస్టు. వారిరువురి సంబంధం ఎవ్వరికి తెలియకుండా ఉండేలా మసలమని ప్రియుడ్ని హెచ్చరిస్తుంది. ఆ ఆఫీసులో పనిచేసే క్యాషియర్‌కి జ్యోతిష్యం తెలుసు. కొత్తగా చేరిన కుర్రవాడి (శంకర్) చేయి చూసి అతనికి పెళ్ళి అయినట్లు అతని భార్య కొత్తగా చేరిన కుర్రవాడి (శంకర్) చేయి చూసి అతనికి పెళ్ళి అయినట్లు అతని భార్య గర్భవతి అని చెప్తాడు. క్యాషియర్ చెప్పేవన్నీ బూటకమనే అతని ప్రియుడితో తాను గర్భవతిని టైపిస్ట్ చెప్పగా కంగుతింటాడు. ఆఫీసులో అడ్డమైన పనులు చేయడం మరియు ఆడదాని ద్వారా ఉద్యోగం సంపాదించడం నామోషీగా ఫీలయిన శంకర్ ఉద్యోగానికి రాజీనామా చేయపోగా వారి పెళ్ళి దృష్ట్యా ముఖ్యంగా కడుపులో పెరిగే బిడ్డ కోసమైనా ఉద్యోగం చేయమని టైపిస్టు తన ప్రియుడు శంకర్‌ని ప్రాధేయపడగా అంగీకరిస్తాడు.

ప్రొప్రయిటర్‌కి టైపిస్టు పార్వతిమీద మోజున్న కారణంగా వారిద్దరి మధ్య తలదూర్చక చూచీ చూడనట్టు పొమ్మనే పర్సనల్ సెక్రటరీ మాటలకి టైపిస్టు పార్వతినే ప్రేమించే శంకర్ గొడవపెట్టుకొని తన రాజీనామా చేయడానికి పూనుకుంటాడు. ఇన్‌కంటాక్స్ కారణంగా గుమస్తాలందరికి రెండునెలలు బోనస్ ఇచ్చినట్లు వారి దగ్గర నుంచి రశీదులు తీసుకొని స్టేట్‌మెంట్ తయారుచేయమని మేనేజర్‌ని ఆదేశిస్తాడు ప్రొప్రయిటర్. తమ హీనస్థితికి కారణమైన ప్రొప్రయిటర్ మేనేజర్ భార్య నానామాటలని పిచ్చితో భయపెట్టగా వెంటనే వాళ్ళను ఇల్లు ఖాళీచేసి పొమ్మంటాడు ఆ ప్రొప్రయిటర్. ఆఫీసులో వాళ్ళు ఎవ్వరూ తాము బోనస్ తీసుకున్నట్లు రశీదు రాయకుండా వారిలో చైతన్యం తీసుకువస్తాడు శంకర్. అంతేకాదు " మేనేజర్ గారూ! యింత వయసుందీ. ఇంకా యెందుకండీ మీకీ పాడుబుద్ధి? మీసాటివాళ్ళ పొట్టలు కొట్టి ఎందుకండీ ఈ ఇనప్పెట్టెలో నింపడానికి చూస్తారు. ఇంతచేస్తే మీకొచ్చే కితాబేమిటో చూచారు. మీ భార్య పిచ్చిది కావడం అంతేనా. అందరి భార్యలూ అలా అయిపోవాలనా మీ అభిప్రాయం. ఏం? ఇకనైనా మానుకొండీ వెధవ భయం" అని శంకర్ వెళ్తాడు. పార్వతి గర్భిణీ అని ప్రొప్రయిటర్ తెలుసుకొని ఫ్యాక్టరీ కూలీల విషయంలో శంకర్ జోక్యం చేసుకోకుండా ఉండేందుకు అతనిని తిరిగి ఉద్యోగంలో చేర్పించమని, అలా చేర్పించని పక్షంలో గర్భంతో ఉన్నట్లు ఆమె తల్లిదండ్రులకు తెలియపరుస్తానని పార్వతిని ప్రొప్రయిటర్ బ్లాక్‌మెయిల్ చేసి ఆమె తండ్రికి అసలు విషయం చెప్పగా పార్వతి తండ్రి ఆ వార్త విని చనిపోతాడు. తనకు ఎదరు తిరిగిన అకౌంటెంట్ పార్వతిలను పిస్టల్‌తో భయపెట్టగా ఈలోపు శంకర్ సి.ఐ.తో వచ్చి ప్రొప్రయిటర్ అవినీతి పాల్పడినట్లు సాక్ష్యాధారాలు చూపించి అరెస్టు చేయిస్తాడు. ప్రాణాలతో వెళ్ళే ప్రొప్రయిటర్‌ను మేనేజర్ భార్య కత్తి విసిరి చంపడంతో నాటకం ముగుస్తుంది.

మానసిక రోగంతో వున్న భార్య పరిస్థితి తలచుకుంటూ తనలో పొంగి పొరలే దు:ఖాన్ని పిల్లలు, బయటవారెవ్వరన్నా చూస్తారని మేనేజర్ భయం. గంపెడు సంసారంతో చాలీచాలని జీతంతో గొడ్డు చాకిరి చేసే భర్తను చూస్తూ జీవితాన్ని గడపటమే మేనేజర్ భార్య భయం. పై అధికారులు చెప్పిన అడ్డమైన పనులు ఆత్మను చంపుకొని వేళాపాళా లేకుండా చేయకపోతే, చేయనంటే అందుకు తన ఉద్యోగం పీకి వేస్తే భార్యాబిడ్డలు బజారున పడి ఎక్కడ చస్తారోననే వారిద్దరి ప్రేమ వ్యవహారం తోటివారికి తెలుస్తుందేమోననే భయం టైపిస్టు పార్వతిది. ఏ క్షణాన ఎవరొచ్చి ఇన్‌కంటాక్స్ పేర డబ్బు కట్టించుకుంటారోననే భయం ప్రొప్రయిర్‌ది. ఇలా అందరూ ఏదో భయంతో బ్రతుకును భారంగా గడిపే వాళ్ళు ఇందరి మనస్తత్వాలను ఈ నాటికలో చిత్రీకరించారు ఆత్రేయ.

2. మనసూ – వయసు :

సిడ్నీ హవర్ట్ రాసిన ' దీ న్యూ వాట్ దే వాంటెడ్ ' అనే నాటకం 'మనసూ–వయసు' నాటకానికి మూలం. ఒకే రంగంతో మూడు దృశ్యాలలో సాగే నాటకం.

శివయ్య ఐశ్వర్యవంతుడు. శివయ్య తిరుపతి యజమాని సేవకుడనేగాని ప్రాణ స్నేహితులు. వీరిద్దరు వ్యాపార నిమిత్తం బొంబాయిలో ఒక కంపెనీకి వెళ్ళగా ఆ కంపెనీలో టైపిస్టుగా పనిచేసే లిల్లీని శివయ్య చూసి ఆకర్షితుడై ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకుంటాడు. 'ఆత్రేయ నాటకాలు – పూర్వాపరాలు' అనే అంశంపై పరిశోధన చేసిన పైడిపాల గారు " లిల్లీ శివయ్యను ఆకర్షిస్తుంది. (ఆత్రేయ పూర్వాపరాలు – పుట 73) అని పొరపాటుగా పేర్కొంటారు. వారు పేర్కొన్నదే నిజమైతే 'మీరెంత మంచివారు, నేనిదంతా ఉత్తరాల్లో రాయలేదు. నన్ను గురించి ఏమీ అడక్కుండా, ఏమీ తెలియకుండా, ఎలా పెళ్ళిచేసుకుంటానన్నారు." అని ఎలా తిరుపతితో అనగలుగును? శివయ్య తనకు పంపిన తిరుపతి ఫొటోను తిరుపతికి చూపిస్తూ " ఇది మోసం కాదా? ఒకరి ఫోటో పంపి ఇంకొకరి పేరు చెప్తారా ? ఇంకొకరు పెళ్ళాడాలని చూస్తారా?" అని లిల్లీ అనే దాన్ని బట్టి బొంబాయి వెళ్ళినప్పుడు తిరుపతిని సూచాయగా చూసిందని తెలుస్తుంది. లిల్లీ శివయ్యను ఆకర్షించలేదని స్పష్టమవుతుంది. శిష్యయ్య ప్రక్కనున్న తిరుపతిని లిల్లి సూచాయగా అప్పుడే చూస్తుంది. ఆ తర్వాత శివయ్య తన ఫొటో వికారంగా ఉన్న కారణంగా దాన్ని లిల్లీకి పంపితే తన ప్రేమను నిరాకరిస్తుందనే భయంతో ఆమె ప్రేమను ఎలాగైనా పొంది పెళ్ళాడాలనే ఉద్దేశ్యంతో తిరుపతికి తెలియకుండానే తిరుపతి ఫొటోను పంపి శివయ్య పేర తిరుపతి చేత లిల్లీకి ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపిస్తాడు. ప్రేమ కథంతా లేఖలు ద్వారానే నడిచి పంపబడిన తిరుపతి ఫొటోను చూసుకున్న లిల్లి అతనే శివయ్య అనుకొని పెళ్ళికి ఒప్పుకుంటుంది.

శివయ్య లిల్లీని రిజిష్టర్ మ్యారేజి చేసుకోవడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేయించి స్వయంగా తానే ఆమెను రిసీవ్ చేసుకోవడానికి ట్రైన్ వచ్చే సమయానికి కారులో స్పీడ్‌గా బయలుదేరతాడు శివయ్య. లిల్లీ శివయ్య ఇంటికి రానే వస్తుంది. లిల్లీ వెంట శివయ్య కలిసి రాకపోవడంతో శివయ్య ఏమై ఉంటాడని కలిసి రాకపోవడంతో శివయ్య ఏమై ఉంటాడని అందరు ఆశ్చర్యపోతారు. తిరుపతిని చూసి అతనే తనను పెళ్ళి చేసుకుంటున్నందుకు కృతజ్ఞతగా తిరుపతిని కౌగిళ్ళలో బిగించగా ఏమి అర్థంకాని తిరుపతి ఆమె నుంచి తప్పించుకొని శివయ్య కోసం ఎదురుచూస్తుండగా యాక్సిడెంట్‌లో కాళ్ళు విరిగి గాయపడిన శివయ్యను డాక్టర్ తీసుకువస్తాడు. తనను పెళ్ళాడబోయేది అతనేనని తెలుసుకున్న లిల్లీ " మీరు మనుష్యులేనా? మీరు మగాళ్లేనా? ఏమిటీ మోసం, ఎందుకీ మోసం? ఆడదాన్ని యిలా మోసం చేస్తారా? ఇంతకన్నా నీచం యింకేమన్నా వుందా" అంటూ జరగబోయే అన్యాయాన్ని తలచుకొని అలా చేసినందుకు వారిని తిట్టి తిరిగి బొంబాయి వెళ్లబోగా తిరుపతి నచ్చచెప్పగా ఆమె తన జీవితం గూర్చి ఆలోచించుకొని ఆ యింటిలోనే వుండడానికి అంగీకరిస్తుంది. శివయ్య తాను చేసిన పనికి పశ్చాత్తాపపడతాడు. లిల్లీమీద గల ప్రేమతోనే అలా చేస్తాడు. ఆమె మన్నించేందుకు ఆమెపై ప్రేమతో బహుమానంగా నగలు కొని ఇవ్వడమే కాక ఇంటి పెత్తనం ఆమెకు అప్పచెప్పుతాడు. ఆయా లిల్లీ బాధను అర్థం చేసుకుంటుంది. ఆమె తన కూతురేనని తెలుసుకుంటుంది. ఎన్నో ఆశలతో పెళ్ళయిన మొదటి రేయి వయసు పరువంతో చల్లని వెన్నెలకు ఓపలేక లిల్లీకి మనసు నిలవదు. మనసును జయించలేక ఆత్మహత్య చేసుకోబోగా తిరుపతి ఆమెను అడ్డుకొని వారించడాన్ని ఆ యింటిలోని వంటమనిషి నాయర్ చూస్తాడు. పెళ్ళికి ప్రేమకు మధ్య పెనుగులాడుతున్న బలహీనదశలో పెళ్లయిన రాత్రి ఆవేశంతో జరిగిన తప్పుకు ఫలితం లిల్లీ గర్భవతి అవుతుంది. లిల్లీ ఈవిషయాన్ని మనసులో పెట్టుకోలేక అమాయకమైన శివయ్య హృదయాన్ని మోసపుచ్చలేక తిరుపతి వల్ల తాను తల్లిని అయిన నిజాన్ని చెప్తుంది. శివయ్యకు ఆ నిజం మింగుడుపకత

తుపాకీతో లిల్లీని కాల్చబోగా ఆయా అడ్డుకొని లిల్లీ తన కూతురుని పంతులుకి తనకు అక్రమ సంతానంగా పుట్టిందని లిల్లీ చేసిన దానిలో తప్పేమిలేదని వాదిస్తుంది. శివయ్య ఆ పరిస్థితులకు తనకు చావే పరిష్కారంగా భావించి తుపాకీతో ఆత్మహత్య చేసుకుంటాడు. శివయ్య తన ఆస్థినంతా మనుమడి పేరిట వీలునామా రాసి ఇచ్చిన కాగితాన్ని తిరుపతికి అందజేయమని పంతులుకి ఇవ్వడంతో నాటకం ముగుస్తుంది.

ఈ విధంగా ఆత్రేయగారు భూతభవిష్యత్ వర్తమాన కాలంలో కొనసాగిన – కొనసాగుతున్న – కొనసాగబోయే అంశాలను తన నాటకాలకి ఇతివృత్తంగా తీసుకొని మహోద్భుతమైన నాటకాలనెన్నింటినో రాశారు. ఆత్రేయగారి నాటకాలు అనుసరలే కాని అనువాదాలు కావు. అనురసణ చేసి వారు నాటకాలు రచించినా అవి మన దేశ సాంఘిక, సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తూ దేశవాళి విలువలతో కూడి ఉంటాయి. ఈ విధమైనటువంటి నాటకాలలో మన వాతావరణమే ఉంటుంది. పాత్రల పేర్లు – కట్టుబొట్టు నుంచి కట్టుబాట్ల వరకు మన చుట్టూ వున్న వాతావరణంలో రూపొందించబడతాయి వారి నాటకాలు. అంతేగాని వారి నాటకాలు మక్కికి మక్కి అనువాదంగా గాని పాశ్చాత్య ప్రభావంతో రాయబడిన నాటకంగా ఏ కోశానైనా కనిపించదు.

ఆత్రేయగారి నాటకాలను పరిశీలిస్తే వాటి రచన వెనుక వారు పడిన తపన మనకు అర్థమవుతుంది. ఇదేవిషయమై వారొకచోట ఇలా చెప్పుకున్నారు. “నేను సత్సంప్రదాయ వంశంలోనే పుట్టి పెరిగాను. కాని కొంతకాలానికి నాలో ఏమూలనో దాగి వున్న విప్లవకారుడు తలెత్తాడు. ధనికుల దౌర్జన్యాలను, పెట్టుబడిదారుల దోపిడీ విధానాన్ని, రాజకీయాల రొచ్చును. అమాయక ప్రజల కన్నీళ్లను కడగండ్లను కళ్ళారా చూసి విజృంభించాడు ఆ విప్లవకారుడు. ఈ అత్యాచార్యాలను, అన్యాయాలను దైవానికీ ఖర్మకూ అంటగట్టడానికి నా మనసు అంగీకరించలేదు. ఈ కుళ్ళును కడగలేకపోయినా, బయటపెట్టాలి. కళ్ళుండీ నిజాన్ని చూడలేక గుడ్డివాళ్లుగా బ్రతుకుతున్న ఈ ప్రజల కళ్లు తెరిపించాలి. ఎలా?ఎలా?” అని మధనపడ్డాను, తపనపడ్డాను, తపించాను, తపస్సు చేశాను. ఆ తపస్సు నుంచి వెలువడ్డవే నా నాటకాలు”. ఆవిధంగా ఆత్రేయ తపించి సమాజంలో జరిగే అన్యాయాలను అక్రమాలను బయటపెట్టడానికి ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి నాటక ప్రక్రియను ఎన్నుకొని ఎన్నో ప్రయోజనాత్మక నాటకాలను రాశారు.

ఆత్రేయ నాటక రంగం నుంచి సినిమా రంగానికి వెళ్ళినా.. నాటక రంగం యొక్క విలువను, ప్రయోజనాన్ని గ్రహించిన ఆత్రేయ, నాటక రంగం మీద వున్న ప్రేమ, అభిమానము, గౌరవభావాన్ని విడనాడక ”.. ఆఖరి నాటకం వ్రాయాలి. నేనే స్వయంగా వెళ్ళి ప్రజలలో – దేశం, నాలుగు మూలలా – ప్రదర్శించాలి. ప్రజలమధ్యనో, రంగస్థలం మీదనో నా ఆఖరి ఊపిరి వదలాలి. కట్టుకున్న పోలీసుల తుపాకీ గుండ్లకు బలైపోవాలి” అని ఆశించిన ఏకైక నాటక రచయిత. అందుకే ఇప్పటికి ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

మూడవ అధ్యాయం
ఆత్రేయ ' నాటక ' సంభాషణలు

ఆత్రేయతోనూ, వారి సాహిత్యంతోనూ బాగా పరిచయం వున్న మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు ఆత్రేయగారి నాటకాలలోని సంభాషణలను గూర్చి – " ఒక మంచి కథ దొరికితే, దానిని మణిపూసగా మలిచే సామర్థ్యమున్న రచయిత ఆత్రేయ. ఆయన వ్రాసే ప్రతీ సంభాషణా అర్థవంతంగా వుంటుంది. దీర్ఘ సంభాషణలు కాక చిన్న చిన్న సంభాషణ అనంతమైన భావాలను దోత్యం చేస్తారు. ఆయన సంభాషణల్లో అనవసరంగా ఒక్క సంభాషణ కూడా దొర్లదు. ఆలోచించి ఆలోచించి సంభాషణను ప్రారంభిస్తారు. తాను అనుకున్న విధముగా సంభాషణ వచ్చే వరకూ ఎంత టైమైన తీసుకుంటారు. అందుకోసం సతమతమై నలిగిపోతారు, గింజుకుంటారు. తాను అనుకున్న విధముగా సంభాషణ వచ్చిన తరువాత ఆనందంలో మునిగిపోతారు. కేవలం సంభాషణ కొరకని ఒక్క సంభాషణ కూడా వ్రాయరు. వ్రాయబడే ప్రతీ సంభాషణ తనే ఆ పాత్రగా ఆలోచిస్తారు. ఒకటికి నాలుగు సార్లు అనుకొని ఆ సారాన్ని అనుభవించి వ్రాస్తారు. నటుడుగా ఆలోచించి సంభాషణలు వ్రాస్తారు. అందువల్లే ఆయన సంభాషణలు అంత సజీవంగా సహజంగా వుంటాయి. అందుకు కారణం ఆయన మంచి నటుడు కావడమే. అని అంటారు. ఆత్రేయగారు పరివర్తన నాటకానికి సంభాషణలు చెప్తుండగా వాటిని చక్కగా రాసిన వ్యక్తికి ఆత్రేయ సంభాషణలు ఏవిధంగా రాస్తారు, ఎలా ఫీలవుతూ రాస్తారని ప్రత్యక్షంగా చూసిన వ్యక్తిగా ఎంతో అర్థవంతంగా చెప్పిన వారు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.

ఆత్రేయ గారి నాటకాలలోని సంభాషణలను గూర్చి చర్చించే ముందు నాటక సాహిత్యంలో సంభాషణ స్వరూపం, స్థానం గూర్చి వివరించడం సముచితమని భావిస్తున్నాను.

" నటించడానికి, అన్ని అందాలా సిద్ధంగా, అనుకూలంగా ఉన్న వాక్యమూహమే సంభాషణం. నవల, నాటక, కథానిక ప్రక్రియలలో సంభాషణలనేవి ఎంత ప్రధానపాత్ర వహిస్తున్నాయో మనకు తెలియంది కాదు. మానవ మనుగడకు మాటలెలా ఉపయోగపడుతున్నాయో పై ప్రక్రియలోని కథను నడిపించడానికి సంభాషణలు అంతే ఉపయోగపడతాయి. కథను కేవలం సంభాషణలతోనే నడిపించే సాహిత్య ప్రక్రియ నాటకమైనప్పటికీ నవల, కథానిక ప్రక్రియలలో కూడా సంభాషణలనేవి ఎంతో ప్రధాన పాత్రను పోషిస్తాయి. సంభాషణలు లేకుండా కథానికను, నవలను రాసిన రచయిత ఉండడని అనడంలో సందేహమే లేదు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథానికలు తీసుకుంటే చాలా వరకు సంభాషణలతోనే రాసి వుంటాయి. ఇవే కాక పాటలు, ఛందోపద్యాలు మున్నగున్న సాహిత్య ప్రక్రియలలో కూడా అక్కడక్కడ సంభాషణ రూపంతో రాయబడి వున్నాయంటే అతిశయోక్తి కాదు!

నాటకంలో ప్రధాన భూమిక వహిస్తూ, కథా వస్తువు పాత్రలకు మధ్య మధ్యవర్తిత్వం పూనుకునేవే సంభాషణలని ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు అంటారు. కొన్ని నాటకాలను మనం చూస్తుంటే అందులోని కొన్ని పాత్రలలో మనకు ఇంతకు మునుపే పరిచయమున్న అనుభూతి కలుగుతుంది. అలాంటి భావం మనకు కలగడానికి కారణం ఆ పాత్రల సంభాషణలే! అతి సహజమైన, వాస్తవిక సంభాషణలను మనం వింటూ వుంటాం. మాట్లాడుతూనే వుంటాం. ఇలాంటి మాటలే ఆ పాత్ర నోట వింటున్నప్పుడు మనమధ్య మసలిన మనిషే ఆ పాత్ర అనే భావన మనలో సహజంగానే కలుగుతుంది. ఈవిధమైన విషయాన్ని గమనించిన పోణంగి శ్రీరామ అప్పారావుగారు " నాటకమును చూచుచున్నంత కాలమును రూపక గత పాత్రలు సజీవులుగా మన ఎదుట కన్పట్టుదురు: సంభాషింతురు. అందుచేత మనము శీఘ్రముగా వారివైపు ఆకర్షింపబడుదుము. అట్టియెడల వారి భాషణములు లోక సహజములుగా నున్నచో మనకు వారు అత్యంతము సన్నిహితులు కాగలరు" అని అంటారు. నాటకీయ శిల్పంలో కూడా సంభాషణలనేవి అత్యంత

ప్రాముఖత్యను కలిగి వున్నవి. ఒక్కొక్క రచయితను గొప్ప రచయితగా, మంచి రచనా శైలి ఏర్పరచుకున్న రచయితగా పాఠకులు, ప్రేక్షకులు గుర్తింపచేసేందుకు తోడ్పడేవి ఈ సంభాషణలనే చెప్పాలి. కాబట్టే – " నాటకీయ శిల్పంలో ఒక భాగం సంభాషణ రచనా సామర్థ్యం అనడం సమంజసం. సంభాషణా రచనా వైదర్భ్యం లేని నాటకం సహృదయము మానసిక సీమలకానందాన్ని ఆపాదింపజాలదు. వాస్తవానికి సంవాదముంటేనే అది నాటకమౌతుందున్న విషయం ఇక్కడ విస్మరించరాదు. లేకపోతు అది శ్రవ్య కావ్యమే అవుతుంది. కాబట్టి సంభాషణ నాటకానికి ప్రాణమనవచ్చు" అని ఆచార్య ఎస్.గంగప్ప అన్నారు.

సంభాషణలేనవి ఎలా ఉండాలి, ఎలా ఉంటే ఉత్తమ సంభాషణలుగా భావింపబడతాయి అనే సందేహాలకు సమాధానాలుగా – " సంభాషణ వ్యక్తి నిష్టకాదు. వ్యవస్థ నిష్టం కావాలి. సంభాషణ వ్యక్తిగతంగా ఎలా వున్నా అది వ్యక్తి నుంచి వ్యవస్థ గుండెలోకి పోయి సామాజికంగా, సామూహిక ధర్మంగా ఆవిష్కృతి పొందుతుంది. సంభాషణ సర్వకాలాలకీ, సర్వజనానికి సంబంధించినదై అవతరించాలి. సంభాషణ సంధి పరిమితం కాదు. అపరిమితం. విస్తృతి సంకుచితం కాదు, విశాలం. సంభాషణ సమాజ జీవనానికి ప్రతిస్పందనం అయినప్పుడు ఉత్తమంగా భావింపబడుతుంది.॥ అని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు చెప్పారు. రచయిత తన పాత్రల నోట పలికించే సంభాషణల ద్వారా నాటకంను చూసే ప్రేక్షకుల్లో, నాటకాన్ని చదివే పాఠకుల్లో చైతన్యాన్ని, ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని కలిగించవచ్చు.ఉత్తమ సంభాషణలు, పాఠకులు, ప్రేక్షకులు హృదయాంతరాల్లోకి వెళ్ళి మంచి – చెడులు, వాస్తవాలు – అవాస్తవాలను గూర్చి పదేపదే సమాజంలో చైతన్యాన్ని, మార్పును తీసుకురావడానికి నాటక రచయితకు గొప్ప ఆయుధంగా ఈ సంభాషణలు ఉపకరిస్తాయి.

అందుకే – " ఉత్తమ సంభాషణ నాటకాన్ని మిక్కిలి ఉత్తమంగా తయారు చేస్తుంది. రసానందం కలిగించడంతోపాటు, సంఘాన్ని సంస్కరించడానికి క్షాళనం చేయడానికి సాంఘిక ప్రయోజనం సాధించడానికి ఉత్తమ సంభాషణ బలవంతుడు ఉపయోగించే ఆయుధం అవుతుంది." అని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు ఉత్తమ సంభాషణ ఎంత శక్తివంతమైనదో తెలిపారు.

అభినయం, వాచికం, అంగికం, ఆహార్యం కలిస్తేనే సంభాషణ సంపూర్ణంగా ఆవిష్కరింపబడుతుంది. అప్పుడే అది ఉత్తమత్వం పొందుతుంది. అవే కాక రచనా, ప్రదర్శన, కథావస్తువు, పాత్రలు, భాష ఇలా అనేకం కలిసిన సంభాషణ ఉత్తమత్వాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి మంచి సంభాషణ పలకటంతో పాటు నటించడంతో కూడా సంబంధాన్ని కలిగి వుంటుందని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు అభిప్రాయపడ్డారు.

3.1.నాటక సంభాషణలు – లక్షణాలు :

ప్రతి ప్రాణి వేర్వేరు రూపాలతో ఉన్నప్పటికీ ఆ ప్రాణుల్లోని ఒకే రకమైన ప్రాణులు వేర్వేరు లక్షణాలు ఎలా కలిగి వుంటాయో.. అదేమాధిరి వివిధ సాహిత్య ప్రక్రియలలో ఈ సంభాషణలు కూడా వాటివాటి లక్షణాలను కలిగి వున్నాయి. అవి ఏమిటో పరిశీలిద్దాం !

1. సంభాషణ పాత్రల మానసికతత్వాన్ని వెల్లడించాలి :

నాటకంలోని పాత్రల మానసిక స్వభావం వారి మాటలను బట్టి అర్థం కావాలి. అందుచేతనే రచయిత ఆ పాత్రలలో పలికించే మాటలనుబట్టి నాటకంలోని ఆ పాత్రల మానసిక స్వభావాన్ని తెలియజేయాల్సి వుంది. అప్పుడే నాటకంలోని ఆపాత్ర స్థానం, ఔచిత్యం ఏమిటి అని తెలుస్తుంది.

2. సంభాషణలు జరిగిన కథను ధ్వనింపచేస్తూ జరగబోయే కథను ముందుకు నడిపించేలా వుండాలి :

అంటే నాటకంలోని వివిధ సన్నివేశాలకు సంబంధించిన కథకు రాయబడే సంభాషణలు ఏవైతో ఉన్నాయో, ఆ సంభాషణలు కేవలం అందుకోసమే రాయక పూర్వకథ ప్రస్థావన వచ్చినప్పుడు నాటకానికి ఉపకరించేలా నాటిక కథను మునుముందుకు నడిపించేవిలా వుండాలి.

3. సంభాషణలు సందర్భోచితంగా ఉండాలి :

ఒక సన్నివేశానికి రచయిత రాసే సంభాషణలు ఆ పాత్రకు – ఆ సంఘటనకు – ఆ స్థితికి సంబంధించి 'అంతే వుండాలి' అని ప్రేక్షకులు భావించేలా నాటకంలో సంభాషణలుండాలి. అందుకు ఆచార్య ఎస్.గంగప్పగారు " సందర్భోచిత సంభాషణలు లేని నాటకం అంగో పాంగాలతో కూడి ఉన్నా ఆది ప్రాణరహితమైన శరీరం లాందిదనవచ్చు. " అని సందర్భోచితంగా లేని సంభాషణలు ఎలాంటివో వివరించారు.

4. సంభాషణలు ఔచిత్యంగా వుండాలి :

ఒకపాత్ర మరో పాత్రతో సంభాషించేటప్పుడు రచయిత ఔచిత్యతను పాటించాలి. ఒక పాత్ర మరోపాత్రతో మాట్లాడేటప్పుడు ఎలా మాట్లాడించాలో రచయిత అవగాహనతో రాయాలి. లేకపోతే ప్రధానపాత్రలు, ఉన్నతమైన పాత్రల మనోభావాలను దెబ్బతీసేలా ఉండి నాటకమే అనౌచిత్యపాలవుతుంది. నిరక్ష్యరాస్యుడు అక్షరాస్యుడులా ధారాళంగా మాట్లాడించడం సంభాషణను అనౌచిత్య పాలుచేయడమే కదా !

5. సంభాషణలు పాత్ర పరిధిని మించరాదు :

రచయిత పాత్ర పరిధిని అనుసరించి సంభాషణలు రాయాలి. పది సంవత్సరాల పిల్లవాడు జీవితాన్ని కాచి వడబోసిన యాభై సంవత్సరాల వ్యక్తిలా పాత్ర పరిధిని మించి మాట్లాడనివ్వకూడదు. అదేవిధముగా వృద్ధాప్య జీవితంతో తొణికిసలాడే పాత్ర ఉడుకురక్తంతో పూర్వాపరాల ఆలోచన లేక ఆవేశంతో ఊగిపోయే వ్యక్తిలా మాట్లాడనివ్వక సన్నివేశానుగుణంగా పాత్ర పరిమితులను అనుసరించి సంభాషణలను పలికించాలి.

6. సంభాషణలు సంక్షిప్తంగా ఉండాలి :

సంభాషణలు కలిగిన ఏ ప్రక్రియలోనైనా సంభాషణలు సంక్షిప్తంగా ఉండాలి. పాత్ర పిలకే సంభాషణలే కాక సన్నివేశానుగుణంగా పాత్రల పునరావృత్త రీత్యా నూతనపాత్రల ప్రవేశదృష్ట్యా సంభాషనలు సంక్షిప్తంగా రాయాలి రచయిత. సంభాషణలు ఎందుకు సంక్షిప్తంగా ఉండాలో ఆచార్య ఎస్.గంగప్పగారు ఈవిధంగా చెప్తారు. సంభాషణలు " సుదీర్ఘమై అన్వయక్లిష్టతతో, దూర్వాసయ దోషదూషితాలపై ఉండడం వాంఛనీయం కాదు. కష్టార్థపద సంయోజనం గల శ్రవ్య కావ్యమైతే నైఘంటికార్థంతో సంతోషించవచ్చు. కానీ నాటకం రంగకావ్యమైతే నైఘంటికార్థంతో సంతోషించవచ్చు. కానీ నాటకరంగం ప్రదర్శన యోగ్యమై ఉండాలి. కాబట్టి రంగంలో ఆయా పాత్రధారులు మాటలు ఉచ్చరించిన వెంటనే సులభ గ్రాహ్యమై ఉండడం అత్యావశ్యకం. సంభాషణలు అతిదీర్ఘమైతే రంగంలో ఒక పాత్ర మాట్లాడుతూ ఉంటే తక్కిన పాత్రలు బెల్లంగొట్టిన గుండ్రాళ్ళలా ఉండవలసి వస్తుంది. అది నటులకు గాని, సామాజికులకు గాని సహించరాని సంగతి. అంతేగాదు దానివల్ల నాటక కార్యవేగం మందగిస్తుంది. వేగం తగ్గితే సామాజికుల సహనానికి పరీక్ష అవుతుంది. కాబట్టి ప్రేక్షకలోకం విసుగుచెందని రీతిగా ఉక్తి ప్రత్యుక్తులతో, ఆసక్తి జనకమై, ఔత్సుక్యస్ఫోరకమై నాటకంలో సంభాషణలు సాగవలసి వుంటుంది"

7. సంభాషణలు సహజంగా – వాస్తవికంగా ఉండాలి :

పాత్రలు మాట్లాడే మాటలు అతి సహజంగా, సరళంగా ఉంటూ వాస్తవికతను కలిగి ఉండాలి. పాత్రలు పలికే మాటలు వాస్తవిక జీవితంలో మనం మాట్లాడుకునే మాటల్లాగే ఉండాలి. భాషకూడా ఎంతో సరళంగా వుండాలి.

సంభాషణలు వ్యక్తినిష్ఠంగా ఉండక వ్యవస్థగతంగా ఉండాలి. " నాటకాలలోని సంభాషణలు కథా కథనం, ఉపన్యాసం, వర్ణనం కంటే భిన్నధర్మ నిర్వహణ సమర్థంగా ఉండాలి.

పై విధముగా సంభాషణలనేవి వివిధ లక్షణాలను కలిగి నాటక ప్రక్రియను సలక్షంగా లక్ష్యసాధనవైపు నడిపిస్తూ నాటక రంగం పట్ల ప్రేక్షకుల ఆదరాభిమానాన్ని సంపాదించడంలో ప్రధానపాత్ర వహిస్తుందనడంలో సందేహమే లేదు! ఇక ఆత్రేయ గారి నాటక సాహిత్యంలోని సంభాషణల వైవిధ్యాన్ని – వైశిష్ట్యాన్ని పరిశీలిస్తే వారి నాటక సంభాషణలు నాటక విజయానికి ఇంత వరకు దోహదపడినాయో అర్థమవుతుంది.

" సంభాషణల ద్వారా నాటక ఇతివృత్తాన్ని, డ్రమెటిక్ యాక్షన్‌ని నడపడం చేతనైన బహుకొద్ది మంది నాటక రచయితల్లో ఆత్రేయ అగ్రగణ్యుడు" అనిన మొదలి నాగభూషణశర్మగారి మాటలు 'నిజమైన నిజం'. ఆత్రేయగారి నాటకాలను పరిశీలిస్తే వారు సంభాషణా రూపంలో స్పృశించని అంశమంటూ ఉండదు. వారి సినిమా సంభాషణకు పునాదిగా ఉపయోగపడినవి ఈ నాటక సంభాషణలే! అందుకనే ఆత్రేయగారి నాటకాలను చూసిన కె.యస్.ప్రకాశరావు తాను దర్శకత్వం వహించే 'దీక్ష' చిత్రానికి ఆత్రేయ గారిని పాటల రచయితగానే కాక తాఫీ ధర్మారావుగారికి జతగా మాటల రచయితగా కూడా తెలుగు చిత్ర పరిశ్రమకి పరిచయం చేశారు.

వస్తు వైవిధ్యంను బట్టి ఆత్రేయ గారి నాటక సాహిత్యంలోని సంభాషనలను ప్రేమ సంభాషణలు, హాస్య సంభాషణలు, విషాదాత్మక సంభాషణలు.. ఇలా సుమారు ఇరవై రకాలుగా విభజించవచ్చు.

3.2. ప్రేమ సంభాషణలు :

తల్లి నవమోసాలు మోసి కనిపెంచినా – తన ఆహారం సంగతే మరచి పక్షి తన బిడ్డ నోటికి ఆహారాన్ని అందించినా – పెయ్య దూడకు మొదలు పాలు ఇవ్వకుండా పాలు పితకాలని ప్రయత్నించే వారికి పాలు ఇవ్వనని ఆవు మొరాయించినా – నాలుకతో తన కూనను పులి నాకుతూ నెమరినా.. ఇవన్నీ వాటి ప్రేమను తెలియజేసే దుష్టాంతాలే! మాట నేర్చిన మనిషి నుంచి పశుపక్ష్యాదుల వరకు – సాధు జంతువు నుంచి క్రూర మృగం వరకు అన్నీ వాటి ప్రేమను వివిధ రూపాలలో, క్రియలలో వ్యక్తీకరిస్తుంటాయి. ప్రపంచం ప్రేమమయం. లోకం ఇంత సుందరంగా సమాజంలో మనుషులు సుఖశాంతులతో ఉన్నారు. వెలకట్టలేనిది ప్రేమ. అందుకే కాబోలు బసవరాజు అప్పారావుగారు 'ప్రేమించు సుఖముకై ప్రేమించు ముక్తికై ప్రేమించు ప్రేమకై" అన్నారు. ఆత్రేయగారి నాటకాలలో ప్రేమ సన్నివేశాలతో కూడిన సంభాషణలు తక్కువైనప్పటికీ అవి అద్భుతమైనవి. ఉదాహరణకి ఒక ప్రేమ సంభాషనను పరిశీలిద్దాం..

తొలిచూపులోనే మనసును పోగొట్టుకున్న అశ్వఘోషుడు తాను ప్రేమించే యువతి ప్రభ 'మహాకవి' అని సంబోధించగా " నన్నలా సంబోధించకు ప్రభా" అని అర్థిస్తాడు. అందుకు ఆమె " మరేమని పిలుచుకోను...?" అని అనగా "ఇంతకన్నా తీయని పిలుపు తెలిసే దాక ఏమీ అనకు" అని అశ్వఘోషుడు నాటికలో అశ్వఘోషుని పాత్ర ద్వారా అద్భుతంగా పలికిస్తారు ఆత్రేయ. ఆత్మీయమైన ఆ పిలుపు "ప్రియ". అందుకే ఆ తర్వాత ప్రభ చేత 'ప్రియా' అని పిలిపించుకొని " అబ్బ.. ఎంత తీయని పిలుపు" అని ఆ పిలుపులోని ప్రేమ మత్తుకు పరవశమైపోతాడు అశ్వఘోషుడు. ఇలా ఆత్రేయ ప్రేమ సంభాషణను పలికించారు.

3.3. సెంటిమెంటల్ సంభాషణలు :

హృదయంలో మోయలేని నిండైన కృతజ్ఞతభావాన్ని ప్రేమ పూర్వకంగా కరుణ రస్మాతక సన్నివేశాలలో కూడా

తీర్చుకొనడానికి మాట్లాడే మాటలు సెంటిమెంట్ సంభాషణలు. ఈ మాటలు అవతలివారికి బంధాలు వేస్తాయి.

(అ) 'అత్మార్పణ' అనే నాటికలో..

మూర్తి భార్య శ్యామ. క్షయ వ్యాధిగ్రస్తురాలు. మూర్తి రాధను ప్రేమిస్తుంటాడు. శ్యామ వైద్యం చేయించుకోవడానికి బెంగుళూరు పోయే ముందు తనతోపాటు రాధను కూడా తీసుకెళ్ళడానికి భర్తను కోరగా " శ్యామా, నన్ను దెప్పుతున్నావా?" అనగా " మిమ్మల్ని దెప్పితే నొప్పి నాకేగా" అని అతని భార్య శ్యామ అంటుంది. ఇలా సెంటిమెంట్‌గా మాట్లాడిస్తారు ఆత్రేయ.

(ఆ) 'తెరచిన కళ్ళు' అనే నాటికలో..

ఏ డాక్టర్ గారి వల్ల కంటి చూపు వచ్చిందో ఆ డాక్టర్ గారికే ప్రమాదవశాత్తు కంటిచూపు పోయిందని తెలిసి "డాక్టర్ గారూ, చీకట్లో వున్న జీవితాలకు వెలుగు చూపించారు.ఆనాడు. కాని యీనాడు మీకే అంతా చీకటైపోయింది. డాక్టర్‌గారూ యివిగో. ఇవి మీరిచ్చిన కళ్లు, మీకు మళ్లా కాళ్ళు రాగలిగితే వీటిని తీసుకోండి – ఆనందంగా యిచ్చేస్తాం తీసుకోండి. మీకు కళ్లొస్తే ప్రపంచానికంతా కళ్లొస్తాయి. తీసుకోండి డాక్టర్ గారూ!" అంటూ ఆ డాక్టర్ చేత కంటిచూపును పొందినవారు కృతజ్ఞతపూర్వకంగా ఋణం తీర్చుకోవాలనుకుంటారు. ఇలా సెంటిమెంట్ డైలాగ్స్‌ను ఆ పాత్రల నోట పలికించారు ఆత్రేయ.

3.4. హాస్య సంభాషణలు :

ఆత్రేయగారి నాటక సంభాషణలలో గాని, సినిమా సంభాషణలలో గాని 'హాస్యం' చాలా తక్కువ స్థాయిలో వుంటుంది. ఆత్రేయ సెటైర్‌నే హాస్యంగా వాడతారు. ఇలాంటి హాస్య సంభాషణలను ఆత్రేయ వారి నాటక సంభాషణలలో ఎలా రాశారో చూద్దాం !s

ఉదా : (అ) ఆత్రేయ సీరియస్ సన్నివేశంలో కూడా హాస్యాన్ని పుట్టించగలరు. అసలే డబ్బు లేక నానా చావు చచ్చే వాళ్ళని పెళ్ళి పేరుతో ఏవేవో చెప్పి పదివేలు కావాలంటూ గొంతెమ్మ కోర్కెలు అడిగే రామశాస్త్రిని చూసిన గోపి "శాస్త్రిగారూ! ఎక్కడున్నా ఒక బ్యాంకి చూడండి!" అని అనగా శాస్త్రి అమాయకంగా "దేనికి" అనేసరికి " అమావాస్య పూటగా బయల్దేరుదాం కొల్లగొట్టడానికి " (ఎన్.జి.వో.) అని అంటాడు గోపి.

(ఆ) పేరు మోసిన నేత్రవైద్యునిగా నిత్యం వైద్య సేవలోనే గడుపుతూ వుండే డాక్టర్‌తో అతని భార్య "మీకోసం చూసి కళ్లు కాయలు కాచిపోతున్నాయి" అనగా " కళ్ళు కాయలు కాచినా, పూలు పూసిన ఏం ఫర్వాలేదులే. ఇంత పెద్ద కళ్లడాక్టరు భార్యవు నీకేంటి. కలువ రేకుల్లాంటి కళ్ళు చేసిస్తా" (తెరచిన కళ్లు) అని అంటాడు. ఇలా ఒక నుడికారాన్ని తీసుకొని కళ్ళ డాక్టర్ ద్వారానే హాస్యం పుట్టించగలిగారు ఆత్రేయ.

(ఇ) పేకాట ఆడడం కోసం సార్జెంటును పిలిచి అతని కోసం ఎదురుచూసే భర్తను ఎందుకు పిలుస్తున్నట్లో అని అడగగా "నేను కాస్త నేర్చుకున్నానులే నిన్ను చూచి. ఏదో ఒకలాభం వుంటే గాని మనుషుల్తో పలకను. పలకరించను" అని భార్యను ఎగతాళి చేస్తూ ఆమె భర్త మాట్లాడగా "పేకాటలో అంత చవటాయేం అతను" (వరప్రసాదం) అని తన భర్తతో అన్నట్లు రాస్తారు ఆత్రేయ. దీన్ని బట్టి పేకాట ఆడడంలో తన భర్తకంటే సార్జెంజు ఎంత అధ్వాన్నమైన వ్యక్తోనని చెప్పకనే చెప్పి హాస్యాన్ని సృష్టించారు ఆత్రేయ.

(ఈ) మత దురహంకారులకు బలికానివ్వకుండా తనకు ఆశ్రయం కల్పించినందుకు కృతజ్ఞతాపూర్వకంగా..

"వత్సల : నసీం ! మీరు నిజంగా దేవతలు సుమా!

నసీం : బాగానే వుంది. ఇదా నువ్వు తీరిగ్గా కూర్చొని చేసిన ఆలోచన, మేమిట్లా వుండటం నీకేం యిష్టం లేనట్టుందే?

వత్సల : ఏం నసీం ఏమన్నాను ?

నసీం : దేవతలన్నావు. ఇంకేమనాలి. మమ్మల్ని అప్పుడే పంపేస్తున్నావీలోకం నుంచి! " (ఈనాడు) అని అంటుంది.

దేవతలు భూలోకంలో కాక స్వర్గంలో ఉంటారంటారు కదా! అక్కడికి పోవాలంటే ఈలోకంలో చనిపోతేనే కదా! ఈ భావనను బేస్ చేసుకొని ఆత్రేయ సున్నిత హాస్యాన్ని పండించారు. ఇలాంటి సున్నిత హాస్యలు ఆత్రేయ ఇతరులతో మాట్లాడే సందర్భరాలలో ఎన్నో జోక్స్ వేస్తూ ఉండేవారు. నాగార్జున సాగర్‌లోని తన పుట్టిన రోజుకు స్వయంగా ఆత్రేయ వచ్చిన ఆనందంలో " నా పుట్టిన రోజున గుడికి వెళ్ళడం అలవాటు. ఈరోజు దేవుడే నాకోసం దిగివస్తే యిక వెళ్ళడం ఎందుకు?" అనిన శ్రీలక్ష్మిని ఉద్దేశించి " ఏమ్మా నేనంత రాయిలా అనిపిస్తున్నానా". అని ఆత్రేయగారు అన్నారట. ఆత్రేయ ఈవిధంగా ప్రాక్టికల్ జోక్స్ వేయడంలో ఘనాపాలి.

ఇలాంటి హాస్య సంభాషణలు ఆత్రేయగారి నాటిక నాటకాలలో ఎన్నో చోటుచేసుకున్నాయి.

3.5. వ్యంగ్య సంభాషణలు :

ఆత్రేయగారు తన సంభాషణలలో హాస్యం కన్నా వ్యంగ్యాన్ని పోషించారు. ఇలాంటి వ్యంగ్య సంభాషణలను ఆత్రేయగారు ఎలా పోషించారో చూద్దాం.

(అ) ఓట్లు అడగడానికి వచ్చి తన గూర్చి గొప్పలు చెప్పుకుంటూ రంగయ్య " అప్పట్లో శలవులకొచ్చినప్పుడు చొక్కా గిక్కా అంతా లాగవతల పారేసి – గోచి బిగగట్టి పొలం మీద పనిచేసేవాణ్ణి. ఇప్పటికైనా సరే రోజుకొక్కసారి అట్టా సాయంత్రం పూటైనా పొలం వైపు వెళ్ళి రాకుంటే నాకు నిద్రపట్టదంటే నమ్ము' అని అనగా ' అవునవును. నాగి గుడిసె అటువైపేగా" (ఓటు నీకే) అంటూ రంగయ్య పరువును వ్యంగ్యమైన మాటల ద్వారా తీసివేస్తాడు సుబ్బన్న.

(ఆ) ఎన్.జి.వో.నాటకంలోని గోపి పాత్రకు సంబంధించిన ప్రతిమాటలను వ్యంగ్యంగా పలికించారు ఆత్రేయ. భయంకరమైన మురికి కాలువల మధ్య జీవించే గోపి వాళ్ళ యింటికి చేతిరుమాలుతో డాక్టర్ ముక్కు మూసుకొని వచ్చి 'అబ్బ ! హెలో హారిబుల్! ఇంకా మీరీయింట్లో కాపురం ఎలా వుంటున్నారో తెలియడం లేదు" అని అనగా "మాకు తెలిస్తేగా మీకు తెలియడానికి" అని గోపి పాత్ర చేత పలికిస్తారు ఆత్రేయ. అదేవిధముగా సంభాషణ సాగుతూ "యింటి ముందు మురుగు కాలువ మూయించమని ఎన్నిసార్లు చెప్పాను? మరీ ముక్కులు పగిలిపోతున్నాయి. నో..నో..ఏం లాభం లేదు" అని పలికే డాక్టర్ మాటలకు "ఎందుకు లేదండీ డాక్టర్‌గారూ? మురుగు కాలువ మూయిస్తే మాకు రోగాలెట్లా వస్తాయి? రోగాలు రాకుంటే డాక్టర్లేం కావాలి?" అని వ్యంగ్యంగా గోపి పాత్రద్వారా పలికిస్తారు ఆత్రేయ. ఇదే నాటకంలో భర్త 24 గంటలు ఆఫీసులోనే గడపటాన్ని ఉద్దేశించి " ఆయనకా ఆఫీసే పెళ్ళాం, బిడ్డలు" అని వ్యంగ్యంగా భార్యపాత్ర చేత పలికిస్తారు ఆత్రేయ.

అద్దెకి ఉండడానికి గోపి చూసొచ్చిన ఇల్లు గూర్చి చెప్తూ ఆ యింట్లో దయ్యం వుందని చెప్పగా భయపడే వదినను చూసి " అసలీ యింట్లో దయ్యం లేదనా నీ అభిప్రాయం? అన్నయ్యకు నెలకొకసారి కనిపిస్తుందట ఆ దయ్యం. ఆఫీసు నుంచి జీతం పట్టుకురాగానే వాకిట్లో హాజరు. దాంతో అన్నయ్యకు గుండెలు జారిపోతాయి." అని అద్దె వసూలు కోసం ఫస్టు కల్లా ఇంటిమీద పడే ఇంటి యజమానులకు గూర్చి గోపి పాత్రద్వార్యా వ్యంగ్యంగా పలికిస్తారు ఆత్రేయ. సామాన్యులు

పట్నంలో బ్రతకలేరు. సామాన్యులుండే ప్రతి అద్దె కొంప ఒక దయ్యం కొంపే అంటారు ఆత్రేయ. అందులోను ఎలాంటి దయ్యాలంటే " కార్లలో తిరిగే దయ్యాలు! లక్షలూ కోట్లూ బ్యాంకుల్లో దాచిపెట్టుకు చచ్చే దయ్యాలు! మాట్లాడే దయ్యాలు" అని ఇన్నిరకాల దయ్యాలున్నట్లు గోపి పాత్రద్వారా వ్యంగ్యంగా పలికిస్తారు ఆత్రేయ.

ఈవిధముగా ఆత్రేయగారు తన సంభాషణా రచనలో ఎన్నో వ్యంగ్య సంభాషణలను రాశారు.

3.6. భావగర్భిత సంభాషణలు :

ఆత్రేయగారు రాసిన ఒక్కో సంభాషణను పరిశీలిస్తే ఇంత భావం ఆత్రేయగారికి ఎలా కలిగింది అని ఆశ్చర్యం కలగక మానదు. అలా కలిగిన భావనను కూడా అందరికీ అర్థమయ్యేలా తేలికైన పదాలతో సందర్భానుగుణంగా సరి అయిన పాత్రల చేత పలికించగల ప్రతిభావంతులు ఆత్రేయ. ఇలాంటి సంభాషణలను కొన్నింటిని పరిశీలిద్దాం..

(అ) అవేశంలో తప్పు జరిగినందుకు బాధపడుతూ తిరుపతితో లిల్లీ " మగ్గాళ్లు పాపాలు చేస్తే ఎప్పుడో అనుభవిస్తారేమో – మా పాపాలు వెంటనే బయటపడిపోతాయి. మమ్మల్ని వెంటాడతాయి" (మనసూ–వయసు) అని అంటుంది. ఈ సంభాషణలో ఆత్రేయ ఎంత గంభీరమైన భావాన్ని వ్యక్తపరిచారో తెలుస్తుంది.

(ఆ) అహింసావాదులైన వారికి బయటపడినది బ్రిటిష్ వారే కాదు. ఆశోకచక్రవర్తి కూడా ఒకనాడు ఆ అహింసకి బయటపడినవాడే! హింసావాదలు చేతిలో వున్న ఆయుధం కంటే బలమైనది అహింసావాదుల చేతిలో ఉన్న 'అహింస' లేదా 'శాంతి' అనే ఆయుధం. శాంతిబోధనలు చేసి కళింగయుద్ధం పట్ల ప్రజలను విముఖులను చేసే ప్రేమానందునిని బంధించి అతన్ని శిక్షించమని అశోకుడు సమరానందునికి ఆజ్ఞాపిస్తుండగా "నిరాయుధులైన భిక్షువులంటే నీకెందుకు నాయనా అంత భయం?" అని ఆశోకసామ్రాట్ నాటకంలో ప్రేమానందుని చేత పలికిస్తారు ఆత్రేయ. అలా చిన్నవాక్యంలో అనంతమైన భావాన్ని భావగర్భితంగా పలికిస్తారు రచయిత.

(ఇ) మూడు రోజుల నుంచి తిండిలేకపోవడం వల్ల ఆకలితో మాడిపోయే వత్సల ఆకలిలేదనడం విని " అబద్దాలు ఎప్పట్నుంచి నేర్చావు?" అని నసీం ప్రశ్నించగా " అన్నం దొరికనప్పట్నుచి" (ఈనాడు) అని వత్సల సమాధానమిస్తుంది.

(ఈ) ఆకలితో అలమటించే వారికి తెలుసు ఆ ఆకలిబాధ ఏమిటో. కష్టపడి తిండి గింజలు పండించినా సాయంత్రానికి రెండు ముద్దలు వండుకుని తినేందుకు గింజలు లేనివాళ్ళకు తెలుసు అలా తమకి అన్నం లేకుండా దక్కకుండా చేసే వాళ్ళెవ్వరో. అందుకే ప్రభుత్వం ఏలే అధికారమే అలాంటి వాళ్ళకు వస్తే ఏమి చేస్తారనే విషయాన్ని వెంకయ్య పాత్ర చేత ఇలా పలికిస్తారు. " ఆకలి తెలిసినోళ్ళం మాకే గనక అధికారముంటే ఆకల్ని బతకినిస్తామా?" అని ఓటు నీకే అనే నాటికలో ఆత్రేయ పలికిస్తారు.

ఈవిధముగా ఒక సామాన్యమైన పాత్ర నోట అసమాన్యమైన ఒక గొప్ప ఆశయాన్ని పలికించడం ఆత్రేయకే సాధ్యం!

(ఎ) 'తెరచిన కళ్ళు' నాటికలో అందమైన భార్యను కనులారా చూసుకోకుండానే కళ్ళు పోగొట్టుకున్న తన భర్తను మంచి డాక్టర్‌కి చూపించగా కళ్లు వస్తాయి. అందుకు వారు డాక్టర్‌తో " మీకు ఆజన్మాంతం ఋణపడి వున్నాం. మీరు మాకాపురంలో దీపం వెలిగించారు" అని అనగా ఆ మాటలకు డాక్టర్ చేత ఆత్రేయ ఏమి పలికించారంటే "నిజమే నాయనా ఇంత అందమైన భార్య వుండి చూడ్డానికి కళ్ళు లేకపోవడం దురదృష్టమే – కాని కళ్ళు వచ్చిన తర్వాత ఇంతకంటే అందాలు కన్పిస్తుంటాయి. వాటి వెంబడి పడి ఆవిడని అన్యాయం చేయకు" అని పలికిస్తారు. సంభాషణ రచనలో మనం గమనించదగిన విషయమేమిటంటే..స్పష్టత. తాను చెప్పదల్చుకున్న విషయాన్ని రచయిత స్పష్టంగా,

సూటిగా, సందర్భానుగుణంగా, భావయుక్తంగా చెప్పడం. ఆత్రేయ గారు ఇక్కడ చేసింది కూడా అదే! పరిస్థితులకు అనుగుణంగా, స్వార్థభావంతో మార్చుకునే మనుష్యుల మనస్తత్వాలను గూర్చి ఆత్రేయ పలికిన మాటలు.

3.7. ప్రబోధాత్మక సంభాషణలు :

ఆత్రేయ గారి నాటిక నాటకాలలోని సంభాషణలలో అంతర్లీనంగా ప్రబోధాత్మకత వుంటుంది. అది కథాపరంగాగాని ఒక్కోసారి సూటిగా సంభాషణపరంగా కూడా వుంటుంది. ఉదాహరణకు కొన్నింటిని పరిశీలిద్దాం.

(అ) " ప్రపంచంలో జరిగే ప్రతిదానికి మనందరం బాధ్యులం. భాగస్వాములం. మనకేం సంబంధమని చేతులు కడుక్కోవడానికి చూడకండి.." అని చావకూడదు అనే నాటికలో పేషెంట్ పాత్ర ద్వారా ప్రబోధిస్తారు ఆత్రేయ.

(ఆ) ప్రతి ఒక్కరూ స్వార్థంతో తామొక్కరమే ఆనందంగా ఉండాలనుకొని అతనికున్న ప్రతిభను పదిమందికి ఉపయోగపడేలా వినియోగించడు కాని – మరి కొందరు ప్రతిభావిజ్ఞానాలను చూస్తూ వాటి ద్వారా ఆనందపడతాడు. అందుకే " మాయ " నాటికలో ఆత్రేయ ధరిత్రి పాత్ర ద్వారా.. ".. తోటి మానవక్షేమం కోసం తమ శక్తిని ప్రతిభను వినియోగిస్తూ బ్రతికే ప్రతి ఒక్కడికి యీ ప్రజాధరణ తప్పదు. ఈ ప్రజానురాగాన్ని పొందటం కన్నా ఆనందం ఏముంది?" అని అంటాడు.

(ఇ) ఆహార సమస్యకు ఒక రకంగా ప్రజలే కారణమని సైంటిఫిక్ ఆప్రోచ్‌తో ఆత్రేయ 'అంతర్యుద్ధం' నాటికలో చెప్పారు. సకాలంలో వర్షాలు లేక పంటలు పండక ఆహార సమస్య ఏర్పడుతుంది. ఇలా వర్షాలు పడకపోవడానికి కూడా ఎన్నో కారణాలు వున్నాయి. మానవుడు ఎక్కడ పచ్చదనాన్ని బ్రతకనిస్తున్నాడు. ఎక్కడ కనబడితే అక్కడ చెట్లు నరికి కలపతో ఇళ్ళు నిర్మిస్తుంటే! పచ్చదనం ప్రయోజనం తెలియనివాళ్ళకు ఆత్రేయ 'ఆవేశం' పాత్ర ద్వారా "ఎక్కడుంది తిండి? ప్రజలే కదూ మరి. వారి కర్మవాళ్లు అనుభవించాలి. చేయగలిగిందంతా చేస్తున్నాం. వనమహోత్సవం ఏర్పాటుచేయమని చెప్పు చూశారా? మరి మొన్న చెట్లు నాటి వర్షాలు రాలేదంటే ఎలా? కనీసం పదేళ్ళైన్నా కావద్దూ. కాస్త ఆగమను" అని పలికిస్తారు. మనమీనాడు నిర్లక్ష్యంగా ఉన్న చెట్లను నరికివేస్తున్నామే గాని దాని స్థానే ఎందరు మొక్కలు నాటుతున్నారు? సామాజిక అడవుల పెంపకం బాధ్యతను స్వచ్ఛందంగా ప్రజలను చేపట్టమని ఆత్రేయ ప్రబోధిస్తున్నారు.

(ఈ) మంచి చదువులు చదివినా నిరుద్యోగంతో బ్రతుకే ఒకపెద్ద సమస్యగా మారడంతో ఉద్యోగం కోసం ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ కూర్చునే వారినుద్దేశించి 'ఒక్క రూపాయి' నాటికలో ఒక సన్నివేశంలోని సంభాషణ ద్వారా ఇలాంటి వారికి కనువిప్పు కలిగేటట్లు ప్రబోధిస్తారు ఆత్రేయ. అది ఏమిటంటే –

" ఒక్క రూపాయి సంపాదించలేని వాళ్లు మీరేం పనికొస్తారు? పైగా పెద్ద చదువులు చదువుకున్నారట. చదువులు ఎందుకయ్యా మీ చదువులు తగలెయ్యనా" అని అద్దె కట్టనందుకు ఇంటి యజమాని మాట్లాడిన మాటలకు పౌరుషం వచ్చిన శివం ''ఆ మాట ఆ చదువులు నేర్పించిన స్కూళ్ళనడుగు, కాలేజీలనడుగు. విద్యాశాఖ మంత్రినడుగు.మమ్మల్నడుగుతవేం. చదువుకున్నాం. ఆస్తులు పాస్తులు అరగదీసుకున్నాం. ఆశలు పెంచుకున్నాం. ఉద్యోగాల కోసం అడ్డమైన వాళ్ళందరినీ అడిగాం. అడుగుతున్నాం. మమ్మల్ని ఏం చేయమంటావు? ఉద్యోగాలు దొరక్కపోతే మాదా తప్పు? అని తప్పు తమది కాదంటూ తప్పించుకునే మాటలు మాట్లాడే శివరాంలాంటి వారినుద్దేశించి " ఉద్యోగం ఉద్యోగం అని వూరెక్కపోతే ఏదన్నా పనిచేసి సంపాదించరాదాయేం? మీ కోసం ఉద్యోగాలు ఎక్కడి నుంచి పుట్టిస్తారు? ప్రపంచంలో అందరూ ఉద్యోగాలు చేసే బ్రతుకుతున్నారా? సోమరిపోతులు. ఒళ్లు వంచి పనిచేయలేక ఉద్యోగాలమీద పడి ఏడుస్తారు" అని ఇంటి యజమాని పాత్ర ద్వారా నిరుద్యోగ యువకులకు ప్రభోదిస్తాడు. ఇప్పటి

సమాజాన్ని వాస్తవిక దృష్టితో ఒకసారి పరిశీలిస్తే నిజం మనకే తెలుస్తుంది. ఆత్రేయగారి మాటల్లో పొల్లంతైన తప్పు లేదని తెలుస్తుంది. టాటా బిర్లాల ప్రారంభ జీవితమేంటి? ఇలా ఎందరో ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని పైకెదిగినవాళ్ళే.

స్వతంత్ర్య భారతదేశంగా మనదేశం రూపొందిన దశలో బ్రిటిష్ ఉద్యోగుల స్థానే అనేకమంది భారతీయులను ఉద్యోగస్వామ్యంలో నామమాత్రం చదువుకున్నా కొంతమందికి అక్షరజ్ఞానం లేకపోయినా చదువుకు తగ్గ ఉద్యోగాలు దొరికాయి. బ్రతిమలాడి ఉద్యోగాలు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. స్వాతంత్ర్య కాలం నాటికి అక్షరాస్యుల శాతం అతి స్వల్పంగా ఉన్న కారణంగా, ప్రజలలో నాటుకుపోయిన మూఢవిశ్వాసం, అజ్ఞానాన్ని పారదోలడానికి ప్రభుత్వం విద్యాభివృద్ధిని చేపట్టింది ప్రధానంగా. కాని ఈనాడు ప్రజల భావన ఎలా ఉందంటే చదివిన ప్రతిఒక్కరికి ప్రభుత్వం విధిగా ఉద్యోగవకాశాన్ని కల్పించాలని, కల్పిస్తుందనే భ్రమలో వున్నారు. చదివిన చదువుతో బయటి ప్రపంచంలోకి పోయి బ్రతకటానికి పనికిరాకపోగా ఎలాంటి చేతివృత్తి విద్యా కోర్సు సాంకేతిక విద్యలు లేవు. ప్రభుత్వం వీటిని ప్రోత్సహించిన నాడు విద్యా వ్యవస్థ ఒక కొత్త రూపాన్ని సంతరించుకొని యువతని వారి కాళ్ళమీద వారే నిలబడి బ్రతకగలిగేటట్లు చేయగలదు. చదివిన చదువుకు సరైన ఉద్యోగం రాక ఏళ్ళ తరబడి ఉద్యోగం కోసం ఏళ్ళు పైబడుతున్నా ఈ నిరుద్యోగ భారతదేశంలో ఎదురుచూసేకన్నా వారికి అభిరుచి ఉన్న కళలలో శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటూ జీవనోపాధిని కల్పించుకోవాలే గాని శివంలా ఎదురుచూడకూడదంటారు. అందుకే " మనం ఏమీ చేతకాని చవటలమట్రా గుమస్తా గిరికి తప్ప యింకదేనికి పనికిరాని బడుద్దాయిలమా? కాలేజిలో చదివిన జామెట్రీ, జాగ్రఫీ తప్ప ఇంకేమి తెలియదా మనకు. ఎవరి దగ్గర బానిస చాకిరీ చేయడం తప్ప వేరేవిధముగా బతకలేమా మనం." అని వేణుపాత్ర చేత పలికిస్తారు ఆత్రేయ. ఈ మార్పు ప్రతి ఒక్క నిరుద్యోగిలో రావాలని ఆత్రేయ ఆకాంక్ష.

రచయిత చెప్పాలనుకున్న విషయాన్ని ప్రేక్షకులు అర్థం చేసుకొని అనుసరించేలా ప్రభావితం చేసే ప్రక్రియ ఈ నాటకరంగమేనని ఆత్రేయకు తెలిసినా తన ప్రబోధాత్మక సంభాషణల ద్వారా ప్రేక్షకులను, పాఠకులను మరింతగా ఆలోచింపజేసి తీర్చిదిద్దాలనుకున్నవారు ఆత్రేయ. కనుకనే వారి నాటిక – సినిమా సంభాషణలలో ఎన్నో ప్రబోధాత్మక సంభాషణలు చోటు చేసుకొని వుంటాయి.

3.6. నిర్వచనాత్మక సంభాషణలు :

ఆత్రేయ తన రచనలో అక్కడక్కడ ఒక స్టేట్‌మెంట్‌లాగ పాత్రల చేత సంభాషణలను పలికిస్తారు. ఇలాంటివి సినిమా సంభాషణలలో చాలా కనిపిస్తాయి. నాటిక నాటక సాహిత్యంలో ఇలాంటి సంభాషణలు ఎలా రాశారో చూద్దాం.

(ఆ) బ్రతుకు : " రూపాయలూ, అణాలూ, పైసల్రా బ్రదర్ బ్రతుకంటే వేరింకేం కాదు!" అని ఎన్.జీ.వో.నాటకంలో రంగనాధం పాత్ర ద్వారా పలికిస్తారు. మనిషి నిద్ర 'లేచింది' మొదలు నిద్ర'పోయే' వరకు ప్రాణిలో వున్న ప్రాణాన్ని నిలబెట్టేది, నిలబెట్టగలిగేది ఈ డబ్బే. అందునా మధ్యతరగతి వాడి స్థితి ఏమిటంటే అణాలు పైసలు కూడా ఎంతో విలువైనవి.

(ఆ) నటన – జీవితం : " మాటలు వప్పిజెప్పితే నటనమవుతుంది. మనసును నచ్చజెప్పితే జీవితమవుతుంది' అని అశ్వఘోషుడు నాటికలో అశ్వఘోషుడు ఊర్వశి వియోరగీతాన్ని నాటకంగా రాయడమే గాక అందులో పురూరవ పాత్రను వేయడానికి అంగీకరించినట్లు అశ్వఘోషుని పాత్ర ద్వారా పలికిస్తారు.

(ఇ) జీవితం : " ఈ అనంతజీవకోటి నుండి తీసుకున్న అప్పు జీవితం" అని గౌతమబుద్ధుడు నాటకంలో పలికిస్తారు ఆత్రేయ.

(ఈ) మరణం : " ప్రపంచంలో ప్రతి జీవి నాశనం కావలసిందే. నా దగ్గర చేరటమే మరణమంటారు" అని గౌతమబుద్ధ నాటకంలో మృత్యు పాత్రచేత ఆత్రేయ పలికిస్తారు.

(ఎ) హింస : " ప్రతి ప్రాణికి జీవించేందుకు హక్కు వుంది. ఆ హక్కును లాక్కోవటమే హింస" అని గౌతమబుద్ధ నాటకంలో ఆత్రేయ పలికిస్తారు.

(ఏ) ఆవేశం : " నిరాశకు దోపిడికి దొంగతనానికి హత్యలకు ఆత్మహత్యలకు అన్నిటికీ కారణభూతమైనదే ఆవేశం" అని అంతర్యుద్ధం నాటికలో పలికిస్తారు ఆత్రేయ.

ఈవిధముగా ఆత్రేయగారు వారి నాటికలలో నాటకాలలో నిర్వచనాత్మక సంభాషణలనెన్నింటినో వివిధ పాత్రల నోట పలికించారు. తిరుగులేని స్టేట్‌మెంట్స్‌లా ఉంటాయి ఈ సంభాషణలు. ఇవీ సంభాషణలలో ఒక భాగంగానే, వాక్యంగానే ఒదిగిపోయి సంభాషణా మొత్తానికి వన్నెని, విలువని కల్పిస్తాయి ఈ సంభాషణలు. ఇవీ సంభాషణలలో ఒక భాగంగానే, వాక్యంగానే ఒదిగిపోయి సంభాషనా మొత్తానికి వన్నెని, విలువని కల్పిస్తాయి. ఈవిధమైన సంభాషణలు రచయితకు సంబంధించిన జీవితానుభవాన్ని పరిశీలనాశక్తిని ప్రతిబింబిస్తాయి.

3.9. ఆత్రేయ సంభాషణలలో వేదాంతం :

ఆత్రేయగారు తన నాటక, నాటిక, సినిమా సంభాషణలలో మరియు సినిమా పాటలలో ఎన్నో వేదాంత భావాలను రాశారు. ఆత్రేయగారికి వేదాంత ధోరణి కాస్త ఎక్కువ. అయితే ఈ నాటక సాహిత్యంలోని సంభాషణలలో వేదాంతభావాలు ఎలా పలికించారో పరిశీలిద్దాం !

జీవమున్న ప్రతిదీ చావక తప్పదు! అది చెట్టుగాని, జంతువుగాని, మనిషిగాని, ఏదైనా సరే ! 'గౌతమ బుద్ధ' నాటకంలో – " ఇంత బాగుందే యీ పువ్వు, ఎందుకు వాడిపోవాలి? వాడిపోకుండా అలాగే వుంటే ఎంత హాయిగా ఉండదు" అని అమాయకంగా అడిగే మనుమరాలి మాటలకు ఆ పిల్ల తాత " ఈ పూవ్వేమిటమ్మా? ఈలా ఎన్ని పూలు రాలిపోయాయి. ఎన్ని మొగ్గలు తేరి పూలుగా వికసించినవి. ఓ! నా కళ్ళముందే ఎన్నో లెక్కలేనన్ని అది కాలచక్రం తల్లీ – దాన్ని అనేవాళ్ళెవరు? " అని పలికిస్తారు ఆత్రేయ. పువ్వుతో మనిషిని పోల్చారు. మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. ఎందరూ వాడిపోయిన పువ్వులా ముసలితనంతో మరణించడం లేదు! మరెందరు మొగ్గల్లాగా ఉండి వికసించినట్లు పసికందులు మునుముందు వాటిలా రాలిపోవడానికి ఎదిగినారు–ఎదుగుతున్నారు. ఈ కాలచక్ర పరిభ్రమణంలో జనన మరణాలు అనంతాలు. నిత్య ప్రహసనం. ఇలాంటి వేదాంతాన్ని ప్రతీకాత్మంగా పలికించారు ఆత్రేయ. రచయిత అలా చెప్పడం వల్ల పసిపిల్లకి ఏమర్థమవుతుంది అని ఆత్రేయను విమర్శ చేయవచ్చు! కాని అలా విమర్శ చేయకుండా ఉండడానికే ఆ తర్వాత సంభాషణలో " వెఱ్ఱితల్లి, నీకర్థం కాదు లేమ్మా" అని ఆ తాతపాత్ర ద్వారా పలికిస్తారు ఆత్రేయ.

ఇంటి అద్దెను వసూలు చేసుకోవడానికి నటుడు, కవి అయిన రజనీ దగ్గరకు నాయుడు గారొచ్చినప్పుడు కవి స్థితిని తెలియజేయడానికి ఆత్రేయ రాసిన సంభాషణ ఇది. ఎన్నాళ్లు తిరిగినా ఇంటి అద్దె ఇవ్వని – ఇవ్వలేని కవిని చూసి "ఇక్క వూర్కోను" అని యింటి యజమాని విరుచుకపడబోగా – " నాదగ్గర పైసా లేదు.చెల్లించాలనే కోర్కె మాత్రం మనస్ఫూర్తిగా ఉంది. కానీ నాయనా ! వెధవ మానవజన్మ ఏమంటావ్ ? జుట్టు కాస్తా ఆ దేవుడి చేతిలో పెట్టి మనం ఎంత గింజుకుంటే మాత్రం ఏం సాగుతుంది? వాడిష్ట ప్రకారం ఆడాల్సిందే కదూ!" అని కవి అంటుండగా " ఇదిగో, యీ వేదాంతం కట్టిపెట్టు. డబ్బెగ్గొట్టటానికి మంచి వేదాంతమే నేర్చిపెట్టావు. ఖాళీ అన్నా చెయ్యవేమయ్యా ! నా పాలిట శనిలాగా పట్టుకున్నావు పదేళ్ళ నుంచి, అద్దె యివ్వకపోతే పోయింది. ఇల్లు ఖాళీ చేయకూడదూ ? " అని ప్రాధేయపడే యింటి యజమానితో కవి " అది మాత్రం నా చేతుల్లో వుందా నాయుడూ!" (మంచం మీద చావడానికి సిద్ధంగా ఉన్న

అతని భార్యను చూపించి) ఇదిగో నా పెళ్ళాం సిద్ధంగా వుంది ఖాళీచేయడానికి ఇవ్వాళో రేపో అది వెళ్ళిపోతుంది కొంచెం ఓపికపట్టు. ఒకరొకరుగా ఖాళీచేస్తాం. నిజంగా ఖాళీ చేస్తాం. నా మాటనమ్ము! నీ యిల్లేకాదు. ఈ ప్రపంచాన్నే ఖాళీ చేసి వెళ్తాం. మమ్మల్నేం చేయమంటావు చెప్పు! చావడానికి కూడా మానవునికి అధికారం లేదు.మానవుడు వట్టి చవట! కనుకనే దేవుడికన్ని అధికారాలిచ్చేసి వేలు కోరుక్కుంటున్నాడు" అని కవి పలికే మాటలకు వెర్రెక్కి కోపంతో మాట్లాడని యింటి యజమానితో తిరిగి ఆ కవి ఇలా అంటాడు. అన్నీ సిద్ధం చేసుకున్నాను. మూటా ముల్లే ఏమీ లేదు. ఎందుచేతనంటే నా బ్రతుకులో నేను చేసిన పుణ్యాలేవి లేవు. నేను మోసుకొని పోవడానికి.. ఇక పాపాలంటావా! అది మోసుకొచ్చే బాధ్యత యమకింకరులది – నాదికాదు. కనుక నేను నా వరకు నేను – ఏ క్షణాన అయినా ప్రయాణానికి సిద్ధం" (చస్తే ఏం) అంటాడు. ఈ సంభాషణలలోని కవి యొక్క నిస్సహాయతను, నిటూర్పును, కష్టాలను, కన్నీళ్లను అతని దయనీయ పరిస్థితి చూపించారు రచయిత ఆత్రేయ. కష్టాల్లోనే కదా వేదాంతం వచ్చేది అందుకే వేదాంత ధోరణిలో ఆ పాత్ర చేత సంభాషణలను పలికించారు ఆత్రేయ.

ఆర్థిక బాధలకు విసిగి వేసారి ఎప్పుడూ చస్తా చస్తా అని జపంలా అంటూ ఉండే భర్తని భార్య వారించగా "పిచ్చిదానా! ఏదో ఒకనాడు చావక తప్పుతుందా" అని అంటూ " అలా జపం చేస్తుంటే చావంటే భయం పోతుంది. అదీగాక మనం ఇప్పుడు బ్రతుకుతున్నామనేగా నువ్వనుకోవడం ? కేవలం పొరపాటు, చూశావ్ ఈ భూమిమీద పడ్డ క్షణం నుంచి చావడం మొదలుపెడతాం ప్రతీక్షణానికి కొంత చస్తుంటాం. అలా చావడం ఆగిపోవడాన్నే మనం సామాన్యంగా చావటం. నిజంగా ఆ క్షణాన్నుంచే మనం బ్రతకడం మొదలుపెడతాం" అని ఎన్.జి.వో. నాటకంలో రంగనాధం అతని భార్యతో చెప్పినట్లు పలికిస్తారు ఆత్రేయ.

ఆత్రేయగారి ఆలోచన తార్కింగా వుంది. ఆ తార్కికతలో కూడా వేదాంత భావనా ప్రభావం కనిపిస్తుంది. ఆత్రేయగారన్నట్లు.. ఈభూమి మీద పడ్డ క్షణం నుంచి చావడం మొదలుపెడతాం. ఏవిధంగానంటే క్షణాలు గడిచేకొద్ది మృత్యువును ఏ ప్రాణైనా సమీపిస్తుండటమే కాని ఆయుర్ధాయం పెరగడం కాదు కదా? ఎప్పుడైతే చనిపోతామో ఆ చనిపోయిన క్షణం నుంచి బ్రతుకుతున్నట్లంటారు ఆత్రేయ. ఎంత గొప్ప తలంపు. ఈ మాటల్ని జాగ్రత్తగా ఆలోచిస్తే వారు చెప్పింది 100% నగ్నసత్యం అనిపించక మానదు. నగ్నసత్యం అనిపించేదే వేదాంతం. వేదాంతమే నగ్నసత్యం.

ఈ విధంగా ఆత్రేయ తన వేదాంతంలోని వాస్తవిక ప్రపంచాన్ని, మానవ జీవితాలను వారి నాటక సాహిత్యంలోని సంభాషణ రూపంలో పాఠకులకు, ప్రేక్షకులకు చూపించారు.

3.10. తార్కిక సంభాషణలు :

ఆత్రేయగారు తన నాటక సాహిత్యంలోని సంభాషణలలో ఒక్కోచోట తార్కికంగా ఆలోచించి రాసిన పద్ధతి కన్పిస్తుంది.

సాధారణంగా మనం మాట్లాడుకునే మాటల్లో దాగిన పొరపాటును ఆత్రేయగారు లాజికల్‌గా ఆలోచించి తప్పు పట్టేస్తారు. " ఎవడికి వాడు ఎదుటివాడు అన్యాయం చేసే పైకొచ్చాడనుకుంటే నిజంగా ఎవరు న్యాయం చేస్తున్నట్టు. ఎవన్యాయం చేస్తున్నట్టు!" అని భయం నాటకంలో ముసలయ్యపాత్ర ద్వారా మనల్ని ప్రశ్నిస్తారు. మనకి మనమే మంచి వాళ్ళమనుకుంటూ ఫలానోడు నన్ను అన్యాయం చేస్తున్నాడు అని అందరూ అలాగే అనుకుంటే.. ఆత్రేయగారు ఇలా ఆలోచించి అడగడంలో తప్పే లేదు.

అదే నాటకంలో ఆత్రేయ అకౌంటెంట్ పాత్ర ద్వారా గొప్ప మాటలని పలికిస్తారు. రేయింబవళ్లు కంపెనీలో జరిగే లావాదేవీల గురించి రాసి రాసి విసిగిపోయి " ఎవడో సంపాదించి ఎవరో అనుభవించే ఈ ఐశ్వర్యానికి ఖర్చూ, జమా, రాస్తూ ఎంతకాలం? అందులో అన్నీ తప్పుడు లెక్కలు, అంతా మోసం. ఏమిటీ పాపం ! ఎవరిదీ పాపం ! నాదేనా !

నాదెందుక్కావాలి నేనేమన్నా అనుభవిస్తున్నానా ఈ డబ్బు. అనుభవించకపోతే మాత్రం పాపం పాపమే. నేను చేస్తున్నదంతా పాపమే " అని అకౌంటెంట్ తార్కింగా ఆలోచించి మాట్లాడినట్లు ఆత్రేయ రాస్తాడు.

ఒక కంపెనీలో పనిచేసే అకౌంటెంట్ చేతుల మీద కోట్లాది రూపాయల లావాదేవీ జరుగుతూ వుంటుంది. యజమాని ఆజ్ఞననుసరించి లాభాలను నష్టాలుగా చూపిస్తూ లెక్కలు తయారు చేయాలి. అలా చేయడం అతని విధి. నిర్వహణ. అయినా ఆ పాపపు పనిలో పరోక్షంగా అతను సహకరించిన పాపి. పోని అలా చేసినందుకు జీతానికి మించిన ప్రతిఫలం యజమాని నుంచి ఏమైనా పొందుతున్నాడా అంటే.. అది పాపపు ఫలితమే! మరి అటువంటప్పుడు తాను చేసేదేమిటో అనే ఆలోచనలు ప్రశ్నలుగా ప్రశ్నిస్తాయి. ఈవిధమైనటువంటి ఆలోచనతో నాటకంలో ఆ సన్నివేశానికి ఆత్రేయ ఆ పాత్ర మాటల ద్వారా ఆ మానసిక స్థితిని, సంఘర్షణను సంభాషణా రూపంలో కల్పించడం అద్వితీయం.

3.11 వర్ణనాత్మక – కవితాత్మక – ప్రతీకాత్మక సంభాషణలు :

ఆత్రేయ తన సంభాషణలలో కొన్ని వర్ణనా ప్రధానంగా కొన్ని కవితాత్మకంగా మరకొన్ని ప్రతీకాత్మంగా రాశారు. ఆత్రేయ గొప్ప భావకుడు. కనుక వారు ఏవిధంగా ఈ సంభాషణలు రాశారో పరిశీలిద్దాం!

'గౌతమబుద్ధ' నాటకంలో ఒకటవ దృశ్యంలోని మొదటి సంఘటనలో కొందరు చీకటిలో మాట్లాడుకునే సంభాషణలో వర్ణనాత్మక ధోరణులు బాగా కన్పిస్తాయి. కొంత ప్రతీకాత్మకత కూడా కన్పిస్తుంది. ఇహపరాలనే యుద్ధం వల్ల మనుష్యుల్ని ఆవహించిన చీకటే అశాంతి! ఆ నిర్మానుష్యమైన కలిక చీకటి గూర్చి " భూమ్యాకాశాలు రెండూ ఏదో సంధి చేసుకుంటున్నట్లుంది" అని చీకటిమయమైన జీవితాన్ని గూర్చి ఆవేదనతో వెలుగు కోసం ఆశగా ఎదురుచూసే మనిషిగా ఒక పాత్ర చేత పలికించారు ఆత్రేయ. ఈ ఇహపరమైన సంగ్రామంలో రోగాలతో – రొప్పులతో కష్టనష్టాలతో, నిరాశ–నిట్టూర్పులతో, మరణాలతో నేలకొరిగిన వారి గూర్చి వారి బంధువులు రోదించే ఆ రోదనను కీచురాళ్ల శబ్దంతో పోల్చి " ఇవిగో సంగ్రామంలో తెగిన యోధుల బంధుతతి ఏడ్పుల లాగున్నవి ఆ రాళ్లలో నుంచి వచ్చే నిశ్శబ్ద శబ్దాలు" అని మరోపాత్ర చేత పలికిస్తారు ఆత్రేయ.

మనిషి ఇహలోక సుఖాల కోసం ఎన్నో కష్టాలను ఆశలతో కొని తెచ్చుకొని ఆశాంతి జీవితాన్ని చేసుకుంటాడు. ఈ అశాంతి జీవితానికి కారణం ఇదని చెప్పలేని – తెలియని ఆవేదన దాగి వుంటుంది. మన చుట్టూ అన్నీ వున్నా మన కోసం కష్టపడి చస్తూ మనల్ని బ్రతికిస్తున్నా మనం ఆనందంగా ప్రశాంతంగా బ్రతకలేకపోతున్నాం. ఇలాంటి భావనలను వెల్లడించేందుకు 'ఆకలి' అంటూ అరిచే ఒక పాత్ర మాటలకి "కాదు, ఆకలి కాదు. భూమి పంటలు వెల్లడించేందుకు 'ఆకలి' అంటూ అరిచే ఒక పాత్ర మాటలకి " కాదు. ఆకలి కాదు. భూమి పంటడు పండేందుకు మనం పెట్టే బాధలన్నీ సహిస్తూనే వుంది. పూలు పండ్లు పండేందుకు రాలిపోతూనే వున్నవి. మనకు వాననిచ్చేందుకు మబ్బులు దూర ప్రయణాలు సాగిస్తూనే వున్నవి. ఇంత వుండీ ఏమిటో మంట – ఎందుకో. ఆకలి కాదనుకొంటాను" అని మరో పాత్ర ద్వారా పలికిస్తారు. ఈ సంభాషణలో ప్రకృతిని ఆత్రేయ ఎంత గొప్పగా అర్థం చేసుకున్నారో తెలుస్తుంది. చెట్టు మనకు ఫలాలు అందించడానికి తన సొగసైన పూతను రాల్చి పండును చేసి పండించి మనకిస్తుంది. అలాగే ఈ చెట్టు ఇన్ని చేయడానికి కావాల్సిన నీటిని ఇవ్వడానికి మేఘాలు వర్షాన్ని కురిపించేందుకు వర్షించే స్థలాలకు ప్రయాణిస్తూ వుంటాయి. ఈవిధముగా ఆత్రేయ సంభాషణలని అద్భుతంగా రాశారు.

గౌతమబుద్ధ నాటకంలోని రెండవ రంగంలో తన కుమారుడు సిద్ధార్థుడు కిటికీలో నుంచి ప్రకృతిని పరిశీలిస్తున్నప్పుడు అతన్ని ఆకర్షించిన దృశ్యమేనైనా ఉంటే చెప్పమన్నరాజు ప్రశ్నకు మంత్రి – " నీలి ఆకాశాన్నంతా రక్తకాంతులతో నింపి పడమటి కొండలలోకి సన్మనిస్తున్న సూర్యుడు, కలకల అంటూ అతన్ని సాగనంపిస్తూన్న పక్షులు, సరస్సులో

ముడుచుకుంటున్న కమలాలను చూచి విప్పారని ముసిముసి నవ్వులు నవ్వుతున్న కలువలు.. " మొదలైన ఆకర్షిస్తున్నట్లు చెబుతాడు. ఈ సంభాషణలో మనకు సీనరి కనిపిస్తుంది. పదాలలో గొప్ప భావం పొదగబడి వుంది. ఎంత అద్భుతమైన ఆలోచన ఆత్రేయది. సూర్యాస్తమయాన ఆకాశం ఎర్రబడుతూ సూర్యుడు కనుమరుగైపోతాడు. పక్షులు ఆ సమయానికి కిలకిలమంటూ వాటి గూటికి చేరుకోవడానికి వెనుదిరిగి వస్తుంటాయి. సూర్యోదయానికి విచ్చుకున్న కమలాలు ఎప్పుడైతే సూర్యుడు కనుమరుగైపోతున్నాడో చిన్నబోతాయి. ఎందుకంటే.. ఇలాంటి కమలాలలను చూసే కలువలు విరిసీ విరియని పువ్వులా ముసిముసి నవ్వులు నవ్వుకుంటాయట. ఎందుకంటే చంద్రుడు వచ్చి తమను వికసింపజేసే సమయం కొద్దిలోనే వున్నదని. ఇలా అస్తమించే సూర్యుడ్ని సన్యాసిగా–అలా వెళ్ళే వానిని పక్షులు సాగనంపి వస్తున్నట్లుగా గొప్ప భావంతో, పరిశీలనాత్మక దృష్టితో రాశారు ఆత్రేయ.

ఆత్రేయగారు అశోక్‌సమ్రాట్‌తో " చల్లని వెన్నెలకై కళ్ళగిప్పించిన కోరాలలా ప్రజలు శాంతికై పరితపిస్తున్నారు" అని సమరానందుని పాత్ర ద్వారా అలంకారిగా పలికిస్తారు ఆత్రేయ. అదేవిధముగా " పండు వెన్నెల పిండారబోసినట్టు విశ్వమంతా వెల్లివిరిసింది" అంటూ అశ్వఘోషుడు నాటికలో వ్యాఖ్యాత చేత పున్నమి రేయిని వర్ణింపజేస్తారు ఆత్రేయ. 'మనసూ–వయసు' నాటికలో పెళ్ళికి ఏర్పాటు చేసిన స్వాగతంలో బోర్డు గూర్చి తిరుపతి పంతులుకు చెప్పే మాటలను ఆత్రేయ ఎలా రాశారంటే " మంచి అందమైన ఆడది – కన్ను గీటినట్టే వుంటుంది" అలాగే, కాపలావానిపీదం' నాటికలో తన కుమారుడు పెళ్ళినాడు విద్యుత్‌దీపాలు " నిద్రలేని వాని కళ్ళలాగా ఎర్రగా ఉండాలి దీపాలు" అని అలంకారికంగా వర్తకుడు అంటున్నట్లు పలికించారు ఆత్రేయ.

'కాపలావానిదీపం' నాటికలో మరుసటి దినం ఉరికంబమెక్కవలసిన ఖైదీ అయిన కవి చేత " ఈరాత్రి ఎంత అందంగా వుంది! ఆకాశమంతా చుక్కలు – స్వచ్ఛమైన చుక్కలు – ప్రేయసి కన్నీటి చుక్కలు" అని కవితాత్మకంగా పలికిస్తారు ఆత్రేయ. గౌతమబుద్ధ నాటకం ఒకదృశ్యంలోని రెండవ సంఘటనలో 'స్వార్థం' పాత్ర చేత మాట్లాడించే మాటలను ఆత్రేయ ప్రతీకాత్మకంగా పలికించారు. మానవులను పక్షులుగా ఇహలోక సుఖాలను, ఆశలను, అనుబంధాలను పంజరంగా సంభాషణా రూపంలో ఏవిధంగా ప్రతీకాత్మక ధోరణిలో పలికించారో పరికిద్దాం!

" ఆ పక్షుల కిచకిచలు విన్నావా? ఎలా రెక్కలు కొట్టుకుంటున్నవో! ఎదుటి పక్షిని మోసం చేసి తానే సుఖంగా వుండాలని ప్రతి పక్షి మనం పెట్టిన పంజరంలో తానుగా చేరింది" అని ఆత్రేయ ప్రతీకాత్మంగా సంభాషణను రాశారు. ప్రతి మనిషి స్వార్థంతో ఎదుటివాడికన్నా సుఖంగా మంచి హోదాతో హాయిగా బ్రతకాలని అందుకోసం ఏదో ఒకరూపంలో – మార్గంలో ఎదుటివాడిని మోసం చేసి సుఖపడాలని అక్రమమైన మార్గాలను అనుసరిస్తూ ఉంటారని ఆత్రేయ అంటారు. ఈ పనులన్నింటికి మూలం ఆశ. ఆశ అనే పంజరం, స్వార్థమనే పంజరం, ఈ ఆశలు నెరవేరకపోతే ప్రాణాలు పోయే పక్షిలా ఆ ఆశల పంజరంలోనే దు:ఖంతో నిరాశతో నిస్పృహతో విలవిలలాడిపోతు గిలగిలకొట్టుకొని చస్తూ బతుకుతూ జీవిస్తుంటాడు ఈ మనిషి.

ఆత్రేయ గౌతమబుద్ధ నాటకంలోని సంభాషణల ముందు పాత్రల పేర్లు ఇవ్వక ప్రయోగం చేసిన కొన్ని సంభాషణలను పరిశీలిస్తే ఆ సంభాషణలలో మనకు అక్కడక్కడ 'క్లూ' ఇచ్చారు. ఉదా : " స్వార్థం! నీవాలా.." అనే సంభాషణను పరిశీలిస్తే ఆ సంభాషణకు ముందు " ఇంతకూ నా ప్రతిభే కారణమని.." అని ఉన్న సంభాషణ స్వార్థం పాత్రదని తెలుస్తుంది. అలాగే " అసత్యం! ఆ వంక చూచి.." అనే 'హింస' పాత్ర సంభాషణ తర్వాత " ఆ వింత చూడండి ఎలాగుందో.." అనే సంభాషణలు అసత్యం ప్రాతవేనని అర్థమవుతుంది.

ఈవిధముగా ఆత్రేయగారు తన నాటక సాహిత్యంలో వర్ణనాత్మక, కవితాత్మక, ప్రతీకాత్మక భావాలతో సంభాషణలను

రమ్యంగా రచించి నాటకాన్ని రసవత్తరంగా నడిచేలా రూపకల్పనా చేశారు.

3.12. స్వ సంభాషణలు :

ఆత్రేయ నాటక సంభాషణలలో వారి ఆలోచనలు, అభిప్రాయాలకు సంబంధించిన విషయాలను స్పష్టంగా ఒకోపాత్ర నోట సూటిగా పలికించారు. ఇలాంటి సంభాషణలను స్వసంభాషణలని అనవచ్చు.

ఆరు రోజుల నుంచి అన్నం లేక ఆకలితో ఉన్న వేణు బీడి కాలుస్తానంటే – బీడి కాలిస్తే గుండె ఆరిపోయి పేగులు మాడిపోతాయి అని జగ్గు వారిస్తే అందుకు వేణు "గుండెలారి పేగులు మాడిపోతే చస్తాం! చస్తే సమస్యే లేదు" అని సీరియస్‌గా అనగా " ఒరే వేణూ, నువ్వు ఆత్రేయ నాటకాలు చదివావట్రా! అయినదానికీ, కాని దానికి చస్తా చస్తానంటావేమిట్రా " అని జగ్గు అనగా " ఆ మాట అనడానికి ఆత్రేయ కావాలా ఏంటి? మనం రోజుకు పదిసార్లు అనేది. అనుకునేదే రాశాడు. ఆయన గొప్పతనంద ఏమీ లేదు" అని ఒక్కరూపాయి నాటికలో వేణు పాత్ర ద్వారా ఆత్రేయ పలికిస్తారు. రచయితలైన వారు సామాజిక నేపథ్యంననుసరించి రచనలు చేయాల్సి వుంటుంది. అలా చేసినవారే ఆత్రేయ. అలా రచన చేసి గొప్పనాటక రచయితగా పేరు పొందిన ఆత్రేయే తనను తాను తగ్గించుకుని చెప్పుకున్నారు.

'కప్పలు' నాటకంలో కూడా ఇన్‌స్పెక్టర్ పాత్ర ద్వారా ఆత్రేయగారు తన గోత్రాన్ని చెప్పుకున్నారు. పంకజం దొంగతనం చేయగా పట్టుబడే సమయంలో ఇన్‌స్పెక్టర్‌ని బురిడీ కొట్టించి తప్పించుకోవాలని అతడ్ని పొగిడి " ఏం గోత్రమో!" అని ప్రశ్నించగా " ఆత్రేయస గోత్రం' అని సమాధానం చెప్తాడు ఇన్‌స్పెక్టర్. ఈవిధముగా ఆత్రేయ తనకు సంబంధించిన విషయాలను నాటకాలలో ప్రత్యక్షంగా ప్రస్తావించినవి. ఇంకా పరోక్షంగా ప్రస్తావించినని కూడా ఉన్నాయి.

ఆత్రేయకు అత్యంత ఇష్టమైన వేమన. వారి పద్యాలను ఎంతో ఇష్టపడేవారు ఆత్రేయ. వీరి రచనాశిల్పం మీద వేమన ప్రభావం వుంది. అందుకు వారి సంభాషణలు పాటలలోని సంక్షిప్తతే ఉదాహరణ. చిన్నమాటలలో గొప్ప భావాన్ని పలికించగలరు. వేమనగారి పద్యాల పట్ల తనకున్న అభిప్రాయాన్ని ఆత్రేయగారు 'వాస్తవం' నాటకంలో రామయ్య, సుబ్బన్న పాత్రల ద్వారా ఏవిధంగా పలికించారో చూద్దాం.

" చూడు – అదెందుచేతనో ఆ వేమన పద్యాలు చదువుతుంటే నాకు నిజంగా అంతకంటే మించిన కవిత్వం ఇంకేముందా ఈ ప్రపంచంలో అనిపిస్తుంది. చూచావూ? అబ్బ! మానవ ప్రకృతిలో ఎన్ని ఎగుడు దిగుళ్ళు వున్నాయో ఎంత చక్కగా చిత్రీకరించాడోయ్ ! కేవలం అచ్చుగుద్దినట్లు కదూ! ఏమన్నా తేడా వుందంటావా? " అని రామయ్య అంటే " అబ్బే! ఎవడంటాడంటీ? అంత ఇదిగా రాసిన కవి మరి మన తెలుగు సాహిత్యంలోనే లేడంటారు తెలిసినవాళ్ళు" అని సుబ్బన్న చేత పలికిస్తాడు. ఈవిధముగా ఆత్రేయకు వేమన సాహిత్యం మీదగల అభిప్రాయాన్ని పరోక్షంగా తెలియజేశారు. సినిమా సాహిత్యంలో ఈ విధమైన సంభాషణలు చాలా ఉన్నాయి.

ఈవిధముగా ఆత్రేయగారు కవిగా తన అనుభూతులకు, అభిప్రాయాలను నాటక సాహిత్య సంభాషణలలో వివిధ పాత్రల నోట పలికించారు.

3.13.ఆత్రేయ సంభాషణలో రాజకీయ ప్రస్తావనం :

ఆత్రేయ తన నాటక సాహిత్యంలో రాజకీయపరమైన విషయాల మీద ఎన్నో అభిప్రాయలు వెల్లడించారు. అజ్ఞానంలో వున్న ఓటర్లను ఎడ్యుకేట్ చేయడానికి రాజకీయమంటే ఏమిటో! ఓటు విలువేమిటో కొన్ని పాత్రల సంభాషణల ద్వారా చెప్పించారు. అలాగే కలుషితమైన కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు గూర్చి అందులోని కొందరి నాయకుల మనస్తత్వాలను

గూర్చి తీవ్రంగా విమర్శిస్తూ, అలాగే అక్కడక్కడ సున్నితంగా కమ్యూనిస్టులను, చెట్టు పేరు చెప్పుకొని కాయలమ్ముకునే రాజకీయ నాయకులను వ్యంగ్యంగా – వాస్తవం, అంతర్యుద్ధం, ఓటు నీకే, వరప్రసాదం, ఎవరుదొంగ, ఒక్క రూపాయి, అంత్యార్పణ, ప్రగతి మొదలగు నాటిక నాటకాలలో విమర్శించారు.

3.13.1. రాజకీయం :

ఎలక్షన్లకు ముందు ఓటర్లను వంగివంగి దండాలు పెట్టి గెలిచినవాడు నాయకుడు అయిన తర్వాత "నేనెవర్నో తెలుసా" అనే అహంకారపు కొమ్ములు మొలిసి ఎవర్ని లెక్కచేయడు. ఇలా అహంకారంతో విర్రవీగే నాయకుడ్ని కర్షక కార్మిక స్త్రీలు నిలదీసి ప్రశ్నించే సన్నివేశానికి ఆత్రేయ రాసిన సంభాషణలు అద్భుతమైనవి.

రాజకీయ నాయకుడంటే మన ఓటుతో పదవి గడించి మననెత్తిన సవారి చేసేవాడు. కుర్చీలో కూర్చోగానే వెనక బ్రతుకంతా మరచి విర్రవీగేవాడు. అంతేకాదు. వాడి ముఠా రాజకీయాల్తో, పదవీ వ్యామోహంతో మనల్ని పూర్తిగా మరచిపోయేవాడని అంతర్యుద్ధం నాటికలో చెప్పారు ఆత్రేయ. ఇంకా ఇలాంటి రాజకీయ నాయకులు ఎలాంటి వారో వ్యంగ్యంగా ఇలా చెప్పారు.

" బ్రతకలేనివారు, పదవుల కోసము
ప్రాకులాడువారు, ప్రజల సొత్తు
మ్రింగి త్రేన్చువారు, మేక తోల్ కప్పిన
పులులె రాజకీయములకు ఘనులు " అని అంటారు.

రాజకీయ నాయకుల్ని అనేక నాటిక నాటకాలలోని సంభాషణలో వ్యంగ్యంగా విమర్శించారు ఆత్రేయగారు. ఆహార సమస్య వల్ల ఒక స్త్రీ ముగ్గురు బిడ్డలతో ఆత్మహత్యకు పాల్పడి చనిపోయినట్లు ధ్రువీకరిస్తూ డాక్టర్‌ని స్టేట్‌మెంటు ఇవ్వమని పత్రికా విలేకరి కోరగా "నేనింకా కనీసం ఒక ఎం.ఎల్.ఏ.నయినా కాందే" అని డాక్టర్ సమాధానం చెప్పినట్లు పలికిస్తారు 'ఎవరుదొంగ' నాటికలో ఆత్రేయ. అంటే రాజకీయ నాయకులు స్టేట్‌మెంట్‌లతో ప్రజలను మభ్యపెడుతూ కాలాన్ని వెళ్ళబుచ్చే వారని ఆత్రేయగారు వ్యంగ్యంగా విమర్శించారు. ఇదే నాటికలో " అయితేతోనే! అన్నం లేనందువల్లే చచ్చిందంటారా?" అనే ఎస్.ఐ.మాటలకు డాక్టర్ – "సైన్సుకు ఎంత వరకు అలాగే చెప్తుంది. పత్రికల్లో స్టేట్‌మెంట్లూ, ప్లాటుఫారం మీద ఉపన్యాసాలు ఎవరికోసం చేయవచ్చుగాని.." అని మాట్లాడినట్లు ఆత్రేయగారు రాశారు.

' ఒక్క రూపాయి' నాటికలో లేని మాటలు మాట్లాడే జగ్గుతో అతని మిత్రుడు రాం " నువ్వు రాజకీయ నాయకుడు కావాల్సినవాడివిరా" అని అంటే " ఏం? " అని అయోమయంగా అన్న జగ్గు మాటలకుదులో అయితే అసలు సమస్యను వదిలి హాయిగా వాగుతూండవచ్చు" అని రాం పాత్ర ఆత్రేయగారు రాజకీయ నాయకుల కల్లబొల్లి ఉపన్యాసాలను, మాటలను విమర్శించాక రాజకీయ నాయకులు ఎలాంటోళ్ళంటే ఐదేళ్ళకోమారు కల్లబొల్లి మాటలతో ప్రజలను) మభ్యపెట్టే మాటలకు హామీపత్రాలుగా మ్యానిఫెస్టోలో వాగ్దానాలతో ముందుకు వస్తారు. 'ఓటు నీకే' నాతో సరిగ్గా ఇలాంటి రాజకీయ నాయకుడే ఇచ్చిన కాగితాన్ని చదువురాని ఆ తల్లిదండ్రులు కుమారుడికి ఇచ్చి ఏమిరాసుందో చెప్పమని కొడుకుని అడగగా "ఇవా? వరాలే!' చెప్పగా " వరాలేంట్రా" అని ఆశ్చర్యంగా కొడుకుని మళ్ళీ ప్రశ్నిస్తాడు. "మనమడక్కుండానే వరాలిస్తుండారు' నింపాదిగా చెప్పాడు కొడుకు. ఆ వరాలు ఇచ్చేదెవరని ఆసక్తిగా తండ్రి అడిగిన. " ఎలక్షనులకి నిలబడే పెద్ద మనుషులు" అని సమాధానం చెప్తాడు. ఆ సమాధానం విని వీళ్ళేమైనా దేవుళ్లా వరాలీయటానికి? అని తండ్రి అడుగగా వాళ్లు అలానే అనుకుంటున్నారని అతనికి చెప్తాడు. వీరి మాటలు వింటున్న అతని తల్లి మరింత అమాయకంగా, అజ్ఞానంగా ఆ వరాల్లో వాన కురిపించేదేదుందేమో?" అని ఆతృతగా అడగగా "నిప్పును కురిపిస్తామని దోపిడి రాజకీయ

నాయకులు గెలిచిన తరువాత వాళ్ళు చేసే పనులను చెప్పగా, ఇంకా వరాలేంటని తల్లి నిరాశతో ఆశగా అడిగే మాటలకు " ఆడాళ్ళకూ మొగాళ్ళకూ సరి సమానంగా మర్యాద, గౌరవం యిస్తారట" అని ఆ కాగితంలోని విషయాన్ని వాళ్ళ కొడుకు చదివి చెప్పగానట్టే వుంది. ఈళ్ళిచ్చేదేంటి – మొదట్నుంచీ మీ అమ్మా నేనూ ఒకటిగా తిన్నాం – కష్టపడ్డాం– అయినా యీ వరాల జాబితా ముందేసుకొని వాళ్ళంతా మన వెనకాల పడ్డం నాకగోచరంగా వుంది" అని వెంకయ్య అంటాడు. ఈ సంభాషణనంతా వ్యంగ్య ధోరణిలోనే పలికిస్తారు ఆత్రేయ.

స్టేషన్ బావిలో ఒక స్త్రీ పిల్లతో సహా దూకి ఆత్మహత్య చేసుకుందని చెప్పే ఎస్.ఐ.తో డాక్టర్ " తప్పు చేసింది. ఏ ఎం.ఎల్.ఏ.ఇంటి వెనకాలి బావిలోనె పడి వుంటే కొంత ఫలితముండేది" అని నర్మగర్భితంగా పలికిన మాటలను తేటతెల్లం చేస్తూ ఆ ఫలితమేమిటో వ్యంగ్యంగా " ఏముంది? తీసేవాళ్లయినా లేకుండా చచ్చేది" అని ఎస్.ఐ.నోట పలికించారు ఆత్రేయ 'ఎవరు దొంగ?' అనే నాటికలో..

రాజకీయ నాయకులు ఎలక్షన్లలో గెలిచే వరకే ఓట్ల కోసం మనల్ని కలుస్తూ వుండేది. మనతో ప్రేమగా మాట్లాడుతున్నట్టు నటిస్తూ వుండేది. ఆ తర్వాత ఏ పనిమీదైనా మనం వారి దగ్గరకెళితే వారి దర్శనాలే కరువైపోతాయి. ఇలాంటి పరిస్థితినే ఆత్రేయ 'వాస్తవం' నాటికలోని ఒక సన్నివేశంలో చూపిస్తూ వ్యంగ్యంగా రాజకీయ నాయకులను ఎలా విమర్శించారో చూద్దాం !

ఎప్పటి నుంచో రామయ్యను కలుసుకోవాలని వారి కోసం వాకిలి దగ్గరే కాచుకొని కూర్చున్న సత్యంతో...

"కోటి : అయ్యగారు చాలా తొందరపనిగా వెళ్తున్నారు. మంత్రి గారొస్తారు. తర్వాత మాట్లాడొచ్చని చెప్పమన్నారు.

సత్యం : వెళ్ళారా ?

కోటి : ఆ..

సత్యం : ఎటు వెళ్ళారు? " అని అమాయకంగా ప్రశ్నించే సరికి ప్రక్కనే ఉన్న వెంకటాద్రి " ఓరి పిచ్చివాడా! అంత పనికి మాలిట్రా మహారాజులిళ్లల్లో ఇన్ని దర్వాజాలు పెట్టి వుండటం! అన్ని ద్వారాలే లేకుంటే నీబోటి వాళ్ల నుండి, దానాలు ధర్మాల కొచ్చే వాళ్ళ నుండి తప్పించుకొని వూపిరితో బయటపడగలరా చెప్పు?" సున్నితంగా వెంకటాద్రి పాత్రచేత విమర్శింపచేస్తారు ఆత్రేయ.

ఆత్రేయ తన నాటక సాహిత్యంలో బూటకపు స్వాతంత్రోద్యమ నాయకుల్ని కూడా విమర్శించకుండా వదలిపెట్టలేదు. స్వాతంత్రోద్యమ నాయకుడ్నని చెప్పి ప్రభుత్వం కల్పించే అన్ని వసతులను అసలైన వారికి అందకుండా అందుకునే వారిని చూపిన ఆత్రేయకు అలాంటివాళ్ళంటే ఒళ్ళు మంట. 'అంతర్యుద్ధం' నాటికలో ఇలాంటి బూటకపు సమరయోధులను ఆవేశం, వివేకం పాత్రల సంభాషణలో ఇలా పలికించారు. "అసలమతను జైలు కెళ్ళడా?" అని వివేకం ప్రశ్నించగా 'వెళ్ళకేం, అయిదు రోజులున్నాడు జైళ్లో" అని సమాధానం చెప్తుంది ఆవేశం. " ఏ క్లాస్‌లో" అని వివేకం అడిగితే " ఏ క్లాసులో " అని ఆవేశం సమాధానం చెప్తుంది. కొద్ది రోజులు కఠిన శిక్ష అయినా అనుభవించాడా అంటే లేదు. అన్ని వసతులతో కూడిన ' ఏ క్లాసు' జైలులో అనుభవించాడు. సరే అదీ మనస్ఫూర్తిగా ఉద్యమంలో పాల్గొన్నాడా అంటే – లేదు! "ఇతనితో పాటు వస్తుంటే పొరబాటున అతన్ని అరెస్టు చేశారు – అంతేగా?" అన్ని వివేకం ఆవేశంతో అంటుంది. ఇలాంటి వాళ్ళు ఏమి చేయకపోయినా ఎన్నో చేశామంటూ – తాము స్వాతంత్ర్య సమరయోధులమంటూ ప్రభుత్వం పంచి యిచ్చే ఇళ్ళ స్థలాల పట్టాలకు, పంట పొలాలకు మరి కొన్ని రాయితీలను అనుభవించడానికి అలాగే ఈ ఉద్యమం పేరు అడ్డం పెట్టుకొని రాజకీయాల్లో దిగి లాభపడడానికి ఇలా ఎన్నోవిధాల మోసం చేసేవారిని ఉద్దేశించి విమర్శిస్తూ రాశారు.

ఆత్రేయ గారి కాలంలో జైళ్ళకెళ్ళడం త్యాగంగా కాంగ్రెస్ పార్టీ వాళ్ళు భావించే వారని అటువంటి వారి మనస్తత్వంను ఆత్రేయ తీవ్రంగా నిరశించారు. ఇలాంటి భావాలకు ఆత్రేయ విరోధం. " ఆత్రేయగారు స్వాతంత్ర్య సమరయోధుడు. చిత్తూరులో ఉంటుండగా రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ అనంతశయనం అయ్యంగారు, ఆత్రేయ మరికొందరు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్ళడం జరిగింది. ఆత్రేయగారు సుమారు పదిరోజులు జైల్లో గడిపారంట. వారి మామగారు బ్రిటీష్ గవర్నమెంట్‌లో మేజిస్ట్రేట్‌గా ఉండడం వల్ల మేనల్లుడు జైల్లో వుంటే తన ఉద్యోగానికే ముప్పని బయటకు విడిపించినట్లు ఆత్రేయగారి భార్య పద్మావతి గారు తెలిపారు. అలా స్వాతంత్రోద్యమంలో ఆత్రేయ గారు పాల్గొన్నందుకు మద్రాసులో వున్నప్పుడు భూములిస్తామని వచ్చిన వాళ్ళతో తనకేమి వద్దని, తిప్పి పంపించారు ఆత్రేయగారు. ఇలా ఇవ్వడం అనేది కూలి పనికాదు. నా మనసుకు స్వాతంత్ర్యం కావాలనిపించి చేశానే కాని ఆ డబ్బుతో బ్రతకాలనే తనకి లేదని తిప్పి పంపారు ఆత్రేయ." ఆత్రేయ కూడా జైలుకెళ్ళడం త్యాగంగా భావించే వెళ్లారా అని ప్రశ్నించవచ్చేమో! అలా భావించేవారు కాదు ఆత్రేయ. ఆత్రేయ అండర్‌గ్రౌండ్‌లో ఉంటూ క్యారమ్స్ ఆడుకొని ఆట పూర్తయిలేచే సరికి వెనక పోలీసులు ఉన్నారు. ఎవరో ఇచ్చిన సమాచారంను బట్టి ఆత్రేయ తప్పని సరి పరిస్థితుల్లో పట్టుబడ్డారు. ఇలా పట్టుబడకుండా ఉండాలని అండర్ గ్రౌండ్‌లో వుండడం పిరికితనం కాదు. దేశభక్తి లేకపోవడం కాదు. పట్టుబడి జైల్లోకెళ్ళి కూర్చుని ఉండే కన్నా, స్వాతంత్ర్యోద్యమం కోసం రహస్య కార్యకలాపాలపైన సాగించవచ్చు కదా బయట ఎక్కడో ఒకచోట దాచుకుంటే ! అదే ఆత్రేయ ఆలోచన. ఆ ఆలోచనలే ఆత్రేయను అతివాద ధోరణివైపు తీసుకెళ్లాయి. ఈనాటి కొందరి స్వాతంత్ర్యోద్యమ నాయకుల్లా ఆత్రేయకు ప్రభుత్వం కల్పించే రాయితీలు, బహుమానాలు అనుభవించే అవకాశం వచ్చినా తిరస్కరించారంటే ప్రత్యేకంగా వారి వ్యక్తిత్వం. స్వాతంత్ర్యం పట్ల వారికి గల గౌరవభావాలు చెప్పనక్కర్లేదు.

'అంతార్పణ' నాటికలో కూడా ఇలాంటి వాళ్ళను ఆత్రేయ విమర్శించారు. తమకు దక్కాల్సిన భూములను బూటకపు స్వాతంత్ర్య సమరయోధులు మింగెయ్యాలని చూస్తుంటే చిన్నోడు తన వారిని భారతమ్మ దగ్గరకు తీసుకెళ్ళి 'ఆ శకరయ్యేమో ఎప్పుడో జైలుకు పోయాడనీ, ఈ శివకామయ్యేమో సిన్నప్పుడెప్పుడో సత్తాగ్రెహాల్లో ముప్పై రూపాయలు జరిమానా కట్టినాడనీ, అట్టా యిట్టా జెప్పి, ఆళ్ళకు యీళ్లకు పంచిపెట్టేశిరి.." ఇలా వారి గోడును చిన్నోడు వినిపించాడు. ఈవిధముగా చిన్నోడు పాత్రద్వారా బూటకపు స్వాతంత్ర్య సమరయోధులను తీవ్రంగా విమర్శించారు ఆత్రేయ.

ఆత్రేయగారి నాటకాల్లో కాంగ్రెస్ పార్టీ – అందులో పనిచేసెటువంటి కొంతమంది స్వార్థపరుల మనస్తత్వాలకు సంబంధించిన ప్రస్తావన చాలా సార్లు వచ్చింది. అవకాశం దొరికినప్పుడల్లా వాళ్ళను తీవ్రంగా విమర్శించడం జరిగింది. ఆత్రేయ ఇలా విమర్శించడం చూసి మీకు సంస్థ మీద సరైన అభిప్రాయం లేదదా?" కుహనావాదులమీద కోపమా?" అని పైడిపాల గారు అడిగిన ప్రశ్నకు " గాంధీ, కాంగ్రెసు ఒకటే అనుకోవడం పొరపాటు. గాంధీవేరు, కాంగ్రెసు వేరు. కాంగ్రెసు ఒక రాజకీయ లక్ష్యం కోసం ఏర్పడిన పార్టీ. గాంధీ వ్యక్తిగతంగా వూరు. అని సమాధానం చెప్పారు ఆత్రేయగారు. మొదటిలో కాంగ్రెస్‌పార్టీని ఎంతో అభిమానించారు. పార్టీ భ్రష్టుపట్టిపోతుంటే ఎంతో బాధపడ్డారు. 'వాస్తవం' నాటకంలో వెంకటాద్రి పాత్ర పలికే మాటలను బట్టి కాంగ్రెస్ పార్టీ పట్ల ఆత్రేయకు మొదటిలో గల సదాభిప్రాయాలు తెలుస్తాయి.

కాంగ్రెస్ ప్రజావ్యతిరేకమైనా పార్టీ అనిన సత్యంకు సమాధానంగా "నాలాగు కోటానుకోట్ల త్యాగమూర్తులు తమ రక్తంతో దాన్ని పెంచారు. పెద్ద చేశారు. ఎన్నో బంగారు కలలు కంటూ ఎందరో చచ్చారు. ఎంతో పవిత్రంగా, ఉన్నతంగా పెంచుకొచ్చిన సంస్థను, చేతులారా యీనాడు కూలదోయలేం. కుళ్ళు వుంటే కడుగుకొంటాం! కుళ్ళిన భాగాన్ని కోసైనా పారేస్తాం. అంతే !" అని పలికిస్తారు వెంకటాద్రి పాత్ర చేత ఆత్రేయ. కాంగ్రెస్ పార్టీని ఇప్పటికైనా బాగుపరచాలనుకునే వారికి ఇదొక సలహా మాత్రమే. అసలు ఆత్రేయ గారి దృష్టిలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో చచ్చిపోయింది. ఇప్పటివరకు వారు చేసిన తప్పులను ప్రజల దగ్గరకెళ్ళి ఒప్పుకోమని భారతమ్మ పాత్రద్వారా 'అంత్యార్పణ'లో పలికించగా

అలా చేయడం వల్ల ప్రభుత్వం పడిపోయి కాంగ్రెస్ నామరూపాల్లేకుండా పోతుందనే భారతమ్మ కొడుకుల్లా వాదించే రాజకీయ నాయకుల్ని ఉద్దేశించి " ఇంకా ఎక్కడుందిరా కాంగ్రెస్. కాంగ్రెస్ కనుక వుంటే ఈ అడ్డమైన వాళ్ళ కాళ్లు పట్టుకొని కలుపుకోవాల్సిన కర్మేమొచ్చిందిరా. ఇంకా సిగ్గులేక " కాంగ్రెస్ కాంగ్రెస్ ' అని ఒక శవాన్ని చూపి బెదిరిస్తున్నారా. మీ బతుకు చెడ " అని భారతమ్మ పాత్ర ద్వారా శాపనార్థాలు పెట్టిస్తారు ఆత్రేయ.

పైవిధముగా ఆత్రేయకు కాంగ్రెస్ పట్ల మొదటిలో ఉన్న అభిమానాన్ని చంపుకోలేక కొన్ని పాత్రల ద్వారా సంభాషణల రూపంలో కాంగ్రెస్ వారికి విన్నవించిన విషయం. మరి ఈనాటి నాయకులెలా ఉన్నారు. ఎలా ఫీలవుతున్నారు. నాయకుడంటే ఏమనుకుంటున్నారు. వారేం చేస్తున్నారు. ఇన్ని తెలుసుకోవాలంటే ఆత్రేయ గారు కాంగ్రెస్ పార్టీ గూర్చి చెప్పిన విషయాలు ఇంకా తెలుసుకోవాల్సి వుంది.

" నలుగుర్ని వెంటేసుకొని నాయకుడనిపించుకోవడం కాదు, రాజకీయ తంత్రాలతో వాళ్ళను వీళ్ళను రెచ్చగొట్టి ప్రజాసేవ అనిపించడం కాదు! ముందుగా అన్ని ఏర్పాట్లు చేసుకొని పూలమాలలు వేసుకొని 'ఏ' క్లాసులో పోయి కూర్చోవటం కాదు. జైళ్ళకు పోయి వచ్చిమనే క్వాలిఫికేషన్‌తో పదవులకు ప్రాకులాట్టం కాదు! 'ఏ' క్లాసులో హాయిగా కూర్చుంటే 'సి' క్లాసులో మురిగి చచ్చింది మేము ! కలిగిన వాళ్లు జైళ్లకు పోయినా కాపురాలు జరిగినవి! మాకు? మింగమెతుకులు లేక మాడి చచ్చాం! వున్న కుండ బొచ్చలతో సహా ఆంగ్ల సామ్రాజ్యాధిపతుల ఆగ్రహానికి ఆహుతి చేశాం.! సత్యాగ్రహాలు చేశాం. లాఠీ దెబ్బలు తిన్నాం! బూటు కాళ్ళ తన్నులు రుచి చూచాం..! ఇల్లా 'వాస్తవం' నాటకంలో వెంకయ్యపాత్ర ముఖంగా ఆత్రేయ ఈనాడు జరిగే రాజకీయ భాగోతం గూర్చి తన నిరశనను తెలియజేశారు.

ఇంకా చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకునే కుహనా రాజకీయ నాయకులనుద్దేశించి 'అంతర్యుద్ధం' నాటికలో ఆత్రేయ ఏమి విమర్శించారో చూద్దాం! రాజకీయ నాయకుడిలోను ఆవేశం ప్రజలను ఎలా మోసం చేయాలో చెప్తుందంటే " బాపూజీ పేరు మర్చిపోయేవు సుమా! అయిన దానికీ కాని దానికీ బాగా ఉపయోగించుకో ముసలాయనపేరు. అహింస.. ఆ.. అదే .. వచ్చే ఎన్నికలలో గెలుపు మనదే" అని చెప్తుంది. చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకోవడమంటే ఇదే మహాత్మగాంధీ, జవహర్‌లాల్, అంబేద్కర్ లాంటి మహామహులు ఎలక్షన్లప్పుడే గుర్తుకువస్తారు మన నాయకులకు.

మనం పరిశీలిస్తూనే ఉన్నాం ఈనాటి రాజకీయనాకుల్ని, రాజకీయ నాయకుడి వస్త్రధారణ సామాన్యులకంటే భిన్నంగా వుంటుంది. తాను స్వచ్ఛమైన గాంధేయవాదినని పదిమంది భావించాలని మన నాయకులు ఎత్తుకు పై ఎత్తుగా ఆలోచిస్తారు. అందుకే కొందరు ఖద్దరు తొడుగుతారు. మరి కొందరు పసుపు బట్టలు తొడుగుతారు. ఇంకొందరు కాషాయం. ఇలా దేశాభిమానం, పార్టీ అభిమానం ఈ బట్టల్లోనే కనిపిస్తుంది. ఖద్దరు పంచె, లాల్చీ మాత్రమే మనకు కనిపించేది. ఇంటిలో వాడే సోపులు, స్ప్రేలు ఇలా విదేశి వస్తువులేమి కనిపించవు. గాంధీ గారు ఖద్దరు వడికారు. తొడిగారు కనుక వీళ్లు తొడుగుతున్నారు. ఇదీ ఈనాటి వారి ఖద్దరు సిద్ధాంతం! సారీ!... గాంధీ సిద్ధాంతం.. సరే విషయానికొద్దాం. గాంధేయ సిద్ధాంతం పేరుతో అహింసా సిద్ధాంతంతో మాయమాటలు చెప్పి మభ్యపెట్టి పదవులందుకొని అధికారి దాహం తీరక హింసలతో పట్టణాలనే అట్టుడికించే సిద్ధాంతాలు. ఇలా చెప్పుకుంటే ఎన్నో వున్నాయి. గాంధేయ వాదంతో ఖద్దరు దుస్తుల ధారణతో ప్రజలను మోసం చేసే నాయకులనుద్దేశించి " బాపూ పవిత్రంగా ప్రవేశపెట్టిన యీ ఖద్దరులో దొంగలు దాక్కున్నారురా యీనాడు " అని 'అంతర్యుద్ధం ' నాటికలోని భారతమ్మ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి అయి అవినీతి మార్గంలో నడిచే తన కొడుకుతో అంటుంది.

సైంటిస్టు తన అక్క శాంతి గాంధీ గారి మార్గాలను, బోధనలను, సిద్ధాంతాలను అనుసరిస్తుందని, ఆమెది 'గాంధీ మతం' అని పెట్టుబడిదారునికి చెప్తుండగా ఆ మాటలు విన్న పిచ్చివాడు " ఉపన్యాసానికి చాలా బాగుంటుందా గాంధీ

మతం – పెరుగుతో అవకాయ ముక్కలా ” అని అనగా “ అందుకే బతకదలచుకొన్న వాడెవడూ దాన్ని అమలులో పెట్టడం లేదు” అని పెట్టుబడిదారుని పాత్ర ద్వారా “ నాయకుడు కాదలచుకన్న వాడెవడూ వదలిపెట్టడం లేదుగా!” (ప్రగతి) అని సైంటిస్టు పాత్ర ద్వారా వ్యంగ్యంగా విమర్శించారు ఆత్రేయ. ‘శాంతి’ ప్రజలకు రుచింపదు. అందుకే గాడ్సే గాంధీనే పొట్టన పెట్టుకున్నాడు. అధికారం కోసం కులమతాల పేరుతో అల్లర్లు సృష్టించి శాంతి!శాంతి!! అని పలికేది ఖద్దరు తొడిగిన ఈ నాయకులే ! నాయకుడిగా ఉండదలచుకున్నవాడెవ్వడూ ఖద్దరు వదలిపెట్టడు. బ్రతకదలుచుకున్న వాడెవడూ దాన్ని అమలుపెట్టడు. ఆత్రేయగారు ఎంత అర్థవంతంగా చెప్పారు. ఇప్పుడు ఇంకా విజ్ఞానం పెరిగి పేదపిల్లతో , పనిపాపలతో వారి ఫొటో తీసే వరకు వారిని అక్కున చేర్చుకునే స్థాయికి ఎదిగారు రాజకీయ నాయకులు. ఇంకా చెప్పాలంటే వారితో భోజనాలు, నృత్యాలు, వారి సాంప్రదాయక అలంకరణాలు అన్నీ ధరించాలి. మరికాలం మారుతుంది కనుక వారుమారాలి కదా! ఇంకా గాంధీ సిద్ధాంతాలను నమ్ముకొని ఎలక్షన్‌లలో పోటీచేస్తే గెలిపించక పోదా అనుకొని జగన్నాధం తన ప్రత్యర్థి తరపున ఎలక్షన్ ప్రచారంలో కాంగ్రెస్ గొప్పతనాన్ని ఏవిధముగా చెప్పుకుంటున్నాడో విందాం!

“ ప్రఖాత్య గాంధీ జ్యోతిష్కుడికి వీరి జాతకం చూపించాం. వీరు ప్రధానమంత్రి అయ్యే యోగం వుందని గట్టిగా చెప్పారు. అందువల్లనే వీరిని నిలబెట్టాం. వీరు జమీందారన్నది మరచిపోకండి. వ్యక్తులను చూడకండి. కాంగ్రెస్ మహాసంస్థను చూడండి. కాదంటే నన్ను చూడండి..” (అంత్యార్పణం) ఇలా మభ్యపెట్టే నాయకులనుద్దేశించే వ్యంగ్యంగా ఈ సంభాషణ ద్వారా ఆత్రేయ విమర్శించారు.

దొంగగాంధేయ వాది చనిపోయి దేహం దహనమయ్యాక వాడితో చావలేక ఇన్నాళ్లు చస్తూ బ్రతికిన ఆ ఆత్మలార్దు లాంటి గార్దుతో “ ఈసారి నన్ను ఖద్దరు వేసుకొని దేహంలో పడేయి. ఖద్దరు బట్టల క్రింద వూపిరితిక్క చచ్చాను” అని ‘అంతర్యుద్ధం’ నాటికలో వేడుకుంటుంది. అంటే.. ఖద్దరు వెనుక ఎన్ని దారుణాలు జరుగుతున్నాయో .. ఆత్రేయ మనల్ని ఆలోచించమంటూ చెప్పారు.

ఆత్రేయగారు ‘అంత్యార్పణ’ నాటికలో కాంగ్రెస్ వారి మీద విరుచుకుపడ్డారు. ఏమన్నారంటే.. “ చేతలు మాని మాటలు నేర్చారురా మీరంతా. అందుకే, మహాత్ముడానాడు స్వరాజ్యం రాగానే అన్నాడు. ఇక కాంగ్రెసును రద్దు చెయ్యండి అని. ఆయనకు బాగా తెలుసు” అని భారతమ్మ పాత్ర ద్వారా పలికిస్తూ ఇంకా ఏమి పలికించారో తెలుసా.. “ మనం ఆందోళన చేయటానికి అలవాటు పడ్డాంగాని పరిపాలనకు పనికిరామని..” అని డొంకతిరుగుడు మాటలు మాట్లాడే తన కొడుకుతో ఆమె మాట్లాడినట్లు ఇంకా చెప్పాలంటే సూటిగా కాంగ్రెస్ వారినే ఆత్రేయ విమర్శించినట్లు నిజాన్ని నిర్భయంగా చెప్పారు.

విచారణే అవసరం లేకుండా అరెస్టు చేయగల కొత్త ఆర్డినెన్స్‌తో సత్యంను అరెస్టు చేయడానికి వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్‌తో కమ్యూనిస్టు పార్టీ వాడైనా సత్యం” “ బ్రిటిష్ వారి దగ్గర నేర్చుకున్న పాఠాలు కాంగ్రెస్ మరలా వప్పుజెపుతుంది” అని విమర్శించారు. అంటే హక్కులు, స్వాతంత్ర్యం కోరిన భారతీయులను బ్రిటిష్ వారు ఏవిధంగా అధికార బలంతో రాజ్యాధికారంతో నియంతృత్వంగా పీడించారో అలాగే కాంగ్రెస్ వారు కూడా చేస్తున్నారని, చేశారని విమర్శించారు. పరోక్షంగా ఇందిరగాంధీ పాలనలోని ‘ఎమర్జెన్సీ’ని విమర్శించారు ఆత్రేయ.

ఇలా కాంగ్రెస్ పార్టీని అందులో పని చేసే నాయకులను తీవ్రంగా ఆత్రేయ గారు విమర్శించారు.

3.13.2. కమ్యూనిస్టు పార్టీ – ఆత్రేయ :

గాంధీ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ పట్ల అనుబంధాన్ని తెంచుకొని కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆసక్తిని చూపారు. అయితే మొదట దీని పట్ల కూడా ఆత్రేయకు ఒక అభిప్రాయముంది. ఏమిటంటే “ వాళ్ళు మాతృదేశం కంటే రష్యానధికంగా

ఆరాధిస్తారు. వాళ్ళకది వేద భూమి" అని 'వాస్తవం' నాటకంలో వెంకటాద్రి పాత్రముఖంగా కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆత్రేయ తన అభిప్రాయాన్ని చెప్పారు.

"... అది సరేగానీ – వెంకటాద్రి! ఆ శంకరం కమ్యూనిస్టుతో కలిసిపోతున్నాడని విన్నాను. ఏమాత్రం నిజం?" అని రామయ్య అడిగిన మాటలకు, " కాంగ్రెస్ అతన్ని కొన్నదా ఏం?" అని నిష్ఠూరంగా వెంకట్రావు అనగా " నిజమే కదూ ? కమ్యూనిస్టులైతే జీతాలు–బత్తాలు ఇచ్చి కొనగలరు. కాంగ్రెస్‌లో అంతా స్వంత ఆముదమేగా" అని రామయ్య అంటాడు. కమ్యూనిస్టు పార్టీ ఈనాటికి ఆకర్షింపజేసుకుంటుంది. బహుశా ఈ అంశం ఆత్రేయగారికి నచ్చి వుండదు. అందుకే అలా సున్నితంగా విమర్శించారు.

రాజకీయంలో ఎదిగిన నాయకుడు ఎలాంటి ఆరాచకాన్నైనా సృష్టించడానికి వెనుకాడడు. అవసరమైతే పోలీస్ వ్యవస్థనే తన వ్యవస్థగా కొని మార్చుకోగలడు. వీలుపడకపోతే తన గుండాలనే పోలీస్ వ్యవస్థగా మార్చుకోగలడు. అందుకే ఎలక్షన్లప్పుడు వాళ్ళ ధీమా ఎలా ఉంటుందో 'అంతర్యుద్ధం' నాటికలో ఆత్రేయ ఆవేశం పాత్ర ద్వారా ఇలా పలికిస్తారు. తుపాకులున్నాయి. ఏం ఫర్వాలా! డబ్బు గలవాళ్ళంతా మనవైపే వున్నారు. బక్క వెధవల బ్రతుకులు డబ్బు గల వాళ్ళ చేతుల్లో వున్నాయి. ఇంకేం చేస్తారు? చస్తారా మనకు ఓటివ్వకుండా.. బ్రిటిష్ వాళ్ళు రెండు వందల ఏళ్లు పరిపాలిస్తే మన వాళ్ళ పాలసీతో కనీసం వంద సంవత్సరాలైనా వుండం?" ఇలా మనదేశ రాజకీయ చరిత్రలో చోటు చేసుకున్న దౌర్జన్యాలు, రిగ్గింగులు, డబ్బు వెదజల్లి ఓట్లు కొనడం, ఆశలు చూపించి వాగ్దానాలు మీద వాగ్దానాలు చేసి ఓట్లు వేయించుకోవడం, పోలింగ్ బాక్స్‌ల అపహరణ, అపోజిషన్ పార్టీ వాడ్ని కిడ్నాప్ చేయడంగాని, చంపడంగాని ఇలాంటివన్నీ ఇప్పట్లో మారవనే నిరాశ ఆత్రేయలో వుంది. అందుకే 'వాస్తవం' నాటికలో సున్నితంగా విమర్శిస్తూ తన అభిప్రాయాన్ని ఇలా తెలియజేశారు – 'వచ్చేసారి గూడా ఎలక్షన్లు ఇంత కుళ్ళుగానే జరుగుతుయంటావు?" అని సత్యం అంటే " ప్రపంచం త్వరలోనే ఏదో గొప్పగా మారుతుందని నీకేదో వెధవాశ వున్నట్లుంది" అని వెంకయ్యపాత్ర చేత ఆత్రేయగారు పలికిస్తారు.

ఇవి! మనదేశపు రాజకీయాలు. రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు, వాళ్ళ సిద్ధాంతాలు కుళ్ళికంపు కొట్టే రాజకీయ వ్యవస్థ. అందుకే ఇకనైనా మన ఓటు విలువేమిటో గుర్తించి కుల మతాలకు ప్రాంతీయ అభిమానాలకు డబ్బుకు అమ్ముడు పోక సరి అయిన నాయకుడ్ని ఎన్నుకోమంటారు ఆత్రేయ. అందుకే ఓటు గూర్చి 'ఓటు నీకే' నాటికలో ఇలా చెప్పారు. "ఓటు చాలా విలువైనది. అది ఒక మాట. ఒక శక్తి. ఒక అధికారం. ఓటు ఇవ్వడమంటే సామాన్యం కాదు. నీ బ్రతుకు, నీ పిల్లల బ్రతుకులు, నీదేశం బ్రతుకు ఒకరి చేతల్లో పెట్టినట్టు" అని చెప్తూ ఇంకా మనం అర్థంచేసుకోవడానికి ఉపమానపూర్వకంగా – "పూర్వము రాజులుండేవారు, మనల్ని యేలుతుండేవారు. ఇప్పుడు రాజుకు బదులు గవర్నమెంటు వచ్చింది. గవర్నమెంటు అంటే ఏమీలేదు.మన్లోనుంచి కొందరు – ఇదిగో ఫలానా వారు ఫలానా రంగయ్య అని మనం ఇక్కడ్నుంచి ఏర్పరచి పంపుతాం. అన్ని ఊళ్ళలో నుంచి ఇలా ఏర్పరచబడ్డ వాళ్ళంతా మద్రాసులో కలిసి మాట్లాడుకొని, మన కష్టసుఖాలలోంచి" మంచి చేస్తారని చెప్తాడు. ఇంకా ఎన్నుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెప్తూ " అందుకే ఏరుకునేటప్పుడే మంచి వాళ్ళు, మన కష్టసుఖాలెరిగిన వాళ్ళుగా చూచి పంపాలి. ఆ ఏర్పరచుకునే అధికారం, హక్కు ఉండేదాన్ని ఓటింగ్ హక్కు అంటారు. అంటే ఫలానా రంగయ్యే మా తరపున ఈ ఊళ్ళోంచి గవర్నమెంటులోకి పోవాలి అని చెప్పటం" అని చెప్తూ – కాగితం ముక్కే కదా అని ఓటుకున్న శక్తిని నిర్లక్ష్యం చెయ్యవద్దు. దాని శక్తి అమోఘమైనది. దానితో బాగుపడవచ్చు. ఓటు వేసి గెలిపించినందుకు ఐదేళ్లూ కూర్చుని ఏడ్వనూ వచ్చు. మనం ఆలోచించుకొని ఓటే వేసి ఎన్నుకునే విధానం మనకున్నదని పెద్దోడు పాత్ర ద్వారా చెప్పారు ఆత్రేయ.

నిరుపేదల పాలిట దెయ్యమై పట్టి పీడించే వారిని ఏమి చేయాలో చివరిగా ఇలా చెప్పారు ఆత్రేయ.

" ఎదురు తిరుగు తలెత్తి
ఎదనిండా లక్ష్యం రగిలించి
నీ లక్ష్యం ఒకటే కావాలి
ఈ నాయకులును నాగలికి కట్టాలి
అప్పుడు స్వరాజ్యం!
అప్పుడు వాళ్ళనే రామరాజ్యం " అని ఆత్రేయ ఒక గేయంలో మనల్ని ఇకనైనా మేల్కోమంటారు.

ఈవిధముగా ఆత్రేయగారు మన దేశ రాజకీయ వ్యవస్థ, నాయకులమీద, వారి పరిపాలనా విధానాల మీద సంభాషణా రూపంలో పాత్రముఖంగా వారి అభిప్రాయాలనెన్నింటినో నిర్భయంగా తెలియజేశారు. ఈవిధమైన సంభాషణలను బట్టి ఆత్రేయగారికి రాజకీయాల పట్ల మంచి అవగాహన ఉన్నట్లు మనకు స్పష్టంగా తెలుస్తుంది.

3.14. విమర్శనాత్మక సంభాషణలు :

ఆత్రేయ తన నాటిక సంభాషణలలో ప్రభుత్వం చేసే తప్పులను గూర్చి, బ్లాక్ మార్కెట్, హిందూ వివాహ చట్టం, దేవతలు, ఆస్తికులు, మూఢవిశ్వాసాలు, మనుష్యుల మనస్తత్వం, లోకం తీరు, మహిళలను, ఈనాటి నాటక రంగం గూర్చి ఇలా అన్నింటిని గూర్చి విమర్శించడం జరిగింది. వీటన్నింటిని బట్టి ఆత్రేయగారు ఎందుకు విమర్శించారు. ఆ విమర్శ ఎలాంటిదో తెలుసుకోవచ్చు!

3.14.1. ప్రభుత్వ విధానాలపై ఆత్రేయ విమర్శ :

బ్రిటిష్ పోలీస్ వ్యవస్థ కన్నా దారుణంగా మారిపోయింది. ఈనాటి మన భారతదేశ పోలీస్ వ్యవస్థ. ప్రభుత్వం చేసే అవినీతి, ఆక్రమాలను గూర్చి ప్రశ్నిస్తే జైళ్ళలోకి నెట్టేస్తున్నారు మన పోలీసులు. అప్పుడు తెల్లవాళ్ళ రాక్షసపాలన గూర్చి కొందరు కలం పడితే, గజ్జెకట్టి గొంతు ఎత్తితే దేశభక్తుడని ఆకాశానికి ఎత్తిన మనవాళ్ళే – ఈ దోపిడీ పాలన గూర్చి కొందరు దోపిడీగాళ్లను ప్రశ్నిస్తుంటే – సమసమాజం కావాలని, రావాలని జీవితాన్ని సుఖాలకు అతీతంగా ఉద్యమాల ఊపిరితో గడుపుతుంటే బ్రిటిష్ క్రూరత్వాన్నే మించిన మన ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్‌ల పేరుతో, లాకప్ మరణాల పేరుతో పొట్టన పెట్టుకునేది చూస్తేనే ఉన్నాం! అందుకు.. "మనోళ్లే ఏస్తే వొద్దంటదా జైలు! వాళ్ళకంటే ఈళ్లే అధికంగా తోస్తండారులే టొక్కల్లో" అని ప్రభుత్వం చేయించే ఇలాంటి పనులను ఆత్రేయ నిరసిస్తూ 'ఓటు నీకే ' నాటికలో వెంకయ్యపాత్ర ద్వారా విమర్శించారు.

కొడుకుకు బాగులేదని డాక్టర్ ఏదైనా మందిస్తాడేమోనని గవర్నమెంటు ఆస్పత్రికి వెళ్ళి ఆలస్యంగా ఇంటికి తిరిగి వచ్చే భర్తను చూసి అతని భార్య " ఏంటయ్యా ఇంతసేపు " అని అడగగా " ధర్మ ఆసుపత్రి కదంటే, అయినోళ్ళకంతా అయితే గదూ మనకివ్వటానికి" అని అంటాడు.మన ప్రభుత్వ ఆసుపత్రులు చాలా వరకు ఇంతే. పేరుకే ధర్మాసుపత్రి. అందులో జరిగే పనులన్నీ అధర్మమైనవి. ఎవరిని ఉద్దేశించి ఈ ఆస్పత్రులను పెట్టారో వారికి సేవలు అందజేయకుండా వచ్చే మందులను బయట అమ్ముకోవటం. అందులో పనిచేసే డాక్టర్లు బయట ప్రాక్టీసు పెట్టడం. ఇలాంటి వాటిపై గవర్నమెంట్ దృష్టే ఉండదు. వాళ్ళ దృష్టంతా రాజకీయం పైనే. ఎంత మింగుదామా, గవర్నమెంటు పడిపోకుండా ఎవర్ని బుజ్జిగొడుదామా? తన పదవికి ఎవడు ఎసరు పెడతాడో ఇలా వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోవడంతోనే తలమునకలైపోతున్నారు ఈనాటి రాజకీయ నాయకులు.

చుట్టూ మురికి కాలువలున్నా మనుషులు నివసించలేని ఇంటిలో వుండే ఎన్.జి.వో.రామనాధం తమ్ముడైన గోపిని ఉద్దేశించి "నేనొక్క మాటడుగుతా – మీరంతా గవర్నమెంటు వుద్యోగులు కదా? గవర్నమెంటు హాయిగా యిళ్ళు కట్టి

మీకివ్వకూడదూ?అని యింజి యజమాని అయిన గుప్తా గారి అసిస్టెంట్ శర్మ అనగా "ఇవ్వకేం? ఇస్తున్నారు. పెద్ద ఉద్యోగస్తులందరికీ బంగళాలిస్తున్నారు. ఎందుకంటే అధిక జీతాలు పుచ్చుకుంటున్నారు గనుక. ఇంగ్లీషు వాళ్లే ఏర్పాటు చేసి వెళ్ళారండీ ఈ విధానం. ఎవడికి వేలవేల జీతాలో వాడికే అన్ని అలవెన్సులు. అన్ని సౌకర్యాలు " అని ఎన్.జి.వో.నాటకంలో గోపి పాత్ర ద్వారా ఆత్రేయగారు ప్రభుత్వ విధానాలను నిరశించి విమర్శించారు. ఎన్.జి.వో.లకు ప్రభుత్వమిచ్చే జీతం చూస్తూనే వున్నాం. ఆ జీతంలో సగం ఇంటి అద్దెలకే పోతుంది. ఇంక మిగిలిన ఆ జీతంతో గంపెడు సంసారాన్ని నెట్టుకురావాల్సి వుంది. ప్రభుత్వం ఇలాంటి చిరుద్యోగులకి వసతి సౌకర్యం కల్పిస్తే ఎన్.జి.వో.ల బ్రతుకు కొంత మెరుగ్గా ఉంటుందని ఆత్రేయగారి భావన. వేలకు వేలు జీతాలు తీసుకునేవారు ఎక్కడైనా ఎంతైనా చెల్లించి ఉండగలరు. చిరుద్యోగుల పరిస్థితి వాళ్ళలా కాదు గదా! గవర్నమెంటు ఆ పన్ను, ఈ పన్ను పెంచబట్టే అద్దె పెంచుతున్నామని యింటి యజమానులు అద్దెకుండే వారి నుంచి డబ్బు గుంజుతున్నారే గాని.. ఆ అద్దెకు తగినట్లు ఆ యింటిలో అన్ని సౌకర్యాలుంటున్నాయా? అద్దెకు తగిన పన్నుని వారి నుంచి గవర్నమెంట్ వసూలు చేస్తుందా?! నిజాయితీతో వాళ్లు తీసుకునే అద్దెకు ఎంత పన్ను కట్టాలో అంత పన్నుని ప్రభుత్వానికి కడుతున్నారా అని ఏ ప్రభుత్వం పట్టించుకోదు. అద్దె యింటి యజమానితో మనం ఎన్ని బాధలు పడ్డా – రోజులు బాగుండి మనము ఇల్లు కట్టుకుంటే ఒకప్పటి మన అద్దె యింటి ఓనర్సులా ప్రవర్తిస్తుంటాం మనం కూడా!

ఇది ఇలా పోతే కొంతమంది ఇది మా హక్కు. ఇది మీకు తగదు. అందరం ఒక్కటే అని నినాదాలను చేసే వాళ్లను ప్రభుత్వం చూస్తూ ఊర్కోదు. " సౌమ్యవాదే కానక్కర్లేదు. ఏమాత్రం అసంతృప్తి చూపెట్టినా – పిసరంత విమర్శించినా సరే, కాల్చేయండి నిర్దాక్షిణ్యంగా" అంటూ ఆర్డర్లు జారీ చేస్తుందీ గవర్నమెంటు. ఇలాంటి గవర్నమెంటును ఆత్రేయ 'అంతర్యుద్ధం' నాటికలో తీవ్రంగా విమర్శించారు.

కొంతమంది రచయితలు తన బాధ్యతగా సమాజంలో జరిగే అవినీతి ఆక్రమాలను కథావస్తువుగా స్వీకరించి రచనలు చేసి నలుగురికి చాటితే ప్రభుత్వాలకిది విద్రోహ చర్యగా కనిపిస్తుంది. అందుకే 'ఆవేశం' లాంటి ప్రభుత్వం " కవులు! వెధవ కవులు. ప్రభుత్వ ద్రోహులు! అందరూ రాసే వాళ్ళే.." (అంతర్యుద్ధం) అని విరుచుకుపడుతుంది. అదే స్వాతంత్ర్యముందు బ్రిటిష్ గవర్నమెంటు మీద నిరసన తెలుపుతూ సాహిత్యాన్ని రాసినవారు వారికి గొప్ప రచయితలుగా కవులుగా కనిపించారు. ఎందుకంటే రచయితలు అప్పుడు విమర్శించింది తెళ్ళోళ్ళని కాని ఇప్పుడు మనోళ్ళనే విమర్శిస్తున్నారు. కనుక నిజం మింగుడు పడడం లేదు మన నాయకులకు.

ఈవిధంగా ఆత్రేయ నాటక సాహిత్యంలోని తన సంభాషణ ద్వారా కథానుగుణంగా మన ప్రభుత్వ విధానాలని తీవ్రంగా విమర్శించారు.

3.14.2. బ్లాక్ మార్కెట్‌పై ఆత్రేయ విమర్శ :

బ్లాక్ మార్కెట్ ఎన్ని రూపాల్లో ప్రజలను నిలువునా దోచుకుంటుందో చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తకుండా ఉంటుంది. ఇంత జరుగుతున్నా. చూస్తున్నా.. తనదాకా వస్తే గాని తెలియదు' అన్నట్లు ఉండకూడదు మనం. అన్యాయం, ఆక్రమం జరిగినప్పుడు దాన్ని చూసినప్పుడు బాధ్యత గల పౌరునిగా అడ్డుకోవాలి. ఎదిరించాలి. మనకు సవ్యంగా జరుగుతుంది కదా అన్ని మౌనంగా వుంటే రేపు ఆ అన్యాయానికి ఆక్రమానికే మనమే బలి కావచ్చు. బ్లాక్ మార్కెట్‌ను నిరశించక పోగా ఆ వ్యాపారం చేసే వాడిని బ్లాక్ మెయిల్ చేసి లాభపడాలనుకునే 'ఆవేశం' ఒకరోజు బాధపడుతూ " కడుపులో ఏదో గడబిడగా వుంది? ఈరోజు అధికంగా తిన్నావు. అయినా వెధవ బియ్యం. పాలిష్ తక్కువగా వేసి పంపాడు వాడు. రేపొస్తే కాస్త దబాయించు వెధవ! బ్లాక్ మార్కెట్ వ్యాపారం చేస్తున్నా పోనీలే అని

వదిలిపెడుతూంటే మనకే దగా చేస్తున్నాడూ!' (అంతర్యుద్ధం) అని నాటికలో బ్లాక్ మార్కెట్ వల్ల కలిగే అనర్థం తెలుసుకొని మాట్లాడుతుంది. బ్లాక్ మార్కెట్ విధానం ఈదేశంలో ఎంత బలంగా నాటుకుపోయి ఎదిగిందో ఆత్రేయ ఈనాడు నాటకంలోని ఒక సన్నివేశంలో చెప్పాడు. స్వాతంత్ర్యం వచ్చిన రోజు కనులపండుగగా జరిగే స్వాతంత్రోద్యమం గూర్చి పురుషోత్తంతో రాం మాట్లాడుతూ " అన్నీ బాగానే వున్నాయి కానీ" అని చెప్పడం ఆపిన రాంతో " కానీ ఏమిటి?" అని పురుషోత్తం చెప్పమన్నట్టు అడగగా "ఈనాడు జెండాను కూడా బ్లాక్ మార్కెట్ చేశారు. అందుకే నా హృదయం చివుక్కుమన్నది" అని రాం పాత్ర ద్వారా చెప్తారు ఆత్రేయ. దీన్ని బట్టి బ్లాక్ మార్కెట్ యొక్క అవినీతి సరూపం ఎంతగా తీవ్రరూపం దాల్చిందో అర్థమవుతుంది. ఈవిధానాన్ని ఖండిస్తూ ఆత్రేయ సినిమాలలో కూడా ఎన్నో పాటలు రాశారు.

3.14.3. హిందూ వివాహ చట్టంపై ఆత్రేయ విమర్శ :

ఆత్రేయ హిందూ వివాహ చట్టంలోని కొన్ని లోపాలను వ్యంగ్యంగా విమర్శించారు. పతంజలి " హిందూ వివాహ చట్టం' పుస్తకం గూర్చి కూతురితో " ఇదుగో నల్లగా ఇంత లావున వుంటుంది. ఆ బరువు నువ్వు మోయకపోతే ఆ వెధవను తెమ్మని " అని చెప్పి తమ కేసు వాదించమని అతని దగ్గరకు వచ్చిన వాళ్ళతో " మన వివాహం వుంది చూచారూ– దానంత పవిత్రమైంది ఇక ప్రపంచంలో ఏదీలేదు. అంటే, అలాంటిదీ అని అర్థం. పుణ్యక్షేత్రాలకెప్పుడన్నా వెళ్ళారూ? అక్కడ పవిత్ర జలాలు, పవిత్ర స్థలాలు ఎంత ఛండాలంగా వుంటాయో తెలుసుగా. అంతే అనుకోండి" అని కూతురు తెచ్చి ఇచ్చిన పుస్తకం అందుకొని " బరువు చూచావా? హిందూ వివాహం బరువు? గాడిద బరువు" అని (అంత్యార్పణ) అంటాడు.

ఈ సంభాషణలో ఆత్రేయ గారి భావన ఏమిటంటే హిందూ వివాహచట్టం భార్యా భర్తల అనుబంధం విషయంలో ఎంత గట్టిదో అంత పనికిమాలినదీ, బరువైందని. భర్త దుర్గార్గుడు, క్రూరుడైనా అలాగా భార్య భర్తను లెక్కచేయనిదైనా చచ్చినట్లు వాళ్ళు చచ్చేదాక చస్తూ కాపురం చేయాల్సిందే.

ఇద్దరూ అంగీకరిస్తే తప్పించి ఏ ఒక్కరూ చట్టపరంగా విడాకులు తీసుకోడానికి వీలుపడదు. ఇలాంటి కొన్ని లోపాలను ఎత్తి చూపుతూ ఆత్రేయగారు విమర్శించి ఉంటారు. ఈ చట్టం అందులోని సూత్రాలననుసరించే బరువైన బంధం కాదు. మోయడానికి కూడా ఆ గ్రంధం బరువైనదేనని వ్యంగ్యంగా విమర్శించారు ఆత్రేయ.

3.14.4. పత్రికల్లో వచ్చే రొటీన్ వార్తలపై ఆత్రేయ విమర్శ :

ఆత్రేయ సాధారణమైన సంభాషణల స్థానంలో కూడా మంచి మాటలను పాత్రనోట పలికించగల నేర్పరి. ప్రమాదం వల్ల మంచానపడి రెస్టు తీసుకునే భర్తకు కాస్త రిలీఫ్ ఇద్దామని 'పేపరు చదివి వినిపించనా' అనే లిల్లీ మాటలకు 'ఆ.. అందులో మాత్రం ఏముంటున్నాయి చదవటానికి? ఎక్కడ చూసినా చావులూ, హత్యలూ, దొంగతనాలు, చిన్నచిన్న దేశాల్లో అంత:కలహాలు, పెద్దదేశాల్లో యుద్దాలు, హైడ్రోజన్ బాంబు పరీక్షలు, అంతరిక్ష యాత్రలు, శాంతి ఉపన్యాసాలు ఏముంది నా తలకాయ" అని మనసూ–వయసూ నాటకంలో రోజూ పేపర్లో వచ్చే రొటీన్ వార్తలను ఈ ప్రపంచంలో జరిగే అన్యాయాలను విమర్శిస్తారు ఆత్రేయ. పత్రికలు వీటికంటే – సమస్యల పరిష్కారానికి సంబంధించిన విషయాలు రాస్తే బాగుంటుందనే అభిప్రాయం ఆత్రేయ గారిది.

1.14.5. దేవుళ్లపై ఆత్రేయ విమర్శ :

ఆత్రేయ తన సంభాషణలలో దేవుళ్ళను కూడా పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ విమర్శించారు. సార్జెంటు కోసం ఎదురుచూస్తే భర్తతో " ఇద్దరూ కలిసి బంగారం చేస్తున్నారా ఏం కొంప తీసి" అని అనగా "తినబోతూ రుచి అడగడం దేనికి " అనే సామెత పలికిన తన తండ్రిని చూసి " నాన్న అట్టాంటిదేదైనా వుంటే బంగారం అంటే పడి చచ్చే

వెంకటేశ్వరుడికి మొక్కో" (వరప్రసాదం) అని కొడుకు వ్యంగ్యంగా అంటాడు. ఇలా ఆత్రేయ వ్యంగ్యంగా విమర్శించారు. ఎందుకంటే తిరుపతిలో అతని వంటి నిండా ఆభరణాలతో కాదు వళ్లే బంగారంతో చేయించుకున్నాడు కనుక అది చూసిన ఆత్రేయ అలా విమర్శించారు.

కవి అయిన రజని తన ఆర్థిక దుస్థితికి దేవుడ్ని నిందిస్తాడు. చాలా మంది దేవుడి పటం ఎదుట నుల్చొని ప్రార్థిస్తుంటారు. అలాగే తన కొడుకునీ అన్నం పెట్టలేని ఈ తల్లిదండ్రుల కడుపునే మళ్ళీ పుట్టాలని ప్రార్థించమని అంటాడు. ఎందుకంటే " అన్నం అయితే పెట్టలేడు కానీ, ఆర్త త్రాణ పరాయణుడైనా దేవుడు పుట్టుకలు మాత్రం నువ్వు కోరినట్లుగా ఇస్తాడురా" (ఛస్తే ఏం?) అని వ్యంగ్యంగా విమర్శిస్తాడు. నారు పోసినవాడు నీరు పోయక మానునా అనుకుంటారు. అందరిలాగా పుట్టిన ఒక బిడ్డ పాలు తాగుతూ కేరింతలుతో తల్లిదండ్రులను మురిపిస్తూ ఆడుకుంటుంటే– మరోచోట మరొకరికి పుట్టిన బిడ్డ తిండి లేక పాలు పడని రొమ్ములపై పాలకోసం కెవ్వున ఏడుస్తూ వుంటాడు. ఇలాంటి వ్యత్యాస బ్రతుకులు ప్రసాదించమని ప్రార్థించకపోయినా దేవుడు ప్రసాదిస్తాడు గాన ఆకలితో అలమటించే ప్రాణాలకు అన్నమయితే పెట్టలేడని విమర్శిస్తారు ఆత్రేయ.

3.14.6. ఋషులపై ఆత్రేయ విమర్శ :

మానవజీవితం అందమైనదీ ఆవేదనకరమైనదీ. ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొంటూ జీవితాన్ని గడుపుతూ ఉండాలి. పుట్టిన నాటి నుంచి చచ్చేవరకు బాల్యం, నిరుద్యోగం, ఉద్యోగం, సంసారం, పిల్లల పెళ్లిళ్లు, వృద్ధాప్యం, కష్టనష్టాలు ఇలాంటివెన్నో వుంటాయి. వీటన్నింటిని అనుభవించక మోక్షాన్ని స్వర్గాన్ని పొందాలని దాన్ని అందుకోవాలని పరితపించి తపస్సు చేసేవారు ఋషులు. ఇలాంటి ఋషులను గూర్చి ఆత్రేయ 'మాయ' నాటికలో ధరిత్రి పాత్ర ద్వారా " అది తపస్సు కాదు. ప్రపంచాన్ని చూసి పిరికివాడు తీసే పరుగు, కష్టాలననుభవించలేక, సుకుమారులు చేరే చల్లని పంచ, కృషికి భయపడి సోమరిపోతులు పోయే దొంగనిద్ర" అని తపస్సు చేసే వాళ్ళను నిందిస్తారు ఆత్రేయ. ఈనాటి సమస్యలకు కూడా ఈ మాటలు వర్తిస్తాయి.

3.14.7 కపట ఆస్తికుల పట్ల ఆత్రేయ విమర్శ :

ఆత్రేయ అస్తికులలో ఒక రకమైన ఆస్తికులంటే అసహ్యించుకుంటారు. అలాంటి వారెవరో తెలుసుకుందాం. " ఆత్మ తృప్తికోసం, దేవుడన్న వాణ్ణి ఏర్పరచుకున్న బలహీనులంటే నాకు అతి అసహ్యం." అని కాపలావాని దీపం నాటికలో కార్మిక పాత్ర ద్వారా విమర్శిస్తారు ఆత్రేయ. అలా విమర్శిస్తూనే " ఏ వింత వల్లనైనా నువ్వు తిరిగి పుట్టవలసి వస్తే ధైర్యం, జ్ఞానం గల నాస్తికుడుగా పుడతావని నమ్ముతాను " అని కవితో అన్నట్లు కార్మికుని చేత పలికించారు. ఒక రకమైనటువంటి ఆస్తికులను విమర్శించడమే కాక పునర్జన్మ పట్ల ఆత్రేయకు విశ్వాసం లేదని తెలియజేశారు. అందుకే ఒకచోట "ఈ 'నేను' మరలా పుడుతుందనడం, అనుకోవడం అవివేకం. అంటే పునర్జన్మ సిద్ధాంతాన్ని నేను అంగీకరించను" అని అంటారు ఆత్రేయ. కాబట్టే పై సంభాషణలో " ఏ వింతవల్లనైనా " అనే మాటను వాడారు.

3.14.8. మూఢాచారాలపై ఆత్రేయ విమర్శ :

ఆత్రేయ ఈనాడు నాటకంలో హిందూ ఆచారాల మీద కూడా తన విమర్శనాస్త్రాన్ని సంధించారు. ఒకరి బ్రతుకు బాగుకు సహాయం చేయకపోగా ఆ బ్రతుకు మీద శాసనం చేసే అధికారం మనకెవ్వరిచ్చారని ఆలోచించని అజ్ఞాన మానవులం మనం. ఈనాటికలో రాం సరిగ్గా ఇలాంటి పనే చేయబోతాడు. రాం హిందూ మతస్థుడు. ఊళ్లో హిందూ ముస్లింలకు అల్లరు జరుగుతుంటాయి. ఒక హిందూ స్త్రీ ముస్లిం మతస్థులైన నసీం ఇంట్లోకి రక్షణార్థమై వచ్చి తలదాచుకోగా ఆ ముస్లింల చేతిలో ఆమె శీలం పోతుందని రాం అమెను బయటకి పంపివేయమంటాడు.అవసరమైతే చంపేస్తానంటాడు.

అంతేకాదు "చావాలి. చావక తప్పదు. మతం కోసం కాదు. కులం కోసం కాదు. స్త్రీ జన్మ కోసం. స్త్రీ జన్మ పవిత్రతను కాపాట్టం కోసం. ఈ నీచపు బ్రతుకు బ్రతకటం కంటే చావటం మేలు" అని అనగా " అది అనగా" అది మీ హిందువుల కాది నుంచీ వున్న ఆచారమేగా ? ఆడదాని శీలాన్నికాపాడటానికి చంపేయటం తప్ప వేరే మార్గం లేదు మీకు " అని నసీం అంటుంది. అలా నసీం పాత్రద్వారా 'ఈనాడు' నాటకంలో హిందూల మూఢాచారాలను తీవ్రంగా విమర్శించారు. చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. పూర్వం యుద్ధంలో హిందువులు ఓడిపోతే తమ స్త్రీలు శత్రువులకు చిక్కి శత్రుసైన్యం చేత చెరచబడి చెరబట్టబడతారేమోనని అనేకానేక ఆచారాలను అనుసరించారు. ఇనుప కచడాలను స్త్రీలకు తొడిగారు. అలాగే భర్త చనిపోయిన తర్వాత భార్య బ్రతకకూడదని సతీసహగమనం చేయించేవారు. అలాగే యుద్దాల్లో తమ భర్త ఓడిపోయారనే తెలిస్తే స్త్రీలు అగ్నిగూండాల్లో దూకేలా ఆచారాన్ని సృష్టించారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని ఆత్రేయగారు ఘాటుగా ముస్లిం పాత్ర ద్వారాగాని విమర్శిస్తే బుద్ధి రాదని విమర్శింపచేసారు. ఈవిధముగా మూఢాచారంతో రాక్షసుల్లా ప్రవర్తించే వారిని విమర్శించారు ఆత్రేయ.

3.14.9. మనుషుల మనస్తత్వంపై ఆత్రేయ విమర్శ :

డబ్బున్న వాడికి లేనివాడికి అందరికీ ఆశే! మనిషన్న ప్రతి మనిషికి ఆశే! మనిషికి సంతృప్తి అనేది ఉండదు కాబోలు. మధ్య తరగతి మనుషుల్లో ఆశలు ఆకాశమంత ఎత్తున ఎదిగి విస్తరించి ఉంటాయి. ఇతరుల కంటే మెరుగ్గా బ్రతుకుతూ కూడా తల్లి తన ఆశను ఆమె కొడుక్కి చెప్పగా " ఆశ, ఆశలకేమమ్మా! మనం ఆశలు మేసి బ్రతుకుతుంటాం. ఎన్నో అన్నీ చేసుకోవాలని ఉంటుంది. వీలుంటే యీ ఇల్లు పడగొట్టి పెద్ద బంగళా కట్టాలని, ఓ పెద్ద కారు కొనాలని, పదిమంది నౌకర్యు చాకర్లను పెట్టుకొని దర్జాగా బ్రతకాలని అనుకుంటాం. కాని ఎలా?" ఇలా ఆశలనేవి అందరికీ ఉంటాయి. ఈ ఆశలు మనిషిని ఎటు నడిపిస్తాయంటే అదృష్టమనే అజ్ఞానం వైపు. ఈ అజ్ఞానంలో ఏవేవో చేస్తుంటాము. మనిషి స్వయంకృషిని నమ్ముకొని బ్రతకడానికి ఇష్టపడడు. కాని అదృష్టం కలిసొస్తది తన్నుకొస్తుందని ఉన్న సొమ్మంతా ఊడ్చి ఉంగరాలు పెట్టుకుంటే తప్పక జరుగుతుందని విశ్వసించె వాళ్ళెందరో. ఇలాంటి వాళ్లనే ఉద్దేశించి " మన బ్రతుకులే అంతమ్మా ! జూదాలు, రేసులు, దేవుళ్లు, వ్రతాలు, కవచాలు, మంత్రాలు మనక్కనబడతాయి. మునుగుతున్న వాడు గడ్డిపోచను పట్టుకున్నట్లు పట్టుకుంటాం వాటిని " అని 'వరప్రసాదం' నాటికలో విమర్శిస్తారు ఆత్రేయ. మానవునిలోని బలహీనతను తెలివైనవారు దేవుడి పేరిట, నమ్మకాల పేరిట, కులమతాల పేరిట, సంస్థల పేరిట ఇలా అనేకానేక మార్గాల్లో సొమ్ము చేసుకొని మోసపుచ్చుతారు.

ఇంకా మధ్య తరగతి బ్రతుకులు ఎలాంటివో 'ఎస్.జి.వో.'. నాటకంలో రంగనాధం డాక్టర్ మధ్య సంభాషణలో చెప్పారు. రంగనాధం డాక్టర్ కోటీశ్వరుని బంగ్లాను, పేదవాడు పూరి పాకలను చూపిస్తూ " ఆ కోటీశ్వరుని బంగళా చూసి అసూయపడతాను. ఈ పూరిపాకను చూసి గర్వపడతాను. ఆ కోటీశ్వరుడి స్థాయిలో బ్రతకాలని ఉబలాటపడతాను. ఈ పూరి గుడిసెలో వాడు నాలా బ్రతికితే ఓర్వలేను. ఆ బంగ్లా-ఈ పూరిపాక వీటి మధ్య ఆడకత్తెరలో పోకలా నలిగిపోతున్న బ్రతుకులు రా బాబు " అని అంటారు. ఈ సంభాషణలో సామాన్య మనిషికి కలిగే ఆశ అదే సమయంలో మనిషిలో సహజంగా ఉండే ఈర్ష్య ఇలాంటి మానసిక స్థితులను చెప్పారు.

ఎన్.జి.వో.నాటకంలో ఆత్రేయ ఉన్నవాడ్ని చూసి, వాడిలా వుండాలని ప్రయత్నిస్తూ మరింత ఊబిలోకి దిగుతూ గిలగిలకొట్టుకునే మధ్య తరగతి వారిని విమర్శించారు. ఉన్నదానిలోనే ఆశలు తీర్చుకుంటూ బ్రతుకు శ్రవ్యంగా గడిచిపోయేలా చేసుకోవాలే గాని బ్రతుకే బరువు కాకూడదు. డాక్టరు గారు తన యింటికి రావడం చూసి " ఏమే కాఫీ పెట్టావా" అని ఇల్లాలు ముఖం చూసి " పాలు లేవేంటి?" అని ప్రశ్నించగా 'అసల్దే లేదు' అనే ఇల్లాలి సమాధానానికి "కాఫీ పొడా? పోనీలే! వూర్కో, నేనేదో దర్జాగా అనేశాను " అనిన భర్త మాటలకు ఆత్రేయ విమర్శనాత్మకంగా " ఈ దర్జాలకేం తక్కువ

మనకు!" అని ఆ యిల్లాలు పాత్ర ద్వారా పలికిస్తారు. డబ్బున్నా లేకపోయినా డబ్బున్న ఎదురింటి వాళ్ళు ఎక్కడ తక్కువగా చూస్తారేమోనని మనమూ ఉదయాన్నే టిఫిన్ కాఫీలు సేవించడం, వాళ్లకున్నట్లే తాము వస్తువులు సమకూర్చుకొని హొదాగా ఉన్నట్లు కనబడడానికి ఫ్రిజ్‌లు, టి.వి.లు ఇన్‌స్టాల్‌మెంట్‌లోనో, ఉన్నదంతా ఊడ్చుకొని డబ్బు కట్టలేక నలుగురిలో నవ్వులపాలవ్వడమో లేదా నానా ఇబ్బందులు పడడమో..! జరుగుతుంటుంది. ఇలాంటోళ్ల కన్నా కాపీ తాగటానికి అణా యివ్వమని ప్రాధేయపడిన బిచ్చగాడే నయమనిపిస్తాడు గోపీ పాత్రద్వారా. ఎందుకంటే " మనం మాత్రం మన తాహతకు మించిన బ్రతుకు బ్రతకవచ్చు. అందుకోసం అడుక్కు తినలేక అప్పులు చెయ్యొచ్చు. ఏ మహారాజునో చూచి వాడిలా బ్రతకాలని వుబలాటపడి, లేనిపోని డాంబికాలు, దర్జాలు నటించొచ్చు. అలవాట్లు చేసుకోవచ్చు." అని చెప్తూ " మన కన్నా వాడు చాలానయం. యదార్ధంగా చెప్పాడు కాఫీ తాగాలని వుందని, మనం వట్టి మోసం చేస్తాం ప్రెస్టేజి బురఖాతో" అని గోపీ పాత్రద్వారా తీవ్రంగా విమర్శిస్తారు ఆత్రేయ. అలాగే వస్త్రధారణ విషయంలో కూడా మధ్యతరగతి వాడి ఇమిటేషన్ – కలెక్టర్ పిలుపు మేరకు గుమస్తా రంగనాధం బయలుదేరుతూ వంకికి తగిలించిన తన కోటును తెమ్మని " ఈ కోటెందుకు తగిలిస్తానో తెలుసా?" అని ప్రశ్నించగా " ఏమో నాకేం తెలుసా? " అని ప్రశ్నించగా " ఏమో నాకేం తెలుసు? " అనిన అతని భార్య మాటలకి " ఇదిగో ఈ షర్టు చిరుగు దాచిపెట్టడానికి, ఇదీ మన బతుకు. ఇదీ మన గొప్ప – గౌరవం" అంటాడు. అంటే ఆర్థిక స్థితిలో బాగా లేకపోయినా – లేనివాడిగా నలుగురు తన చిరిగిపోయిన బట్టలను చూసి చీదరించుకుంటారేమోనని పెళ్ళి నాటిదో మరెప్పటి కోటో వేసుకొని ఉన్నవాడిలా నటిస్తూ నెట్టుకొచ్చే మధ్యతరగతి బ్రతుకుల ఇమిటేషన్‌ను విమర్శించారు.

ఇక మానవ స్వభావం ఎలాంటిదో ఆత్రేయ 'మాయ' నాటికలో ఇలా చెప్తారు విభాండకుడు పాత్ర ద్వారా. ఏడ్చే మానవుల బ్రతుకే అంత. ఎప్పుడూ ఏడుపు తల్లి గర్భం నుంచి ధరిత్రి వడిలో పడేటప్పుడు ఏడుస్తారు. ఏడుస్తూ, ఇతరుల నేడిపిస్తూ బ్రతుకుతారు, చస్తారు" ఇదీ మానవ స్వభావం. ఇందులో మనం గ్రహించాల్సింది ఏమిటంటే బాగా బ్రతికేవాళ్ళను చూస్తే కొంతమంది ఏడుస్తూ ఉంటారు. అలాంటి వాళ్లు అలా హాయిగా బ్రతికే వాళ్ల బ్రతుకుల్లో ఏదో ఒక కల్లోలం రేపడానికి ప్రయత్నిస్తూ ఏడ్చేరకం.ఇలాంట వాళ్లను ఆత్రేయ తీవ్రంగా విమర్శించారు వారిపాటల్లో కూడా. " నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది" అని ప్రేమనగరులోని " నేను పుట్టాను..' అనే పాటలో అంటారు. ఈ పాటలోనే లోకం తీరు కూడా ఉంది. అలాగే " ఏ డబ్బు గల వారో కట్టెలు మోసుకొస్తే 'సింప్లిసిటీ' అంటారు. అదే మాబోటివాళ్లయితే గతిలేదంటారు" అని ఎన్.జి.వో.నాటకంలో లోకం తీరు గురించి గుమస్తా గురునాధం పాత్ర ద్వారా పలికిస్తారు ఆత్రేయ.

3.14.10. ఈనాటి నాటక విధానంపై ఆత్రేయ విమర్శ :

ఆత్రేయ అతి పవిత్రంగా భావించే నాటక కళలో జరిగే కొన్ని తప్పులను విమర్శించారు. ఒకానొక కాలంలో కాంట్రాక్టు నాటకంలో నటించడానికి ఒప్పుకుని " నేను భీముడికి సరిపోనూ?" అని ఆశగా అడుగగా " ఆ..ఆదేంది లేండి. ఇప్పుడందరూ అన్నింటికి సరిపోయే వేస్తున్నారా? ఎవడు చూచొచ్చాడు భీముడిని, మనిషుంటే చాలు" అని నాటకాల కాంట్రాక్టర్ చిన వెంకటసుబ్బయ్య అంటారు. పాత్రల ఎంపికలో నియమాలు ఆదర్శాలు లేని కాంట్రాక్ట్ లాంటి నాటక సమాజాలు అంత నిర్లక్ష్యధోరణితో ఉంటాయి. వాళ్లకి కావాల్సింది డబ్బు, ఇలాంటి వాటిని చూసి ఆత్రేయ తీవ్రంగా విమర్శించారు. అదేవిధముగా తన నాటికలోని స్త్రీ పాత్రలో నటించని భార్యను ఒప్పించడానికి మను మరో స్త్రీని పెళ్ళాడినట్లు నాటకమాడతాడు. అందులో రాఘవయ్య రంగయ్య పాత్రగా మనూకు మామగా రాధ దగ్గరకొచ్చి తన కూతుర్ని మనూ పెళ్ళిచేసుకున్నట్లు మనూ రాఘవయ్య అసలు విషయాన్ని చెప్పగా " ఎంత గొప్పగా తెచ్చి ఎంత తుస్సుమని పోనిచ్చావోయ్" అని మనూ అనగా " ఈనాటి నాటకాలే అంత!" అని 'కళకోసం' నాటికలో రాఘవయ్య పాత్రచేత పలికిస్తారు. ఆవిధముగా రాఘవయ్య పాత్ర ద్వారా ఈనాటి నాటకాలోని లోపాలను ఎత్తిచూపుతూ సున్నితంగా

విమర్శించారు ఆత్రేయ. అలాగే స్టేజిమీద నాటకాలు వేయడానికి ముందుకు రాని స్త్రీలను ఉద్దేశించి " నాటకాల్లో వేషాలు వేస్తే తప్పా! నాటకాల్లో కన్నా మించి మేకప్, డ్రెస్సు చేసకొని పదిమంది చూడాలని ఏదో పనంటూ పట్టపగలు వీధులంబడి తిరగవచ్చు కాని, నాటకాల్లో వేషాలు వేయరాదేం?" అని మనూ అతని భార్యతో పలికినట్లు విమర్శింప చేస్తారు ఆత్రేయ.

ఈవిధముగా ఆత్రేయ తన నాటక సాహిత్యంలో కొన్ని విషయాలను తీవ్రంగా నిరసిస్తూ విమర్శించారు. వారి విమర్శలో ఏ దురభిప్రాయం ఉండదు. మార్పు కోరే మనిషే కాని తానొక్కడే ఖచ్చితమైన మనిషినని, కళాకారుడ్ని – రచయితనని చెప్పుకోవడం కాదు. అందుకే నాటకరంగం మీద విమర్శ చేస్తూ చివరన రచయితలకు ఇలా విన్నవించుకుంటారు. " నా విమర్శను సహృదయంతో స్వీకరించి – నిద్రాణమై – నిస్సారమైపోతూన్న తెలుగు నాటక రంగానికి సరికొత్త కలం కొరడాలతో – మేలుకొలుపు పాడి ముందుకు వురకలు వేయించాలని నా కోరిక–విన్నపం". ఈ విన్నపం ప్రజలకు కూడా వర్తిస్తుంది.

3.15. ఆత్రేయ సంభాషణలలో 'స్త్రీ' :

ఆత్రేయ తన సంభాషణలలో స్త్రీ మూర్తిలోని త్యాగాన్ని, తెగింపును, ఆమె శక్తిని తెలియపరిచారు. ఉదాహరణకి 'గౌతమబుద్ధ' నాటకంను పరిశీలిస్తే సిద్ధార్థుని వైరాగ్య భావాలకు విరుగుడుగా మంత్రి పాత్ర చేత ఆత్రేయ ఏమి సలహా ఇప్పించారంటే " ఎట్టి వైరాగ్య భావమైమానినీ మందహాస శృంఖలాలకు కట్టుబడిపోతుంది. పరిత్యాగ సాగరమంతా వనితా వీక్షణాలకు యింకిపోతుంది. ప్రపంచాన్ని చేతనంగా చేసి నడిపించే మహాశక్తి స్త్రీ. అని శుద్ధోదన మహారాజుకు మంత్రి సలహా యిచ్చినట్లు ఆత్రేయ గోప్యంగా పలికించారు. అలా వారి చూపులకు గల ఆ శక్తి ప్రపంచాన్ని చేతనంగా చేసి నడిపించే మహాశక్తి స్త్రీకే ఉన్నట్లు " అశోక సామ్రాట్ " నాటకంలో " నారీలోకం నడుము కడితే అసాధ్యం' అనేది వుండదు. స్త్రీ శక్తి స్వరూపిణి. మహిషాసురుని సంహరించిన మాత, మృత్యువును జయించిన మానిని, మార్తాండుని నిల్పిన మహిళ మనవారే " అని అశోకచక్రవర్తి సామ్రాజ్య దాహానికి ఎదురు తిరుగమని 'శాంతి'లో విప్లవాన్ని రగుల్చుతూ ప్రేమానందుని పాత్ర ద్వారా ప్రభోదిస్తారు ఆత్రేయ.

స్త్రీలు ఎంతటి దయాహృదయులో మనసూ–వయసు నాటకంలో ఆత్రేయ ఇలా చెప్పారు." ఆడవాళ్లు పొరబాట్లను, మోసాలను మగవాళ్ళ కన్నా సానుభూతితో, సృహదయంతో చూస్తారు. సులభంగా మన్నిస్తారు. మర్చిపోతారు. క్షమ వాళ్ళ స్వభావానికి చాలా సన్నిహితం. వాళ్ళకి కావల్సిందల్లా మనం వాళ్ల ప్రాముఖ్యతను గుర్తించడమే" అని తాను చేసిన తప్పును లిల్లీ క్షమిస్తుందా అని అడిగిన శివుడిత తిరుపతి చెప్పినట్లు ఆత్రేయ పలికిస్తారు.

3.16. ఆత్రేయ సంభాషణలలో కవులు :

ఆత్రేయగారి దృష్టిలో కవి, రచయితలయినవారు గొప్పవాళ్ళు. వీళ్ళు కలమనే ఆయుధం ద్వారా ఏమైనా సాధించగలరని ఆత్రేయ నమ్మకం. అందుకే వీళ్లు ఎలాంటి వాళ్లో అశ్వఘోషుడు నాటకంలో మహాకవి అయిన అశ్వఘోషుడ్ని బౌద్ధమత గురువు పాత్రచేత కవులనే వారు "త్రికాలజ్ఞులు.. గతాన్ని, వర్తమానాన్ని అర్థం చేసుకొని భవిష్యత్తును రూపొందించగలగిన వాళ్లు..మానవునిలో మానవత్వాన్ని, దైవత్వాన్ని పెంచగలవాళ్లు.. చీకటి లోకానికి కాగడాలు. కవులు ప్రజాబాహుళ్యానికి మార్గదర్శకులు కావలసినవారు కవులు. దేశం యొక్క సంస్కృతి, స్వాతంత్ర్యం, సౌభాగ్యం సర్వస్వం మీ మీద ఆధారపడింది. ప్రజలు మీ కలం గీచిన బాటలననుసరిస్తారు. మానవజీవితంలో అమరవాహిని కవి. కవి చిరంజీవి' అని 'పరివర్తన' నాటకంలో గొప్ప కవి అయి ఉండి అజ్ఞాతంలో ఉంటూ బాబు చేతిలో కీలుబొమ్మలా ఉంటూ అతనికి కావల్సిన స్టేట్‌మెంట్లు, ఉపన్యాసాలు రాసేవానిగా కవిచూసిన చౌదరి పాత్ర ద్వారా ఈ మాటలను పలికిస్తారు. ఈ మాటలను బట్టి

కవి అయినవాడు సమాజానికి ఎంత ఉపయోగపడతాడో తాను నిర్వర్తించవలసిన విధులు బాధ్యతలు కవులకు వున్నవేమిటో పాత్రలముఖంగా వివరించారు ఆత్రేయ.

ఇంకా చెప్పాలంటే కవి ఏమి చేయాలి? ఏమి రాయాలి? అనే విషయాన్ని కూడా ఆత్రేయ తన నాటకసాహిత్యంలోని సంభాషణలలో కొన్ని పాత్రల నోట పలికించారు 'పరివర్తన' నాటికలో.

'జగతి నడిపించేటి జ్ఞానజ్యోతివి నీవు తెగువ కలిగించేటి దివ్యౌషధము నీవు" అని కవి గూర్చి చెప్పారు ఆత్రేయ. కవులైన వారు పాఠకులను మైమరపించే శృంగారగీతాలను రాయడమే కాదు. తమ చుట్టూ వున్న సమస్యలను కథా వస్తువుగా తీసుకొని తమ కళ్ళ ఎదుట జరిగే ఘోరాలను సాహిత్య రచనలో బహిర్గతం చేయాలంటారు. అందుకే..

" పలుకవోయ్ పేదోళ్ల బ్రతుకు తెలిసేటట్లు

వ్రాయవోయ్ కలవాళ్లు వణికిపోయేటట్టు "

అని 'పరివర్తన' నాటకారంభంలోనే రంగడు పాత్రచేత ఈపాటను పాడిస్తారు ఆత్రేయ. ఆత్రేయ కవులకు ఇలా ఎందుకు చెప్పారంటే ఒక కళాకారుడు తన కళారూపం ద్వారా నిద్రాణంలో వున్న ప్రజలను మేల్కొలపాలి. ఉత్తేజవంతుల్ని చేయాలి. అంతేగాని పరివర్తన నాటకంలో మాదిరి తాను నేర్చిన విజ్ఞానాన్ని కష్టజీవులలో చైతన్యాన్ని రగల్చడానికి వినియోగించక రఘు (కవి) పాత్రలాంటి కవులు ఒక దుర్మార్గుని ఎదుగుదలకు ఉపయోగపడే స్టేట్‌మెంట్లు , ఉపన్యాసాలు రాయడానికి ఉపయోగపడకూడదని ఆత్రేయ ఉద్దేశ్యం.

ఆత్రేయ తన నాటక సాహిత్యానిపై ప్రయోజనాలను ఆశించి రాశారు. వారు చేపట్టిన కథా వస్తువులు ఎలాంటివో 'కాపలావాని దీపం' లో సౌందర్య వర్ణణలతో కవిత్వాన్ని అల్లే కవిని ప్రశ్నించే కార్మికుని పాత్రద్వారా తెలుస్తుంది. "లోకపు కుళ్లు చూడలేదా నువ్వు? జాడ్యాన్ని చూడలేదా నువ్వు? తిండిలేక గుడ్డ పీలికల్లా కూలిపోయే పసిపిల్లల్ని చూడలేదా నువ్వు? తిండిలేక పాలిపోయిన ఆ పసికందుల శరీరాలు నిన్నెప్పుడూ ఉద్రేకింపచేయలేదా? ఒళ్లు కప్పుకోవడానికి గుడ్డ చాలక అర్ధనగ్నంగా అల్లాడిపోయే స్త్రీలెన్నడూ కంటపడలేదూ? వయసు గడిచిపోయినా, పట్టెడన్నం కోసం శరీరాన్ని అమ్ముకోవడానికి వీధుల్లో దారికాసే స్త్రీలను చూడవా నువ్వు? సంఘం అనబడే మాయదారి యంత్రంలో నలిగి, నలిగి పొట్టకోసం గత్యంతరం లేక దారి దోపిడీలు, దొంగతనాలు చేసే వేలాదిమందిని ఎరగవా నువ్వు? ఔను? నువ్వు మాట్లాడేది సౌందర్యం గురించి, యమయాతనల్ని అనుభవిస్తున్న ప్రపంచం వైపు ఒక చూపు పారేసి, సంధ్యారాగంలో ఈ వృద్యార్త ప్రపంచం సౌందర్యంతో తళాతళా మెరిసిపోతుందని వర్ణిస్తారు. పేదలను పాతాళానికి తొక్కేసే బాధల్ని, రంగు రంగు మాటలు పులుముతూ వర్ణించి మురిసిపోతారు. గుడ్డి దీపం కూడా లేని వారి గుడిసెల్ని, చావ సిద్ధమౌతున్న వారి పిల్లల్ని చుక్కలతోను, మంచు ముక్కలతోను, మేఘాలతోను వర్ణించి తాత్విక మహాకవుల జాబితాలో ఒక స్థానం సంపాదిస్తారు. కవీ! నువ్వు తిరిగి జన్మించాల్సి వస్తే, బూర్జువా కవికంటే ఆత్మశుద్ధిగల ఇంకెవరిగానైనా జన్మిస్తావని ఆశిస్తున్నాను." అని పలికిస్తారు ఆత్రేయ. ఈ మాటలు ఈ కాలంలోని చాలా మంది కవులకు చెంపదెబ్బలు లాంటివి.

ఈనాటి కవులయిన వారు ఎందరో మన చుట్టూ జరిగే సమస్యల మీద స్పందిస్తూ కవిత్వం రాస్తున్నారు? కవిత్వం కేవలం సౌందర్య వర్ణనకు ఉపకరించే ప్రకియే కాదు. ఏ మారుమూల ప్రాంతంలో జరిగిన అన్యాయాన్నైనా కవి తన కవిత్వం ద్వారా కోటానుకోట్ల ప్రజలకు గొంతెత్తి చాటి చెప్పాలి. వాళ్ళలో చైతన్యాన్ని తీసుకువచ్చి, అధర్మాన్ని అన్యాయాన్ని అణిచివేసేలా చెయ్యాలి. అదే ఆత్రేయగారి ఆశ. వారి నాటక సాహిత్యమంతా ఇందుకోసమే రాయబడింది. ఆత్రేయ నాటక రంగం గురించి ఒక వ్యాసంలో.. "దేశంలో.. జీవితంలో, సమస్యలంటూ వుంటే అవి కవి కలంలో కంఠంలో మారు పలకాలి కవితగానో – నాటకంగానో" అని అన్నారు.

ఆత్రేయ తన నాటక సాహిత్యం ద్వారా కొన్ని పాత్రల ద్వారా కవులకు సందేశం ఇచ్చారు. ఏమిటంటే కవిత్వం వల్ల తాను సంపాదించింది. సంసారాన్ని ఉద్ధరించి సుఖపడింది లేదని చెప్పుకొని విచారించే కవి అయిన రఘు పాత్రలాంటి కవులకు అకౌంటెంట్ దాసు పాత్ర ద్వారా ఇలా పలికిస్తారు ఆత్రేయ. "కవిత్వం సరదాగా వుండొచ్చు గానీ, దాని వల్లనే బ్రతకాలనుకోవడం పొరబాటు కాదూ? అవన్నీ పోయాయి నాయనా, అది ఏ కృష్ణదేవరాయల యుగమో". ఇప్పటి ప్రభుత్వాలకు సాహిత్య పోషణతో పనిలేదు. ఎన్నికలకు, అడపాదడపా అల్లర్లకు ఉపయోగపడే గూండాల పోషణే ముఖ్యం.

అదేవిధముగా తమలాంటి కవులను పోషించని జనాన్ని నిందించే రఘును చూసి "ప్రజలకు కావల్సింది వ్రాయండి. మీ సాహిత్యాన్ని ప్రజాభ్యుదయానికి వుపయోగించండి. ప్రపంచ జీవశక్తి అయిన ప్రజాబాహుళ్యానికి చేదోవు వాదోడుగా నిలవండి. అప్పుడు ప్రజల బలమంతా మీదే.ప్రజలే మిమ్మల్ని పోషిసారు." అని 'పరివర్తన' నాటకంలో చౌదరిపాత్ర ద్వారా అంటారు ఆత్రేయ.

" చస్తే ఏ" నాటికలో కవినోట చేదు నిజాన్ని పలికించడానికి ఆత్రేయ రాసిన మాటలు అద్భుతమైనవి. ఇవి ఈనాటికి వర్తిస్తున్నది. అది ఏమిటంటే అనారోగ్యంతో భార్య, పస్తులతో పిల్లలు ఇలా కుటుంబం వుంటే కవిగా తాను ఏమి చేయలేని వానిగా నిస్సహాయతతో నిట్టూర్పు, విడిచే భర్తతో అతని భార్య ఊరటగా మాట్లాడగా ఆ మాటలకు బదులుగా కవి తన భార్యతో – " కవికి భార్య ఎందుకు? కనీసం భారతదేశంలో కవి భర్త కాలేడు. కవి తానే భార్య అవుతాడు. అతడిని ఏ ధనికుడితో భరించాలి. కృతి భర్తలందరూ కవి భర్తలే" అని ఆత్రేయ పలికించిన మాటలు చేదు నిజాలు.

గొప్ప కావ్యాలు రాయగల కవులు ఈ దేశంలో ఉన్నప్పటికీ వారు రాసింది గ్రంథ రూపంలో ప్రజలకు పరిచయం చేయడానికి ఈనాడు ఎంతమంది కవులకు ఆర్థిక స్తోమత ఉంది? కొద్దో గొప్పో ఉన్నా రచయితలైనా వారికి ఈనాటి ఘోరమైన బుక్ మార్కెటింగ్ విధానం తెలిసే వుంటుంది.

వారి పుస్తకాలు షాపుల్లో వుంచి అమ్మిపెట్టినందుకు 40శాతం పైన కమీషన్ ఇవ్వాలి. ఇలా ఎన్నో రచయితలను దోచుకుంటే ఎవరు పుస్తకాలను అచ్చు వేయగలుగుతారు. ఆత్రేయగారి గౌతమబుద్ధ నాటకానికి నెల్లూరు వి.వి.నాయుడు & సన్స్‌వారు వాయిదా పద్ధతితో 50 రూపాయిల పారితోషకాన్ని ఇచ్చారు. అంటే 1944లో 50 రూపాయిలంటే ఎంతో గొప్ప. మరి ఈనాడు పబ్లికేషన్స్ వారు రచయితలకు ఏమాత్రం పారితోషికమిస్తున్నారు ? ఇలా చెప్పుకుంటే ఎన్నో వున్నాయి.

పూర్వం రాజులు, ఆ తర్వాత సంస్థానాధిపతులు, జమిందారులు ఇలా కవులను పోషిస్తూ వస్తే ఇప్పుడాబాధ్యత డబ్బున్నవారి మీద వుంది. కృతి స్వీకర్త కృతి భర్తే కదా! ఈవిధంగా ఆ మాటలను వారు అలా వ్యంగ్యంగా సంభాషణలో పలికించారు.

ఆత్రేయ తన పరివర్తన నాటకంలో పరోక్షంగా అతనినే ఉద్దేశించుకొని " కవి వింత మనిషి. కవి గుమస్తా కాలేడు. కవి చేయతగ్గ ఉద్యోగాలు చాలా తక్కువ వున్నాయి ఈ సంఘంలో. అందుచేత ఏ ఉద్యోగాన్ని అంటిపెట్టుకొని ఉండలేకపోయాను." అని కవి పాత్ర ద్వారా ఆత్రేయ తన విషయాన్ని కవుల పరిస్థితులకు అన్వయిసూత చెప్పారు. ఆత్రేయ గారు నెల్లూరు జిల్లా కోర్టులో నఖలు లేఖడుగా పనిచేసారు. ఆ తర్వాత తిరుత్తనిలో సెటిల్‌మెంట్ ఆఫీసులో గుమస్తాగాను, మరికొంత కాలం 'జమీను రైతు' పత్రికలో 4 నెలలపాటు సహాయ సంపాదకునిగా మరి కొన్నాళ్లు 'ఆంధ్ర నాటక కళా పరిషత్' లో వేతన కార్యదర్శిగా పనిచేసి ఏ ఉద్యోగంలోను నిలువలేకపోతారనిపిస్తుంది.

ఆత్రేయగారు 'జమీన్ రైతు' పత్రికకు సహాయ సంపాదకునిగా పనిచేసేటప్పుడు భానుమతి నాగయ్యగారు నటించిన

'స్వర్గసీమ' చిత్రం గూర్చి అందరూ దాన్ని గొప్ప కళాఖండమని పొగుడుతుంటే ఆత్రేయగారు ఆ సినిమాపై తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా విమర్శిస్తూ జమీన్ పత్రికలో రాయగా ఆ పత్రికాధిపతి మండిపడగా 40 రూపాయలు జీతమిచ్చే ఆ ఉద్యోగాన్ని మానివేశారు.

పై ఉదాహరణను బట్టి చూస్తే 'పరవర్తన'లోని కవి (రఘు) పాత్ర చేత పలికించిన మాటలు సూటిగా ఆత్రేయగారు తన వ్యక్తిగత విషయాన్నే చెప్పారని అర్థమవుతుంది.

ఈనాటికీ మనం చూస్తూ ఉన్నాం. కళాకారులను, కవులను, రచయితలను ప్రేక్షకులు పాఠకులు అభినందనలతో ఎలా ముంచెత్తుతారో . ఒక గొప్ప నటుడి ప్రదర్శన ద్వారా – ఒక మంచి రచయిత ద్వారా ప్రేక్షకులుగా, పాఠకునిగా మానసిక ఆనందాన్ని, లేదా వాస్తవికత జీవితాన్ని సత్యాలను తెలుసుకున్నవారు పొగడ్తలతో, దుశ్శాలువాల ముసుగులతోనే కళాకారుల, కవుల దుర్భర జీవితాలను కప్పుతున్నారు కాని ఆర్థికపరమయిన సహాయాలు ఏమాత్రం చేయరు. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని ఆత్రేయ మనలాంటి వారిని ఆలోచింపచేయడానికి 'చస్తే ఏం' నాటికలోని ఒక సన్నివేశాన్ని కరుణరసభరితంగా రాశారు. అది ఏమిటంటే – తిండిలేక, పెట్టలేక ఏడ్చే తన పిల్లల్ని చూసి ఆర్థికంగా చితికిపోయిన ఆ కవి 'ఛీ వెధవల్లారా ! మరీ తిండిపోతులవుతున్నారు. ఆకలేంటిరా ఆకలి! దేవుడున్నాడు. కావలసినన్ని వేదాంతగ్రంధములన్నవి. ప్రేమ, అంతరాత్మ ఇన్ని వుండగా ఆకలేంటిరా ఆకలి! అన్ని ఎందుకు? ఇన్ని సంవత్సరాలుగా నేను గడించిన కీర్తి ఎంత వుంది! నేను వ్రాసిన సేకరించిన పుస్తకాలెన్ని వున్నవి! కడుపు నింపుకోలేరూ పొగుడుతూ రాసిన ఉత్తరాలను అతని కుమారునికి చూపిస్తూ .. " ఇంత కీర్తి సంపాదించుకున్న తర్వాత ఛస్తే ఏం? మీకు అన్నం లేకుంటే ఏం? ఏమంటా మీకు తెగులు? ఇంకా బ్రతకాలని మీకెందుకురా వెధవ ఆశ? కీర్తి గడించని వాళ్ళలాగే తింటూ వుండాలని మీకేం ఖర్మరా! ప్రపంచంలో శాశ్వతంగా గూడెం కట్టుకొని వుండిపోయి కీర్తినంతా ఇంకెవ్వరికీ దక్కనీకుండా చేయాలని మీకెందుకంటా దురాశ!.." ఇలా రజనీ (నటుడు) పాత్రద్వారా బరువైన మాటల్ని పలికించారు ఆత్రేయ.

ఆత్రేయపై సంభాషణ ద్వారా అందరికీ చెప్పదలిచింది ఒక్కటే! ఒక కళాకారుడు – రచయిత ద్వారా ఏదో ఒకరూపంలో ఆనందపడి (లాభపడి) దానికి మెచ్చి, ప్రతిఫలంగా కష్టకాలంలో అతనిని ఆదుకోలేని మెమెంటోలు, శాలువా సత్కారాలు పొగడ్తలతో ముంచెత్తే ఉత్తరాలు కాదు మనం ఇవ్వాల్సింది. నాలుగు కాలాలపాటు అలాంటివారు మనం మెచ్చేలా కళాసేవ చేయడానికి ఆర్థికపరమైన ఇబ్బందులలో చితికిపోకుండా ఉండడానికి చేతనైన ఆర్థిక సహాయం చేయాలంటారు.

ఈనాటి కవుల పరిస్థితిని చూసి ఆ నాటి కవుల పరిస్థితి తలచుకొని ఆత్రేయ వ్యంగ్యంగా 'ఒక్క రూపాయి' నాటికలో జగ్గు పాత్రనోట ఒక మాటలను పలికిస్తాడు. కడుపు నిండినవాడికి నిద్ర తప్పించి కవిత్వమేమొస్తుంది! కడుపు నిండని వాడికి ఆకలి మంటల జ్వాలలు రగిల్చే కవితావేశపు భావాలు భగభగమంటూ జ్వలిస్తూ వస్తాయి. అంతేకాని మన ప్రాచీన కవుల మాదిరి అష్టైశ్వర్యం, సర్వభోగాలను అనుభవిస్తుంటే సుఖమయ జీవితానుభవాల నుండి వచ్చే కవిత్వం వేరు. అందులో మనుష్యుల ఆర్తనాదాలు, ఆకలిదప్పులు ఇవేవి ఉండవు. స్త్రీ వర్ణనలు, ప్రకృతి వర్ణనలు, పూరాణాలతోనే నిండిపోతుంది. అందుకోసం వారు కవితావేశం (మూడ్) వచ్చేదాక సుఖంగా కూర్చుంటారు. కాని ఆకలి కవలు పరిస్థితి వేరు. అందుకే వీధి దీపం క్రింద 'గౌతమబుద్ధ' లాంటి గొప్పనాటకం, అద్దె యింటికోసం పడిన పాటల్లో నుంచి ఎన్.జి.వో., ఇలా మొదలైన నాటకాలు ఆత్రేయలాంటి ఆకలి కవులు ఆవేదనల నుంచి వెలువడినవి. ఇలానే ఆకలితో అలమటిస్తూ.. 'మూడ్సు గీడ్సు' అని కూర్చోక కవిత్వం రాయి అనే మిత్రుని మాటలకు నిరుద్యోగ కవి జగ్గు " అల్లసాని పెద్దనకున్నావేం రా? మనం ఆకలి కవులం " అని అంటాడు.

'పరివర్తన' నాటకంలో సమాజానికి పనికిరాని కవిత్వం రాసే వారిని శోభపాత్ర ద్వారా ఆత్రేయ విమర్శిస్తారు. "ఆ.. కవులకేం తక్కువ ఈ కాలంలో. ఏమీ పని తోచని వాళ్ళందరూ కవులై కూర్చుంటున్నారు.భాష, ఛందస్సు, వ్యాకరణం,

అలంకారాలు ఏవీ ఎరుగని వాళ్ళందరూ ప్రజాకవులని బయలుదేరుతున్నారు. వాళ్ళు వ్రాసే ప్రతి చెత్తా ప్రజా సాహిత్యమవుతుంది" అని విమర్శించారు. ఇదే నాటికలో చెత్త పుస్తకాలు ఎక్కువ రాయడానికి గల కారణం కూడా 'బాబు' పాత్ర నోట ఈవిధముగ పలికిస్తాడు. అసలు ఈ కాలంలో ప్రెస్సులెక్కువైన కొద్దీ ప్రతీ చెత్త పుస్తకము అచ్చుకావటమేఁ!" మంచి పుస్తకం అయినప్పుడు ఆలస్యంగా వేయడం వల్ల కలిగే ఇబ్బందులను గురించి " ఎప్పటికప్పుడు వ్రాసింది అచ్చయిపోవడం చాలా మంచిది. ఎందుచేతనంటే ఇంకా కొన్నాళ్లకి ఏ కవికో ఇదే ఐడియా కలిగిందనుకో, వ్రాసి ప్రింట్‌చేస్తాడనుకో అప్పుడు మనదేమవుతుంది.? తీరా కాపీ అనేస్తారా?" అని బాబుపాత్ర చేత చెప్తారు. ఆత్రేయగారు ఇలాంటి పరిస్థితిని 'కప్పలు' నాటకం ద్వారా చవిచూసి వుండవచ్చు.

కవుల బలహీనతో, కవుల లక్షణమో తెలియదుగాని 'ఆత్మార్పణ' నాటికలో కవి అయిన మూర్తి కవులకు కవిత్వం ఎలా వస్తుందో ఇలా చెప్తారు, " కవులకే ప్రియురాళ్లు లేకపోతే మాట పెగలదు, కలం కదలదు" మరి మహాకవి ఆత్రేయ గారు ఆ మాటలను ఆ కవిపాత్ర చేత పలికించారంటే నిజమే అయి వుంటుంది.

ఈవిధముగా ఆత్రేయగారి సంభాషణలలో కవులు, రచయితలను గూర్చి, కవిత్వ ప్రయోజనాన్ని, పరమార్ధం గురించి..ఇలా ఎన్నో సంగతులను గూర్చి ఎన్నో విషయాలను వివిధ పాత్రల చేత పలికించారు.

3.17. ఆత్రేయ సంభాషణలలో 'యుద్ధం' :

ఆత్రేయకు 'యుద్ధం' అనే పదమంటేనే అసహ్యం. ఆయనకే కాదు! హాయిగా బ్రతకాలనుకునే వారికెవ్వరికీ యుద్ధమంటే ఇష్టం ఉండదు. ఆత్రేయ యుద్ధానికి ఎంత వ్యతిరేకమో విశ్వశాంతి, అశోక్‌సామ్రాట్, ప్రగతి మొదలగు నాటకాలలోని కొన్ని పాత్ర సంభాషణలను పరిశీలిస్తే అర్ధమవుతుంది. 'విశ్వశాంతి' నాటకంలోని భూదేవి పాత్రను పరిశీలిస్తే ఆత్రేయ 'శాంతి భావం' స్పష్టంగా కన్పిస్తుంది. యుద్ధం మీద కాంపోజిషన్ రాయడానికి తనతల్లి భూదేవిని ఆమె కూతురు సమత అడగ్గా..

ప్రపంచం పుట్టిన నాటి నుండి నేటి దాక యుద్ధాలు ఎక్కడో ఒకచోట. దేనికో ఒకదానికి ఎవరో ఒకరు, ఏదో ఒక విధముగా చేస్తూనే వున్నారు. ప్రతియుద్ధం శాంతి ఒడంబడికలతోనే ముగిసింది. ముగిసిందని అనుకున్నాం. కాని ఆగలేదు. యుద్ధం ఒక విచిత్రమైన పుండు" అని ఆ పాత్ర ద్వారా పలికిస్తూ... అందులోనూ అది మాడిపోయే పుండా అంటే కాదు, ' ఈ పుండుపైకి మానిపోయినట్లే అగుపించేది. కాని లోలోపలే పురుగులా తొలుచుకొని పోయి, ఎక్కడో మళ్ళా పైకి లేచేది. ప్రతియుద్ధం అంతకు పూర్వపుయుద్ధం కన్నా భయంకరంగా, బాధగా, భీభత్సంగా తయారయ్యేది. ఎందరో జయించారు. ఎందరో ఓడారు. అయినా యుద్ధాలు ఆగలేదు. జరుగుతూనే వున్నాయి. ఈ భూమి మీద ప్రాణం ఎప్పుడు మెదిలిందో ఎవ్వరూ ఎరుగరు. కానీ ఆనాటి నుంచి, ప్రాణం మెదిలిని నాటి నుంచి, యుద్ధం జరుగుతూందట.తిండికోసం యుద్ధం, వుండడానికి నీడకోసం యుద్ధం. ఆస్తికోసం – పిల్లకోసం–ప్రేమకోసం–డబ్బు కోసం–కీర్తి కోసం – యుద్ధం! యుద్ధం! వేదాంతులు చెప్పారు. జీవితానికి మృత్యువుకూ ఎప్పుడూ యుద్ధం జరుగుతూందని, చివరికి మృత్యువే గెలుస్తుందట. దాంతో యుద్ధం ఆగిపోతుందట" అని వ్యంగ్యంగా పలికిస్తారు ఆత్రేయ. యుద్ధప్రీతి ఈ మనుష్యులకే కాదు. పురాణ మనుషులకు కూడా వుంది. "పెళ్ళాం కోసం ఏమి జోక్యం లేని కొన్ని వేలమంది ఆమాయకుల్ని బలిచేసిన రాముడు, ఒక ఆడదాని కోసం తన ప్రజల్ని నాశనం చేసిన రావణుడు శూరులు. ఇంటి గొడవలేవో పెంచుకొని, ఏ జోలి శౌంటీ ఎరుగని జనాన్ని యుద్ధం పేరిట, ధర్మం పేరిట కురుక్షేత్రంలో బలిపెట్టిన పాండవులూ, కౌరవులూ మనకు వీరాధివీరులు" అని విమర్శిస్తారు. అలాగే చరిత్రలో వీరులుగా గుర్తింపబడిన వారిని కూడా ఆత్రేయ వదలలేదు. " కీర్తికోసం రాజ్యాలను జయిస్తూ అందువల్ల ఏ లాభము పొందని జనాన్ని లక్షలు లక్షలుగా మారణహోమం చేసిన సీజరు, అలెగ్జాండరు, గజనీ అందరూ మనకు పూజ్యులు. వాళ్ళని, ఆ నరహంతకుల్ని కన్నవాళ్ళందరూ వీరమాతలు.

దేశానికి వాళ్లు దివ్యమణులు" అని విమర్శిస్తారు.అంతేకాదు పిల్లల్ని, ఆడవాళ్లని ముసలీ ముతకనీ చంపకూడదు అలాగే రాత్రి పూట యుద్ధం చేయకూడదనీ అప్పటి యుద్ధం నియమాల్ని, సివిలియన్స్‌ను చంపకూడదని ఇప్పటి యుద్ధ నియమాలను తీవ్రంగా విమర్శిస్తూ.. " కుళ్ళిన పెండుకు సెంటు పూసుకున్నట్లు యుద్ధాలకు కొన్ని నియమాలు నియమించుకున్నాం" అని పలికిస్తారు ఆత్రేయ.

ఇన్ని యుద్దాలు జరిగినవి – జరుగుతున్నాయి కదా! ప్రజలు కావాలని కోరుతున్నారా? లేదు. యుద్ధమంటే ఎవరూ ఇష్టపడరు. ఎందుకంటే దాని స్వరూపం, పరిణామాలు భయంకరమైనవి. అందుకే ఆత్రయ "విశ్వశాంతి" నాటకంలో ఎన్నో యుద్ధాలలో పాల్గొని కళ్లూ, కాళ్లు, చేతులు పోగొట్టుకున్న సిపాయి తాతగా పేరు పొందిన అమరయ్య పాత్ర ద్వారా మనుష్యులందరూ ఒక్కటే అని అన్ని దేశాల్లో చూచాను. అందరూ మనలాగే నవ్వుతారు, ఏడుస్తారు. మనలాగే తింటారు. అందరికీ సుఖం దు:ఖం ఆకలి అన్నీ ఒక్కటే. అందరికీ ప్రాణాలంటే తీపి వుంది. అందరికీ సుఖంగా బతకాలని వుంది. కూడు, గుడ్డ అందరికీ కావాలి. రంగుతేడా, మాటతేడా, ఆచారాలు, అలవాట్లు తేడా అంతే. అందరూ యీ బ్రతుకును హాయిగా చేసుకోవాలనే ప్రయత్నిస్తున్నారు." అని ప్రతి మనిషి మనసులో యుద్ధం పట్ల వారికి కలిగిన వ్యతిరేకభావాన్ని ఆత్రేయ పలికించారు. మరి ప్రజలు వ్యతిరేకులై వున్నప్పుడు యుద్దం చేసేదెవరు, ఎలా చేయిస్తున్నారు? అన్న ప్రశ్న మనలో కలగవచ్చు. రాజులు, ప్రభుత్వాలు తమ స్వార్ధం కోసం అనాది నుంచి నేటివరకు ఏదో ఒక నెపంతో యుద్ధాన్ని చేయడానికి ప్రజలను యుద్దంలో పాల్గొనడానికి మత్తుమందును యుద్ధకాంక్షా పరులు ఇంజెక్ట్ చేస్తున్నారు. ఏమిటా మత్తుమందంటే... " దేశభక్తి, వీరస్వర్గం అన్న పదాలే మత్తుమందులు, వీరిపేరిటనే ఆది నుంచే ఎన్నో హింసాచర్యలు జరిగినవి " అని రాధాగుప్తని పాత్ర ద్వారా తెలియజేశారు ఆత్రేయ.

" ఇప్పుడు అన్ని దేశాలలో పెద్దవాళ్ళమనుకునే కొందరు యుద్ధం అనేది లేకుండా చేయాలని ఆలోచిస్తున్నారు" అని పెట్టుబడిదారుడు అనగా " కాదు కదు. మాట్లాడుతున్నారు." అని పిచ్చివాడు పాత్ర ద్వారా ఇప్పటికీ జరుగుతున్న చరిత్రను ప్రగతి నాటికలో అప్పుడే చెప్పారు అంటే యుద్దం గురించి శాంతిశాంతి అనుకుంటూ మాటలకే పరిమితమయ్యాయి జరిగే చర్చలు, సభలు. ఆచరణలో ఆ 'శాంతి'ని చూపించలేకపోతున్నారు. చర్చలు అయిపోయిన వెంటనే యుద్ధాలు జరుగుతున్నాయి. ఒకవేళ యుద్దం రాని పరిస్థితి కనిపిస్తే " కనీసం పెద్దవాళ్లందరూ కలిసి రప్పిస్తారు." అని భూదేవి పాత్ర ద్వారా పెద్దమనుష్యులు చేసే ఘనకార్యాన్ని విమర్శింపచేస్తారు ఆత్రేయ. " మరి శాంతి సభలు అవ–ఇవీ చేస్తున్నారే? ఏమంటావు?" అని యుద్దాన్ని రూపుమాపటానికి కోట్లాది రూపాయలు తగలేస్తూ వ్యర్ధమైన సభలను నిర్వహించే దేశాల గూర్చి పిచ్చివాడు అడిగిన దానికి బదులుగా " అదంతా మోస్టు అన్‌సైంటిఫిక్. వాళ్ళంతా శాంతిని గురించి మాట్లాడుతూ, యుద్దాన్ని గురించి ఆలోచిస్తున్నారు. అంతే !" అని ప్రగతి నాటికలో సైంటిస్టు పాత్ర ద్వారా నేటికీ ప్రపంచంలో జరిగే శాంతి సభల సంబడాన్ని ఆత్రేయ ఆనాడే బట్టబయలు చేశారు వారి సంభాషణల్లో. మనం చూస్తూనే వున్నాం... అణ్వాస్త్ర రహిత దేశాలుగా ఉండాలంటూ పరాయి దేశాలు ఆంక్షలు విధించి తనిఖీ చేస్తున్నారే కాని ఆ తనిఖీ చేసే దేశాలు తమ దేశంపై అనుమానం కలిగిన ఏ దేశాన్నైనా తనిఖీ చేసుకోమని అంటుందా? తనఖీ చేస్తే ఒప్పుకుంటుందా? లేదు. ఇలాంటి నెపాలతోనే మొన్నటికి మొన్న ఇరాక్‌పై అమెరికా బ్రిటన్ లాంటి దేశాలు యుద్ధం చేసాయి. అంటే శాంతిసభలు, ఐక్యరాజ్య సమితిలు ఇవన్నీ పేరుకే..! కొన్ని దేశాల ప్రయోజనాలకే నెలకొల్పబడినయి.

ఒకదేశం యుద్దం చేయడం వల్ల ఆ దేశంలోని ఆర్థిక వ్యవహారాల్లో జరిగే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో 'ప్రగతి' నాటికలో ఆత్రేయ పిచ్చివాడి పాత్ర ద్వారా – " యుద్దంలేకుంటే ఆకలి లేదు– చావులు లేవు – వ్యభిచారం లేదు – బ్లాక్ మార్కెట్‌లేదు – కోట్లుకోట్లు కొల్లగొట్టడం లేదు. బొజ్జలు పెరగడం లేదు" అని పలికిస్తారు ఆత్రేయ. ఈ యుద్ధం వల్ల దేశంలో బ్లాక్ మార్కెట్ మరింత వికృత రూపం దాల్చి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి

ఉత్పత్తులు లేక ఆకలిచావులు ఆర్తనాదాలు, ప్రకృతి వైపరీత్యాలు వస్తే బాగుండని, వస్తే నాలుగు డబ్బులు వెనకేసుకోవాలనే కొందరు ఉద్యోగులెలానో అలాగే ఇదే సమయంగా యుద్ధం వల్ల లాభపడే వారు డబ్బు సంపాదించి బొజ్జలు పెంచుకోవడం చేస్తారు.

ప్రపంచంలో.. కాదు – ఈభూమి మీదే యుద్ధం జరగకూడదంటే ఏమి చేయాలో నెగిటివ్‌గా ఆలోచించి సైంటిస్టు పాత్ర ద్వారా పలికిస్తారు ఆత్రేయ. ఏవిధంగా అంటే యుద్దం వల్ల నువ్వు కొంత నష్టపడ్డావు.నువ్వే కాదు ఎందరో నష్టపడ్డారు. ఎందుచేత? యుద్ధం చేయటంలో– అంటే యుద్ధ పరికరాల్లో మనం చాలా వెనుకబడి వున్నాం.యుద్ధం ఈనాటికన్నా భయంకరంగా కావాలి. ఎన్నో యుగయుగాలుగా బుద్ధుడు, ఏసుక్రీస్తు, గాంధీలాంటి వాళ్లు యుద్ధాలు మానండ్రా అని ఎలుగెత్తి అరుస్తున్నారా. ఏం? చెప్పు "అని సైంటిస్టు తన అక్కని ప్రశ్నిస్తూ " నీతి ప్రబోధాల వల్ల యుద్దాలు ఆగవు. చేతులు కాల్తాయని ఒకసారి అనుభవమైన తర్వాత ఎవరన్నా నిప్పు జోలికెళ్తారు! అలాగే యుద్ధం కూడా అతి భయంకరంగా, మళ్ళా దాని జోలికి రానట్టుగా తయారుకావాలి.." ఇలా వ్యంగ్యంగా 'ప్రగతి' నాటికలో సైంటిస్ట్ పాత్ర ద్వారా పలికిస్తారు ఆత్రేయ. అలా జరిగే నాటికైన మిగిలే ఆ కొద్దిమంది ప్రజలకైనా బుద్ధనేది వస్తుందేమోనని ఆత్రేయ ఆశ కాబోలు!

విజ్ఞానం ముసుగులో యుద్ధ పరికరాలను చేస్తూ మానవుల మనుగడకే ముప్పును తీసుకొనిరావడానికి మారణాయుధాలను తయారుచేసే వారిని ఉద్దేశించి " మానవుని జీవితాన్ని సుఖప్రదం చేసేదే విజ్ఞానం. మానవుని ఆయుర్ధాయాన్ని పెంచేదే విజ్ఞానం" అని పలికిస్తారు ఆత్రేయ.

ఈవిధముగా ఆత్రేయగారు యుద్దం వల్ల జరిగే అనర్ధాలను వారి నాటకాలలోని పదునైన మాటల్లో సంభాషణ రూపంలో వివిధ సన్నివేశాలలో చూపించారు.

3.18. ఆత్రేయ సంభాషణలలో మత సామరస్యం :

ఆత్రేయ మతసామరస్యం కోసం 'ఈనాడు' నాటకాన్ని రాశారు. వారు ఈనాడు నాటకంలోనే కాక గౌతమబుద్ధ, అశ్వఘోషుడు నాటకాలలో, నాటికలో మత సామరస్యం గురించి వివిధ పాత్రల ద్వారా నీతిని బోధించారు. " మతం వ్యక్తి గతమైనది గానే వుండాలి. అఇది సామాజిక సహజీవనానికి సాధనం కాదు – ఏనాడూ కాలేదు. అన్ని మతాలు ఒక్కడే దేవుడు అంటూ యెన్నిదేవుళ్ళను సృష్టించాయి! మతదాస్యం కన్నా మౌఢ్యం మరొకటి లేదు.మతం ద్యాస్యాన్ని, దాసులను, దాసీజనాన్ని సృష్టిస్తుంది – సమర్దిస్తుంది. మతం పేరిట చరిత్రలో యెన్ని మారణహోమాలు, రక్తపాతాలు జరిగినవో లెక్కలేదు. ఇది అనాదిగా జరుగుతున్న చరిత్ర. అని చెప్తూ " దైవం, మతం వ్యక్తిగతమైన నమ్మకాలుగా నిర్ణయించి, వాటిని సమాజానికీ, ప్రజా జీవితానికి, పరిపాలనా విధానానికి ముడిపెట్టకుండా, అవి వాటిలో చొచ్చుకురాకుండా చేస్తే గాని దేశం బాగుపడదు. అని తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఆత్రేయ.

గ్రీకు వ్యాపారి దత్తమిత్రుని కుమార్తె ప్రభను సుదర్శనా పండితపుత్రుడు అశ్వఘోషుడు ప్రేమించడం సహించని పండితులు, కులపెద్దల వర్ణసాంకర్యం పేరిట కులం నుంచి వెలివేయాలని నిర్ణయించి అతని తండ్రికి హెచ్చరించగా తండ్రీ కొడుకుల మధ్య జరిగిన సంభాషణను 'అశ్వఘోషుడు' నాటికలో రమ్యంగా రాశారు ఆత్రేయ.

గ్రీకు వ్యాపారి దత్తమిత్రుని కుమార్తె ప్రభను సుదర్శనా పండిత పుత్రుడు అశ్వఘోషుడు ప్రేమించడం సహించని పండితులు, కులపెద్దలు వర్ణసాంకర్యం పేరిట కులం నుంచి వెలివేయాలని నిర్ణయించి అతని తండ్రికి హెచ్చరించగా తండ్రీ కొడుకుల మధ్య జరిగిన సంభాషణను 'అశ్వఘోషుడు' నాటికలో రమ్యంగా రాశారు ఆత్రేయ.

అశ్వ : ఎవరు మనల్ని బహిష్కరించేవారు?

సుదర్శన్ : శాస్త్రము.. సదాచారము..

అశ్వ : శాస్త్రాన్ని రచించేదెవరు? సదాచారాన్ని స్థాపించేదెవరు?

సుదర్శన్ : ఎవరు – నువ్వా, నేనా?

అశ్వ : మనమే – మానవులం

తల్లి : చిరంజీవి.. మనం కట్టుకున్న ఇల్లని, నెత్తిన కూల్చుకుంటామా చెప్పు..

అశ్వ : మనం తవ్వుకున్న బావి అని ఉరికిక మరణిస్తామా అమ్మా..

సుదర్శన్ : చాల్లేవయ్యా...చాతుర్యం – స్వమతాన్నే అవమానిస్తున్నావు. మతం లేని మానవుడు మానవుడు కాదు తెలుసా ?

అశ్వ : మానవత్వం లేని మతం మతం కాదు నాన్నగారూ!!" అని అశ్వఘోషుని ద్వారా పలికిస్తారు ఆత్రేయగారు. ఈ సంభాషణ నడిపింపు 'జయభేరి' చిత్రంలోని ఇలాంటి సన్నివేశానికి సంబంధించిన సంభాషణలనే గుర్తుచేస్తుంది.

అల్లర్లు జరుగుతుండగా ముస్లిం అయిన అక్బర్ హిందూ స్త్రీని చేరదీశాడని తెలుసుకొని ముస్లిం మతస్థులు కొందరు అక్బర్ ఇంటి వైపు దాడి చేసి తలుపులు బద్దలు కొడుతూ " అక్బరు దాదా! ఇది కేవలం నీ విషయంకాదు. మన మతానికి, అల్లాకు సంబంధించినది" అని బయటివారు అనగా "ఛీ! నోరు ముయ్యండి! అల్లా పేరెందుకు చెరుపుతారు. ఆడవాళ్లను, పసికందులను చంపమని అల్లా చెప్పాడా? మనుషుల్ని మనుషులు చంపుకోవడమేనా మన మతం? సిగ్గు లేదూ?" అని 'ఈనాడు' నాటకంలోని నసీం పాత్ర ద్వారా ఆత్రేయ పలికించారు. ఇలాంటిదే మతమైతే అది మానవులకు చెందింది కాకూడదు.

'ఈనాడు'నాటకంలోని అల్లర్లు జరుగుతుంటే తినడానికి ఇంట్లో బియ్యం కూడా లేకపోయిన మౌనంగా ఖురాను చదువుతుండే తండ్రితో రహీం " ఖురాను చదువుకొంటూంటే కడుపు నిండుతుందా?" అని ఆకలికి ఆగలేక ప్రశ్నించగా "గొంతులు కోసుకోమన్నది ఖురానే అయితే కడుపు నింపుకోడానికి కూడా మార్గం చూపుతుందిలే!" అని అక్బర్‌చేత – మతసూత్రాలను విశ్వసిస్తూ మత గ్రంథంగా ఖురానును పవిత్రంగా భావిస్తూ మానవత్వాన్ని మరచి మనిషిని మనిషి చంపుతూ మారణహోమాన్ని సృష్టించే వారిని వ్యంగ్యంగా విమర్శింపచేసారు ఆత్రేయ. ఇదే నాటకంలో హిందూ స్త్రీ మత దురహంకారుల నుండి పారిపోయి ఒక ఇంటిలో చేరి తలదాచుకున్న తరువాత తాను చేరింది కూడా ముస్లీంల ఇల్లేనని తెలుసుకొని భయపడగా ముస్లీంలందరు హృదయంలేని వాళ్లు కాదులే అనే కొడుకు మాటలకు " ఆమేం చేస్తుంది పాపం! మన నాగరికతలో మనిషి మీద మనిషికంత నమ్మకం వుంది" అని అక్బర్ చేత పలికిస్తారు. ఆత్రేయ గారి ఒక్క మాట చాలుశూలంలా గుండెల్లో గుచ్చుకోవడానికి.

మతాలు పేరిట కులాలు పేరిట మనుషులు ఒకరినొకరు నరుక్కుచస్తుంటే ఇక భూమి మీద మిగిలేదెవరు? రాజకీయ పదవుల కోస, నాయకత్వ మార్పిడి కోసం, గద్దెకోసం కులమతాల మధ్య చిచ్చురేపి మారణహోమాన్ని సృష్టించేది దేని కోసం?" ఎవర్ని పారిపాలించడానికి?! అప్పుడప్పుడు దేశంలో జరిగే అల్లర్లను ఉద్దేశించి " బెంగాల్‌లో ఎండిపోయిన వట్టి పీనుగులైతే ఇప్పుడు కరుడుగట్టిన చిక్కన నెత్తురులో చితికిపోయిన చీలుగుల్ని చూస్తాం! అంతే! మనుష్యులే లేని దేశాన్ని ఏలుకోబోయే, మహానుభావులెవరో సంతోషిస్తారు" అని 'ఈనాడు' నాటకంలోని మతం మత్తుతో కళ్లు మూసుకొని ప్రవర్తించే వారికి చెంపదెబ్బగా అక్బర్ పాత్ర చేత ఆ మాటలు పలికించారు ఆత్రేయ. ఇలాంటి సమాజాన్ని చూసిన బుద్ధుడు " ప్రపంచంలో ఎక్కడ చూచినా హింస, స్వార్థం తాండవం చేస్తున్నది. నిస్సాంగత్యంలో,

భక్తిలో, యోగంలో, అన్నింటిలో స్వార్థం. లోకాన్నుంచి దూరంగా పోవటమో, లోకాన్ని పూర్తిగా మరచిపోవడమో తప్ప తోటిమానవులతో హాయిగా బ్రతికే విధానం, బ్రతుకనిచ్చే మతం లేదా ?" అని 'గౌతమబుద్ధ' నాటకంలో ప్రశ్నిస్తారు ఆత్రేయ. మానవులుగా మనం ఆలోచిస్తే మనదే మతమో అర్థమవుతుంది.

3.19. ఆత్రేయ సంభాషణలలో జీవిత సత్యాలు :

ఆత్రేయ సాహిత్య రచనలో ఉపదేశాత్మక వుంటుంది. మంచి విషయాన్ని అనువైన చోట పలికిస్తారు. వారి సంభాషణలలో, పాటలలో ఎన్నో జీవిత సత్యాలను పొందుపరిచారు. వాటిని గ్రహించి వారి జీవితాలకు అన్వయించుకొని ఆలోచించగలిగే వారికి ఆ మాటలు ఎంతో ప్రయోజనకరమైనవిగా వుంటాయి. ఆత్రేయ గారు తన నాటకాలలో ఈ జీవిత సత్యాలను ఏ విధముగా చెప్పారో చూద్దాం.

సక్రమమైన మార్గంలోనే డబ్బు సంపాదించాలంటే కష్టతరమైన రోజులివి. ఆదర్శభావాలు కలిగిన నటుడు, కవి అయిన రజని పూట గడవని పరిస్థితుల్లో ఆదర్శాలు వదిలి కిరాయి నాటకాలు ఆడననే తన పట్టుదలను విడిచి కిరాయి నాటకం ఆడి ఇరవై రూపాయిలు సంపాదించి "ఆదర్శాలు, అభిప్రాయాలు లేనప్పుడు డబ్బు గడించడం చాలా సులభం" అని రజని అతని భార్యతో అన్నట్లు రాశారు ఆత్రేయ. అంటే ఇది చేదు నిజమే అయినా జీవిత సత్యం కదా! అలా అని ఆదర్శాలు అభిప్రాయాలను మరచి మిమ్మల్ని తప్పుదోవలో పొమ్మని చెప్పడం కాదు సుమా! లోకం స్థితిని అలా చూపించారు ఆత్రేయ 'ఛస్తే ఏం?' అనే వారి నాటికలో..

" ప్రపంచంలో సత్యం చెప్పేవారు చాలా తక్కువ. ఏ ఒకరిద్దరు సత్యం చెప్పాలనుకున్నా విని నమ్మేవాళ్లు అసలే ఇదండి!" అని ఈరోజు లోకంలో నెలకొన్న ప్రజల మనస్తత్వాలను సుబ్బన్న పాత్ర ద్వారా 'వాస్తవం' నాటకంలోని తెలియజేస్తారు.

డబ్బుల్లేక ఇల్లు గడవడమే కష్టంగా వుంటే.. చదువుకోసం డబ్బు తగలేయకూడదనే నిర్ణయంతో తన అన్న ఫీజు కట్టమని ఇచ్చిన డబ్బుతో పళ్ళపొడి పొట్లాలు అమ్మే వ్యాపారం మొదలుపెడతారు గోపి. ఆ విషయం అతని అన్నకు తెలిసి "చదవాలని లేదేంరా" అని అడిగిన ప్రశ్నకు "చదివి విజ్ఞానం గడించడం మానవుడైన వాడికి అవసరమే. కాని, అంతకన్నా బ్రతకడం ముఖ్యం" అని 'ఎన్.జి.వో.' నాటకంలో సన్నివేశానుగుణంగా సమస్యను ప్రతిబింబిస్తూ జీవిత సత్యాన్ని పలికించారు ఆత్రేయ.

కళింగయుద్ధానికి విముఖత చూపే ప్రజలకు లోబరుచుకోవటానికి మంత్రి రాధాగుప్తుడు ఆశోకునకు చెప్పే ఉపాయం ఏమిటంటే – " అవసరాన్ని బట్టి మానవజీవితం మారుతుంది. నీతి, ధర్మం, అధర్మం అన్నీ ఈ జానెడు పొట్టకు బానిసలు. ఇది మానవ జీవిత రహస్యం " అని 'అశోక్ సామ్రాట్' నాటకంలో పలికిస్తారు ఆత్రేయ.

లిల్లీ కంగారుకు కారణం చెప్పమని అడిగితే తన భర్త శివుడుతో లిల్లీ " నిజం పిడుగులాంటిది. బలహీనులు అబద్ధాలతో బ్రతకటం మంచిది. నిజం చెప్పటానికి చెప్పిన నిజాన్ని స్వీకరించడానికి గుండె నిబ్బరం కావాలి" అని మనసూ–వయసు నాటకంలో పలికిస్తారు ఆత్రేయ.

తన కుమారుడు సిద్ధార్థుడు క్రమంగా వేదాంతాభావాలపై మనసు లగ్నం చేయడంపై ఆందోళనపడేరాజు గారితో "యౌవ్వనంలో హృదయం పరిపరి విధాల పరువెత్తుతుంది. క్షణికాలైన పొంగులెన్నో వస్తుండగలవు" (గౌతమ బుద్ధ) అని యౌవనంలో సంభవించే పరిణామాలను గుర్తుకు చేసి జాగ్రత్తపడమంటారు.

మనిషిని లోబరుచుకోడానికి, అదుపు చేయడానికి రెండే రెండు ముక్కు తాళ్లున్నయ్యంటారు ఆత్రేయ 'విశ్వశాంతి'

నాటకంలో. అవేమిటంటే 'ఆకలి – ఆశ – ఇవి రెండే మానవ జీవితాన్ని నడుపుతున్న శక్తులు. ఈ ముక్కు త్రాళ్లకు ఎంతటి వాళ్లైనా లొంగుతారు" అని శాస్త్రి పాత్ర ద్వారా అనిపిస్తారు. ఇదే విషయాన్ని 'అశోక్ సమ్రాట్ ' నాటకంలో కూడా పలికిస్తారు.

" సృష్టి కారణం ఆకలి.. స్థితి కారణం ఆశ.. ఆకలి మంటలోంచి విప్లవాగ్ని వెలువడడం అతి సులభం. ఆకలి వున్నప్పుడు ఆవేశం. కడుపు నిండినప్పుడు మనసు శూన్యమవుతుంది." అని ప్రేమానందుని పాత్ర ద్వారా మాట్లాడిస్తారు ఆత్రేయ.

నిరుద్యోగ సమస్యతో బ్రతకటమే కష్టతరమై పోయే పరిస్థితులను చూస్తూ చదివిని చదువులకు ఏనాటికైనా ఉద్యోగం దొరకదా? కష్టాలు తీరకపోవా అనే ఆశతో ఉన్న జగ్గు పాత్ర ద్వారా కాస్తంత వేదాంత ధోరణితో జీవిత సత్యాన్ని ఈవిధంగా పలికిస్తారు ఆత్రేయ.

" ఈ ప్రపంచం విచిత్రమైంది. బ్రతకలేని వాళ్లను చావనివ్వదు. చావని వాళ్లను బతకినివ్వదు. చావక, బతకనివ్వక కొద్దికొద్దిగా ఊపిరిపోస్తూ అర్ధ కడుపు తిండి అప్పుడప్పుడు పెడుతూ, ఆశలు చూపిస్తూ, నిరాశల్లో తోస్తూ, మెల్లిమెల్లిగా చంపుతుంది" అని పలికిస్తారు 'ఒక్క రూపాయి ' నాటికలో. మనిషిగా పుట్టటం కన్నా మనిషిగా ఈ భూమి మీద బ్రతికి బట్టకట్టటమే గొప్ప. అందరు ఈ అదృష్టానికి నోచుకోరు. వాళ్ళూ మనుషులైనప్పటికి, నోచుకునే అదృష్టమున్న అడ్డుకునే వాళ్ళెందరో. అందుకే ఇలాంటి ప్రపంచం విచిత్రమైనది ఆత్రేయగారు అలా పలికించారు.

కుటుంబ పరిస్థితులతో సతమతమయి యింటి నుండి విసురుగా వెళ్ళిపోయిన భర్త ఏమైనా అఘాయిత్యం చేసుకుంటడేమోనని బాధపడే తనే వదినతో గోపి "వదినా...వదినా! వూర్కో! అన్నయేం చేసుకోడు. చచ్చిపోవడమంటే అంత సులభమా?" (ఎన్.జి.వో.) అని ఓదార్చుతాడు. ప్రాణం పోసుకోవడమంత సులభం కాదు ప్రాణాలు తీసుకోవడం. ఈ భూమిమీద బ్రతకటం బాధే చావడమూ బాధే!

ఈవిధముగా ఆత్రేయగారు తన నాటక సాహిత్యంలో వివిధ పాత్రల నోట జీవిత సత్యాలనెన్నింటినో పలికించారు. ఆత్రేయగారి నాటక సాహిత్యంలోని సంభాషణల తియ్యదనాన్ని చవిచూసిన వారికి ఆత్రేయగారి సినిమా సంభాషణలు అంతగా రుచింపవు. కారణమేమిటంటే ఇవి నాటక సాహిత్యానికి సంబంధించిన సంభాషణలు కావడమే! అదీగాక నాటక రచనకు ఆత్రేయ గ్రహించిన కథావస్తువులు అందరికి సుపరిచితాలైన ఆకలిదప్పులు, మధ్యతరగతి కుటుంబాల సాధక బాధకాలు, సమాజంలో జరిగే అన్యాయాలు – అక్రమాలు బ్లాక్ మార్కెటింగ్.. ఇలాంటివెన్నో అయి ఉండటం!ఒక్క మాటలో చెప్పాలంటే కథావస్తువే బంగారంలాంటిదైతే ఆ విలువైన దానికి సంభాషణలు మరింత వన్నెను తెస్తాయి. మంచి సంభాషణలు రాయడానికి వీలు కల్పిస్తాయి.అందుకే ఆత్రేయ గారి నాటకాలు – ఆ నాటకాలలోని సంభాషణలు పాఠకులను, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దీన్ని బట్టి ఆత్రేయ గారి నాటక సంభాషణలు ఎప్పటికీ మరువలేనివి..మరువరానివని చెప్పవచ్చు..

నాల్గవ అధ్యాయం

ఆత్రేయ సంభాషణా శైలి

ఆత్రేయ గారి సంభాషణా శైలి అద్భుతమైనది. సంభాషణా నడిపింపులో, పలికించడంలో వారు అనుసరించిన రచనా విధానం అత్యద్భుతమైనది. వారు సంభాషణా రచయితగా మంచి పేరు సంపాదించుకోవడానికి వారేర్పరచుకున్న రచనా విధానమే తోడ్పడింది.

ఒక రచయిత రచనకు మరొక రచయిత నుంచి వేరు చేసే అంశాలలో శైలి అనేది అతి ప్రధానమైన అంశం. ఏదైనా ఒక పాట విన్నా మాట విన్నా అది రాసినది ఫలానా రచయిత అయి వుంటుంది అని చెప్పగలిగిన ఆ గుణమే శైలి.

4.1. వాక్య నిర్మాణం :

'వర ప్రసాదం' నాటికలో ఆత్రేయ తండ్రి పాత్ర ద్వారా ఒక విచిత్రమైన వాక్య ప్రయోగం చేస్తారు అది ఏమిటంటే "ఆడదానితో బ్రతకటం కష్టం. ఆడది లేకుండా బ్రతకటం నరకం' అని అంటారు. ఇలాంటి ప్రయోగాలు సినిమా సంభాషణలలో కూడా అనేకం చేశారు ఆత్రేయ.

ఆత్మహత్య ప్రయత్నానికి గల కారణంను డాక్టర్ ప్రశ్నించగా " మీరెందుకు బతికున్నారో తెలుసా – తెలియదు, చావలేకా – బతికున్నారు. నేనెందుకు చావాలునుకున్నానో తెలుసా – బతకలేక చావాలనుకున్నాను. అంతే " అని 'చావకూడదు' నాటికలో పేషెంట్ ద్వారా సమాధానం చెప్పిస్తారు ఆత్రేయ. ఇక్కడ చావలేక బతికున్నవారు కొందరైతే బ్రతకలేక చావాలనుకునేవ్యక్తి పేషెంట్. అకౌంటెంట్‌గా ఉండి తన పని కాకపోయినపై వారి ఆజ్ఞను అనుసరించి టైపిస్టు పనిని కూడా చేసే అకౌంటెంట్‌ను అప్పుడే వచ్చిన టైపిస్టు తన పనెందుకు చేయడమని అడుగగా "ఎందుకా? చేస్తూన్న పనులన్నీ ఎందుకు చేస్తున్నాం. బతకాలి గనుక.. చేయకపోతే బతకలేం గనుక" (భయం) అని అంటాడు.

'మనసూ–వయసు' నాటకంలో పంతులు ఆయాతో " బతికినంత కాలం బతకం" అని అనగా " చచ్చే దాక బతక్క తప్పదు బతికున్నంతవరకూ నాకా బాధ్యత తప్పదు " అని ఆయా పాత్ర ద్వారా ఆత్రేయ పలికిస్తారు.

ఆఫీసులో అడ్డమైన చాకిరీ చేయించుకునే మేనేజర్‌తో "ఎంతకాలం చేస్తామీ చాకిరీ?" అని అకౌంటెంట్ ప్రశ్నించగా " బతికున్నంతకాలం బతకాలనుకున్నంత కాలం చేయాల్సిందే" అని మేనేజర్ పాత్ర ద్వారా 'భయం' నాటకంలో పలికిస్తారు. ఇదే నాటకంలో ఆఫీసులోనే ప్రొప్రయిటర్ మేనేజర్‌కు ఇల్లు వస్తే ఆఫీసులో ఎక్కువుగా కనిపించని మేనేజర్‌ని ఉద్దేశించి " ఆఫీసు చూచుకుంటావని ఇల్లు దగ్గరగా యిచ్చాను కాని ఇల్లు చూచుకుంటావని ఆఫీసుకు దగ్గర పెట్టలేదు నిన్ను " అని ప్రొప్రయిటర్ చివాట్లు పెడతాడు.

జరుగబోయే ఎలక్షన్ల విషయమై మాట్లాడడానికి రమ్మని వెంకయ్య చేత కబురుపంపంగా " అయ్యగారికి కాస్త మనందరితో పని పడింది లేవయ్యా..." అని అనగా అయ్యగారికి మనతో పన్లు లేకేం సుబ్బన్నా! మన పన్లు ఆళ్ళ దగ్గర కావు గాని – అని " ఓటు నీకే " నాటికలో వెంకయ్య పాత్ర ద్వారా పలికిస్తారు. ఈవిధమైన సంభాషణలన్నింటిని ప్రతి సంభాషణలో ఒకేవాక్యాన్ని రెండు రకాలుగా తిప్పి తిప్పి ఆత్రేయ ప్రయోగించినట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు కొన్నింటిని పరిశీలిద్దాం !

" ఆడదానితో బ్రతకటం కష్టం

ఆడది లేకుండా బ్రతకటం నరకం " అనే ప్రయోగంలో ఆడవ్యక్తితో సహజీవనం చేయడమనేది కష్టము మరియు నరకం అంటారు. ఇది ఒక స్టేట్‌మెంట్ లాంటి ప్రయోగం. రెండవ రకానికి చెందిన ప్రయోగాన్ని పరిశీలిస్తే..

"బతకలేక చావాలనుకున్నాను

చావలేకా బతికున్నాను " అనే ప్రయోగంలోని రెండో వాక్య నిర్మాణాన్ని పరిశీలిస్తే వెనుకది ముందుకి, ముందుది వెనక్కి ప్రయోగించినట్లు అనిపిస్తుంది. ప్రయోగ విధానంలో ఆత్రేయ చేసిన మార్పు స్వల్పమైనా.. భావం గొప్పది. అలాగే మూడో ప్రయోగాన్ని పరిశీలిస్తే...

" బతకాలి గనుక

చేయలేకపోతే బతకలేం గనుక "

ఇంచుమించు కొద్ది కొద్ది మార్పులతో ఇలాంటి ప్రయోగాలనెన్నింటినో ఆత్రేయగారు వాక్య నిర్మాణంలో చేశారు. వారు వాక్యాలలో ప్రాసను కూడా విరివిగా వాడతారు. అలా వాడడం వల్ల ఆ వాక్యం వినేందుకు చదివేందుకు సొంపుగా వుంటుంది.

4.2. 'కాదు' పద ప్రయోగం :

ఆత్రేయగారు సంభాషణ రచనలో చేసే మరో ప్రయోగం ఏమిటంటే 'కాదు' పద ప్రయోగం. ఏదైనా ఒక విషయాన్ని ఒక పాత్ర ద్వారా చెప్పించి, వెంటనే 'కాదు' అనిపించి మరో విషయాన్ని చెప్పిస్తారు.

ఉదా : కార్మికులను దోచుకునేటటువంటి ఒకవ్యక్తి దగ్గర కవి అయి ఉండి అజ్ఞానంగా పనిచేసే రఘుని ఉద్దేశించి కార్మిక నాయకుడు చౌదరి " మిమ్మల్ని చూస్తే జాలేస్తుంది" అనగా " నన్ను చూస్తేనా ? ఎందుకు ? " అని ఆశ్చర్యంగా కవి అడిగిన మాటలకు " మీ అమాయకత్వానికి, కాదు – అజ్ఞానానికి" అని 'పరివర్తన' నాటకంలో చౌదరి పాత్ర ద్వారా ఆత్రేయ పలికిస్తారు. అంటే అనుకూలను మోసం చేసే వ్యక్తికి స్టేట్‌మెంట్లు రాసిస్తూ, ఉపన్యాస పత్రాలు రాసిస్తూ పరోక్షంగా ప్రజలను మోసపుచ్చేందుకు సహకరించే కవి అమాయకత్వానికి అంతకు మించిన అజ్ఞానత్వానికి తనకు జాలి కలుగుతుందని చౌదరి చేత పలికిస్తారు రచయిత. అంటే ఇందులో మొదటి మాటకంటే ఇంకా బలమైన అజ్ఞానాన్ని ప్రయోగించడానికి 'కాదు' ప్రయోగాన్ని చేశారు ఆత్రేయ.

అలాగే 'కళ కోసం' నాటికలో – తన నాటికలో నటించనందుకు భర్త మరో స్త్రీని పెళ్లాడినట్లు తెలుసుకున్న రాధ తన పుట్టింటికి వెళ్తూ " రాధ పుట్టింటికి వెళ్ళిందని – కాదు చచ్చిందని" చెప్పమని తన భర్తకి కొత్త మామగారైన రంగయ్యకు చెప్పి వెళ్ళబోతుంది రాధ. అంటే ఇక్కడ వెళ్ళింది. చచ్చింది అనే పదాల నడుమ కాదు ప్రయోగాన్ని ప్రయోగించడంలో ఆత్రేయ ఆంతర్యం ఏమిటంటే తాను అలా వెళ్ళిన తర్వాత తాను చచ్చినట్టే తన భర్తని భావించమని, ఇక తనతో ఎలాంటి సంబంధం లేదనే ఆమె భావాన్ని చెప్పేందుకు రెండు పదాలను ప్రయోగించడానికి 'కాదు' ప్రయోగాన్ని చేశారు ఆత్రేయ.

ఇలాంటి ప్రయోగాలు ఉదాహరణలుగా చెప్పుకోదల్చుకుంటే ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ప్రయోగాలు సినిమా సంభాషణలలో కూడా ఎన్నో చేశారు.

4.3. క్యాచీ డైలాగ్స్ :

ఆత్రేయగారి వాక్య నిర్మాణంగా ఇలాంటి శైలిని కూడా వారు అనుసరిస్తారు. ఒక పాత్ర విషయాన్ని చెప్తుండగా ఆ పాత్ర చెప్పబోయే విషయాన్ని ఎదుటి పాత్రలందుకొని చెప్పడాన్ని క్యాచీ డైలాగ్ అనవచ్చు.

ఉదా : అక్రమ సంబంధంతో తిరిగే కూతుర్ని నీవు కనవని వెంకటాద్రి రాముతో చెప్తూ "నువ్వాలంటి కూతుర్ని కనవు... కన్నా చూస్తూ..." (బతకనివ్వవు) అని ఏదో చెప్పబోతుండగా ఆ ముగింపు వాక్యాన్ని రాము అందుకొని " బతకనివ్వదు" అని అంటాడు. అంటే ఈ సంభాషణలో నువ్వలాంటి కూతుర్ని కనవు. కన్నా చూస్తూ బతకనివ్వవు లేదా ఊరుకోవు అని చెప్పబోయే అతని భావాన్ని ఎదుటిపాత్ర చేత చెప్పించడం. అలాగే మరొకటి.

'మనసూ-వయసు' నాటకంలో శివుడు మూగగా ప్రేమించి పెళ్ళి చేసుకోబోయే లిల్లీ రైల్వే స్టేషన్‌కి వస్తుండగా రిసీవ్ చేసుకోవడానికి కంగారుగా వెళ్ళబోయే శివుడి పరిస్థితిని చూసి పంతులుగారు తిరుపతితో " తిరుపతీ! నువ్వు కాస్త.." అనే సరికి "వెళ్తాను.. కానీ శివుణ్ణి మీరు అనవసరంగా కంగారు పెట్టకండి" అని అంటాడు. అంటేపై ప్రయోగంలో పంతులు "నువ్వు కూడా కాస్త వెళ్ళరాదు" అని చెప్పబోయే అంశాన్ని కొనసాగింపుకే సమాధానంగా "వెళ్తాను" అని తిరుపతి పాత్ర చేత పలికించారు ఆత్రేయ.

ఇలా ఆత్రేయ తన సంభాషణ రచనలో తనదైన ఒక శైలిగా ఏర్పరచుకొని ఈ క్యాచ్ డైలాగ్స్‌ను రాశారు.

4.4. పద చమత్కారం :

ఆత్రేయ తన సంభాషణా రచనలో అవసరమైనచోట పద చమత్కారాన్ని చేస్తుంటారు. అంటే అలా చేసి పాత్ర నోట పలికించడం వల్ల ఆ పాత్రలు మాట్లాడే మాటలలో బరువు. కొంత వ్యంగతను తీసుకురావచ్చు.

ఉదా : పోలీస్ స్టేషన్ బావిలో ఒక మహిళ ముగ్గురు పిల్లలతో దూకి చనిపోతుంది. ఆ సంఘటన నుంచి రక్షించిన పోలీస్ ఎస్.ఐ.తో "ముగ్గురు బిడ్డలు దొరికారండి" అనగా " ఓ మైగాడ్! ముగ్గురు బిడ్డలే! అందరూ చనిపోయేరా!" అని ఎస్.ఐ.గాబరాగా అడిగిన మాటలకు "చచ్చి ఎప్పుడో పోయారండి " అని పోలీస్ సమాధానం చెప్పాడు.

మనం సాధారణంగా చనిపోయిన వాని గూర్చి " చచ్చిపోయాడు " అని అంటూ ఉంటాం. చావడమేమిటి? పోవడమేమిటి ! ప్రాణాలు లేకుండా ఉండటమే చావడం. మరిపోవడం సంగతి ఏమిటి. ఇలా ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిలోని ఆత్మ ఉంటుందంటారు సరే దాన్ని వదిలేస్తే ఈ చనిపోవడం అనేది ఎప్పుడో జరిగిందనే విషయాన్ని చచ్చి ఎప్పుడో పోయాడండి అని ప్రయోగిస్తారు ఆత్రేయ. ఇలాంటి పద చమత్కారాలెన్నో వారి నాటక సాహిత్యంలో కన్పిస్తాయి.

4.5. శ్లేష ప్రధానంగా సంభాషణలు :

'మనసూ-వయసు' నాటకంలో శ్లేషతో కూడిన ప్రయోగాన్ని చేశారు. లిల్లీ తిరుపతీల సంబంధాన్ని అపార్థం చేసుకునే పంతులతో ఆయా " పెద్దవాళ్ళయ్యారే కాని మీకింకా పెద్దబుద్దులు రాలేదు " అని విమర్శిస్తుంది. ఈ మాటల ద్వారా పెద్దవాళ్ళకు పెద్దరిక లక్షణాలు అనేవి ఉండాలని చెప్పడానికి 'పెద్ద బుద్ధులు ' అని ప్రయోగించారు.

రాత్రంగా ఆఫీసులోనే కూర్చొని పనిచేసే అకౌంటెంట్‌తో " తెల్లారిపోయింది. బారెడు పొద్దెక్కింది కూడా" అని ముసలయ్య అనగా "తెల్లారిందా. హూ. పొద్దు తెల్లారిందే కాని ఈ పని తెల్లారలా యింకా" (భయం) అని అకౌంటెంట్ అంటాడు. రాత్రి ఏవిధంగా గడిచిపోయిందో. అయిపోయిందో అలాగే తెల్లార్లు చేసిన పని మాత్రం తెల్లార్లేదు. అంటే అయిపోలేదనే అర్థంలో శ్లేషగా పలికిస్తారు ఆత్రేయ.

4.6. వినూత్న వాక్య ప్రయోగం :

'మనసూ-వయసు' నాటకంలో ఆత్రేయ 'ఎ - జెడ్ ' అనే ఆంగ్ల వాక్యాన్ని తెలుగులో 'అ' నుంచి 'క్ష' అని ఎలవా వాడారో చూద్దాం. ముసలితనంలో శివుడు లిల్లీని పెళ్ళి చేసుకోవడం గూర్చి తిరుపతి పంతులుతో వాదిస్తూ 'ఈ పెళ్ళి సంగతి 'అ' మొదలు 'క్ష' వరకు నాకు తెలుసు " అని అంటాడు. అదేవిధముగా ఎన్.జి.వో.నాటకంలో ఆత్రేయ గోపి

పాత్ర ద్వారా ఒక కొత్తరకమైన ప్రమాణాన్ని చేపిస్తారు. మనం సాధారణంగా అమ్మతోడు, దేవుడి సాక్షి ఇలా వాడతాము. మరిది ఇల్లు చూసి వచ్చినట్లు చెప్పగా 'నిజంగా? అని అతని వదిన ఆశ్చర్యంగా అడగగా " హరిశ్చంద్రుడి సాక్షి" అని గోపి చేత పలికిస్తారు. అబద్ధమంటే ఎరుగని హరిశ్చంద్రుడినే సాక్షిగా నిలిపారు ఆత్రేయ.

4.7. సంక్షిప్తత :

ఆత్రేయగారు ఏదో సినిమాకి జైలు వాతావరణం గూర్చి రాయాల్సివస్తే .. అసలు జైలు ఎలా ఉంటుంది? అక్కడ ఖైదీలు, వాళ్ళ భోజనాలు, పద్ధతులేమిటో తెలుసుకొని రాస్తే బాగుంటుందని హైద్రాబాద్‌లోని సెంట్రల్ జైలుకెళ్తారు. అలా వెళ్ళి ఆ వాతావరణాన్ని పరిశీలిస్తూ ఉంటే యావజ్జీవ కారాగార శిక్షపడ్డ ఒక ఖైదీ ఆత్రేయగారి వైపు అదే పనిగా చూస్తూ వారు ఎటుపోతే అటు ఫాలో అవుతూ వుంటే అది గమనించిన ఆత్రేయ గారు ఖైదీని "ఇటురా..!" అని ఎటుపోతే అటు ఫాలో అవుతూ వుంటే అది గమనించిన ఆత్రేయ గారు ఖైదీని " ఇటురా..!" అని పిలిచి " ఏం నాయనా అలా చూస్తున్నావు?" అనే సరికి " నేను మీ అభిమానిని సార్!" అని ఖైదీ సమాధానం చెప్తే, " అమ్మో!.. జైల్లో కూడా నా అభిమానులున్నారే!" అని ఆశ్చర్యపడి ఆనందంతో " ఏపాట ఇష్టం నాయనా?" అని అడిగేసరికి ఆ ఖైదీ తనకిష్టమైన ఆత్రేయగారి పాటలను చెప్పి " నేను కూడా ఒక చిన్న రచయితనే సార్! నా ఆత్మకథను రాశాను. మీరు చదువుతున్నారా?" అని ఖైదీ అడగగా.. " జైల్లో పనీ పాట లేక పెద్ద గ్రంథం రాసి ఉంటాడు. నేనిప్పుడు దాన్ని చచ్చినట్లు చదవాలి కాబోలు" అని ఆత్రేయ గారు మనసులో అనుకునేలోపే సిగరెట్ పెట్టలో తోకల్లా ఉండే కాగితాల మీద రాసిన ఆ కాగితం ముక్కలను జేబులో నుంచి తీసి " ఇదే సార్ నా ఆత్మకథ " అని ఖైదీ ఇస్తాడు. ఆత్మకథ రాశానంటూ చిన్నకాగితం ముక్కలిచ్చిన ఆ ఖైదీని చూసి ఆత్రేయ " ఎవడ్రా వీడు " అని ఆశ్చర్యపోయి దాన్ని తీసుకొని చదివి అందులోని విషయాన్ని గ్రహించి " ఇది పోలీస్ వ్యవస్థకు సంబంధించిన ఎన్‌సైక్లోడిడియా" అంటారు. "క్లుప్తంగా రాయడమంటే అదీ! ఈ జనాలు, మేధావులు, విమర్శకులు నేను క్లుప్తంగా రాస్తాననుకుంటారు. అలా అంటుంటే ఇప్పుడు నాకు నవ్విస్తుంద" నే వారు. ఇంతకి ఆ సిగరెట్ కాగితం ముక్కలపై ఆ ఖైదీ ఏమి రాశాడంటే.. " నేనొక తప్పు చేశాను. పశ్చాత్తాపంతో పోలీసులకు పట్టుబడ్డారు. నేను తప్పు ఎలా చేశానో.. కోర్టులో ఎలా చెప్పాలో పోలీసులు నాకు కొన్ని విషయాలు చెప్పారు. అప్పుడు అసలు నేనీ తప్ప చేశానా అనిపించింది!" అని రాశాడు. అందుకే ఆత్రేయ దాన్ని 'పోలీసుల సర్వస్వం' అన్నారు. "ఇంతకంటే క్లుప్తంగా ఇంకెవరైనా రాయగలరా? అదయ్యా క్లుప్తతంటే!" అని వారి ప్రియశిష్యుడు జె.కె.భారవితో అనేవారు మహాకవి ఆచార్య ఆత్రేయ.

ఆత్రేయ సంభాషణాశైలిలో ఒక భాగం ఈ సంక్షిప్తత. ఆత్రేయ సంభాషణా రచనలో పాటించినంత సంక్షిప్తత మరే రచయిత పాటించలేదని నా అభిప్రాయం. ఒక గొప్ప భావాన్ని చెప్పడానికి రచయిత మాటలనే రాయాల్సిన అవసరం లేదు. నటుని నటన ద్వారా కూడా ఆ భావాన్ని చెప్పించే విధంగా కూడా రాయవచ్చు. 'విశ్వశాంతి' నాటకంలో యుద్ధం అంటే ఏమిటో చెప్పమని సతమ అనే చిన్నపాప సిపాయి తాతయ్య సమరయ్యను అడగగా "చూడమ్మా – ఇది నా కాలు – ఇది నా చేయి – ఇది నా కన్ను " అని యుద్ధంలో తాను పోగొట్టుకున్న అవయవాల స్థానే అమర్చుకున్న కృత్రిమ అవయవాలై కన్ను, కాలు, చేయిని తీసి బల్లపై పెట్టి చూపిస్తాడు. ఈ విధంగా ఆత్రేయగారు మాటలు పలికించకుండా వాటి కంటే బరువైన భావాన్ని నటన ద్వారా పలికించారు.

తన వ్యక్తిగత విషయాలు (రహస్యాలు) అన్నీ తెలిసిన ముసలయ్యతో టైపిస్టు "అన్నీ కడుపులో దాచుకో ముసలయ్య" అని ప్రాధేయపడి అడిగిన మాటలకు ముసలయ్య పాత్రచేత ఆత్రేయ ఏవిధముగా సమాధానం చెప్పించారంటే.. "అట్టాగేమ్మా, కడుపు చించి చూచినా కనపడకుండా దాస్తానమ్మా!" (భయం) అని పలికిస్తారు. అంటే ఆమెకు సంబంధించిన రహస్యాలను అతను ఇంకా ఎంత రహస్యంగా దాచగలడో ఆ పాత్ర ద్వారా రచయిత పలికించారు.

తన తమ్ముడు ఇంటిలోని ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి బస్టాండులో పళ్ళపొడి పొట్లాలు అమ్మడం అవమానంగా ఫీలయిన రంగనాధం భార్యను తిడుతుండగా " ఎందుకరా వాడట్టా అరుస్తున్నాడు" అని అతని తండ్రి గోపిని అడగగా " చావలేక - బతకలేక" (ఎన్.జీ.వో.) అని గోపి అన్న రంగనాధం అంటాడు. చిన్నమాటలో ఆ పాత్ర స్థితిని చెప్పారు ఆత్రేయ. పరిస్థితులను చక్కదిద్దుకోవడానికని నలుగురిలో చులకనగా బతకలేరు. అలాగని చావలేరు. ఇదీ మధ్యతరగతి వాడి జీవితం. అందుకే చావలేక - బతకలేక అనే మాటను పలికించారు ఆత్రేయ.

ఇలా ఆత్రేయ తన సంభాషణా రచనలో సంక్షిప్తతను పాటించి నాటకాన్ని చకచక నడిపించగలిగారు.

4.8. పాత్రల స్వాభావిక చిత్రణ :

ఆత్రేయ తన నాటకాలలోని పాత్ర స్వాభావిక చిత్రణలను సంభాషణల ద్వారా చిత్రీకరిస్తారు. నాటకంలోని ఆ సంభాషణలను వింటున్నప్పుడు, చూస్తున్నప్పుడు మనకు ఆ పాత్ర ఎలాంటిదో వెంటనే అర్థమవుతుంది. అంటే వారి మాటలలోనే ఆ పాత్రల మనస్తత్వం అర్థమవుతుంది. ఉదాహరణకు 'అశోక్ సామ్రాట్' నాటకంలో రెండు మనస్తత్వాల స్వభావాలను ఆత్రేయగారు సంభాషణలలో ఎలా ప్రొజెక్టు చేశారో చూద్దాం !

" వీణ మీటనా?" అనే భార్య మాటలకు

" అశోకుడు	:	వీణ ! వీణ కాదు, తిష్యా! ధంకా - భేరీ!
తిష్య	:	మరలా యుద్ధమా?
అశోకుడు	:	అవును
తిష్య	:	మరి సెలవు
అశోకుడు	:	ఏం?
తిష్య	:	నాకింక చోటు లేదు.
అశోకుడు	:	తిష్యా!
తిష్య	:	క్షమించండి
అశోకుడు	:	వెళ్తున్నావా?
తిష్య	:	మీరే వెళ్ళగొడుతున్నారు.
అశోకుడు	:	ఎవర్ని
తిష్య	:	ప్రేమను
అశోకుడు	:	ఎక్కడికి
తిష్య	:	ఈ మీ సామ్రాజ్యపు పొలిమేరలు దాటి (అశోకసమ్రాట్) అని అంటుంది.

పై సంభాషణను బట్టి శాంతి, ప్రేమ నిండుకున్న మంచి మనిషిగా ఉన్నది తిష్య పాత్రయితే యుద్ధోన్ముఖుడైన అశోకుడు దీనికి విరుద్ధమైన స్వభావం, లక్షణాలు కలవాడని తెలుస్తుంది.

'ఓటు నీకే' అనే నాటికలో ఎలక్షన్లకు ముందు ఓట్లు అడగడానికి వచ్చిన రామయ్య అసలు విషయం చెప్పకుండా నానుస్తూ ఓటరుగా వెంకయ్య ఓటుకున్న అధికార బలం గూర్చి చెప్తూ " రెండు నెల్లకు పూర్వం వెంకయ్యవు కావీనాడు. ఇప్పుడు వెంకయ్యకున్న బలం పేరు" అని గూఢార్థములు రామయ్య చెప్పిన మాటలు అర్థం కాని వెంకయ్య " లేదయ్యా

ఏమీ లేదు. నాకేం ఐశ్వర్యం రాలా – ఎవరో చెప్పిన మాటలు విని మీరు ఇట్లా మాట్లాడితే ఏవన్నా, రెండు నెళ్లకు ముందు ఇంకాస్త బాగుండేవాణ్ణి. అప్పుడు పూట తిండికి గింజలన్నా వుండేవి. ఇప్పుడవి లేవు. రెండు నెళ్లకు మునుపు జమీందారి కాడ నౌకరీ వుండే వాణ్ణి. ఇప్పుడదీ లేదు. మీకేంటో బలమంటారు. శత్తంటారు – ఏంటో వోరు చెప్పారయ్యా మీకిదంతా! గిట్టనోళ్లెవరో చెపితే యిని..” అని అంటాడు.

ఈ సంభాషణ ద్వారా ఆ పాత్ర ఎంత అమాయకరమైనదో, అజ్ఞానమైనదో తెలుస్తుంది. భాషాపరంగా పల్లె ప్రజల మాటలను ఈ సంభాషణలలో పాత్రనోట పలికించారు ఆత్రేయ.

ఈవిధముగా వారి సంభాషణలలో వివిధ పాత్రల మనస్తత్వం స్వభావం స్పష్టంగా కనిపిస్తుంది.

4.9. నాటిక, నాటకాలలో పాటల రచనా ప్రయోగం :

ఆత్రేయగారి నాటకాలలో ప్రత్యేకత ఏమిటంటే పాటలు. ఈ పాటలను నేపథ్యగీతంగానో, స్లైట్‌గానో పాడిస్తారు. ఉదాహరణకి రాజకీయ ఇతివృత్తం గల ‘వాస్తవం’ అనే నాటకమును పరిశీలిస్తే సామాన్యమావవుడు నౌకరి అయిన చెవిటివాడు పాత్ర ద్వారా నాటక ఆరంభంలోనే –

“ అన్నమైతే నేమిరా – మరి
సున్నమైతేనేమిరా – యీ
పాడు పొట్టకు ఆకలిణిగె అన్నమే వేతాముర్రా.
కాంగ్రెసైతేనేమిరా – మరి
కమ్యూనిష్టయితే నేమిరా
బువ్వపెట్టి గుడ్డ యిస్తే
ఎవ్వడైన ఒకటేరా,
ఎర్రపెట్టె అని యేమిరా – మరి
పసుపు పెట్టె అని యేమిరా
మాట తప్పని మంతిరైతు
ఓటు ఆయనకివ్వరా ! ” అని పాడిస్తారు.

పేదవాడికి ఫలానా పార్టీవాడే గెలిచి రాజ్యమేలాలనే కాంక్ష ఉండదు అన్నం పెట్టే ఏ పార్టీనైనా గౌరవిస్తాడు. ఓటు వేస్తాడు. ఇది పూర్తి రాజకీయపాట. ఈ పాటలోనే ఓటరు పాత్ర ద్వారా నాటకం యొక్క సందేశం మొదటే చెప్పబడి ఉంటుంది. ఇలాంటి పాటలే గౌతమబుద్ధ, మనసూ–వయసు నాటకాలలోను అంత్యార్పణ నాటికలోను ఉన్నాయి.

4.10. సంభాషణలలో న్యాచురాలిటీ :

ఆత్రేయగారి సంభాషణలలో న్యాచురాలిటీ వుంటుంది. సంభాషణ ఒక ప్రవాహంలా సాగిపోతుంది. ఎక్కడ బ్రేక్ అయినట్లు వుండదు. ఉదాహరణకీ ఎన్.జి.వో.లోని ఒక సన్నివేశాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది.

ఒకప్రక్క సీరియస్‌గా ఇంటి అద్దె విషయమై గోపి ఆ ఇంటి తరపున వాడైన శర్మతో వాదించి విసిగిపోయి ఉండగా, శర్మ పాత్ర నిష్క్రమణతో వాకిట్లో బిచ్చగాడి పాత్ర ప్రవేశపెట్టారు ఆత్రేయ.

“ మేడల్లో కులికినా,
గుడిసెల్లో కులికినా,

కట్టెల్లో ఒకలాగె కాలిపోవాలి!
బూడిదలో ఒకటిగా కలసిపోవాలి
వున్న నాలుగునాళ్లు వుబ్బిపోకురా !

కన్ను తెలియని రీతి గర్వపడబోకురా!" అని బిచ్చగాడు పాడే పాటను విన్న గోపి " ఇదీ వేదాంతం! ఆ కోటీశ్వరుడి చెవుల్లో ఇల్లు కట్టుకొని చెప్పరా బాబు. మాకెందుకీ వేదాంతం" అని అంటాడు. బిచ్చగాడిలా అలా చెప్పినాక " బాబూ! ఆకలి ! మాడిపోతుండా! " అనే సరికి " ఆహారశాఖామంత్రి నడుగు" అని అంటాడు గోపి. " బాబు! మా రాజులు" అని మళ్లీ అడగడం మొదలుపెట్టే సరికి " ఏడ్చినట్టుంది. నీ కళ్లకు మేం మారాజుల్లా అగుపిస్తున్నాం. వెళ్ళు వెళ్లు" అంటాడు గోపి. ఇలా సంభాషణను సరళంగాను, సహజత్వంతోను నడిపించడంలో ఆత్రేయ ప్రత్యేకశైలిని అనుసరిస్తారు.

4.11 పాత్రల పరిచయం :

ఆత్రేయ నాటక సాహిత్య రచనలో వారి ప్రత్యేక శైలి ఏమిటంటే పాత్రల పరిచయం. పాత్రల స్వభావం ఏమిటి, ప్రేక్షకులకు ఆ పాత్రను ఎలా చూపించాలి వాళ్ళకి ఆ పాత్రలు ఎలా అగుపించాలి అని కొత్త క్యారెక్టర్‌ని సీన్‌లో ప్రవేశపెట్టబోయే ముందు ఆ క్యారెక్టర్ గూర్చి ఆత్రేయ ఎలా రాస్తారో చూద్దాం.

" తిరుపతి మంచి అందగాడు. కండలు తిరిగిన దేహం. అలాగని మొరటువాడు కాదు. అతని కళ్లు ఎలాంటి ఆడదాన్నయినా అట్టే ఒక క్షణకాలమైన ఆకర్షించి నిలపివేయగలవు. ఆలాగని పెద్దవీ కావు " అని 'మనసూ – వయసు' నాటికలో రాశారు. ఇదే నాటికలో లిల్లీ పాత్రను పరిచయం చేస్తూ " బండి చక్రాల్లాంటి కళ్లు, కాళ్ళకే గాని కళ్ళకు లేవు జోళ్ళు"... ఇలా రాస్తారు. అదేవిధంగా 'వాస్తవం' నాటకంలో " సెబ్బన్న వచ్చాడు. కళ్ళద్దాలు, చేతికర్ర, పైపంచ అతని ఆత్మబంధువులు " అని సుబ్బన్న పాత్రను, అలాగే 'కోటిగాడు వచ్చాడు. కోరమీసాలు, కోరచూపులు అతని ఆభరణాలంటూ కోటిగాడి పాత్రను సింపుల్‌గా పరిచయం చేస్తారు. ఇంకొంచెం వర్ణనాత్మకంగా వెంకటాద్రి పాత్రను ఎలా పరిచయం చేశారంటే" సంస్కారమెరగని జుట్టు, గడ్డం, చాకలి యిట్లు యెరగని బట్టలు, గుండీలు లేని చొక్కాలో నుంచి ఎండిపోయిన గుండెలు కనిపిస్తూ వుంటాయి". అని రాశారు. ఈవిధముగా ఆత్రేయ చమత్కారంగా పాత్రలను ప్రవేశపెట్టే ముందు దర్శకులకు ఒక సూచనగా క్యారెక్టర్లను పరిచయం చేస్తారు. నాటకాన్ని చదివే పాఠకులు ఆ పాత్రల స్వభావాన్ని – స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికే ఆత్రేయగారు అలా పాత్రలను పరిచయం చేశారు.

4.12. రంగస్థల రూపకల్పనా రచన :

ఆత్రేయగారు రంగస్థలాన్ని ఎలా అలంకరించాలో వివరించే మాటలలో కూడా కవితాత్మక/వర్ణనాత్మక ధోరణులు కనిపిస్తాయి. 'వాస్తవం' నాటకంలోని రెండవ రంగంను ప్రదర్శించబోయే ముందు రంగస్థలం ఎలా ఉండాలో ఇలా రాశారు. " కష్టజీవుల చిరుగు గుడిసెలుండే ప్రదేశం ఊరి వెలుపల, దగ్గరనే స్మశానం.." ఇలా చెప్తూ " ఒకచోట ప్రకృతి ఏర్పరచిన రచ్చలాంటి రాతి తిన్నె వుంది. దాని దగ్గర ముసలిచెట్టు అంతాపోయి ఎముకలు మాత్రం వున్న దరిద్రునిలా నిలబడి వుంది" అని వర్ణనాత్మకంగా చెప్తారు ఆత్రేయ.

ఆత్రేయగారు స్వయంగా దర్శకులు, నటులు కాబట్టి నాటకంలోని పాత్రు చేసే ఏ విధముగా నటింపజేయాలో వారి హావభావాలు ఏవిధముగా ఉండాలో ఇలా వారి నాటక రచనలోనే వారి డైరెక్షన్ ఉంటుంది. 'ఒక్క రూపాయి' నాటికను పరిశీలిస్తే అందులో రంగస్థలాన్ని ఎలా అలంకరించాలో చెప్పి నిరుద్యోగ యువకులైన ఆ పాత్రలను చూసే ప్రేక్షకులు ఎలా ఉండాలో చెప్తూ ముగింపుగా "పాపం! వాళ్ళ బాధలు వాళ్లు పడుతున్నారు. నాకేం నవ్వండి. చివరికి మీరు ఏడుస్తారు" అని ఆ నాటిక విషాదాంతాన్ని తెలియజేస్తారు.

4.13. రంగం (నాటకంలో) ముగింపు :

ఆత్రేయ తన నాటిక నాటకాలలో రంగం ముగింపులో గాని అసలు నాటకాంతానికి సంబంధించి వారు రాసే మాటలు కూడా బలంగా వుంటాయి. ఉదాహరణకి ఎన్.జి.వో.నాటకాన్ని పరిశీలిస్తే గోపి తన అన్న ఇంటి పరిస్థితుల ప్రభావానికి తలవంచి లంచానికి పాల్పడ్డాడని తెలుసుకొని అన్న మనసును మార్పించి లంచంగా పుచ్చుకున్న గుడ్డల మూట, డబ్బును తిరిగి వాళ్లకే ఇవ్వడానికి గోపి బయలుదేరగా వర్షానికి ఆగిపోయే సన్నివేశాన్ని ఆత్రేయ ఎలా రాశారంటే "తలుపు తెరిచేటప్పటికి జల్లు జివ్వుమని కొట్టింది. ఆగాడు. ప్రకృతి ఆ కుటుంబ నైతిక పతనానికి సాయపడింది" అని రాస్తారు. 'ప్రకృతి ఆ కుటుంబ నైతిక పతకానికి సాయపడింది' అనే వాక్యం నాటకీయంగా చూపించడానికి వీలు లేకపోయిన నాటకాన్ని చదివే పాఠకులకు ఆసక్తి కలిగిస్తుంది ఈ శైలి.

ఈవిధమైన శైలిని ఏర్పరచుకున్నారు కాబట్టే.. ఆత్రేయ గారు భౌతికంగా మనమధ్య లేకున్నా వారి సాహిత్యలోకంలో ఇంకా బ్రతికే వున్నారు. అందుకే నలబై దశాబ్దాల క్రితం రాసిన వారి నాటకాల గూర్చి ఇప్పటికీ చెప్పుకుంటున్నాం – చదువుతున్నాం – ఈ నాటకాలను నాటికలను చూస్తున్నాం – చూస్తాం! దటీజ్ ఆత్రేయ.

ఈవిధంగా ఆత్రేయ గారు వివిధ కథాంశాలతో నాటకాన్ని రాసి పదునైన సంభాషణలతో నాటకాన్ని రక్తి కట్టించారు. ఆత్రేయ గారి నాటక – సినిమా సంభాషణలను పరిశీలిస్తే నాటక సాహిత్యంలోనే ఆణిముత్యాల్లాంటి సంభాషణలున్నాయని చెప్పాల్సి వస్తుంది. ఒక రచయిత రాసిన కథకు – దర్శక నిర్మాతల అభిరుచి మేరకు – నటులను దృష్టిలో పెట్టుకొని రాసే సినిమా సంభాషణల్లా గాక నాటక సంభాషణా రచనలో ఇతరుల జోక్యం ఉండదు కనుకనే ఆత్రేయ అద్భుతమైన సంభాషణలు రాశారు. ఏది ఏమైనా నాటక రచనకు ఆత్రేయ గారు స్వీకరించే కథావస్తువు. ఉపయోగించే భాష, పాత్రల నడిపింపు, సన్నివేశ కల్పన, సంభాషణల వాడీవేడి, రచనా శైలి.. ఇవన్నీ ఆత్రేయకు మంచి గుర్తింపును తీసుకొచ్చాయి.

" నాటకరంగం యీ నాటికి వున్నతిని సాధించగలిగిందంటే దానికి మూలపురుషుడు ఆత్రేయ" అని కీ.శే.పుల్లయ్య గారు ఆధునిక తెలుగు నాటక యుగకర్త ఆత్రేయగారిని ప్రస్తుతించారు.

అదేవిధముగా " నా రచనకు హ్యూమర్. ఆయన రచనకు హ్యూమనిటేరియన్ సెంటిమెంట్స్ వుంటాయి. సోషల్ డ్రామా ట్రెండ్ సెట్టర్ ఆత్రేయ" అని శ్రీ డి.వి.నరసరాజు గారు ఆత్రేయని కొనియాడారు.